

'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16 సంచిక: 1

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఇన్‌ఫ్లుయెన్సర్లూ జాగ్రత్త!
ఉత్పత్తుల గురించి ప్రచారం చేసేవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం -11లో



రోజుకు 5 వేల పరిహారం
రుణం తీర్చిన 30 రోజుల్లో పత్రాలన్నీ ఇచ్చేయాలన్న ఆర్‌బీఐ - 13లో



మేం రష్యా వెంటే..!
ఉక్రెయిన్‌పై యుద్ధానికి సంబంధించి రష్యాకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ చెప్పారు.
వివరాలు 6లో ▸



ప్రత్యేక సెషన్ అజెండా ఇదే..
ఈనెల 18 నుంచి మొదలయ్యే ప్రత్యేక సెషన్‌లో తొలి రోజున పార్లమెంట్ 75 ఏళ్ల ప్రస్థానంపై చర్చ ఉంటుందని కేంద్రం తెలిపింది.
వివరాలు 6లో ▸



17న అఖిలపక్ష సమావేశం
పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో ఈ నెల 17న అఖిలపక్ష భేటీ నిర్వహించనున్నట్లు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు.
వివరాలు 6లో ▸



కశ్మీర్‌లో ఉగ్రఘాతుకం
జమ్మూ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో ఉగ్రవాదుల దాడిలో ఆర్మీ కల్నల్, మేజర్, డిప్యూటీ ఎస్పీ వీరమరణం పొందారు.
వివరాలు 6లో ▸

ఇంటింటికీ ఆరోగ్య రక్ష

రేపట్నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష' క్యాంపెయిన్‌కు శ్రీకారం

జగనన్న సురక్ష తరహాలోనే ప్రజల కోసం మరో కార్యక్రమం

- పౌరుల ఆరోగ్య సమస్యలను గుర్తించి పరిష్కరించడమే లక్ష్యం
- అనారోగ్య బాధితులను చేయి పట్టుకుని నడిపించే వ్యవస్థకు నాంది.. 5 దశల్లో కార్యక్రమం.. ఉచితంగా 7 రకాల పరీక్షలు
- 15 నుంచి వలంటీర్లు, గృహ సారథులు, ప్రజాప్రతినిధుల క్యాంపెయిన్..
- ఈ నెల 30 నుంచి నలుగురేసి డాక్టర్లతో హెల్త్ క్యాంప్‌లు
- వీరిలో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు కూడా..
- 45 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా క్యాంపులు ఏర్పాటు
- రాష్ట్రంలో ప్రతి గ్రామం, ప్రతి ఇల్లూ కవర్ చేయాలి
- కార్యక్రమం అమలుపై కలెక్టర్లకు సీఎం జగన్ దిశా నిర్దేశం
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశం


ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా వైద్యం పొందడంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన బ్రోచర్‌ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో మంత్రి రజిని, అధికారులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రతి ఇంటిని జల్లెడ పట్టి ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకోవడంతోపాటు వాటిని పరిష్కరించే గొప్ప బాధ్యతను ప్రభుత్వం స్వీకరిస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగానే ఇప్పటికే అమలు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమం తరహాలోనే ఇప్పుడు 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. మొత్తం ఐదు దశల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని హెల్త్ క్యాంపులతో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జగనన్న సురక్ష ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించామని, సుమారు 98 లక్షలకు పైగా సర్టిఫికెట్లను నెల రోజుల వ్యవధిలో అందించినట్లు గుర్తు చేశారు. దీని ద్వారా
మిగతా 2వ పేజీలో ▶

> రాష్ట్రంలో ప్రతి ఇంటిని, ప్రతి కుటుంబాన్ని, ప్రతి వ్యక్తిని ఆరోగ్యపరంగా సురక్షితంగా ఉంచే కార్యక్రమమే 'జగనన్న ఆరోగ్య సురక్ష'.
> - సీఎం వైఎస్ జగన్

కుట్రదారు చంద్రబాబే..

సీమెన్స్ కంపెనీకి తెలియకుండానే ఆ కంపెనీ పేరుతో బురిడీ

ఆ విషయాన్ని స్పష్టం చేసిన సీమెన్స్ కంపెనీ

10లో

- సీఐడీ అదనపు డీజీ సంజయ్ వెల్లడి
- చంద్రబాబు పన్నాగంతో రూ.3,300 కోట్ల నకిలీ ఒప్పందం.. ఆయన ఆదేశాలతోనే నిబంధనలకు విరుద్ధంగా నిధుల విడుదల
- అందుకోసం 13 చోట్ల ఏ–1 చంద్రబాబు సంతకాలు
- అయిదు చోట్ల ఏ–2 అచ్చెన్నాయుడు సంతకాలు
- ఆద్యంతం సర్వం తానై చక్రం తిప్పిన బాబు
- కుంభకోణం బయట పడకూడదనే నోట్ ఫైళ్ల గల్లంతు
- ఈడీ దర్యాప్తులోనూ అక్రమాలు బట్టబయలు
- అక్రమాలన్నీ నిర్ధారించుకున్నాకే బాబుకు కోర్టు రిమాండ్


మీడియా సమావేశంలో సీఐడీ అదనపు డీజీ సంజయ్, ఎస్పీ ఫక్కీరప్ప

ఏపీఎస్‌ఎస్‌డీసీ కుంభకోణంలో చంద్రబాబుకు వ్యతిరేకంగా 8 రకాల ప్రాథమిక సాక్ష్యాధారాలు లభించాయి. అందుకే ఎఫ్ఐఆర్‌లో ఏ–37గా ఉన్న చంద్రబాబును ఈ కేసులో ప్రధాన నిందితుడు(ఏ–1)గా చేశాం. దర్యాప్తు కొనసాగుతున్న కొద్దీ లభించే ఆధారాలను బట్టి తగిన నిర్ణయం తీసుకునే వెసులుబాటు చట్ట ప్రకారం దర్యాప్తు సంస్థలకు ఉంది.

> విదేశాలకు పరారైన బాబు పీఎస్ శ్రీనివాస్, మనోజ్ పార్థసానిని అరెస్ట్ చేసేందుకు త్వరలోనే ఆ దేశాలకు ప్రత్యేక బృందాలను పంపిస్తాం. అచ్చెన్నాయుడుతోపాటు ఇతరులపై కూడా త్వరలోనే చర్యలు తీసుకుంటాం. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్, అసైన్డ్ భూములు, ఫైబర్ నెట్ తదితర కేసుల్లో నారా లోకేశ్ కీలక పాత్ర పోషించారు. ఆయనపైనా త్వరలోనే చర్యలు తీసుకుంటాం.
> - సీఐడీ అదనపు డీజీ సంజయ్

న్యూస్‌రీల్

స్మార్ట్ మీటర్లతో రైతు సాధికారత



ఉచిత విద్యుత్ వాడుకునే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్ల వల్ల రైతులకు అన్ని విధాలుగా మేలు జరుగుతుందని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఖర్చంతా ప్రభుత్వానిదేనన్నారు. కేంద్ర విద్యుత్ శాఖ నిబంధనలను అనుసరించి స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నట్లు చెప్పారు.
వివరాలు 14లో ▸

చంద్రబాబు అవినీతికి గట్టి ఆధారాలున్నాయ్



అవినీతికి పాల్పడినట్లు పక్కా ఆధారాలున్నందునే చంద్రబాబు జైలుకు వెళ్లాడని ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు స్పష్టం చేశారు. బాబు అరెస్టును టీడీపీ నాయకులు ఖండిస్తున్నారంటే దొంగను, అవినీతిని సమర్థించినట్టేనన్నారు. ఏసీబీ కోర్టు జడ్జి హిమబిందు తన బంధువంటూ టీడీపీ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. తప్పుడు ఆరోపణలు మానుకోవాలని సూచించారు.
వివరాలు 3లో ▸

20న రాష్ట్ర కేబినెట్ భేటీ

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన ఈనెల 20న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాక్ కేబినెట్ సమావేశ మందిరంలో ఈ భేటీ నిర్వహించనున్నారు. మంత్రివర్గ సమావేశంలో ఉంచాల్సిన ప్రతిపాదనలను నిబంధనల ప్రకారం 19వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోగా సాధారణ పరిపాలన కేబినెట్ విభాగానికి సమర్పించాలని వివిధ శాఖల అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డి బుధవారం ఆదేశించారు.

గెలిచే జట్టు ఫైనల్‌కు...

ఆసియా కప్‌లో నేడు శ్రీలంకతో పాక్ పోరు.. రద్దయితే ఫైనల్‌కు లంక 12లో

చంద్రబాబు పిటిషన్‌లో కౌంటర్ వేయండి

సీఐడీకి హైకోర్టు ఆదేశం.. విచారణ 19కి వాయిదా

- 18 వరకు పోలీసు కస్టడీ పిటిషన్‌లో కౌంటర్ కోసం ఒత్తిడి చేయొద్దు
- ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానానికి హైకోర్టు ఆదేశం
- కౌంటర్ లేకుండా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు సాధ్యం కాదు
- ఏ కేసులోనైనా కౌంటర్ తర్వాతే మధ్యంతర ఉత్తర్వులపై నిర్ణయం
- చంద్రబాబు న్యాయవాదులకు తేల్చి చెప్పిన న్యాయస్థానం



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో సీఐడీ పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ మాజీ సీఎం, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన పిటిషన్‌లో హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో
మిగతా 3వ పేజీలో ▶

బాలయ్య.. బాంబు!

చంద్రబాబు సీట్లో కూర్చుని నేతలతో మంతనాలు

నేను వస్తున్నానంటూ టీడీపీ క్యాడర్‌కు సందేశం

కొత్త రాజకీయంతో ఉలిక్కిపడ్డ లోకేశ్

హడావుడిగా తల్లితో కలిసి కార్యకర్తల సమావేశం

పార్టీ నారా కుటుంబం చేతుల్లోనే ఉందని చినబాబు సంకేతాలు

తాజా పరిణామాలతో అయోమయంలో శ్రేణులు

- వివరాలు 14లో

కన్నుమూస్తే.. టీడీపీ కౌంట్‌లోకి

3లో

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ శవరాజకీయం

అనారోగ్య, ఇతర కారణాలతో మృతి చెందుతున్న వ్యక్తులు

ఆ మరణాలను తమ సానుభూతి ఖాతాలోకి వేసుకుంటున్న టీడీపీ

బాబు కోసం పవన్ 'ఆరాటం'

- వారం రోజుల్లోనే రాష్ట్రానికి రెండోసారి వస్తున్న పవన్‌కళ్యాణ్
- జైలులో ఉన్న బాబుతో నేడు భేటీ
- హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో రాజమండ్రికి..
- 2014లో పార్టీ పెట్టాక అప్పుడప్పుడు మాత్రమే రాష్ట్రానికొస్తున్న జనసేన అధినేత
- విస్తుపోతున్న ఆ పార్టీ నేతలు

14లో

గజదొంగను అరెస్టు చేస్తే తప్పా?

- స్కిల్ స్కామ్‌ను ఆధారాలతో వివరించిన వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి
- రూ.370.78 కోట్ల దోపిడీకి బలమైన సాక్ష్యాలు
- వాటితో ఏకీభవించే బాబును రిమాండ్‌పై జైలుకు పంపిన కోర్టు
- అయినా బాబు ఏ తప్పూ చేయనట్లు ఎల్లో మీడియా రాద్ధాంతం
- చంద్రబాబు అడ్డంగా దొరికిపోయారన్నది ప్రజలందరికీ తెలుసు
- దబాయిస్తే తప్పు ఒప్పు కాదు.. అబద్ధం నిజం కాదు
- ఇంకా రచ్చ చేస్తే మరింత అభాసుపాలే

3లో



ఊహకందని మహా విషాదం

5,100 డెర్నా సిటీలో వరద మృతులు

30,000 సర్వం కోల్పోయి వలస వెళ్లినవారు

లిబియాలో వరద ఉధృతికి వేలాది మంది గల్లంతు..

నగరంలో ఎటు చూసినా శవాలే

రహదారులు దెబ్బతినడంతో సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం

- వివరాలు 6లో


లిబియాలోని డెర్నా సిటీలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద

ఇదండీ వరస (ఇదంజగత్)



క్లుప్తంగా...

రేపు విజయనగరం జిల్లాలో సీఎం వైఎస్ జగన్ పర్యటన

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 15వ తేదీ (శుక్రవారం) విజయనగరం జిల్లాలో పర్యటించనున్నారు. విజయనగరం మెడికల్ కాలేజీ ప్రాంగణం నుంచి 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీ (విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల)లను వర్చువల్‌గా ప్రారంభిస్తారు. ఉదయం 8.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి విజయనగరం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రాంగణానికి చేరుకుంటారు. అక్కడ డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహావిష్కరణ, తర్వాత నూతన మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవం, ల్యాబ్‌ల పరిశీలన, మిగిలిన 4 మెడికల్ కాలేజీల వర్చువల్ ప్రారంభోత్సవం తర్వాత సీఎం ప్రసంగిస్తారు. కార్యక్రమం అనంతరం బయలుదేరి తాడేపల్లి నివాసానికి తిరిగి చేరుకుంటారు.

29న విశాఖలో దక్షిణాది రాష్ట్రాల సదస్సు

సాక్షి, విశాఖపట్నం: విశాఖ నగరం మరో జాతీయ సదస్సుకు ఆతిథ్యమివ్వనుంది. పౌర సరఫరాలు, వినియోగదారుల హక్కులకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు ఈ నెల 29న దక్షిణాది రాష్ట్రాల అధికారులు నగరంలోని నోవాటెల్ హోటల్‌లో సమావేశం కానున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, డీఎస్‌వో సూర్యప్రకాష్ పర్యవేక్షిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, అండమాన్ నికోబార్ దీవులకు సంబంధించిన అధికారులు హాజరుకానున్నారు. కన్స్యూమర్ అఫైర్స్ మంత్రిత్వ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రవికుమార్ సింగ్ ముఖ్యఅతిథిగా హాజరై సదస్సును ప్రారంభించనున్నారు. ఆయా రాష్ట్రాల్లో పౌరసరఫరాల విభాగంలో అమలు చేస్తున్న సంస్కరణలు, వినియోగదారుల హక్కులకు సంబంధించి తీసుకుంటున్న చర్యలపై చర్చించనున్నారు. ఏడు రాష్ట్రాలకు సంబంధించిన పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలు, 173 జిల్లాల వినియోగదారుల హక్కుల కమిషన్ చైర్మన్‌లు, ఇతర అధికారులు హాజరుకానున్నారు.

రాష్ట్రంలో కొత్తగా మరో 54 రైతు బజార్లు

పొదలకూరు: రాష్ట్రంలో మరో 54 రైతు బజార్లను ఏర్పాటు చేస్తున్నట్లు మార్కెటింగ్‌శాఖ (రైతు బజార్లు) సీఈవో నందకిషోర్‌రెడ్డి తెలిపారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరులో రైతుబజార్ ప్రారంభోత్సవానికి బుధవారం ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 105 రైతు బజార్లు ఉన్నాయని, అదనంగా మరో 54 మంజూరు చేశామన్నారు. వాటిలో 20 రైతు బజార్ల నిర్మాణం పూర్తయిందని చెప్పారు. మరో 34 బజార్ల పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. పొదలకూరు రైతు బజార్‌ను రూ.45 లక్షలతో నిర్మించినట్లు తెలిపారు. ప్రభుత్వం రైతు బజార్లలో మెరుగైన సౌకర్యాలు అందించేందుకు రూ.4.50 కోట్లతో ఆధునికీకరణ పనులు చేసినట్లు వివరించారు.

విశాఖ కంటైనర్ టెర్మినల్ సరికొత్త రికార్డు

- ఒకే రోజు 4,475 టీయూఈ హ్యాండ్లింగ్



సాక్షి, విశాఖపట్నం: కార్గో హ్యాండ్లింగ్‌లో విశాఖపట్నం కంటైనర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్ (వీసీటీపీఎల్) మరోసారి తన రికార్డును తానే తిరగరాసింది. ఒక్క రోజులో అత్యధిక కంటైనర్ల హ్యాండ్లింగ్ చేసి రికార్డు సృష్టించింది. 12వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి 13వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక్క రోజులో 4,475 టీయూఈ(20 అడుగుల కంటైనర్లు) హ్యాండ్లింగ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కంటైనర్ల ద్వారా 78,947 మెట్రిక్ టన్నుల సరకు రవాణా జరిగినట్లు వివరించారు. ఈ ఏడాది జూన్ 26న 4,004 టీయూఈలతో నెలకొల్పిన రికార్డును అధిగమించింది. ఆరోజున మొత్తం 72,297 మెట్రిక్ టన్నుల హ్యాండ్లింగ్ జరిగింది. భవిష్యత్తులో నెలకు 75 వేల టీయూఈలు హ్యాండ్లింగ్ చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు వీసీటీపీఎల్, విశాఖపట్నం పోర్టు ట్రస్టు అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

‘అరకు కాఫీ బెస్ట్ ఇన్ ది వరల్డ్’

- ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా ట్వీట్



సాక్షి, అమరావతి: అరకు కాఫీపై ప్రముఖ పారిశ్రామికవేత్త, మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా ప్రశంసలు కురిపించారు. ఢిల్లీలో జరిగిన జీ-20 సమ్మిట్ తర్వాత వివిధ దేశాధినేతలకు ప్రత్యేక బహుమతిగా అరకు కాఫీని అందించడంపై ఆనందం వ్యక్తం చేశారు. అరకు కాఫీని ప్రపంచ స్థాయిలో అత్యుత్తమ నాణ్యత గల ఉత్పత్తులను అందించే భారతదేశ సామర్థ్యానికి ప్రధాన ఉదాహరణగా ఆయన అభివర్ణించారు. అరకు ఒరిజినల్స్ బోర్డు చైర్మన్‌గా ఈ ఘనత తనకు ఎంతో గర్వకారణమన్నారు. ‘ఇది నాకు చాలా గర్వంగా ఉంది. అరకు కాఫీ ది బెస్ట్ ఇన్ ది వరల్డ్. గ్రోన్ ఇన్ ఇండియాకు సరైన ఉదాహరణ’ అంటూ ఆనంద్ మహీంద్రా బుధవారం ట్వీట్ చేశారు.

4 వేల గ్రామాల్లో

భూముల రీసర్వే పూర్తి

దేశంలో మొట్టమొదటిసారి ఇన్ని గ్రామాల్లో రీసర్వే పూర్తిచేసిన రాష్ట్రంగా ఏపీ

- ఈ గ్రామాల్లో సర్వే పూర్తయినట్లు నోటిఫికేషన్లు జారీ
- భూముల సేవలన్నీ ఏకీకృతం..
- భూ హక్కు పత్రాల ద్వారా భద్రత..
- సర్వే రాళ్లు పాతడం ద్వారా రక్షణ కల్పిస్తున్న ప్రభుత్వం
- దేశంలోని పలు రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టు



సాక్షి, అమరావతి: భూముల రీసర్వేలో రాష్ట్ర ప్రభుత్వం మరో మైలు రాయిని అధిగమించింది. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు వేల గ్రామాల్లో అన్ని దశల సర్వే పూర్తయింది. ఈ గ్రామాల్లో సర్వే పూర్తయినట్లు నెంబర్ 13 నోటిఫికేషన్లు కూడా జారీచేయడంతో అక్కడ కొత్త రెవెన్యూ రికార్డులు అందుబాటులోకి వచ్చాయి. స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఇప్పటివరకు దేశంలోని ఏ గ్రామంలోనూ పూర్తిస్థాయి రీ సర్వే జరగలేదు. ఇప్పటికీ అన్ని రాష్ట్రాల్లోని గ్రామాలు, పట్టణాల్లో బ్రిటీష్ వాళ్లు రూపొందించిన రెవెన్యూ రికార్డులే ఉన్నాయి. తొలిసారిగా మన రాష్ట్రంలోనే నాలుగు వేల గ్రామాల్లో రీసర్వే పూర్తవడంతో అక్కడ డిజిటల్ రెవెన్యూ రికార్డులు అందుబాటులోకి వచ్చాయి. ఈ కొత్త రికార్డుల ఆధారంగానే ఇకపై భూముల వ్యవహారాలు జరగనున్నాయి. రీసర్వేలో భాగంగా ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్‌లు (గ్రామాల ఫొటోలు) తయారుచేయడానికి విమానాలు, హెలికాప్టర్లు, డ్రోన్లు వినియోగిస్తున్న తొలి రాష్ట్రం కూడా మనదే.

2020 డిసెంబర్‌లో ప్రాజెక్టు ప్రారంభం

పూర్వపు కృష్ణాజిల్లా జగ్గయ్యపేట మండలంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకాన్ని 2020 డిసెంబర్ 21న ప్రారంభించారు. ఆ తర్వాత కరోనా రావడంతో కొంత ఆలస్యమైనా ఆ తర్వాత శరవేగంగా ఈ కార్యక్రమం జరుగుతోంది. విమానాలు, హెలికాప్టర్లు, డ్రోన్లు, కంటిన్యూయస్లీ ఆపరేటింగ్ రిఫరెన్స్ స్టేషన్లు, రోవర్ల వంటి అత్యాధునిక సర్వే టెక్నాలజీలను ఉపయోగించి దాదాపు వందేళ్ల తర్వాత సమగ్ర రీ సర్వేను చేపట్టారు. సర్వే తర్వాత రైతులకు భూ హక్కు పత్రాలివ్వడం.. ఆ భూములకు భద్రత నిర్ధారించడం, భూ రక్ష సర్వే రాళ్లు నాటడం ద్వారా సరిహద్దు భద్రతను ప్రభుత్వం కల్పిస్తోంది. భూరక్ష సర్వే రాళ్ల ఖర్చు మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది.

రీ సర్వే వల్ల ప్రయోజనాలు..

- సర్వే తర్వాత భూముల రికార్డులను 10 సెంటీమీటర్ల కచ్చితత్వంతో కొలిచి తయారుచేస్తారు.
- భూ యజమానులకు భూ కమత పటం, గ్రామ పటం, భూ హక్కు పత్రం వంటి రికార్డులను జీపీఎస్ కో-ఆర్డినేట్లు, ఐడీ నెంబర్, క్యూఆర్ కోడ్‌తో ఇస్తారు.
- గ్రామంలోని స్థలాలు, అర్బన్ ప్రాంతాల్లోని భూములను కూడా మొదటిసారి సర్వేచేసి యజమానులకు యాజమాన్య ధ్రువీకరణ పత్రాలు కూడా జారీచేస్తున్నారు.
- భూమి రికార్డులు ట్యాంపరింగ్‌కి అవకాశం ఉండదు. భూ యజమానికి తెలియకుండా భూమి రికార్డులో ఏ మార్పులు జరిగే అవకాశం ఉండదు. డబుల్ రిజిస్ట్రేషన్లకు ఆస్కారం ఉండదు.
- గ్రామ సచివాలయాలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుగా పనిచేస్తాయి. ఎప్పటికప్పుడు భూమి రికార్డులు అప్‌డేట్ అవుతాయి.
- రిజిస్ట్రేషన్‌కు ముందే మ్యుటేషన్, పట్టా సబ్ డివిజన్ జరుగుతుంది.
- రీ సర్వేకు హాజరుకాలేని వారికి వాట్సాప్ వీడియో కాల్, జూమ్ ఇతర వీడియో ఇంటరాక్టివ్ టెక్నాలజీల ద్వారా రీసర్వే బృందాలు వారి స్టేట్‌మెంట్లను రికార్డ్ చేస్తున్నాయి.

భూ సంబంధిత సేవలన్నీ ఏకీకృతమయ్యాయి

రీ సర్వే విజయవంతంగా జరుగుతోంది. భూమికి సంబంధించిన అన్ని సేవలు ఏకీకృతమై ఒకే డెస్క్ వ్యవస్థలోకి వస్తున్నాయి. గ్రామ సచివాలయంలో సమీకృత సర్వే, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ సేవలను దేశంలోనే మొదటిసారి అందిస్తున్నాం. మన రీ సర్వే ప్రాజెక్టు అనేక రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలుస్తోంది. ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ మన అధికారులతో ఇతర రాష్ట్రాల్లో రీసర్వే శిక్షణలు ఏర్పాటుచేస్తోంది.

– సిద్ధార్థ జైన్, కమిషనర్, సర్వే, సెటిల్మెంట్ శాఖ



వధూవరులకు సీఎం జగన్ ఆశీస్సులు

విజయవాడలోని ఏ1 కన్వెన్షన్‌లో బుధవారం తమ సమీప బంధువులైన ప్రతాప్, సుదీపల కుమార్తె వివాహ రిసెప్షన్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. వధువు ఆలన, వరుడు సంజయ్‌లకు ఆశీస్సులు అందజేశారు. - సాక్షి, అమరావతి

ఐటీ హబ్‌గా విశాఖ

- త్వరలో విశాఖలో ఇన్ఫోసిస్ కార్యకలాపాలు
- సంస్థ ప్రతినిధులతో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్‌ల భేటీ



ఇన్ఫోసిస్ ప్రతినిధులతో భేటీ అయిన వైవీ సుబ్బారెడ్డి, గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: ఐటీ హబ్‌గా విశాఖ అభివృద్ధి చెందనుందని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌లు చెప్పారు. ఐటీ దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్ త్వరలోనే విశాఖలో తన కార్యకలాపాలను ప్రారంభించనుందని తెలిపారు. వైఎస్సార్ హయాంలో విశాఖలో ఐటీకి జీవం పోస్తే.. ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఐటీ అభివృద్ధి పరుగులు పెడుతోందని ప్రశంసించారు. ఎండాడ సమీపంలో ఐటీ సెజ్ హిల్ నంబర్-2లో ఇన్ఫోసిస్ సంస్థ ఏర్పాటు కానున్న నూతన భవనాన్ని బుధవారం ఇన్ఫోసిస్ ప్రతినిధులతో కలిసి వారు పరిశీలించారు. అనంతరం ఇన్ఫోసిస్ సంస్థ ప్రతినిధులతో భేటీ అయ్యారు. సమావేశంలో ఇన్ఫోసిస్ సంస్థ మౌలిక సదుపాయాల విభాగం వైస్ ప్రెసిడెంట్, గ్లోబల్ హెడ్ నీలాద్రి ప్రసాద్‌మిశ్రా, మౌలిక సదుపాయాల అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ పునీత్ దేశాయ్, మౌలిక సదుపాయాల రీజనల్ హెడ్ కులకర్ణి, సంస్థ ఇతర ప్రతినిధులు జయచంద్రన్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు. వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇన్ఫోసిస్ కంపెనీ కార్యకలాపాలకు అవసరమైన సహాయ సహకారాలు ప్రభుత్వం తరఫున అందిస్తామని హామీ ఇచ్చారు. సంస్థ ప్రారంభోత్సవ తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ఉన్నారు.

ఐరాస సదస్సుకు ఏపీ విద్యార్థులు

- న్యూయార్క్ పయనమైన 10 మంది విద్యార్థుల బృందం
- బృందంలో 8 మంది బాలికలు, ఇద్దరు బాలురు
- దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఘనత
- విద్యార్థి బృందాన్ని అభినందించిన మంత్రి బొత్స సత్యనారాయణ



విద్యార్థి బృందాన్ని అభినందిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 10 మంది విద్యార్థులు ఐక్య రాజ్య సమితి (ఐరాస) ఈ నెల 16 నుంచి నిర్వహించే సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు (ఎస్డీజీ) సదస్సుకు ఎంపికయ్యారు. 8 మంది బాలికలు, ఇద్దరు బాలురతో కూడిన ఈ బృందం గురువారం హైదరాబాద్ నుంచి విమానం ద్వారా అమెరికాలోని న్యూయార్క్ నగరానికి బయలుదేరనుంది. ఇందుకోసం బుధవారం రాత్రి విజయవాడ నుంచి ఈ బృందం రోడ్డు మార్గంలో హైదరాబాద్ బయలుదేరి వెళ్లింది. అంతకుముందు విద్యార్థుల బృందంతో విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఐక్యరాజ్య సమితిలో అడుగుపెట్టడం దేశ చరిత్రలో ఇదే ప్రథమం కావడం గర్వకారణమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, బలహీన వర్గాల పిల్లల అభ్యున్నతికి చేస్తున్న కృషికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. ఉత్తర అమెరికాలోని రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పర్యటనను విజయవంతం చేసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యార్థి ప్రతినిధుల బృందాన్ని పూర్తి ప్రభుత్వ వ్యయంతోనే అమెరికాకు తీసుకెళ్తున్నట్టు అధికారులు మంత్రికి వివరించారు. వారం రోజుల పర్యటనలో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించామన్నారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఏపీ విద్యా సంస్కరణలపై ఐరాసలో ప్రదర్శన

రాష్ట్ర విద్యావ్యవస్థలో నాడు-నేడు, జగనన్న విద్యాకానుక, జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, ద్విభాషా పాఠ్యపుస్తకాలు, ట్యాబ్లెట్‌ల పంపిణీ, డిజిటల్ తరగతి గదులు, ఆంగ్ల విద్య, పాఠ్యాంశాల సంస్కరణలు, సబ్జెక్టు ఉపాధ్యాయుల నియామకంతో పాటు విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను ఏపీ విద్యార్థుల బృందం ఐక్యరాజ్య సమితిలో ప్రదర్శించనుంది. సమగ్ర శిక్ష పీడీ బి.శ్రీనివాసరావు బృందం ప్రతినిధిగా, కేజీబీవీ కార్యదర్శి డి.మధుసూదనరావు నోడల్ ఆఫీసర్‌గా, ఉపాధ్యాయులు వి.విజయదుర్గ, కేవీ హేమప్రసాద్ మార్గదర్శకులుగా వ్యవహరించనున్నారు. ఐక్యరాజ్య సమితిలోని ఎకనామిక్, సోషల్ కౌన్సిల్ స్పెషల్ కన్సల్టేటివ్ స్టేటస్ మెంబర్ వున్నవ షకిన్‌కుమార్ సమన్వయంతో ఏపీ ప్రతినిధులకు అన్ని ఏర్పాట్లు చేశారు. 2023 పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 108 మంది అభ్యర్థులకు రాత పరీక్షలు నిర్వహించి, అందులో ఎంపికైన 30 మందికి కమ్యూనికేషన్ స్కిల్స్ పరీక్షించి 10 మందిని ఎంపిక చేశారు. ఇందులో ఒకరు 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఉండటం విశేషం.

న్యూయార్క్ బయలుదేరిన విద్యార్థులు వీరే

1. మాల శివలింగమ్మ, కేజీబీవీ ఆదోని, కర్నూలు జిల్లా (తండ్రి మాల సోమనాథ్ రైతు కూలీ, తల్లి గంగమ్మ)
2. మోతుకూరి చంద్రలేఖ, కేజీబీవీ ఎటపాక, ఏఎస్ఆర్ జిల్లా (తండ్రి మోతుకూరి రామారావు ఆటో డ్రైవర్, తల్లి మణి)
3. గుండుమోగుల గణేష్ అంజనాసాయి, ఏపీఆర్ఐఎస్, అప్పలరాజుగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా (తండ్రి గోపీ, కౌలు రైతు, తల్లి లక్ష్మి)
4. దడాల జ్యోత్స్న, సాంఘిక సంక్షేమ పాఠశాల, వెంకటాపురం, కాకినాడ జిల్లా (తండ్రి సింహాచలం సెక్యూరిటీ గార్డు)
5. సి.రాజేశ్వరి, ఏపీ మోడల్ స్కూల్, నంద్యాల (తండ్రి దస్తగిరి లారీ డ్రైవర్, తల్లి రామలక్ష్మి)
6. పసుపులేటి గాయత్రి, జెడ్పీహెచ్ఎస్ వట్లూరు, ఏలూరు జిల్లా (తండ్రి రమేష్ కూలీ, తల్లి జ్యోతి)
7. అల్లం రిషితారెడ్డి, మునిసిపల్ ఉన్నత పాఠశాల, కస్బా, విజయనగరం జిల్లా (తండ్రి ఎ.రామకృష్ణారెడ్డి మెకానిక్, తల్లి ఉదయలక్ష్మి)
8. వంజివాకు యోగేశ్వర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చంద్రగిరి, తిరుపతి జిల్లా (తండ్రి నాగరాజు కేబుల్ ఆపరేటర్, తల్లి విజయ)
9. షేక్ అమ్మాజన్, ఏపీఆర్ఎస్, వేంపల్లి, శ్రీ సత్యసాయి జిల్లా (తల్లి షేక్ ఫాతిమా, వ్యవసాయ కూలీ)
10. సామల మనస్విని, కేజీబీవీ, జీఎల్ పురం, పార్వతీపురం మన్యం జిల్లా(తల్లి కృష్ణవేణి)

ఇంటింటికీ ఆరోగ్య రక్ష

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం మీకు అందుబాటులో, మీ గ్రామంలోనే ఉందనే భరోసా ఇవ్వగలిగామన్నారు. అదే మాదిరిగానే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వివరించారు. బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించిన సీఎం జగన్ కార్యక్రమం అమలుపై అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్యం పొందడంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ రూపొందించిన బ్రోచర్‌ను ఈ సందర్భంగా సీఎం జగన్ ఆవిష్కరించారు. సమీక్షలో సీఎం ఏమన్నారంటే..



ఉన్నత స్థాయి సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పెను మార్పులకు శ్రీకారం

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఇంటినీ సందర్శించి మ్యాపింగ్ చేస్తారు. ఏ ఇంట్లో ఎవరు ఎలాంటి ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్నారో గుర్తిస్తారు. గ్రామాల్లో నిర్వహించే ప్రత్యేక హెల్త్ క్యాంప్‌ల ద్వారా వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి అవసరమైన పరీక్షలతో పాటు మందులు, కళ్లద్దాలు అందిస్తారు. క్యాన్సర్, కిడ్నీ వ్యాధులు లాంటి దీర్ఘకాలిక జబ్బుల బాధితులను (క్రానిక్ డీసీజెస్) గుర్తించడం, రెగ్యులర్‌గా చెకప్ చేయడం, డాక్టర్లు ఎప్పటికప్పుడు పరిశీలించడం, మందులను అందించడం, అవసరమైతే ఆస్పత్రులకు పంపడం లాంటి జాగ్రత్తలతో అనారోగ్య బాధితులను పూర్తిగా చేయి పట్టుకుని నడిపించే కార్యక్రమాన్ని చేపడుతున్నాం. గ్రామం పూర్తి బాధ్యతను ఫ్యామిలీ డాక్టర్ తీసుకోవాలి. రెగ్యులర్‌గా ఓ వైపు తనిఖీలు చేస్తూనే మందులు కూడా ఇవ్వబోతున్నాం. ఎక్కడా మందులు లేని పరిస్థితి ఉండకూడదు. ఇలా చాలా పెద్ద మార్పులకు శ్రీకారం చుడుతున్నాం. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలోనూ ప్రతి ఇల్లూ కవర్ కావాలి. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులున్న ఇళ్లను ప్రత్యేకంగా పరిగణించి కాలానుగుణంగా పరీక్షలు చేస్తూ మందులు, చికిత్స అందించాలి.

సంపూర్ణ రక్తహీనత నివారణ

రాష్ట్రంలో జీరో అనిమిక్ (రక్తహీనత) లక్ష్యంగా పనిచేయాలి. ఆరోగ్య సురక్షలో గర్భిణులు, బాలింతలతో పాటు రక్తహీనత బాధితులను కూడా గుర్తించి మందులతో పాటు, ఫుడ్ సప్లిమెంటేషన్ అందచేస్తాం. దీర్ఘకాలిక వ్యాధులు, నియోనేటల్ అండ్ ఇన్‌ఫాంట్ కేర్ (నవజాత శిశువులు, చిన్నారులు) కేసులను పరిగణలోకి తీసుకోవడంతో పాటు బీపీ, షుగర్ లాంటి సమస్యలున్న వారికి చికిత్స అందించాలి. ఒకవైపు సరైన సమయంలో చికిత్స అందిస్తూనే జీవన విధానాల్లో తీసుకోవాల్సిన మార్పులు, ఆయా వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలపై (ప్రివెంటివ్ కేర్) ప్రజల్లో అవగాహన పెంపొందించాలి. దీన్ని కూడా ఈ కార్యక్రమంలో భాగంగా చేపట్టాలి.

ప్రతి పేషెంట్‌కు ఉచిత వైద్యమే లక్ష్యం

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద అర్హులందరికీ ఉచితంగా వైద్యం అందాలి. పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి. ఆరోగ్య సురక్ష తొలి, రెండో దశల్లో వలంటీర్లు, సీహెచ్‌వోలు, ఏఎన్ఎంలు, ఆశాలు ప్రత్యేకంగా రూపొందించిన ఆరోగ్యశ్రీ బ్రోచర్లను ప్రజలకు అందజేయాలి. ఆరోగ్యశ్రీ యాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవడం, వినియోగంపై వివరించాలి. ఆరోగ్యశ్రీలో గతంలో 1,050 ప్రొసీజర్లు మాత్రమే ఉంటే మనం 3,256కి పెంచాం. పథకం పరిధిని విస్తృతం చేశాం. ప్రతి పేషెంట్ ఈ సేవలను ఉచితంగా అందుకోవాలన్నదే మన లక్ష్యం. ఏ ఒక్కరూ వైద్యం కోసం అప్పులపాలయ్యే పరిస్థితులు ఉండకూడదు.

45 రోజుల తర్వాత కూడా..

మనం 45 రోజుల పాటు తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని ఆ తర్వాత కూడా చేపట్టాలి. ప్రతి మండలంలోనూ నెలకు కనీసం 4 గ్రామాల్లో ఈ క్యాంపులను నిర్వహించాలి. దీంతో ప్రతి 6 నెలలకు ఒకసారి ఆ మండలంలో ఉన్న ప్రతి గ్రామంలోనూ హెల్త్ క్యాంపు నిర్వహించినట్లు అవుతుంది.

క్యాంప్‌లలో నలుగురు వైద్యులు

హెల్త్ క్యాంప్‌లలో నలుగురు డాక్టర్లు పాల్గొంటారు. ఇందులో ఇద్దరు పీహెచ్‌సీ డాక్టర్లు, మరో ఇద్దరు స్పెషలిస్టు డాక్టర్లు ఉంటారు. స్పెషలిస్ట్ వైద్యుల్లో గైనిక్/పీడియాట్రిక్ స్పెషలిస్టు డాక్టర్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. కంటి పరీక్షలను కూడా క్యాంపులో భాగంగా చేపట్టాలి. స్కూళ్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలి. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించేందుకు అనుకూలంగా ఉంటుంది. ఎంపీడీవో, ఎమ్మార్వోలు ఈ మెడికల్ క్యాంపు నిర్వహణ బాధ్యతలు తీసుకోవాలి. హెల్త్ క్యాంపు నిర్వహణకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. అధికారులకు ఈ కార్యక్రమంపై ఎలాంటి సందేహాలున్నా సీఎంవో (ముఖ్యమంత్రి కార్యాలయం)తో నివృత్తి చేసుకోవాలి.

ప్రివెంటివ్ కేర్‌లో నూతన అధ్యాయం

ఈ నాలుగేళ్లలో ఒక్క వైద్య, ఆరోగ్య శాఖలోనే 53,126 పోస్టులను భర్తీ చేశాం. ఎక్కడైనా ఖాళీలు ఏర్పడితే వెంటనే భర్తీ చేసేలా మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా చర్యలు తీసుకుంటున్నాం. గతంలో ఈ తరహా కార్యక్రమాన్ని ఎవరూ, ఎప్పుడూ చేయలేదు. నాడు-నేడుతో అన్ని ఆసుపత్రులను జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేశాం. రాష్ట్రంలో 17 కొత్త వైద్య కళాశాలలతోపాటు వీటికి అదనంగా 5 మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను ఏజెన్సీలో నిర్మిస్తున్నాం. ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ క్లినిక్‌ల పాత్ర ప్రివెంటివ్ కేర్‌లో కొత్త అధ్యాయం.

- సమీక్షలో వైద్య శాఖ మంత్రి మంత్రి విడదల రజిని, సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి, చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ సాయిప్రసాద్, వైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, మహిళా శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్, మహిళా శిశు సంక్షేమశాఖ కమిషనర్ జానకి, సీసీఎల్ఏ కార్యదర్శి ఇంతియాజ్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ నివాస్, ఆరోగ్యశ్రీ సీఈవో హరేంధిరప్రసాద్, ఆర్థిక శాఖ కార్యదర్శి గుల్జార్, గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ వెంకట మురళీ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐదు దశల్లో ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ ఇలా...

1. వలంటీర్లు, గృహ సారథులు, ప్రజా ప్రతినిధులు.. ఈ ముగ్గురూ కలిసి ప్రతి ఇంటినీ సందర్శిస్తారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురించి ప్రజలకు వివరిస్తారు. తేదీతో పాటు ఏయే సేవలు అందిస్తారో గ్రామం/పట్టణం వారీగా తెలియజేస్తారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీపై కూడా అవగాహన కల్పిస్తారు. ఆరోగ్యశ్రీ పథకంలో నెట్‌వర్క్ ఆస్పత్రులు ఎక్కడ ఉన్నాయి? ఏదైనా అనారోగ్య సమస్య వస్తే ఎలా ఆ ఆస్పత్రులకు వెళ్లాలి? ఉచిత వైద్య సేవలను ఎలా వినియోగించుకోవాలనే దానిపై అవగాహన కల్పిస్తారు. అనంతరం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌వో), ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ల బృందం ఆయా కుటుంబాల వద్దకు వస్తుందని, ప్రతి ఇంట్లోనూ పౌరులందరితో మాట్లాడి 7 రకాల టెస్టులకు సంబంధించిన అంశాలను మీతో చర్చిస్తారని తెలియజేస్తారు. ఈ నెల 15వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ క్యాంపెయిన్ మొదలవుతుంది.
2. సీహెచ్‌వో ఆధ్వర్యంలో ఏఎన్ఎం, ఆశావర్కర్, వలంటీర్లు అన్ని ఇళ్లను సందర్శిస్తారు. ప్రజలకు వారి ఇంటివద్దే బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, యూరిన్, స్పూటమ్ (కఫం) పరీక్షలతోపాటు జ్వరంతో బాధపడుతున్న వారికి మలేరియా, డెంగీ లాంటి మొత్తం ఏడు రకాల పరీక్షలు నిర్వహిస్తారు. వైద్య పరీక్షల ఫలితం ఆధారంగా సేకరించిన వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేస్తారు. అనంతరం ప్రతి ఇంటికి, పేషెంట్‌కి ఒక కేస్ షీట్ జనరేట్ అవుతుంది. ఈ డేటా వివరాలు హెల్త్ క్యాంపు జరిగే నాటికి ఉపయోగపడతాయి.
3. మరోసారి ఓరియెంటేషన్ కార్యక్రమం ఉంటుంది. గ్రామం/పట్టణంలో హెల్త్ క్యాంప్ నిర్వహించటానికి మూడు రోజులు ముందుగానే వలంటీర్, గృహ సారథులు, ప్రజా ప్రతినిధులు ఆయా చోట్ల ప్రజలకు మరోసారి గుర్తు చేస్తారు. క్యాంప్ నిర్వహించే రోజు అందుబాటులో ఉండాలని సమాచారం ఇస్తారు.
4. గ్రామం/పట్టణంలో హెల్త్ క్యాంపు నిర్వహిస్తారు. ఈ నెల 30వతేదీ నుంచి హెల్త్ క్యాంపులు ప్రారంభం అవుతాయి. ప్రతి రోజూ ప్రతి మండలంలో ఏదో ఒక గ్రామం/పట్టణంలో క్యాంపు నిర్వహిస్తారు. గ్రామాల్లో వైఎస్సార్ విలేజ్ క్లినిక్/పట్టణాల్లో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని యూనిట్‌గా తీసుకుని 45 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా క్యాంపులు జరుగుతాయి.
5. ప్రతి గ్రామంలో జల్లెడ పట్టిన తర్వాత ప్రజల ఆరోగ్య వివరాలు హ్యాండ్ హోల్డింగ్‌లో ఉండాలి. వివిధ సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించాక వారికి కాలానుగుణంగా టెస్టింగ్, కన్సల్టేషన్, మందులు ఇవ్వడం అన్నది ఈ కార్యక్రమంలో ప్రధాన అంశం. మందులు లేవు, దొరకడం లేదు అన్న మాటే వినిపించకుండా చర్యలు.



కత్తి తీసి పోరాడటమే సరైనది

చంద్రబాబు లాయర్ సిద్ధార్థ లూథ్రా ఆసక్తికర ట్వీట్



సిద్ధార్థ లూథ్రా చేసిన ట్వీట్

సాక్షి, అమరావతి: స్కిల్ కుంభకోణంలో అరెస్ట్ అయిన చంద్రబాబు నాయుడు తరఫున వాదిస్తున్న సుప్రీంకోర్టు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ఆసక్తికరమైన ట్వీట్ చేశారు. హైకోర్టు బుధవారం క్వాష్ పిటిషన్‌ను వాయిదా వేస్తూ తీర్పు ఇచ్చిన అనంతరం.. ఈ రోజు మా నినాదం ఇదే.. అంటూ గురు గోవింద్ సింగ్ సూక్తిని ఆయన ఉటంకించారు. 'అన్ని విధాలుగా ప్రయత్నించినా న్యాయం కనుచూపు మేరలో లేదని తెలిసినప్పుడు కత్తి తీసి పోరాడటమే సరైనది' అని ట్వీట్ చేశారు.

ప్రధాన దోషి చంద్రబాబే

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



వినుకొండ(నూజెండ్ల): స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ప్రధాన దోషి చంద్రబాబే అని పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం వినుకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల సిఫార్సులు లేకుండా అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి పథకం ప్రకారం దోచుకొని చంద్రబాబు అడ్డంగా దొరికిపోయారని అన్నారు. ఆధారాలతో ప్రభుత్వం అరెస్ట్ చేసి జైలుకు పంపితే రాజకీయ కుట్ర అని అసత్య ప్రచారాలు చేస్తున్నారని, అలాంటి కుట్ర ఏదీలేదని స్పష్టం చేశారు.

చంద్రబాబు పిటిషన్‌పై విచారణ 19కి వాయిదా

కౌంటర్ దాఖలు చేస్తామన్న సీఐడీ

సాక్షి, అమరావతి: అమరావతి మాస్టర్ ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ డిజైన్ల ముసుగులో సాగిన భూ దోపిడీపై సీఐడీ 2022లో నమోదు చేసిన కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ చంద్రబాబు నాయుడు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో తదుపరి విచారణ ఈ నెల 19వ తేదీకి వాయిదా పడింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ పిటిషన్‌పై బుధవారం జస్టిస్ సురేష్‌రెడ్డి విచారణ జరిపారు. బాబు తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు రిమాండ్‌కు వెళ్లగానే సీఐడీ.. ఏసీబీ ప్రత్యేక కోర్టులో పీటీ వారెంట్ కోసం పిటిషన్ దాఖలు చేసిందన్నారు. సీఐడీ తరఫున ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. కౌంటర్ దాఖలు చేస్తామని చెప్పారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేశారు.


అవినీతికి పాల్పడడం వల్లే బాబుకు జైలు: కేఏ పాల్

పూసపాటిరేగ: మాజీ సీఎం చంద్రబాబు అవినీతికి పాల్పడడం వల్లే జైలు పాలయ్యారని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు కేఏ పాల్ అన్నారు. విజయనగరం జిల్లా కందివలస గెడ్డ వద్ద బుధవారం ఆయన మాట్లాడారు. చంద్రబాబు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ పేరిట ప్రజాధనాన్ని లూటీ చేశారని చెప్పారు.

గజదొంగను అరెస్టు చేస్తే తప్పా?

స్కిల్ స్కామ్ తీరును సాక్ష్యాధారాలతో వివరించిన వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం ద్వారా ప్రభుత్వ ఖజానా నుంచి రూ.370.78 కోట్లను దోచేశారనడానికి బలమైన సాక్ష్యాధారాలు ఉండటం వల్లే చంద్రబాబుకు ఏసీబీ కోర్టు 14 రోజులు రిమాండ్ విధించి, జైలుకు పంపిందని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. అయినా సరే.. గజదొంగ చంద్రబాబును సీఐడీ పోలీసులు అరెస్టు చేయడమే తప్పన్నట్లుగా.. మానవ హక్కులను ఉల్లంఘించినట్లుగా ఎల్లో మీడియా, దశాబ్దాలుగా వివిధ వ్యవస్థల్లో చంద్రబాబు పెంచిపోషిస్తున్న కాలనాగులు రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు వివిధ పార్టీల నేతల్లో చంద్రబాబుకు మద్దతు కూడగట్టేందుకు కాలనాగుల వ్యవస్థ పనిచేస్తోందన్నారు. దొంగతనం చేసి అడ్డంగా దొరికిపోయిన కేసులోనూ ప్రజల సానుభూతి పొంది.. తద్వారా రాజకీయ ప్రయోజనం పొందాలన్న వ్యూహంతోనే ఈ గోబెల్స్ ప్రచారానికి దిగారని దుయ్యబట్టారు. దబాయిస్తే అబద్ధం నిజం కాదని.. తప్పు ఒప్పు కాదన్న సత్యాన్ని గుర్తుపెట్టుకోవాలని చంద్రబాబు, ఎల్లో మీడియాకు హితవు పలికారు. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు అడ్డంగా దొరికిపోయారన్నది ప్రజలకు తెలుసునని.. ఇంకా రచ్చ చేస్తే అభాసుపాలవుతారని హెచ్చరించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ స్కామ్‌లో చంద్రబాబు రూ.370.78 కోట్లు దోచేసిన తీరును ఆయన సాక్ష్యాధారాలతో వివరించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.



స్కామ్ జరిగిన తీరును వివరిస్తున్న సజ్జల

ప్రభుత్వ ఖజానాను దోచేయడానికే పథకం

- రాష్ట్రంలో యువతకు నైపుణ్యాలను అభివృద్ధి చేసేలా శిక్షణ ఇచ్చి.. ఉపాధి కల్పించేందుకు సీమెన్స్ ఇండియా లిమిటెడ్, డిజైన్ టెక్, స్కిల్ డెవలప్‌మెంట్ మధ్య కుదిరిన ఎంవోయూ (ఒప్పందం)ను అమలు చేస్తూ.. ఈ పథకానికి వ్యయమయ్యే 90 శాతం నిధులు అంటే రూ.2,734.20 కోట్లను సీమెన్స్ గ్రాంట్-ఇన్-ఎయిడ్‌గా ఇస్తుందని.. రాష్ట్ర ప్రభుత్వం వాటాగా పది శాతం అంటే రూ.రూ.370.78 (రూ.330 కోట్లు+ట్యాక్స్ రూ.40.80 కోట్లు) ఇవ్వాలని 2015 జూన్ 30న ఉత్తర్వులు (జీవో ఎంఎస్ నెంబర్ 4) జారీ చేశారు.
- ఎంవోయూలో మాత్రం రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.370.78 కోట్లు కాస్త ఆర్థిక సహాయంగా మార్చేశారు. ఆ ఎంవోయూ ఎప్పుడు కుదుర్చుకున్నారన్న తేదీ కూడా వేయలేదు. ఆ నిధులను డిజైన్ టెక్‌కు విడుదల చేయడానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, కార్యదర్శులు తీవ్రంగా అభ్యంతరం చెప్పారు. కానీ అప్పటి సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఆ నిధులను విడుదల చేసినట్లు నోట్ ఫైల్స్‌లో పేర్కొన్నారు. అధికారులపై చంద్రబాబు ఒత్తిడి తేవడం అక్రమం కాదా?
- డిజైన్ టెక్‌కు చేసిన చెల్లింపులపై 2017–18లో జీఎస్టీ ఇంటెలిజెన్స్ విభాగం విచారణ చేసి.. రూ.240 కోట్లకుపైగా నిధులను దారిమళ్లించేసినట్లు తేల్చుతూ రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసింది. దీనిపై కేసు(టీఆర్‌ఏసీఐ 2018–00436) నమోదు చేసింది. అప్పట్లో ఈ అక్రమంపై చర్యలు చేపట్టాల్సిన చంద్రబాబు.. తన తప్పును కప్పిపుచ్చుకోవడానికే ఆ ఫైళ్లను మాయం చేశారు.

దొంగతో నీతులు చెప్పిస్తారా?

➤ డిజైన్ టెక్ ఎండీ వికాస్ కన్వేల్కర్‌ను అటు ఈడీ, ఇటు సీఐడీ అరెస్టు చేశాయి. బెయిల్‌పై ఉన్న ఇతనితో స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణమే జరగనట్లుగా ఎల్లో మీడియా చెప్పించడం విడ్డూరం. చంద్రబాబు తప్పు చేయకపోతే తన పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, హవాలా మనోజ్ వాసుదేవ్ పార్థసానిలు ఎందుకు విదేశాలకు పారిపోయారు?

➤ ఢిల్లీ నుంచి రూ.కోట్లు ఫీజుగా చెల్లించి రప్పించుకున్న లాయర్ కూడా అక్రమం జరగనట్లుగా వాదించలేదు. చంద్రబాబుకు జైలులో ప్రత్యేక వసతులు, ఇంటి భోజనం ప్రతిపాదనకు సీఐడీ అభ్యంతరం చెప్పలేదు. అయినా సరే చంద్రబాబుపై కక్ష సాధిస్తున్నట్లు ఎల్లో మీడియా రాద్ధాంతం చేయడం హేయం. జాతీయ, అంతర్జాతీయ దర్యాప్తు సంస్థలకు కేస్ స్టడీగా స్కిల్ స్కామ్ ఉపయోగపడుతుంది.

బాబు భద్రతపై మరింత శ్రద్ధ

- రాజమహేంద్రవరం జైలును తనిఖీ చేసిన జైళ్ల శాఖ డీజీ
- బాబుతో న్యాయవాది లూథ్రా ములాఖత్

సాక్షి, రాజమహేంద్రవరం/కంబాలచెరువు: రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న చంద్రబాబు భద్రతపై జైలు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కోస్తాంధ్ర జైళ్ల డీజీ రవికిరణ్ బుధవారం సుమారు గంటపాటు జైల్లో తనిఖీలు చేశారు. బాబుకు కేటాయించిన స్నేహ బ్లాక్‌తో పాటు భద్రతను పరిశీలించారు. జైలు అధికారులకు పలు సూచనలు చేశారు. ఇప్పటికే చంద్రబాబు ఉంటున్న స్నేహ బ్లాక్ వద్ద సీసీటీవీ కెమెరాలతో భద్రతను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఆర్మ్‌డ్ సిబ్బంది చంద్రబాబు వైపు ఎవరూ వెళ్లకుండా పహారా కాస్తున్నారు. బాబు సుముఖత వ్యక్తం చేస్తేనే ములాఖత్‌కు అనుమతిస్తున్నారు.



చంద్రబాబుతో ములాఖత్‌కు వచ్చిన సిద్ధార్థ లూథ్రా

ఎలా ముందుకెళ్దాం..!

స్కిల్ స్కామ్ కేసులో చంద్రబాబు తరఫున వాదిస్తున్న సుప్రీంకోర్టు న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా బుధవారం సెంట్రల్ జైలులో ఆయన్ని కలిశారు. విజయవాడ నుంచి వచ్చిన ఆయన తొలుత లోకేశ్‌తో మాట్లాడి అనంతరం జైల్లో చంద్రబాబును కలిశారు. సుమారు 40 నిమిషాలు వారు కేసు గురించి చర్చించినట్లు తెలిసింది. అనంతరం జైలు బయటకు వచ్చిన లూథ్రా మీడియాతో మాట్లాడకుండా వెళ్లిపోయారు.

లోకేశ్‌కు రజనీకాంత్ ఫోన్..

చంద్రబాబు తనయుడు లోకేశ్‌కు సినీ నటుడు రజనీకాంత్ ఫోన్ చేసి.. కేసు గురించి వాకబు చేశారు. టీడీపీ ముఖ్యనేతలతో లోకేశ్, భువనేశ్వరి బుధవారం రాజమహేంద్రవరంలో భేటీ అయ్యారు.

మూడో రోజూ గడిచిందిలా..

చంద్రబాబు జైలు జీవితం గత రెండు రోజుల మాదిరిగానే మూడో రోజు కూడా సాగింది. తెల్లవారుజామున నిద్ర లేచిన చంద్రబాబు యోగా, వాకింగ్ చేసిన అనంతరం బ్లాక్ కాఫీ, డ్రై ఫ్రూట్స్, ఫ్రూట్ సలాడ్‌తో అల్పాహారం తీసుకున్నారు. మధ్యాహ్నం అన్నం, రెండు కూరలతో.. రాత్రికి అన్నం, పుల్కా, కూరతో భోజనం చేసినట్లు తెలిసింది.

కన్నుమూస్తే.. టీడీపీ కౌంట్‌లోకి

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ శవరాజకీయం

- అనారోగ్యం, ఇతర కారణాలతో మృతి చెందుతున్న వ్యక్తులు
- ఆ మరణాలను తమ సానుభూతి ఖాతాలోకి వేసుకుంటున్న టీడీపీ

సాక్షి, నంద్యాల/తాళ్లపూడి/కొవ్వూరు/వెంకటగిరి రూరల్: తెలుగుదేశం పార్టీ శవ రాజకీయాలను వీడడం లేదు. ఆ పార్టీ అధినేత చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి, జైలుకు వెళ్లిన నేపథ్యంలో ప్రజల్లో సానుభూతి కోసం వెంపర్లాడుతున్నారు. అనారోగ్యం, ఇతర కారణాలతో రాష్ట్రంలోని చనిపోయిన వారిని చంద్రబాబు అరెస్టును తట్టుకోలేకే చనిపోతున్నారంటూ టీడీపీ తమ ఖాతాలో వేసుకుంటోంది. ఈ మరణాలను పచ్చపత్రికల్లో ప్రచురిస్తూ బాబు అరెస్టును తట్టుకోలేక చనిపోయారంటూ కలరింగ్ ఇస్తున్నారు. ఇది చూసి మృతుల కుటుంబసభ్యులు, స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ మరణాలకు, చంద్రబాబు అరెస్టుకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేస్తున్నారు.

టీడీపీ ఖాతాలో వేసుకున్న మరణాలు.. వాటి వెనుక నిజాలు..

➤ నంద్యాల జిల్లా పాణ్యం మండలం, గోరుమానుకొండ గ్రామానికి చెందిన తెలుగు వెంకటేశ్వర్లు కుటుంబ సమస్యలతో చాలాకాలం క్రితం మద్యానికి బానిసయ్యాడు. గత నెల రోజులుగా మరింత ఎక్కువగా మద్యం సేవిస్తున్నాడు. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం ఎక్కువగా తాగి.. ఆ మత్తులో పురుగుల మందు తాగాడు. దీంతో అపస్మారకస్థితిలోకి వెళ్లి అదేరోజు మరణించాడు. ఈ మరణాన్ని టీడీపీ నాయకులు తమ ఖాతాలో వేసుకున్నారు.





➤ నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గంలోని లింగాల గ్రామానికి చెందిన నెత్తికప్పుల నాగరాజు కుటుంబమంతా గతకొన్నేళ్లుగా వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలుపుతున్నారు. మంగళవారం నాగరాజు గుండెనొప్పితో మరణించారు. ఇతని కుటుంబ సభ్యులను బతిమలాడి, పార్టీ నుంచి ఆర్థికసాయం అందుతుందని మభ్యపెట్టి చంద్రబాబు రిమాండ్‌ను తట్టుకోలేక గుండెపోటుతో మరణించినట్లు టీడీపీ నేతలు ప్రచారం చేసుకున్నారు.

➤ తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం మలకపల్లికి చెందిన టీడీపీ నాయకుడు చెరుకూరి సూర్యనారాయణ (80) వృద్ధాప్య సంబంధిత బాధలతో మంగళవారం మృతి చెందారు. ఈ మరణాన్ని సానుభూతి ఖాతాలో టీడీపీ నేతలు వేసుకున్నారు.

➤ తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త జొన్నకూటి శేఖర్ (45) కొన్నాళ్లుగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. ఆదివారం అర్ధరాత్రి మూత్రవిసర్జనకు లేచి కుప్ప కూలి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. భార్య సోదరుడు టీడీపీ సానుభూతిపరుడు. అతని మాట ప్రకారం టీడీపీ వాళ్లు సాయం చేస్తారనే ఉద్దేశంతో వారి ఖాతాలో వేసుకున్నారని స్థానికులు చెబుతున్నారు.

➤ తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణం రాణిపేటకు చెందిన వీర కృష్ణయ్య (63) చేనేత కార్మికుడు. మంగళవారం సాయంత్రం తమ మిద్దెపైకి ఎక్కిన సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కృష్ణయ్య మనుమడు మహేశ్ ఆయనను చికిత్స నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించాడు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారన్నారు. కృష్ణయ్య మృతికి చంద్రబాబు గృహ నిర్బంధం పిటిషన్ తిరస్కరణకు సంబంధం లేదని ఆయన మనుమడు మహేష్ స్పష్టం చేశారు.

➤ ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బలుసుపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గండమాల వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటి షుగరు, బీపీతో బాధపడుతున్నాడు. మద్యం ఎక్కువగా సేవిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఇంట్లోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చంద్రబాబు అరెస్టుకు వెంకటి మృతికి ఎలాంటి సంబంధం లేదని గ్రామస్తులు తెలిపారు.

చంద్రబాబు పిటిషన్‌లో కౌంటర్ వేయండి

▶ మొదటి పేజీ తరువాయి

కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీని ఆదేశించింది. చంద్రబాబు కస్టడీ కోరుతూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం వరకు విచారణ చేపట్టవద్దని విజయవాడ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానాన్ని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. సీఐడీ వాదన వినకుండా ఈ కేసులో ప్రస్తుత దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీచేయడం సాధ్యం కాదని న్యాయమూర్తి స్పష్టం చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అరెస్టయిన చంద్రబాబు నాయుడు జ్యుడీషియల్ రిమాండ్‌లో భాగంగా ప్రస్తుతం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న సంగతి తెలిసిందే. ఈ కుంభకోణంలో సీఐడీ తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ మంగళవారం ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే ఈ కేసు ఆధారంగా విజయవాడ ఏసీబీ కోర్టు తనకు రిమాండ్ విధిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను సైతం కొట్టేయాలని తన పిటిషన్‌లో కోర్టును కోరారు. ఈ వ్యాజ్యంపై బుధవారం న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి విచారణ జరిపారు.

మీరు ఈ వ్యాజ్యంపై విచారించేందుకు అభ్యంతరం లేదు

విచారణ ప్రారంభం కాగానే వాదనలు వినిపించేందుకు చంద్రబాబు తరపు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా సిద్ధమవుతుండగా, న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. వాదనలు వినిపించే ముందు తాను ఓ విషయం చెప్పదలచుకున్నానని తెలిపారు. తాను పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ)గా ఉన్న సమయంలో కొన్ని కేసుల్లో పిటిషనర్ చంద్రబాబుకు వ్యతిరేకంగా హాజరయ్యానని, దీనిపై మీకు అభ్యంతరం ఉంటే విచారణ నుంచి తప్పుకుంటానని స్పష్టం చేశారు. దీనిపై లూథ్రా, దమ్మాలపాటి శ్రీనివాస్, పోసాని వెంకటేశ్వర్లు స్పందిస్తూ, తమకు ఎలాంటి అభ్యంతరం లేదంటూ గట్టిగా చెప్పారు. ఈ వ్యాజ్యాన్ని మీరే వినాలని కోరారు. దీంతో న్యాయమూర్తి విచారణను కొనసాగించారు. లూథ్రా వాదనలు మొదలు పెడుతుండగా, సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ, ఈ వ్యాజ్యంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని, ఇందుకు తమకు కొంత గడువు కావాలని కోర్టుకు స్పష్టం చేశారు. కౌంటర్ దాఖలుకు ఆదేశాలిస్తానని చంద్రబాబు న్యాయవాదులను ఉద్దేశించి న్యాయమూర్తి చెప్పగా, తాము వాదనలు వినిపిస్తామని వారు తెలిపారు. ఇందుకు న్యాయమూర్తి అంగీకరించారు.

ఈ దశలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేం

ఈ సమయంలో లూథ్రా జోక్యం చేసుకుంటూ, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోర్టును కోరారు. కౌంటర్ లేకుండా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం సాధ్యం కాదని న్యాయమూర్తి అన్నారు. ఈ కేసులో మాత్రమే కాదని, సాధారణంగా తాను ఏ కేసులో కూడా కౌంటర్ లేకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వనని తెలిపారు. ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో సీఐడీ పోలీసులు చంద్రబాబు కస్టడీ కోసం పిటిషన్ దాఖలు చేశారని, ఈ వ్యాజ్యంలో తమను కౌంటర్ దాఖలు చేయాలంటూ ఏసీబీ కోర్టు ఒత్తిడి చేస్తోందని లూథ్రా న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. పోలీసు కస్టడీ పిటిషన్‌పై ఈ దశలో విచారణ జరిపితే తమకు నష్టం జరుగుతుందన్నారు. అందువల్లే కస్టడీ పిటిషన్‌పై విచారణను నిలిపేయాలని కోరుతున్నామన్నారు. దీనికి న్యాయమూర్తి స్పందిస్తూ, అలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఈ దశలో సాధ్యం కాదని లూథ్రాకు తేల్చి చెప్పారు. సోమవారం వరకు కస్టడీ పిటిషన్‌లో కౌంటర్ దాఖలుకు ఒత్తిడి చేయకుండా ఉండే విషయంలో మీకేమైనా అభ్యంతరం ఉందా? అని అదనపు ఏజీని ప్రశ్నించారు. సహచర న్యాయవాదులతో చర్చించిన అనంతరం తమకు ఎలాంటి అభ్యంతరం లేదని అదనపు ఏజీ స్పష్టం చేశారు. దీంతో న్యాయమూర్తి, సోమవారం వరకు పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని చంద్రబాబు న్యాయవాదులను ఒత్తిడి చేయవద్దని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానాన్ని ఆదేశించారు.

చంద్రబాబు రిమాండ్ చెల్లదు..

సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. చంద్రబాబు అరెస్ట్ అక్రమమన్నారు. అవినీతి నిరోధక చట్టం (పీసీ యాక్ట్)లోని సెక్షన్ 17ఏ ప్రకారం పబ్లిక్ సర్వెంట్‌ను విచారించాలన్నా, కేసు నమోదు చేయాలన్నా గవర్నర్ అనుమతి తప్పనిసరి అని తెలిపారు. ఈ కేసులో అలాంటి అనుమతి ఏదీ తీసుకోలేదన్నారు. ఇది చట్టవిరుద్ధమని తెలిపారు. గవర్నర్ అనుమతి తప్పనిసరి అని సుప్రీంకోర్టు కూడా చెప్పిందన్నారు. సెక్షన్ 17ఏను ఏసీబీ ప్రత్యేక కోర్టు సరైన కోణంలో అర్థం చేసుకోలేదన్నారు. 2018 జూలై తర్వాత ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 2018 తర్వాత నమోదైన కేసులకు గవర్నర్ అనుమతి తప్పనిసరని తెలిపారు. గవర్నర్ అనుమతి తీసుకోకుండా నమోదు చేసిన కేసు, అరెస్ట్, రిమాండ్ ఇవన్నీ చెల్లవన్నారు. అందువల్ల చంద్రబాబు రిమాండ్ ఉత్తర్వులను నిలిపేయాలని కోరారు.

నిబంధనల ప్రకారమే కస్టడీ పిటిషన్ వేశాం

ఈ సమయంలో అదనపు ఏజీ సుధాకర్ రెడ్డి జోక్యం చేసుకుంటూ, లూథ్రా పూర్తి స్థాయిలో వాదనలు వినిపిస్తున్నారని, తాము కౌంటర్ దాఖలు చేసిన తర్వాత వాదనలు వినిపించుకోవచ్చన్నారు. సెక్షన్ 17ఏ విషయంలో చట్టం చాలా స్పష్టంగా ఉందని, అందువల్ల ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని లూథ్రా కోరారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. అవతలి పక్షానికి సైతం అవకాశం ఇద్దామని తెలిపారు. కౌంటర్ల దాఖలుకు ఎంత సమయం కావాలని ప్రశ్నిస్తూ.. తొలుత శుక్రవారం కల్లా కౌంటర్ దాఖలు చేయాలని అదనపు ఏజీకి చెప్పారు. అంత తక్కువ సమయం సరిపోదని అదనపు ఏజీ తెలిపారు. నిబంధనల ప్రకారం రిమాండ్ విధించిన మొదటి 14 రోజుల లోపు పోలీసు కస్టడీ పిటిషన్ దాఖలు చేయాల్సి ఉంటుందని, అందుకు అనుగుణంగానే ఇప్పటికే పిటిషన్ దాఖలు చేశామని చెప్పారు. అయితే విచారణను సోమవారానికి వాయిదా వేస్తానని, అప్పటిలోపు కౌంటర్ దాఖలు చేయాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. సోమవారం వినాయక చవితి సెలవు అని సుధాకర్‌రెడ్డి చెప్పడంతో అలా అయితే మంగళవారం విచారణ చేపడతానని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

అంగళ్లు విధ్వంసం కేసులో బెయిల్ ఇవ్వండి

హైకోర్టులో చంద్రబాబునాయుడు పిటిషన్.. నేడు విచారణ

సాక్షి, అమరావతి: అన్నమయ్య జిల్లా, అంగళ్లు వద్ద జరిగిన విధ్వంసానికి సంబంధించి ముదివేడు పోలీసులు తనపై నమోదు చేసిన కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న నేపథ్యంలో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేయలేకపోతున్నానని తెలిపారు. దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తానని, ఎలాంటి షరతులు విధించినా అభ్యంతరం లేదని, తనకు మాత్రం బెయిల్ మంజూరు చేయాలని చంద్రబాబు న్యాయస్థానాన్ని కోరారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు గురువారం విచారణ జరపనుంది. అంగళ్ల కేసులో చంద్రబాబు ఏ1గా ఉన్నారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న పలువురు టీడీపీ నేతలు హైకోర్టును ఆశ్రయించి బెయిల్స్ తెచ్చుకున్నప్పటికీ ప్రధాన నిందితుడిగా ఉన్న చంద్రబాబు మాత్రం హైకోర్టుకు రాలేదు. తనకేం కాదులే అనే ధీమాతో ఉన్న ఆయన.. ఇప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి, జైల్లో ఉండటంతో ఒక్కసారిగా మేల్కొన్నారు. ఎందుకైనా మంచిదని బెయిల్ కోసం పిటిషన్ వేశారు.

రాజకీయ ప్రయోజనాల కోసం పిల్స్ వేయకూడదు

- హైకోర్టు సీజే ధర్మాసనం స్పష్టీకరణ
- టీడీపీ నేతల గృహ నిర్బంధంపై మాజీ ఎమ్మెల్యే పిల్

సాక్షి, అమరావతి: రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేయకూడదని హైకోర్టు చెప్పింది. స్కిల్ కుంభకోణం కేసులో టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు అరెస్టు సందర్భంగా టీడీపీ నేతలు, కార్యకర్తల గృహ నిర్బంధం చేయడాన్ని సవాలు చేస్తూ ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు దాఖలు చేసిన పిల్ విచారణ సందర్భంగా హైకోర్టు ఈ విషయం స్పష్టంచేసింది. ఈ వ్యాజ్యంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ న్యాయవాది బాలాజీ వాదనలు వినిపిస్తూ.. గృహ నిర్బంధం ద్వారా పోలీసులు పౌరుల హక్కులను హరిస్తున్నారన్నారు. పిటిషనర్ కూడా గృహ నిర్బంధ బాధితుడేనా అని ధర్మాసనం ప్రశ్నించింది. అవునని బాలాజీ చెప్పగా.. బాధిత వ్యక్తి ఇతరులందరి తరఫున ఎలా పిల్ దాఖలు చేస్తారని ప్రశ్నించింది. ఈ వ్యాజ్యం విచారణార్హతపై ధర్మాసనం సందేహం వ్యక్తంచేసింది. గృహ నిర్బంధం విషయంలో అభ్యంతరాన్ని వ్యక్తం చేసేందుకు పిటిషనర్‌కు ప్రత్యామ్నాయాలున్నాయని తెలిపింది. రాజకీయ ప్రయోజనాలను సాధించుకునేందుకు పిల్ దాఖలు చేయడానికి వీల్లేదని సుప్రీంకోర్టు తీర్పులు ఇచ్చిందని ధర్మాసనం గుర్తుచేసింది. ప్రతివాదులుగా ఉన్న హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, గుంటూరు ఎస్పీ తదితరులకు నోటీసులు జారీ చేసింది. విచారణను అక్టోబర్ 4కి వాయిదా వేసింది.

టీడీపీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదు

దుబాయ్‌లో జరిగిన సన్మానసభలో మంత్రి అంబటి రాంబాబు

సాక్షి, అమరావతి: కేసులన్నింటిలో శిక్ష పడితే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు జీవితాంతం బయటకు రాలేరని, ఇక ఏపీలో వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. యూఏఈలోని దుబాయ్ నగరంలోని కారామా ఏరియాలోని ఓ ఫంక్షన్ హాల్‌లో యూఏఈలోని వైఎస్సార్‌సీపీ ఎన్‌ఆర్‌ఐ సలహాదారు ప్రసన్నసోమిరెడ్డి, సమన్వయకర్త అక్రమ్‌బాషా ఆధ్వర్యంలో బుధవారం మంత్రి అంబటి రాంబాబుకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ చంద్రబాబు అవినీతి కేసు విషయంలో చట్టం, న్యాయం వాటిపని అవి చేసుకుని వెళుతున్నాయని చెప్పారు. 'ఈ సోషల్ మీడియా యుగంలో పచ్చమీడియా ఏకపక్ష, పక్షపాత వార్తా ప్రచారాలను ప్రజలు నమ్మడం లేదు. టీడీపీ పిలుపిచ్చిన బంద్ విఫలమవడం ద్వారా ఈ విషయం రుజువైంది. ఆరునెలల్లో అధికారంలోకి వస్తామంటూ టీడీపీ వారు కలలుకనొచ్చుగానీ.. వారు ఎట్టిపరిస్థితిలోను అధికారంలోకి వచ్చే అవకాశమే లేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు.



అంబటి రాంబాబును సన్మానిస్తున్న సోమిరెడ్డి, అక్రమ్‌బాషా, శ్రీనివాసచౌదరి తదితరులు

చంద్రబాబుపై విచారించదగిన కేసులు ఆరేడు ఉన్నాయి. ఈ కేసుల్లో అరెస్టయితే ఆయన బయటకు వచ్చే అవకాశం లేదు. ఈ ఆరేడు కేసుల్లో ఆయనకు శిక్షపడితే జీవితాంతం బయటకు రాలేరు. సాక్ష్యాధారాలతో సహా అడ్డంగా దొరికిన దొంగలా చంద్రబాబు అరెస్టవడం మనమంతా చూశాం. అందరం కోరుకున్నట్టే దేవుడు చంద్రబాబుకు జైలు రాత రాశాడు. ఆయన్ని రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఖైదీ నంబర్ 7691గా ఉంచారు. కట్టుదిట్టమైన రక్షణ కల్పించారు..' అని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికలను ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస చౌదరి, ఫహీం, శ్యామ్‌సురేంద్రరెడ్డి, మోహన్‌రావు, బ్రహ్మానందరెడ్డి, షేక్ అబ్దుల్లా, షర్ఫుద్దీన్, కుమార్, రవికుమార్, మైనర్ బాబు, ఖాజా, ఇర్షాద్, జాఫర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు అవినీతికి గట్టి ఆధారాలు

- ప్రజల నుంచి ఎలాంటి సానుభూతి రాలేదు
- ఆయన కట్టిన జైలు భవనంలోనే ముద్దాయిగా ఉన్నాడు
- న్యాయమూర్తి హిమబిందు మా బంధువనే ప్రచారం తగదు
- టీడీపీ సోషల్ మీడియా దుష్ప్రచారం మానుకోవాలి
- ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

నగరం: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవినీతికి పాల్పడినట్లు ఆధారాలు ఉన్నాయి కాబట్టే జైలుకు వెళ్లాడని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు స్పష్టం చేశారు. చంద్రబాబు అరెస్టును సానుభూతిగా మార్చుకోవాలని టీడీపీ భావించినా, ప్రజల నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. బాపట్ల జిల్లా వెలమవారిపాలెం గ్రామంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చం



ద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో సీమెన్స్ అనే బోగస్ సంస్థను సృష్టించి, సుమారు రూ.370 కోట్లు తన బినామీ కంపెనీలకు తరలించారనే ఆధారాలతో సీఐడీ అరెస్ట్ చేసిందన్నారు. దీనికి సంబంధించి 2018లోనే జీఎస్టీ నోటీసులు ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రజాధనాన్ని కొల్లగొట్టి, ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేసినట్లు స్పష్టమైన ఆధారాలు ఉండటం వల్లే చంద్రబాబు రిమాండ్‌కు వెళ్లారన్నారు. అవినీతికి పాల్పడి, అడ్డంగా దొరికి జైలుకు వెళితే టీడీపీ నాయకులు అక్రమంగా చంద్రబాబును జైల్లో పెట్టారనడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. చంద్రబాబు అరెస్టును టీడీపీ నాయకులు ఖండిస్తున్నారంటే దొంగను, అవినీతిని సమర్థించినట్టేనన్నారు.

కౌంట్ డౌన్ మొదలు..

రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌లో చంద్రబాబు కట్టిన బిల్డింగ్‌లోనే ఆయన్ను కట్టిపడేశారని ఆయన సతీమణి భువనేశ్వరి పేర్కొన్నారని మోపిదేవి చెప్పారు. ఆయన కట్టించిన బిల్డింగ్‌కు ముద్దాయిగా వెళ్లారని తెలిపారు. ఎటువంటి తప్పు చేయకపోయినా చంద్రబాబును జైలుకు పంపారని బాలకృష్ణ అనడం హాస్యాస్పదం అన్నారు. తప్పు చేశాడనే విషయం ఆధారాలతో బయటపడిందని, అందుకే న్యాయస్థానం రిమాండ్ విధించిందనే విషయాన్ని బాలకృష్ణ తెలుసుకోవాలన్నారు. చంద్రబాబుకు కౌంట్ డౌన్ స్టార్ట్ అయిందని, సీరియల్‌గా కేసులు సిద్ధంగా ఉన్నాయన్నారు. రాజధాని నిర్మాణంలో ఇన్నర్ రింగ్ రోడ్డు భూ సేకరణలో జరిగిన అవకతవకల్లో చంద్రబాబు, అప్పుడున్న మంత్రులు అవినీతికి పాల్పడినట్లు సీఐడీ దగ్గర ఆధారాలు ఉన్నాయని తెలిపారు. చట్టానికి అందరూ సమానులేనని, ఎవరు తప్పు చేసినా శిక్ష అనుభవించక తప్పదన్నారు. చంద్రబాబుకు రిమాండ్ విధించిన ఏసీబీ కోర్టు న్యాయమూర్తి హిమబిందు తమ బంధువని టీడీపీ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం తగదని చెప్పారు. న్యాయమూర్తితో తమకు బంధుత్వం లేదని స్పష్టం చేశారు. ఉన్నత స్థానంలో ఉన్న వారిపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.



దేవుడు పాపులను భరిస్తాడు:
కానీ శాశ్వతంగా కాదు.
– మిగెల్ సెర్వాంటీజ్

సాక్షి
గురువారం, 14 సెప్టెంబర్ 2023

చేజేతులా చేసుకున్నదే!

జీ20 ముగిసినా దాని ప్రకంపనలింకా తగ్గలేదు. ఢిల్లీ శిఖరాగ్ర సదస్సుకు హాజరై, భారత ఆత్మీయ ఆతిథ్యాన్ని అందుకున్న మిగతా ప్రపంచ నేతలందరికీ ఇది చిరస్మరణీయ అనుభవమేమో కానీ, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు మటుకు ఇది పీడకలగా పరిణమించింది. భారత ప్రధాని నుంచి సాదర స్వాగతం అందకపోగా, ఖలిస్తానీ తీవ్రవాదులకు అడ్డుకట్ట వేయకపోవడంపై ద్వైపాక్షిక చర్చల్లోనూ భారత్ ఆయనకు తలంటి పంపినట్టు వార్త. ఎలాగోలా సదస్సు ముగియగానే తిరుగు ప్రయాణం అవుదామంటే ప్రత్యేక విమానంలో సాంకేతిక సమస్యలు. భారత్‌లో కెనడా ప్రధాని చేదు అనుభవాలన్నీ సొంత గడ్డపై ప్రతిపక్షాలకు కావాల్సినంత మేత ఇచ్చాయి. మంగళవారం ట్రూడో తిరుగు పయనమయ్యారు కానీ, భారత్ పర్యటనలో ఆయనకు వ్రతం చెడ్డా ఫలితం దక్కలేదు.

భారత్ నుంచి పంజాబ్‌ను వేరుచేయాలని కోరుతున్న ఖలిస్తానీ ఉద్యమకారులు, వారి మద్దతుదార్లపై కెనడా మెతకగా వ్యవహరిస్తోందని భారత వాదన. ట్రూడో మాత్రం భావ ప్రకటన స్వేచ్ఛ తమ దేశీయ విధానమని సమర్థించుకుంటున్నారు. తమ అంతర్గత రాజకీయాల్లో భారత్ జోక్యం చేసుకుంటోందనేది కెనడా సర్కార్ ఆరోపణ. జీ20 వేళ ఆదివారం ట్రూడో, మోదీల మధ్య భేటీలో ఇరుపక్షాలూ తమ తమ ఆందోళనలు వ్యక్తం చేశాయి. భారత– కెనడా సంబంధాలు ఇటీవల అంతకంతకూ దిగజారుతున్నాయనడానికి ఆ భేటీ వార్తలే తార్కాణం. ఇరుదేశాల మధ్య చర్చల్లో ఉన్న వాణిజ్య ఒప్పందమూ నత్తనడకన సాగే ప్రమాదంలో పడింది. ఇది ఎవరికీ శ్రేయోదాయకం కాదు.

గతంలో 2018లో ప్రధానిగా ట్రూడో తొలి భారత సందర్శన సైతం ఘోరంగా విఫలమైంది. శిక్ష పడ్డ తీవ్రవాదిని విందుకు ఆహ్వానించి, అప్పట్లో ఆయన గందరగోళం రేపారు. అప్పటితో పోలిస్తే, ఇప్పటి పర్యటన మరీ ఘోరం. కీలక మిత్రదేశాల నుంచి దూరం జరిగిన కెనడా, భారత్‌తో తనబంధాన్ని మరింత బలహీనపరుచుకుంది. వెరసి, ఈ ప్రాంతంలోని రెండు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలైన చైనా, భారత్‌లు రెంటికీ కెనడా దూరమైంది. ఎన్నికల్లో జోక్యం, కెనడియన్ పౌరుల కిడ్నాప్, ఆర్థిక యుద్ధతంత్రం వగైరాల వల్ల చైనాకు దూరం జరగడం అర్థం చేసుకోదగినదే. కానీ, రాజకీయ కారణాలతోనే ట్రూడో భారత్‌ను దూరం చేసుకుంటున్నట్టు కనిపిస్తోంది. కెనడా జనాభా 4 కోట్ల యితే, భారత జనాభా 140 కోట్లు. కెనడా ఆర్థిక వ్యవస్థకు భారత ఆర్థిక వ్యవస్థ దాదాపు రెట్టింపు. అలా చూస్తే, భారత్‌తో బంధం కెనడాకు అవసరం, లాభదాయకం. ఆ సంగతి ట్రూడో విస్మరించారు.

మునుపటి ప్రధాని స్టీఫెన్ హార్పర్ హయాంలో ఢిల్లీతో వాణిజ్యాన్ని ఒటావా విస్తరించింది. వ్యవసాయ సామగ్రి, ఎరువులు, అణువిద్యుత్‌కు అవసరమయ్యే యురేనియమ్ భారత్‌కు కెనడా అందిస్తూ వచ్చింది. ట్రూడో హయాంలో ఎలాంటి వివరణా ఇవ్వకుండానే ఇటీవలే సరికొత్త వాణిజ్య ఒప్పందంపై చర్చల్ని ఆపేశారు. భారత్‌లో మోదీ విధానాలు కెనడాలో తన రాజకీయ భవిష్యత్తును దెబ్బతీస్తాయని ట్రూడో భావన. అందుకే, వీలైనంత దూరం జరగాలని చూస్తున్నారు. కెనడాలో ఎక్కువగా ప్రవాసీ సిక్కులుండడంతో, వారి మద్దతుకై తంటాలు పడుతున్నారు. భారత్‌లో 2020 నాటి రైతుల ఆందోళనలపై ట్రూడో మాట్లాడుతూ ఇప్పుడు జీ20లో అన్నట్టే భావప్రకటన స్వేచ్ఛల్ని ప్రబోధించారు. తీరా కెనడాలో అలాంటి నిరసనలే ఎదురైతే, అత్యవసర చట్టం ప్రయోగించారు. మైనారిటీలపై మోదీ ప్రభుత్వ కఠిన వైఖరిని తప్పుపడుతున్న ట్రూడో కెనడాలో చేస్తున్నది అదే!

అంతర్జాతీయ సంబంధాల్లో కెనడా ఇప్పుడు దోవ తప్పింది. ఐరాస భద్రతామండలి తాత్కాలిక సభ్యత్వం కోసం ఆ దేశం చేసిన గత రెండు ప్రయత్నాలూ విఫలమయ్యాయి. 20వ శతాబ్దిలో శాంతి పరిరక్షణ ప్రయత్నాలకు మారుపేరుగా, ఐరాస శాంతిపరిరక్షక దళానికి సృష్టికర్తగా నిలిచిన కెనడా ఇప్పుడు ఆ ఊసే ఎత్తని స్థితికి చేరింది. ఒకప్పుడు వర్ణవివక్షపై పోరాటంలో, అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు ఏర్పాటులో ముందుండి, మానవ భద్రతకై మందుపాతరల నిషేధ ఒప్పందం కావాలని కూడా పోరాడిన దేశం గత రెండు దశాబ్దాల్లో ఊహించని మార్గం పట్టింది. 2005 తర్వాత ఆ దేశం తన విదేశాంగ విధానాన్ని సమీక్షించుకోనే లేదు. దేశంలో, ప్రపంచ పరిస్థితుల్లో శరవేగంతో మార్పులు వచ్చినా ఎప్పటికప్పుడు తాత్కాలిక ప్రతిస్పందనతోనే విదేశాంగ వాహనాన్ని నెట్టుకొస్తోంది. ఫలితంగా ప్రపంచంలో కెనడా పేరుప్రతిష్ఠలే కాదు... ప్రభావమూ దెబ్బతింటోంది. తక్షణమే కెనడా విదేశాంగ విధానానికి దశ, దిశ కావాలని విశ్లేషకులు అంటున్నది అందుకే!

గత ఇరవై ఏళ్ళలో డయాస్పోరా రాజకీయాలు, వ్యక్తిగత రాగద్వేషాలతో కెనడా విదేశాంగ విధానం తప్పటడుగులు వేస్తోంది. మధ్యప్రాచ్యంపై మునుపటి హార్పర్ ప్రభుత్వం, భారత్‌తో వ్యవహారంలో ఇప్పటి ట్రూడో సర్కార్ వైఖరి అందుకు మచ్చుతునక. చమురు, సహజవాయువు, జలవిద్యుచ్ఛక్తి ఉత్పత్తిలో కెనడాది అగ్రపీఠం. అలాగే, యురేనియమ్, అనేక కీలక ఖనిజాలు అక్కడ పుష్కలం. దాన్ని సానుకూలంగా మలుచుకొని విదేశాంగ విధానాన్ని తీర్చిదిద్దుకొనే అద్భుత అవకాశం ఉన్నా అక్కడి పాలకులు ఆ పని చేయట్లేదు. ఇప్పటికైనా కెనడా బయటి ఒత్తిళ్ళను బట్టి నడవడం మానాలి. దేశాన్ని కలసికట్టుగా నిలిపే స్పష్టమైన లక్ష్యాలను పౌరులకు అందించాలి. కీలక అంతర్జాతీయ అంశాల్లో తమ వైఖరిని స్పష్టం చేయాలి. భారత్‌తో బంధాన్ని మళ్ళీ బలోపేతం చేసుకోవడంతో ఆ పనికి శ్రీకారం చుట్టాలి. ఎందుకంటే, పాలకుల పనికిమాలిన చర్యల వల్ల కెనడాకు ఆర్థిక నష్టం కలిగితే అది పాలకుల పాపమే. ట్రూడో ఇకనైనా స్వార్థ రాజకీయ ప్రయోజనాలు వదిలి, విశ్వవేదికపై సమస్త కెనడియన్ల ప్రయోజనాలపై దృష్టి పెడితే మంచిది.

‘జమిలి’ ఎన్నికలు రాజ్యాంగ ఉల్లంఘన



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

దశాబ్దాలుగా రాజ్యాంగ మౌలిక స్వరూపం చెదరకుండా ప్రజలు కాపాడుకుంటూ వచ్చారు. అయితే ఇటీవల కాలంలో ‘ఒకే దేశం – ఒకే ప్రజ’ వంటి ఆకర్షణీయ నినాదాలతో దేశ సమాఖ్య తత్వాన్నీ, లౌకిక స్వభావాన్నీ దెబ్బతీసే ప్రతిపాదనలను కేంద్రపాలకులు ముందుకు తెస్తున్నారు. మెజారిటీ వాదాన్ని ప్రోత్సహిస్తున్నారు. అలాగే రాజకీయ పార్టీల్లో ఎలాగైనా అధికారాన్ని చేజిక్కించుకోవాలనే ధోరణి పెరిగిపోతోంది. ఫలితంగా రాజకీయాలు నేరమయం, ధనమయం అయిపోతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో కేంద్రం ‘జమిలి ఎన్నికలు’ అంశాన్ని మరోసారి ముందుకు తెచ్చింది. కేంద్ర, రాష్ట్ర చట్ట సభలకు ఒకేసారి ఎన్నికలు జరిపించాలనే ఆలోచన ఏ మాత్రం ఆచరణ సాధ్యం కాదు. దీనివల్ల రాజ్యాంగ పరమైన సమస్యలు తలెత్తుతాయి.

‘ఒక దేశం, ఒక ఎన్నిక’ అన్న ఎజెండా ద్వారా, ‘ఒకే పన్ను, ఒకే రేషన్ కార్డు’ ఇత్యాది నినాదాలూ, విధానాల ద్వారా దేశంలో ఐక్యతను కాపాడగలమన్న సరికొత్త భావనను ప్రవేశపెట్టడానికి కేంద్ర పాలకులు ప్రయత్నిస్తున్నారు. తద్వారా కేంద్ర పాలకులు తమ చేతుల్లో పరిపాలనా, రాజకీయ అధికారాన్ని బహుముఖంగా కేంద్రీకరించుకుని, రాష్ట్రాల అధికారాలను బలహీనపరచడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ తతంగం 2014 నుంచే ప్రారంభమైందని మరవరాదు. ఈ తంతులో భాగంగానే పార్లమెంటును పాలకులు విస్పష్ట నిర్ణయాలు తీసుకోకుండా తటస్థపరిచారు. ఇక మీడియా దాదాపు పాలకుల సేవికగా మారింది. న్యాయ వ్యవస్థను చాలావరకు మెడలు వంచారు, పౌర సమాజాన్ని నిర్వీర్యపరిచారు.''

– సీనియర్ జర్నలిస్టు సి. రాం మనోహర్ రెడ్డి (11.9.2023)

దేశ తొలి అధ్యక్షుడు బాబూ రాజేంద్రప్రసాద్, ఆయన ఆధ్వర్యంలో నియమితులైన నాటి రాష్ట్రాల గవర్నర్లు వ్యవహరించిన తీరుతో ఇటీవలి కాలంలో మన దేశ అధ్యక్షులు, గవర్నర్లు వ్యవహరిస్తున్న తీరుతెన్నులను పోల్చి చూస్తే రాజ్యాంగం ఏ విధంగా అతిక్రమణకు గురవుతోందో అర్థమవుతుంది. రాజ్యాంగ ప్రవేశికలో ‘భారత ప్రజలమైన మేము రూపొందించుకొని, అంకితమిచ్చుకున్న ప్రజా రాజ్యాంగం’ అని సగర్వంగా ప్రకటించుకున్న మనం ఇప్పుడు రాజ్యాంగ ఉల్లంఘనలను చూసి తల దించుకోవలసి వస్తోంది. ఆ తొల్లింటి రాజ్యాంగ హామీలు, ఇంకా ఇప్పుడు అమలు జరుగుతున్నాయనుకోవడం ప్రజల భ్రమ అవుతుంది. ఎందుకంటే ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని, విధానాలను మనసారా అభిలషించి ‘దేశంలో కొలది మంది మోతుబరుల చేతుల్లో దేశ సంపద, అధికారాలు కేంద్రీకృతం కారాదని’ శాసించిన జాతిపిత గాంధీజీని ప్రేమించినట్టు నటించి ఆయనను హతమార్చినవాళ్లే గాంధీ బొమ్మలు పెట్టుకుని ఊరేగుతున్నారు.

దేశ స్వాతంత్య్ర తొలి సంవత్సరాల్లో కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ ఒకేసారి ఎన్నికలు నిర్వహించేవారు. కానీ 1960లలో కేంద్ర (కాంగ్రెస్) పాలకులు రాజ్యాంగంలోని 356వ నిబంధనను తమ స్వార్థ రాజకీయాలకు ఉపయోగించుకుని రాష్ట్రాలలో తమకు ఇష్టం లేని ప్రభుత్వాలను కూల్చడానికి జంకలేదు. శాసనసభ విశ్వాసాన్ని చూరగొన్న రాష్ట్ర ప్రభుత్వాలే పాలనలో ఉండాలి. ఆ విశ్వాసం సడలినప్పుడు అవి దిగిపోయి, తిరిగి ప్రజల విశ్వాసం చూరగొనేందుకు ఎన్నికలకు వెళ్లాలి. ఈ పద్ధతిని తారుమారు చేసి, కేంద్ర పాలనను (రాష్ట్రపతి పాలన) రుద్దడానికి పాలకులు అలవాటు పడటం ద్వారా అటు ఫెడరల్ వ్యవస్థ లక్ష్యాలనూ, ఇటు ప్రజాస్వామ్య విలువల్నీ ఏకకాలంలో ధ్వంసం చేయడానికి తెగబడ్డారు. అదే సమయంలో రాష్ట్రాలూ, కేంద్రానికీ ఎన్నికలు వేరు వేరు సమయాల్లో జరప వలసిన అవసరం ఏర్పడింది. ఇప్పుడు కేంద్రం ‘జమిలి ఎన్నికలు’ అంశాన్ని మరోసారి ముందుకు తెచ్చింది. కేంద్ర, రాష్ట్ర చట్ట సభలకు ఒకేసారి ఎన్నికలు జరిపించాలనే ఆలోచన ఏమాత్రం ఆచరణ సాధ్యం కాదు. దీనివల్ల అనేక రాజ్యాంగ పరమైన సమస్యలు తలెత్తుతాయి.

తొలినాటి ప్రజాస్వామిక విలువలు మచ్చుకు కూడా కానరాకుండా పోవడం నేటి రాజకీయాల్లో మనం చూస్తున్న విషాదం. ఎవరు ఎంత డబ్బు ఖర్చుపెడితే అంతగా ఎన్నికల్లో గెలవవచ్చు అనే నమ్మికతో రాజకీయపార్టీలు తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ధనవంతులూ, నేరప్రవృత్తి కలిగినవారూ రాజకీయాల్లో అత్యధికంగా పాల్గొనడం కళ్లెదుట కనిపిస్తున్న రాజకీయ చిత్రం. తాజా ఏడీఆర్ రిపోర్ట్‌ను గమనిస్తే మన ప్రజాస్వామ్య వ్యవస్థ ఎంత ‘నిఖార్సు’గా పరిఢవిల్లుతోందో అర్థమవుతుంది. రాజ్యాంగం ప్రకారం ఏమాత్రం మన రాజకీయపార్టీలు నడుచుకోవడం లేదనీ, అవి కేవలం ఏదో విధంగా అధికారంలోకి రావడానికే ప్రయత్నిస్తున్నాయనీ... పైకి మాత్రం రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నట్లు నటిస్తున్నాయని మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇప్పుడు రాజ్యాంగ సూత్రాలనూ, సమాఖ్య తత్వాన్నీ, లౌకికత్వాన్నీ యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ అనేక ప్రతిపాదనలు బహిరంగంగానే ముందుకొస్తున్నాయి. ‘ఒకే దేశం, ఒకే ఎన్నిక, ఒకే వ్యక్తి పాలన’ అటువంటిదే.

చైతన్యశీలి, ప్రజాస్వామ్యవాది అయిన నేటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ పదవీ స్వీకారం చేసిన తర్వాత అడుగడుగునా కేంద్ర పాలకుల దుందుడుకు విధానాలను వ్యతిరేకిస్తూండటంతో కొంతలో కొంత వారు దూకుడు తగ్గించుకుంటున్నారు. అయితే మళ్లీ అధికారం చేజిక్కించుకోవడానికి ఎప్పటిలాగే తమ పాత విధానాన్ని అనుసరించి కుల, మత, వర్గ సంఘర్షణలకు ప్రజల మధ్య ‘చిచ్చు’ రగిలిస్తున్నారు. ఇదేమాత్రం వారికి అమానవీయం అనీ, రాజ్యాంగ విరుద్ధమనీ అనిపించడంలేదు. మెజారిటీ వాదాన్ని ముందుకు తెచ్చి తమ చర్యలను ప్రతిభావంతంగా సమర్థించుకుంటున్నారు.

బహుశా అందుకే మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు ఒక పాత్ర ద్వారా చెప్పించిన మాటలు ఈ సందర్భంగా గుర్తుకొస్తున్నాయి:

‘నేను చేసిన పాపాలు అనేకమయినా, నా జిహ్వకు మాత్రం అవి పానకాలే!’ అందుకే, అలాంటి ‘పానకాల రాయుళ్ల’ను పాలకులుగా పెరగనివ్వకుండా ఉంచడానికే నేటి చైతన్యశీలమైన సుప్రీంకోర్టు విశ్వ ప్రయత్నం! దాని కృషికి చేదోడు వాదోడుగా నిలవడం – బాధ్యతగల భారత పౌర సమాజ ధర్మం!

abkprasad2006@yahoo.co.in

రెండో మాట



సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!



వండర్ హ్యారీ



హ్యారీ పాటర్ పుస్తకాల మ్యాజిక్‌కు 25 సంవత్సరాలు! ఇది నమ్మడం కష్టంగా ఉంది... ఎన్నో అద్భుతమైన జ్ఞాపకాలు!

– జె.కె. రౌలింగ్, ‘హ్యారీ పాటర్’ సిరీస్ రచయిత్రి

వృథా ఖర్చు



జీ20 సదస్సు కోసం ఇండియా 4,100 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. ఒక వైపేమో మన పిల్లల కోసం తగినన్ని పాఠశాలలు లేవు. కూర్చోవడానికి కుర్చీలు లేవు. వీటి మీద ఎందుకు చర్చ జరగడం లేదు? ఈ విషయం ఎందుకు మనకు కోపం తెప్పించడం లేదు?

– శివమ్ విజ్, జర్నలిస్ట్

న్యాయ విజయం



డిగ్రీ సర్టిఫికెట్లు లేకపోవడం లేదా ‘ఈడబ్ల్యూఎస్’కు సంబంధించిన చిన్న లేఖక దోషాల వల్ల చాలామంది విద్యార్థులను ఈ ఏడాది మెయిన్స్ పరీక్ష రాయడానికి అనుమతించకుండా వారి అడ్మిట్ కార్డులను రద్దు చేసింది యూపీఎస్సీ. దీన్ని ‘ప్రొ బోనో’(ప్రజా సంక్షేమార్థం) కేసుగా తీసుకున్నాం. అడ్మిట్ కార్డులు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇవ్వాళ యూపీఎస్సీని నిర్దేశించింది.

– ఆతిశ్ మాథుర్, న్యాయవాది

మంచి మనిషి



స్పెయిన్‌లో పేషెంట్లను ఉచితంగా హాస్పిటల్‌కు తీసుకెళ్లిన ఒక ట్యాక్సీ డ్రైవర్‌కు అదే హాస్పిటల్ నుంచి ఇంకో పేషెంట్‌ను తీసుకెళ్లమని కాల్ వచ్చింది. రాగానే, ఆయన్ని ఆశ్చర్యపరుస్తూ – డాక్టర్లు, నర్సులు నిలబడి చప్పట్లతో జేజేలు పలికారు (వీడియో షేర్ చేశారు).

– హరీందర్ సింగ్ కుక్రేజా, ఆంట్రప్రెన్యూర్

ఎందుకు సిగ్గుపడాలి?



గతంలో నేను భయానికి గురైన చిన్నారిని. ఇప్పుడు శక్తిమంతురాలైన మహిళను. సిగ్గు పడాల్సింది అత్యాచారం జరిపినవాళ్లు, ఆ బాధకు గురైనవాళ్లు కాదు. ఈ సాధికారతా ప్రచారాన్ని మొదలుపెట్టిన ఎమ్మా జేన్ టేలర్‌కు ధన్యవాదాలు (‘నాట్ మై షేమ్’ అనివున్న టీ షర్ట్‌ను ధరించిన ఫొటోను షేర్ చేశారు).

– నదియా జమీల్, నటి

పగటి కలలు



అంతర్గత భద్రతను సాధించకుండా, పొరుగు దేశాలతో శాంతిని నెలకొల్పకుండా ఏ దేశం కూడా సూపర్ పవర్ కాలేదు. చరిత్ర చెప్పే పాఠం ఇదే. కాబట్టి మనల్ని మనం మభ్యపెట్టుకోవడం ఆపుదాం. మనం ఇంకా చాలా దూరం ప్రయాణించాలి. ఉమ్మడిగా ఆ లక్ష్య సాధన కోసం పనిచేద్దాం.

– నీరా చందోక్, డిస్టింగ్విష్డ్ ఫెలో

మీరా మాట్లాడేది?



అజహరుద్దీన్ నుంచి జహీర్ నుంచి భారత్‌లో ఎందరో మైనారిటీ క్రికెటర్లు. ఇప్పుడు సిరాజ్. అదే పాకిస్తాన్‌లో ఒక్క క్రిస్టియన్ ఆటగాడు యూసుఫ్ యోహానా ఉండేవాడు. ఆయన్ని కూడా బలవంతాన మతం మారేలా చేశారు. డానిష్ కనేరియా అయితే బహిరంగంగా తన జట్టు సభ్యులను విమర్శించాడు. మళ్లీ వాళ్లు లౌకికవాదం గురించి మాట్లాడుతారు.

– జాఫర్, వ్యాఖ్యాత

మనకు తెలియని మన చరిత్ర


సందర్భం



అఫ్సర్

చరిత్ర పుటలు కొన్ని ఎందుకో చిరిగిపోతాయి. ఏ గాలులకో ఎగిరి ఎటో వెళ్లిపోతాయి. అంత దూరం నుంచే కొన్నిసార్లు వాటి మీది నెత్తుటి మరకలు కనిపిస్తూ ఉంటాయి. హైదరాబాద్ ఎంత అందమైన నగరమో! కానీ, ఈ నగరం కడుపులో చాలా గుండె కోతలున్నాయి. కదిలిస్తే చాలు, కన్నీరు పెల్లుబికే ఘటనలూ ఉన్నాయి. అలాంటిదే 1948 సెప్టెంబర్ 14 నుంచి 18 దాకా అయిదు రోజుల పాటు జరిగిన పోలీసు చర్య.

అప్పుడు దేశమంతా స్వాతంత్య్ర వేడుకల సంబరాలు జరుగుతున్నాయి. కానీ, ఇండియా – పాకిస్తాన్ సరిహద్దులు మాత్రం విభజన విషాదంలో కూరుకుపోయి ఉన్నాయి. ఆ విషాదానికి మతం లేదు. దానికి ఎర అయినవాళ్ళల్లో ముస్లింలు మాత్రమే లేరు. అంతే సంఖ్యలో హిందువులూ ఉన్నారు. ఆ వలసలూ, కన్నీటి కథలూ సరిహద్దులకే పరిమితం కాలేదు. సరిహద్దులకు దూరంగా ఉన్న ప్రాంతాలు కూడా విభజన రేఖ కింద నలిగి పోయాయి. ఆ విభజన విషాదాన్ని అనేక కోణాల నుంచి చరిత్ర నమోదు చేసింది. కానీ, హైదరాబాద్ వేదన మాత్రం అధికారిక చరిత్ర పేజీల బరువు కింద అణగిపోయింది. నిజాం రాజు స్వయం ప్రతిపత్తి కోరుకోవడంతో అప్పటి నెహ్రూ ప్రభుత్వం బలవంతంగా హైదరాబాద్ స్టేట్‌ని యూనియన్‌లో విలీనం చేసుకుంది. నిజాంనీ, స్థానిక రాజకీయ శక్తుల్నీ అణచివేయడానికి యూనియన్ మిలిటరీ రంగంలోకి దిగింది. అదే ‘పోలీసు చర్య’. నిజానికిది మిలిటరీ దురాక్రమణ అని అప్పటి చరిత్రకారులు రాశారు. జాతీయ వాదం పేరుతో ముస్లింల ఏరివేత జరిగింది. అసలైన రజాకార్లు సరిహద్దులు దాటివెళ్లిపోతే, ఇక్కడ సామాన్య ముస్లింలు మాత్రం రోజువారీ హింసలకి గురయ్యారు.



ఈ పోలీసు చర్య జరిగిన వెంటనే నెహ్రూ నియమించిన ‘సుందర్ లాల్ కమిటీ’ హైదరాబాద్, దక్కన్‌లలో అనేక ప్రాంతాలలో కాళ్ళకి బలపం కట్టుకొని తిరిగింది. కొన్ని వందలమంది బాధితులనీ, పోలీసు చర్య సాక్షులనూ ఇంటర్వ్యూలు చేసింది. ఆ కమిటీ తేల్చిందేమిటంటే: కేవలం అయిదు రోజుల్లో కొన్ని వేల మంది ముస్లింలను పోలీసు చర్య పేరుతో బలి తీసుకున్నారు. ఇంకా కొన్ని వేల మంది పాకిస్తాన్‌తో సహా ఇతర దేశాలకు వలస వెళ్లారు. ఇదే సమయంలో తెలంగాణ సాయుధ పోరాటాన్ని అణచివేయడానికి కూడా పోలీసు చర్య ఒక ముసుగుగా మారింది.

అయితే, ఆ కమిటీ నివేదికను ‘జాతీయ భద్రత’ పేరుతో మొన్న మొన్నటిదాకా బయటికి తీయలేదు ప్రభుత్వం. హైదరాబాద్ చరిత్రను అధ్యయనం చేస్తున్న పరిశోధకుల కృషి ఫలితంగా ఈ నివేదిక పూర్తి పాఠం చివరికి బ్రిటిష్ లైబ్రరీలో బయటపడింది. నిజానికి ఆ నివేదిక చెప్పని కథలు ఇంకా చాలా ఉన్నాయి. అవి ఏ చరిత్రలోనూ, ఏ నివేదికలోనూ, ఏ పత్రాల్లోనూ నమోదు కాలేదు. 1948 నుంచి అయిదారేళ్ళ పాటు హైదరాబాద్ కేంద్రంగా అచ్చయిన కొన్ని కథల్లో, ఆత్మకథల్లో, నవలల్లో, వ్యక్తిగత జ్ఞాపకాల్లో మాత్రమే అవి మిగిలిపోయాయి. అంతేకాకుండా, ఆ రక్తపాతాన్నీ, అణచివేతనీ కళ్ళారా చూసిన వాళ్ళలో చాలా మంది మొన్న మొన్నటి కోవిడ్ లోనో, వయోభారం మీద పడడం వల్లనో కన్ను మూశారు. అదే సమయంలో హైదరాబాద్ కేంద్రంగా వెల్లువెత్తిన సాంస్కృతిక, సాహిత్య, సామాజిక మార్పులు తెలంగాణకి దిక్సూచి అయ్యాయి.

చరిత్రను అర్థం చేసుకోడానికి అధికారిక పత్రాలు కొంతమేరకే పనికి వస్తాయి. సాధారణ జన జీవనంలోకి వెళ్ళి, ఆ చరిత్రను అవగాహన చేసుకుంటే, అట్టడుగున పడివున్న చరిత్ర బయటికి వస్తుంది. 1998లో హైదరాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో అద్వానీ ఈ పోలీసు చర్యను ‘‘హైదరాబాద్ విముక్తి ఉత్సవం’’గా ప్రకటించిన తరవాత అసలు సంఘటన మీద అనేక కొత్త పొరలు కమ్ముకొచ్చాయి. ఇది నిజంగా విముక్తి ఉత్సవమా? లేకపోతే, హిందూత్వం దీన్ని తిన్నగా తన ముస్లిం వ్యతిరేక అజెండాలోకి మార్చుకుందా అన్న ప్రశ్నలూ తలెత్తాయి. అలాంటి ‘‘రాజకీయ’’ కథనాల మధ్య అసలు కథను ఎలా అర్థం చేసుకోవాలన్న ప్రశ్న ఇప్పటి తరాన్ని సతమతం చేస్తోంది. ఆ సతమతం చేయడంలో మతం పాత్ర కూడా తక్కువేమీ కాదు. మతం పాత్రను గుర్తిస్తూనే, ఒక సామాన్యుడి బతుకు సమరాన్ని అర్థం చేసుకోవాల్సిన సందర్భం ఇది. సామాన్యుడి జీవితమే కేంద్రంగా, హిందూ–ముస్లింల ఉమ్మడి సంస్కృతి ఆధారంగా రూపుదిద్దుకున్న కొత్త హైదరాబాద్ చరిత్రను తెలుసుకోవాలి.

వ్యాసకర్త ప్రముఖ కవి, రచయిత

(‘రీ మేకింగ్ హిస్టరీ: 1948 పోలీస్ యాక్షన్ అండ్ ది ముస్లిమ్స్ ఆఫ్ హైదరాబాద్’ పేరుతో వ్యాసకర్త రాసిన పుస్తకాన్ని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ఈ నెలలో ప్రచురించింది.)

బ్రిక్స్ దేశాలు సాధించింది శూన్యం

అభిప్రాయం



పంకజ్ మిశ్రా

దక్షిణాఫ్రికా వేదికగా ‘బ్రిక్స్’ దేశాల 15వ సమావేశం ముగిసింది. అంతర్జాతీయ సమాజం ఈ సమావేశాలపై అనూహ్యంగా తన దృష్టిని కేంద్రీకరించింది. వ్యాఖ్యాతలు కొందరు ఇంకో అడుగు ముందుకేసి దీన్ని 1955 నాటి బండుంగ్ (ఇండోనేషియా) సమావేశాలతో పోల్చారు. బండుంగ్ వేదికగానే భారత్ సహా చైనా, ఇండోనేషియా, ఈజిప్ట్ యుగొస్లావియా కలసికట్టుగా అలీనోద్యమాన్ని ప్రకటించాయి. తాజా సదస్సులో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా నవతరం నేతలు అమెరికా ఆధిపత్య ప్రపంచానికి ప్రత్యామ్నాయాన్ని సృష్టించే ప్రయత్నం చేసినంత హడావిడి జరిగింది.

ప్రత్యామ్నాయం ఏమిటి?

అయితే... సమావేశాలు నడుస్తున్న కొద్దీ వీటి డొల్లతనం ఇట్టే బయటపడింది. ఆతిథ్య దేశమైన దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా స్వాగతం పలికేందుకు విమానాశ్రయానికి రాకపోవడంతో, భారత ప్రధాని నరేంద్ర మోదీ విమానంలోంచి దిగేందుకు నిరాకరించినట్లు ప్రముఖ దక్షిణాఫ్రికా వెబ్‌సైట్ ఓ వార్త ప్రచురించింది. ఇతర నాయకులతో పాటు వీడియో లింక్ ద్వారా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉపన్యసించిన ప్రారంభ సమావేశంలో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కారణం చెప్పకుండా, ఇవ్వాల్సిన ఉపన్యాసం ఇవ్వలేదు.

యుద్ధ నేరాల పేరుతో ఎక్కడ తనను అరెస్ట్ చేస్తారో అన్న భయంతో దక్షిణాఫ్రికాకు రాలేకపోయిన పుతిన్ యథావిధిగానే ఉక్రెయిన్ మీద తమ యుద్ధానికి బాధ్యత పాశ్చాత్య దేశాలదేనని నిందించారు. చైనా అధ్యక్షుడు తన ప్రసంగంలో పేరు చెప్పకుండా, కానీ దేని గురించో తెలిసేట్టుగా ఒక దేశం ‘తన ఆధిపత్యాన్ని ఎలాగైనా కొనసాగించాలన్న పంతంతో’ ఉందనీ, చైనా ప్రగతిని అడ్డుకుంటోందనీ వ్యాఖ్యానించారు. బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డ సిల్వా ప్రసంగం మాత్రం కొంత కల్లోలం చేసిందని చెప్పాలి. డీ–డాలరైజేషన్, బ్రిక్స్‌కు ప్రత్యామ్నాయం వంటి అంశాలపై ఈయన మాట్లాడారు. కానీ ఏ ఫలితమూ రాలేదు.

బ్రిక్స్ సభ్యదేశాల సంఖ్యను పెంచే విషయంతో ఈ శిఖరాగ్ర సమావేశాలు ముగిశాయి. సంక్షోభంలో ఉన్న అర్జెంటీనా, ఇథియోపియాలతోపాటు చమురు నిల్వలు పుష్టిగా ఉన్న సౌదీ అరేబియా, ఇటీవలిదాకా దీని ప్రత్యర్థి దేశం ఇరాన్ ఇప్పుడు బ్రిక్స్ బృందంలో చేరనున్నాయి. అయితే ఏ ప్రత్యామ్నాయ సంస్థలు బ్రిక్స్ నిర్మిస్తుందో మాత్రం స్పష్టం కాలేదు. ఈ అంశాలపై స్పష్టత ఇవ్వడం కోసం జరగాల్సిన విలేఖరుల సమావేశాన్ని కాస్తా, జర్నలిస్టులకు ‘విశ్రాంతి’ పేరుతో దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రామఫోసా చివరి నిమిషంలో రద్దు చేశారు.

అమెరికా సెక్యూరిటీస్ సంస్థలో పెట్టుబడులను రాబట్టేందుకు ఓ బ్రిటిష్ ఆర్థికవేత్త యథాలాపంగా పెట్టిన ‘సంక్షిప్త నామం’తో నడుస్తున్న బ్రిక్స్ సదస్సు నుంచి ఇంతకంటే గొప్పగా ఏమీ ఆశించలేము. అయితే అమెరికా నేతృత్వంలోని వ్యవస్థకు ప్రతిగా ఏర్పాటైన చాలా ముఖ్యమైన సంస్థ బ్రిక్స్ అని డబ్బా కొట్టుకోవడాన్ని మాత్రం ఎలా పరిహరించవచ్చో ఆలోచించాలి. పాశ్చాత్య దేశాల భౌగోళిక, ఆర్థిక పెత్తనానికి చెక్ పెట్టేందుకు ఒక దీటైన సంస్థ కోసం ప్రపంచం శతాబ్దానికి పైగా ఎదురు చూస్తోంది. అయితే ఇలాంటి ఓ సంస్థ ప్రాముఖ్యతను గుర్తించడంలో పాశ్చాత్య జర్నలిస్టులు విఫలమవుతూండటం విచారకరం.



దూరదృష్టి కరవు

ఒక విషయమైతే స్పష్టం. బ్రిక్స్‌కూ, అలీనోద్యమానికీ ఏమాత్రం సారూప్యత లేదు. 1950లు అంటే ఇండియా, ఈజిప్తు, చైనా... జాతీయోద్యమాలు, వలస పాలనకు వ్యతిరేక సంఘర్షణల నుంచి అప్పుడప్పుడే బయట పడుతున్న కాలం అది. ఆర్థికాభివృద్ధి విషయంలో అందరికీ సమాన అవకాశాలిచ్చే అంతర్జాతీయ వ్యవస్థ ఒకటి అవసరమని అప్పటి నాయకులు నిజాయితీగా నమ్మారు. ఈ నమ్మకంలో భాగంగానే న్యూ ఇంటర్నేషనల్ ఎకనమిక్ ఆర్డర్ వంటివి బయటకు వచ్చాయి. దురదృష్టకరమైన విషయం ఏమిటంటే... బండుంగ్ సమావేశపు ప్రతినిధులకు ఉన్న దార్శనికత, దూరదృష్టి దక్షిణాఫ్రికా బ్రిక్స్ సదస్సులో అస్సలు కనిపించకపోవడం. వాస్తవానికి మారిపోతున్న పరిస్థితుల్లో తామేం చేయాలన్నది ఇప్పుడిప్పుడే వీళ్లు నేర్చుకుంటున్నట్టుగా కనిపిస్తుంది.

కొత్తగా చేరిన సభ్యులతో సహా అన్ని బ్రిక్స్ దేశాల సాధారణ ‘విజన్’ ఏంటంటే– వాణిజ్యం, టెక్నాలజీ, మిలిటరీ ఒప్పందాల్లో తమకు ప్రాధాన్యం ఎక్కువ ఉండేలా అమెరికా, యూరప్‌లతో బేరాలు సాగించగలగడం. ఇంతకంటే భిన్నంగా ఉండే అవ కాశం లేదు.

భారత్‌నే ఉదాహరణగా తీసుకుందాం. వ్యూహాత్మకంగా శత్రువైనప్పటికీ చైనా నుంచి చౌక వస్తువులు కావాలి. చౌక ధరల్లో రష్యా నుంచి ముడి చమురు కావాలి. మిలిటరీ టెక్నాలజీ, ఆయుధాల్లాంటివి అమెరికా, యూరప్‌ల నుంచి తెచ్చుకోవాలి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచి పెట్టుబడులూ కావాలి. అందుకు తగ్గట్టుగానే భారత్ విదేశాంగ విధా నమూ ఉంటుంది. ఒంటరిగానైనా, గుంపుగానైనా ఆయా దేశాలకు కట్టుబడి ఉండేలా వ్యవహరిస్తుందన్నమాట! గ్లోబల్ సౌత్‌కు నేతృత్వం వహిస్తున్నామనీ, అందుకే వరి, చక్కెరల ఎగుమతులపై నిషేధం విధిస్తున్నామనీ కూడా భారత్ ప్రకటించుకోలేదు. ఈ విషయంలో చైనాకు ఎంతో కొంత మంచి పేరున్నా... రోజురోజుకూ ముదిరిపోతున్న ఆర్థిక సంక్షోభాన్ని తట్టుకోవడంలోనే ఆ దేశం తలమునకలై ఉంది. సభ్యులు, పెరిగినా, తగ్గినా బ్రిక్స్‌తో ప్రయోజనం శూన్యమని అర్థం చేసుకునేందుకు బహుశా వచ్చే ఏడాది రష్యాలో జరగనున్న సదస్సు వరకూ వేచి చూడాల్సిన అవసరం లేదేమో!

వ్యాసకర్త నవలా రచయిత, సామాజిక విశ్లేషకుడు

(‘బ్లూమ్‌బర్గ్’ సౌజన్యంతో)

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** అమావాస్య పూర్తి (24గంటలు), **నక్షత్రం:** పుబ్బ తె.5.09 వరకు (తెల్లవారితే శుక్రవారం), తదుపరి ఉత్తర, **వర్జ్యం:** ఉ.11.26 నుండి 1.12 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.55 నుండి 10.44 వరకు, తదుపరి ప.2.46 నుండి 3.35 వరకు, **అమృతఘడియలు:** రా.10.03 నుండి 11.34 వరకు, పోలాల అమావాస్య ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.50, **సూర్యాస్తమయం:** 6.03.

బాల్య వివాహాలకు బై బై!

సత్ఫలితాలనిస్తున్న ప్రభుత్వ చర్యలు



- ఆగస్టులో 160 బాల్య వివాహాలపై ఫిర్యాదులు
- ఇందులో 159 వివాహాలను నివారించిన ప్రభుత్వం
- కృష్ణా జిల్లాలో ఒక్క బాల్య వివాహమే జరిగింది
- ఈ వివాహంపై ఎఫ్ఐఆర్ నమోదు
- బాల్య వివాహాల నియంత్రణకు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వం
- సచివాలయాల కేంద్రంగా కమిటీలు
- బాల్య వివాహాల కట్టడే లక్ష్యంగా వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా నిబంధనలు

సాక్షి, అమరావతి: చిత్తశుద్ధితో పని చేస్తే ఏదైనా సాధ్యమేనని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిరూపిస్తోంది. ఇందుకు తాజా ఉదాహరణ రాష్ట్రంలో బాల్య వివాహాలను అరికట్టడం. బాల్య వివాహాలను అరికట్టి, బాలలను మంచి చదువులు చదివించాలన్న సీఎం వైఎస్ జగన్ సంకల్పానికి తగ్గట్టుగా పలు చర్యలు చేపట్టారు. ఈ చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. బాల్య వివాహాలు చేస్తే ప్రభుత్వ పథకాలకు దూరమవుతారని తల్లిదండ్రుల్లో ప్రభుత్వం ఒక పక్క అవగాహన కల్పిస్తూనే, మరో పక్క బాల్య వివాహాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో ఆగస్టు నెలలో రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో 160 బాల్య వివాహాలపై వివిధ మార్గాలు, 1098 హెల్ప్ లైన్‌కు ఫిర్యాదులు రాగా ఇందులో 159 వివాహాలను ప్రభుత్వం నివారించింది. కేవలం కృష్ణా జిల్లాలో ఒక్క వివాహం మాత్రమే జరిగింది. ఈ బాల్య వివాహంపై ప్రభుత్వ యంత్రాంగం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేసింది. బాల్య వివాహాల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల కేంద్రంగా పలు చర్యలు చేపట్టింది. సచివాలయాల స్థాయిలో సర్పంచ్ లేదా వార్డు కౌన్సిలర్ అధ్యక్షతన బాల్య వివాహాల నియంత్రణ, పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీల్లో గ్రామ, వార్డు కార్యదర్శులు, రెవెన్యూ అధికారి, ఏఎన్ఎం, మహిళా పోలీస్, స్వయం సహాయక సంఘం సభ్యురాలిని సభ్యులుగా నియమించింది. ఈ కమిటీలు బాల్య వివాహాలు జరగకుండా చర్యలు చేపడుతున్నాయి. ఏ గ్రామంలోనైనా బాల్య వివాహం జరిగితే సంబంధిత గ్రామ, వార్డు కార్యదర్శులను బాధ్యులను చేసి వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఉండే కమిటీ తరచూ సమావేశమై బాల్య వివాహాల నియంత్రణ చట్టం అమలు, అందుకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించాలని ప్రభుత్వం ఆదేశించింది. వివాహ రిజిస్ట్రేషన్లను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. దీంతో పాటు బాలికలకు 18 ఏళ్లు నిండిన తర్వాత 21 ఏళ్ల అబ్బాయితో పెళ్లి చేస్తేనే వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా కింద లబ్ధి చేకూరుతుందని వివరిస్తున్నారు. ఈ పథకాలకు పదో తరగతి ఉత్తీర్ణత సాధించాలనే నిబంధనను ప్ర భుత్వం విధించింది. మధ్యలో బడి మానేసిన 15 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల బాలికలను ప్రభుత్వం తిరిగి పాఠశాలలు, కళాశాలల్లో చేర్పిస్తోంది. అలాగే ఫ్యామిలీ డాక్టర్ గ్రామాలను సందర్శించినప్పుడు బాల్య వివాహాలు చేయకుండా తల్లిదండ్రుల్లో అవగాహన కల్పిస్తున్నారు.

ఆగస్టులో వివిధ జిల్లాల్లో బాల్య వివాహాలపై 1098 హెల్ప్ లైన్‌తో పాటు ఇతర మార్గాల్లో వచ్చిన ఫిర్యాదులు, ఆపిన వివాహాల సంఖ్య..

జిల్లా	ఫిర్యాదులు	నివారించినవి	జరిగిన వివాహాలు
అనంతపురం	53	53	0
ఏలూరు	36	36	0
శ్రీకాకుళం	10	10	0
వైఎస్సార్	9	9	0
ప్రకాశం	8	8	0
కర్నూలు	8	8	0
కృష్ణా	7	6	1
విజయనగరం	6	6	0
నెల్లూరు	6	6	0
కాకినాడ	5	5	0
గుంటూరు	5	5	0
చిత్తూరు	4	4	0
విశాఖపట్నం	3	3	0
మొత్తం	160	159	1

రాఘవేంద్రుని సన్నిధిలో బ్రిటన్ ప్రధాని తల్లిదండ్రులు



పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులతో ఉషా సునాక్, యశ్వీర్ సునాక్

రాయచూరు రూరల్/మంత్రాలయం: మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠాన్ని బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ తల్లిదండ్రులు ఉషా సునాక్, యశ్వీర్ సునాక్, అత్త ఇన్ఫోసిస్ చైర్‌పర్సన్ సుధానారాయణ మూర్తి బుధవారం సందర్శించారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన చేసి హారతి ఇచ్చారు. అనంతరం రాఘవేంద్రుల బృందావనానికి విశేష పూజలు జరిపారు. శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు రాయరు జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల పూల మంత్రాక్షింతలతో సత్కరించి వారిని ఆశీర్వదించారు.

జన్యుపరిరక్షణ ప్రయోగం విజయవంతం

ఒంగోలు జాతి కోడె దూడకు జన్మనిచ్చిన ఆవు



దూడను పరిశీలిస్తున్న పశువైద్యశాఖాధికారులు

నాగులుప్పలపాడు: అధునాతన సాంకేతికత ద్వారా ఒంగోలు జాతి పశువుల జన్యుపరిరక్షణ లక్ష్యంగా ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలంలోని చదలవాడ పశు ఉత్పత్తి క్షేత్రం పశువైద్యులు చేపట్టిన ప్రయోగం విజయవంతమైనట్లు క్షేత్రం డిప్యూటీ డైరెక్టర్ బి.రవి తెలిపారు. ట్రాన్స్‌వజైనల్ ఆల్ట్రాసౌండ్ గైడెడ్ ఒవెమ్ పికప్, ఇన్విట్రో ఫెర్టిలైజేషన్ ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ టెక్నాలజీతో గత ఏడాది నవంబర్‌లో ఉమ్మడి ప్రకాశం జిల్లా బొల్లాపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం గోశాల ఆవు గర్భంలో సరోగసి పద్ధతి ద్వారా మేలు రకం ఒంగోలు జాతి ఆవు పిండాన్ని చదలవాడ పశుఉత్పత్తి క్షేత్రంలోని పశువైద్యులు సోమశేఖర్ పిండగర్భధారణ ప్రక్రియ ద్వారా విజయవంతంగా ప్రవేశపెట్టారు. తద్వారా ఆవు గర్భం దాల్చి మంగళవారం రాత్రి ఒంగోలు జాతి కోడె దూడకు జన్మనిచ్చింది. ఆ దూడ ఆరోగ్యంగా ఉంది. చదలవాడ పశుక్షేత్రం చేపట్టిన ప్రయోగం ద్వారా జన్మించిన ఈ దూడను బుధవారం పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ రమేష్, సహాయ సంచాలకులు డాక్టర్ పద్మావతి, డీడీ రవి, వైద్యులు సోమశేఖర్, విజయకుమార్ రెడ్డి, మాధవీలత సందర్శించారు.

రైల్వేగేటుపై ఒంటరి ఏనుగు దాడి

కొమరాడ: పార్వతీపురం మన్యం జిల్లాలో ఒంటరి ఏనుగు (హరి) హల్‌చల్ చేస్తోంది. ఇటీవల కొమరాడ మండలం ఆర్తాం సమీపంలోని ఓ ప్రైవేట్ బస్సుపై దాడి చేసి అద్దాలు పగులగొట్టిన ఏనుగు.. బుధవారం తెల్లవారు జామున నాలుగు గంటల సమయంలో విక్రంపురం నుంచి చంద్రంపేట వెళ్లే రహదారిలో రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద ఉన్న రైల్వేగేటుపై దాడి చేసింది. గేటును పూర్తిగా వంచేసింది. అప్రమత్తమైన రైల్వే సిబ్బంది అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని ఏనుగును డంగభద్ర వైపు దారిమళ్లించారు. ప్రస్తుతం శివిని పంచాయతీ కురంపేట గ్రామ పరిసరాల్లో సంచరిస్తోంది. విక్రంపురం, శివిని గ్రామాల ప్రజలు రాత్రి సమయంలో బయట తిరగవద్దని అటవీశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

గడువులోగా పోలవరం జల విద్యుత్ కేంద్రం నిర్మాణం

- ఏపీ జెన్‌కో ఎండీ చక్రధరబాబు

దేవీపట్నం (అల్లూరి సీతారామరాజు జిల్లా)/పోలవరం రూరల్: పోలవరం జలవిద్యుత్ కేంద్ర నిర్మాణాన్ని నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఏపీ జెన్‌కో ఎండీ చక్రధరబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. దేవీపట్నం మండలం అంగుళూరు వద్ద నిర్మితమవుతున్న పోలవరం జలవిద్యుత్ కేంద్ర నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఉదయం ప్రాజెక్టు వద్దకు చేరుకుని స్పిల్ వే, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పరిశీలించారు. జల విద్యుత్ కేంద్రం వద్దకు చేరుకుని కోన్ డ్రాఫ్ట్ ట్యూబ్‌ల ఏర్పాట్లను పరిశీలించారు. క్రేన్ బాస్కెట్‌లో జల విద్యుత్ కేంద్ర శిఖరాగ్రానికి చేరుకుని జరుగుతున్న పనులను వీక్షించారు. విద్యుత్ కేంద్రం వద్ద ఏపీ జెన్‌కో నిర్మిస్తున్న కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. జెన్‌కో, మేఘా ఇంజినీరింగ్ సంస్థ ప్రతినిధులతో సమీక్షించారు. జరుగుతున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెన్‌కో హైడల్ డైరెక్టర్ ఎంవీవీ సత్యనారాయణ, సీఈ ఎం. సూరజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య రచనలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

'శ్రీవేంకటేశ పదములు' పుస్తకావిష్కరణ సభలో టీటీడీ చైర్మన్ భూమన



శ్రీవేంకటేశ పదములు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన, ఈవో ధర్మారెడ్డి

తిరుపతి కల్చరల్: శ్రీవేంకటేశ్వరస్వామి వైభవాన్ని తన సంకీర్తనల ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం చేసిన తాళ్లపాక అన్నమాచార్యుల సంగీతామృతాన్ని మరింతగా జనబాహుళ్యంలోకి తీసుకెళ్దామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. టీటీడీ ధార్మిక ప్రాజెక్టులు, శాంతా వసంత ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ముద్రించిన 'శ్రీవేంకటేశ పదములు' పుస్తకావిష్కరణ సభ బుధవారం మహతి కళాక్షేత్రంలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన భూమన మాట్లాడుతూ అన్నమయ్య రచించిన 32 వేల సంకీర్తనల్లో 12 వేలు మాత్రమే లభించాయన్నారు. సమాజంలోని కుల వివక్షను 600 ఏళ్ల కిందటే వ్యతిరేకించి పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త అన్నమయ్య అని గుర్తు చేశారు. డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి అన్నమయ్య సంకీర్తనలను పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే ఈ పుస్తకాన్ని 25 వేల కాపీలు తెలుగులో ముద్రించి ఉచితంగా అందిస్తానని ప్రకటించారు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి ప్రసంగించారు. అనంతరం శాంతా వసంత ట్రస్ట్ తరఫున వేటూరి నందమూర్తి, గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్, సాయికృష్ణ యాచేంద్రలను స్వర్ణ కంకణాలతో సత్కరించారు.

ఏడుగురు 'ఎర్ర' స్మగ్లర్లు అరెస్టు

రూ.3.7 కోట్ల విలువైన దుంగలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, నిందితులతో ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైం: రైల్వే కోడూరు నుంచి చెన్నైకి అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలను బుధవారం ఉదయం గాజులమండ్యం పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఎంఆర్ పల్లి పేరేడ్ గ్రౌండ్లో విలేకరులతో ఆయన మాట్లాడారు. రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలోని గాజులమండ్యం పోలీసులు యోగానంద కాలేజీ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక లారీ, కొన్ని వాహనాలు అనుమానాస్పదంగా కనిపించాయి. లారీ (ఏపీ 04 ఎక్స్ 6586), సుజుకి ఎర్టిగా (ఏపీ 39 ఎంవై 9446), టాటా క్రిష్ట (ఏపీ 39 యుఆర్1233) వాహనాలను తనిఖీ చేసి 3 కోట్ల 70 లక్షల 80 వేల రూపాయలు విలువచేసే 404 దుంగలు స్వాధీనం చేసుకున్నారు. లారీ, ఇన్నోవా కారు, ఎర్టిగా కారును సీజ్ చేశారు. అన్నమయ్య జిల్లాకు చెందిన సింగమల్ల గిరిబాబు అలియాస్ గిరి, యజ్ఞం చంద్రశేఖర్ అలియాస్ శేఖర్, పులి హరీష్, జ్యోతి శ్రీనివాసులు, జవాది తిరుమల, వైఎస్సార్ జిల్లాకు చెందిన కొవ్వూరు హరికృష్ణ, తిరుపతి జిల్లాకు చెందిన విశ్వనాథ్‌ను అరెస్ట్ చేశారు. ల్యాండ్ ఆర్డర్ ఏఎస్పీ కులశేఖర్ పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

సాక్షి, అమరావతి: ప్రజలను ఆరోగ్యంగా ఉంచడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడానికి సీఎం జగన్ ప్రభుత్వం కృషి చేస్తోందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. వైద్యారోగ్య, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు సమన్వయంతో పనిచేస్తే ప్రజారోగ్యం విషయంలో ఆశించిన ఫలితాలు సాధించగలమన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం దేశవ్యాప్తంగా ఆయుష్మాన్‌భవ కార్యక్రమం క్యాంపెయిన్‌ను ఢిల్లీలో ప్రారంభించారు. వర్చువల్‌గా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున డిప్యూటీ సీఎం.. మంగళగిరిలోని వైద్య శాఖ ప్రధాన కార్యాలయంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.వేలాది కోట్లు వెచ్చించి పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైద్య శాఖలో గడిచిన నాలుగేళ్లలో 53 వేలకు పైగా పోస్టుల్ని భర్తీ చేశామన్నారు. మానవ వనరుల కొరతను అధిగమించడంలో ఏపీ తీసుకున్న చర్యలు దేశానికి ఆదర్శంగా ఉన్నాయని స్పష్టం చేశారు. టీబీ నియంత్రణ కార్యక్రమంలో నిక్షయ్ మిత్రలుగా వ్యవహరిస్తున్న ఎస్‌బీఐ డీజీఎం కృష్ణకుమార్, ఏజీఎం సుబ్రమణ్యం, కనెక్ట్ టు ఆంధ్రా సీనియర్ కన్సల్టెంట్ ప్రశాంత్‌రెడ్డి, డాక్టర్ సమరం తదితరులను సన్మానించారు.

గ్రేడ్–5 కార్యదర్శులకూ గ్రామ పంచాయతీ అధికారాలు కల్పించండి

పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్–5 వారికి కూడా గ్రామ పంచాయతీల అధికారాలు కల్పించేందుకు తగిన ఆదేశాలివ్వాలని కోరుతూ గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రతినిధులు బుధవారం ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును కలిసి వినతి పత్రం ఇచ్చారు.

పాడి పరిశ్రమాభివృద్ధి లక్ష్యంగా పరిశోధనలు

ఎస్వీ వెటర్నరీ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ కే సర్జన్ రెడ్డి



మాట్లాడుతున్న ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిశోధన సంచాలకులు డాక్టర్ సర్జన్ రెడ్డి

తిరుపతి సిటీ: రాష్ట్రంలో పాడి పరిశ్రమాభివృద్ధే లక్ష్యంగా పరిశోధనలు చేపట్టనున్నట్లు ఎస్వీ వెటర్నరీ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ కే సర్జన్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం పరిపాలనా భవనంలో రెండు రోజులపాటు జరిగిన రాష్ట్రస్థాయి సాంకేతిక సమీక్షా సమావేశం బుధవారం ముగిసింది. వివిధ పరిశోధనా స్థానాల నుంచి వచ్చిన ప్రముఖ శాస్త్రవేత్తలు, అధిపతులు తమ సంస్థల్లో జరిగే పరిశోధనలపై వార్షిక నివేదిక, భవిష్యత్ ప్రణాళికను సమావేశంలో వివరించారు. సంచాలకులు మాట్లాడుతూ ప్రధానంగా గుంటూరు లాంఫారంలో ఒంగోలు, పుంగనూరు జాతుల వీర్యం సేకరించి ఘనీకృతం చేసి, ద్రవనత్రజనిలో భద్రపరిచేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. నంద్యాల పశు పరిశోధనా స్థానం నుంచి అధిక పాడి ఉత్పత్తి ఉన్న ఒంగోలు పశువుల మందని సంరక్షించడం ద్వారా జీవ వైవిధ్యానికి, జాతి అభివృద్ధికి దోహదపడే ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. పలమనేరు పశుపరిశోధనా స్థానంలో పుంగనూరు పశువులను సంరక్షిస్తున్నారని తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని వెంకటరామన్న గూడెం గేదెలపరిశోధనా స్థానంలో గేదెల పోషణ, నిర్వహణ, పునరుత్పత్తి, ఆరోగ్యపరిరక్షణ తదితర అంశాలపై విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయని చెప్పారు. దీంతో పాటు 25కి పైగా పశుగ్రాస రకాలు, పశుగ్రాస ఉత్పత్తిలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి 'సూపర్ నేపియర్' రకం దేశంలో మొదటిసారి ఇక్కడినుంచే దేశ వ్యాప్తంగా సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. పరిశోధనా సంస్థల అధిపతులు, పశువైద్య కళాశాలల అసోసియేట్ డీన్ సీనియర్ ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పేదల సంపూర్ణ ఆరోగ్యం కోసమే 'జగనన్న ఆరోగ్య సురక్ష'

- 15 నుంచి 30వ తేదీ వరకు ఆరోగ్య సేవలు, అవసరమైన వారి గుర్తింపు
- అక్టోబర్ 1 నుంచి రోజూ 700 మెడికల్ క్యాంపులు
- ఈ క్యాంపుల్లో 14 రకాల వైద్య సేవలు, 105 రకాల మందులు ఉచితం
- ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ స్పెషల్ ఆఫీసర్ యాదాల అశోక్‌బాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రతి పేదవాడు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే గొప్ప ఆశయంతో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ స్పెషల్ ఆఫీసర్ యాదాల అశోక్ బాబు తెలిపారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ సెల్ సమావేశం జరిగింది. సెల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో యాదాల అశోక్ బాబు మాట్లాడుతూ.. ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రంలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వాలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య సేవలు అవసరమైన వారిని గుర్తిస్తారని చెప్పారు. అక్టోబర్ 1 నుంచి 30వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో రోజూ 700 మెడికల్ క్యాంపులు నిర్వహిస్తారన్నారు. ఈ క్యాంపుల్లో 14 రకాల వైద్య సేవలు, 105 రకాల మందులు ఉచితంగా అందిస్తామని వివరించారు. 30 రోజులపాటు విలేజ్ క్లినిక్‌లలో జరిగే మెడికల్ క్యాంపుల్లో మెరుగైన వైద్య సేవలు అవసరమైన వారిని గుర్తించి ఆరోగ్యశ్రీ రిఫరల్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందిస్తామని బత్తుల అశోక్‌రెడ్డి చెప్పారు. మెడికల్ క్యాంపుల్లో ఇద్దరు ప్రభుత్వ వైద్యులు, ఒక ప్రైవేటు వైద్యుడు, వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ సెల్ నుంచి మరో వైద్యుడు సేవలందిస్తారని వివరించారు. ఆరోగ్యశ్రీ సేవలతో వైఎస్సార్ ప్రతి పేదవాడి గుండెలలో నిలిచిపోయారని డాక్టర్స్ సెల్ జోన్ ఫోర్ అధ్యక్షుడు మహబూబ్ చెప్పారు. ఆయన కుమారుడు, సీఎం వైఎస్ జగన్ మరో రెండు అడుగులు ముందుకు వేసి విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌లతో తండ్రిని మించిన తనయుడుగా పేరు తెచ్చుకున్నారని తెలిపారు. ముఖ్యంగా కోవిడ్ సంక్షోభంలో అత్యుత్తమ సేవలందించి ఏపీని దేశంలో అగ్రస్థానంలో నిలిపారన్నారు. ఈ సందర్భంగా జగనన్న ఆరోగ్య సురక్ష పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సమావేశంలో డాక్టర్స్ సెల్ జోన్ ఫైవ్ అధ్యక్షుడు డాక్టర్ జీవన్, నవరత్నాల ప్రోగ్రామ్ వైస్ చైర్మన్ నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష పోస్టర్ విడుదల చేస్తున్న యాదాల అశోక్‌బాబు, అశోక్‌రెడ్డి

ప్రముఖ నిమ్మ వ్యాపారి పాలేటి మృతి




సాంబశివరావు (ఫైల్)

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ నిమ్మకాయల వ్యాపారి, సౌత్ ఇండియన్ లెమన్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యదర్శి పాలేటి సాంబశివరావు (77) బుధవారం మృతి చెందారు. అనారోగ్యానికి లోనైన సాంబశివరావును విజయవాడ దగ్గర్లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చగా, అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులున్నారు. సాంబశివరావు దాదాపు మూడు దశాబ్దాలుగా తెనాలిలోని నిమ్మకాయల మార్కెట్ వ్యాపారుల సంఘానికి అధ్యక్షుడిగా ఉన్నారు. తెనాలిలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్‌గానూ పనిచేశారు. సాంబశివరావు భౌతికకాయాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. గురువారం మధ్యాహ్నం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలియజేశారు.

ప్రపంచ పర్యాటక కేంద్రంగా అంబేడ్కర్ స్మృతి వనం

- మంత్రి మేరుగు నాగార్జున
- నవంబర్ 26న ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్



గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ప్రపంచ పర్యాటక కేంద్రంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం నిర్మిస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో అంబేడ్కర్ విగ్రహం, స్మృతి వనం నిర్మాణ పనులను బుధవారం సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయలక్ష్మితో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న అంబేడ్కర్ విగ్రహం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ప్రస్తుతం విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్నారని తెలిపారు. విగ్రహం కింది భాగంలో నాలుగు ఏసీ హాల్స్ నిర్మిస్తున్నారని చెప్పారు. దేశ వ్యాప్తంగా సందర్శకులు అంబేడ్కర్ విగ్రహం, స్మృతి వనాన్ని సందర్శించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. స్మృతివనాన్ని నవంబర్ 26న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించి ప్రజలకు అంకితం చేస్తారని తెలిపారు.

సింహగిరి స్తంభం.. స్వర్ణశోభితం

- ధ్వజస్తంభానికి రూ.1.40 కోట్లతో బంగారు తాపడం
- 25 సంవత్సరాల గ్యారంటీ సర్టిఫికెట్ అందజేత



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ధ్వజస్తంభానికి స్వర్ణకాంతులు చేకూరాయి. సుమారు 1.40 కోట్లను వెచ్చించి 1 కేజీ 800 గ్రాముల బంగారంతో సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ ధ్వజస్తంభానికి రాగి తాపడంపై బంగారు పూత సమకూర్చారు. చెన్నైకి చెందిన స్మార్ట్ క్రియేషన్స్ సంస్థ రాగి రేకులను తీసుకెళ్లి వాటికి పసిడి కాంతులు అద్దే పనులు చేసింది. వాటిని తిరిగి సింహగిరికి తీసుకొచ్చి ధ్వజస్తంభానికి బుధవారం అమర్చారు. సాయంత్రం ధ్వజస్తంభం వద్ద కళా ఆవాహన పూజలు నిర్వహించారు. స్మార్ట్ క్రియేషన్స్ సంస్థ బంగారం కోటింగ్‌పై 25 ఏళ్ల గ్యారంటీ సర్టిఫికెట్‌ను సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ ఈవో త్రినాథరావుకు అందజేశారు.

భళా అరటి గెల



సాధారణంగా అరటి గెల మూడు నుంచి ఏడు అడుగుల పొడవు పెరుగుతుంది. అయితే ఏలూరు జిల్లా కైకలూరు రిజిస్ట్రార్ ఆఫీసు ఎదురుగా ఆక్వా రైతు దండు రంగరాజు నివాసం వద్ద మాత్రం అరటి గెల ఏకంగా 10 అడుగులు పెరిగి అందర్నీ అబ్బురపరుస్తోంది. ఇంటికి ఇరువైపులా కడియం నుంచి తీసుకొచ్చిన అరటి పిలకలను ఆయన 2015 నుంచి నాటుతున్నారు. -కైకలూరు

సునామీని ఎదుర్కోవడం ఎప్పుడైనా సవాలే!

మరో సునామీ ఎప్పుడైనా విరుచుకుపడొచ్చు

- మాక్‌డ్రిల్స్ నిర్వహణతో ప్రాణనష్టం తగ్గింపు
- ఇన్‌కాయిస్ డైరెక్టర్ డాక్టర్. టి.శ్రీనివాస కుమార్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ప్రకృతి విపత్తులు రకరకాలుగా ఉన్నప్పటికీ ఎప్పుడు వస్తుందో తెలియని మహా విపత్తు సునామీని ఎదుర్కోవడం ఎప్పుడూ ఒక సవాలేనని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (ఇన్‌కాయిస్) డైరెక్టర్ డాక్టర్ టి. శ్రీనివాసకుమార్ వ్యాఖ్యానించారు. 2004 తరువాత ఇప్పటివరకూ ఇంకో సునామీ రాకున్నా ఏ క్షణమైనా విరుచుకుపడే అవకాశం ఉందన్నది అందరూ గుర్తుంచుకోవాలని ఆయన అన్నారు. సునామీ వస్తే సమర్థంగా ఎదుర్కొనేందుకు ఏమేం చేయాలన్న అంశంపై ఇన్‌కాయిస్ చాలా ఏళ్లుగా మార్గదర్శకాలను రూపొందించడమే కాకుండా.. సన్నాహక కార్యక్రమాలు కూడా చేపడుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా వచ్చే నెల కూడా మాక్‌డ్రిల్స్ చేపట్టనుంది. ఈ మాక్‌డ్రిల్స్ తీరుతెన్నులను వివరించేందుకు, సునామీని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పునశ్చరణ కోసం హైదరాబాద్‌లోని ఇన్‌కాయిస్ కార్యాలయంలో బుధవారం ఒక కార్యక్రమం ఏర్పాటైంది. కోస్ట్‌గార్డ్స్ మొదలుకొని భారతీయ వాయు సేన, నావికాదళం, పలు రాష్ట్రాల విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో డైరెక్టర్ శ్రీనివాస కుమార్ మాట్లాడారు. సునామీ ముందస్తు సమాచారం, లేదా హెచ్చరికలు సముద్రతీరంలో ఉన్న సామాన్యుడి వరకూ సమర్థంగా వెళుతున్నాయా? లేదా? అన్నది పరిశీలించేందుకు మాక్‌డ్రిల్స్ ఉపయోగపడతాయని చెప్పారు.

తొలిసారి 14 దేశాలతో కలిసి..

అక్టోబరులో తొలిసారి హిందూ మహా సముద్ర ప్రాంతంలోని 14 దేశాలు మాక్‌డ్రిల్‌లో పాల్గొంటున్నాయని ఆయన వివరించారు. సముద్ర గర్భంలో భూకంపం సునామీకి కారణం కావచ్చునని అందరికీ తెలుసు కానీ.. భూకంపానికి గల కారణం వల్ల కూడా సునామీ తీరుతెన్నుల్లో మార్పులుంటాయని, వీటిని కూడా దృష్టిలో ఉంచుకుని ఈ మాక్‌డ్రిల్స్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. మాక్‌డ్రిల్స్‌ను సమర్థంగా నిర్వహిస్తూండటం వల్ల 2018లో అతితక్కువ కాలంలో సుమారు 1.90 లక్షల మందికి తీర ప్రాంతం నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించగలిగామని, తుపానుల సమయంలోనూ ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు ఈ మార్గదర్శకాలు ఉపయోగపడుతున్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌కాయిస్ గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ టి.ఎం.బాలకృష్ణ నాయర్, పశ్చిమబెంగాల్, ఒడిశాల విపత్తుల నిర్వహణ సంస్థ ఉన్నతాధికారులు కునాల్ అగర్వాల్, డాక్టర్ సునీతా జేనాలు పాల్గొనగా.. జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ సభ్యులు లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అతా హస్నైన్, ఇండియన్ ఓషన్ సునామీ వార్నింగ్ అండ్ మిటిగేషన్ సిస్టమ్ ప్రతినిధులు ఆన్‌లైన్ పద్ధతిలో హాజరయ్యారు.

తెలంగాణ

విద్యుదాఘాతంతో దంపతుల మృతి

వలిగొండ: పొలంలో గడ్డి కోస్తుండగా స్తంభం పైనుంచి విద్యుత్ వైరు తెగి పడడంతో విద్యుదాఘాతానికి గురై భార్యాభర్త మృతిచెందారు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని నాగారం గ్రామంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. నాగారం గ్రామానికి చెందిన బండ అంజయ్య (50), బండ జంగమ్మ(45) దంపతులు బుధవారం సాయంత్రం తమ వ్యవసాయ పొలంలో గడ్డికోసే యంత్రంతో వరాలకు ఉన్న గడ్డిని కోస్తున్నారు. ఈ క్రమంలో పొలం పక్కనే ఉన్న స్తంభంపైనుంచి కరెంట్ వైరు తెగి పడింది. అంజయ్య అది గమనించకపోవడంతో తెగిపడిన కరెంట్ వైరు గడ్డికోసే యంత్రానికి తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. అతడిని కాపాడే ప్రయత్నంలో భార్య జంగమ్మ కూడా కరెంటు షాక్‌కు గురై మృతిచెందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మట్టెవాడ, హనుమకొండ, సుబేదారి పోలీస్‌స్టేషన్ల పరిధిలో తొమ్మిది అపార్ట్‌మెంట్లలో చోరీలకు పాల్పడిన అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను బుధవారం సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో అరెస్టు చేసినట్లు సీపీ రంగనాథ్ తెలిపారు. ఈ నెల 5న వరంగల్ నగరంలోని తొమ్మిది అపార్ట్‌మెంట్లలో వరుస చోరీలు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ముఠాను అరెస్ట్ చేశారు. బుధవారం కమిషనరేట్‌లో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టిన సీపీ వారి వివరాలు వెల్లడించారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం ఘజియాబాద్‌కు చెందిన అక్బర్ ఖురేషీ, మీరట్ జిల్లాకు చెందిన కపిల్ జాటోవ్, ఘజియాబాద్‌కు చెందిన మహ్మద్ షరీఫ్, మహ్మద్ షహజాద్ ఖాన్‌లు ఈ నెల 5న వరంగల్ నగరంలోని తొమ్మిది అపార్ట్‌మెంట్లలో వరుస చోరీలు చేశారని తెలిపారు. వీరినుంచి రూ.2 కోట్ల విలువగల 2 కిలోల 380 గ్రాముల బంగారు, వజ్రాభరణాలు, రూ.5.20 లక్షల విలువగల 104 కిలోల గంజాయి, ఒక పిస్టోల్, 5 రౌండ్ల బుల్లెట్లు, కారు, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు వాకీటాకీలు, నాలుగు నకిలీ ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సీపీ వివరించారు.

పరిహారం దక్కడం లేదని..

- భూ నిర్వాసితుడు ఆత్మహత్య

సాక్షి, నాగర్‌కర్నూల్: తమకున్న భూమి మొత్తం రిజర్వాయర్ కింద కోల్పోవాల్సి రావడం.. ప్రభుత్వం నుంచి న్యాయమైన పరిహారం అందడం లేదన్న మనస్తాపంతో ఓ రైతు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగిన ఈ సంఘటనపై పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రం సమీపంలోని కుమ్మెర గ్రామానికి చెందిన అనంత అల్లోజీ (45)తోపాటు ముగ్గురు సోదరులకు కలిపి మొత్తం 19 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు కింద చేపట్టిన వట్టెం వెంకటాద్రి రిజర్వాయర్ కోసం వీరికి చెందిన 19 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. బోరు సౌకర్యం ఉన్న భూమిలో ఎకరాకు రూ.5.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించడంతో న్యాయమైన పరిహారానికి 2019లో అల్లోజీ కుటుంబం హైకోర్టును ఆశ్రయించింది. మొదటి విడత పరిహారం కింద ఎకరాకు రూ.2.04 లక్షల చొప్పున ఖాతాలో జమ చేస్తామని చెప్పారు. ఓ వైపు తాము నమ్ముకుని బతుకుతున్న భూమి మొత్తం రిజర్వాయర్‌లో కోల్పోతుండటం, రూ.లక్షల విలువైన భూమికి సరైన పరిహారం దక్కడం లేదన్న మనస్తాపంతో అల్లోజీ మంగళవారం రాత్రి పురుగు మందు తాగాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

క్లుప్తంగా...

కార్లలో 6 ఎయిర్‌బ్యాగ్స్ తప్పనిసరి కాదు: గడ్కరీ

న్యూఢిల్లీ: ప్యాసింజర్ కార్లలో ఆరు ఎయిర్‌బ్యాగుల నిబంధనపై కేంద్ర ఉపరితల రవాణా, జాతీయరహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టతనిచ్చారు. ఈ నిబంధనను తప్పనిసరి చేసే ఆలోచన ఏదీ ప్రభుత్వానికి లేదని ఆటోమొబైల్ పరికరాల తయారీ సంస్థల సమాఖ్య ఏసీఎంఏ వార్షిక సమావేశంలో పాల్గొన్న సందర్భంగా తెలిపారు. అక్టోబర్ ఒకటో తేదీ నుంచి ఈ నిబంధన అమల్లోకి రానున్న నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఎయిట్ సీటర్ వాహనాల్లో తయారీ సంస్థలు తప్పనిసరిగా ఆరు ఎయిర్‌బ్యాగులు ఏర్పాటు చేసే నిబంధనను 2022 అక్టోబర్ ఒకటో తేదీ నుంచి అమలు చేయాలని భావించింది. అయితే, అంతర్జాతీయంగా సరఫరాపరమైన సమస్యలు నెలకొన్న నేపథ్యంలో దానిని 2023 అక్టోబర్ ఒకటో తేదీకి వాయిదా వేసిన సంగతి తెలిసిందే.

పార్క్‌లో సరదాగా..

బార్ అసోసియేషన్ సభ్యులతో సీజేఐ

న్యూఢిల్లీ: నిత్యం కీలకమైన కేసుల విచారణ, వాదోపవాదనలను ఆలకించడంలో బిజీగా ఉండే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ బుధవారం కొద్దిసేపు అవన్నీ పక్కనబెట్టారు. మధ్యాహ్నం వేళ కొన్ని కేసుల వాదనలు విన్నాక మధ్యలో కొద్దిసేపు విరామం ప్రకటించారు. వెంటనే కొందరు జడ్జీలతో కలిసి అక్కడే ఉన్న ప్రముఖమైన సుప్రీంకోర్టు పార్క్‌లో కలియతిరిగారు. అక్కడికి వచ్చిన సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ సభ్యులతో సరదాగా మాట్లాడారు. అక్కడి కెఫెటేరియాలో టీ తాగారు. జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ మనోజ్ మిశ్రాలు సీజేఐతోపాటు నడిచారు.

బీజేపీ కార్యాలయం వద్ద ప్రధానికి ఘన స్వాగతం

న్యూఢిల్లీ: ఇటీవల భారత్ సారథ్యంలో జీ20 శిఖరాగ్ర భేటీని విజయవంతంగా నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయం వద్ద ఘన స్వాగతం లభించింది. బుధవారం సాయంత్రం బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ(సీఈసీ) సమావేశానికి హాజరైన సందర్భంగా ప్రధానికి కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్‌తోపాటు బీజేపీ చీఫ్ జేపీ నడ్డా తదితరులు స్వాగతం పలికారు. భారీ సంఖ్యలో హాజరైన పార్టీ కార్యకర్తలు నినాదాలు చేస్తూ ప్రధానిపై పూల వర్షం కురిపిస్తూ కార్యాలయంలోకి ఆహ్వానించారు. జీ20 విజయవంతంగా ముగియడం, ప్రపంచ నేతలు మోదీ నాయకత్వంపై ప్రశంసలు కురిపించడం తెలిసిందే. ఈ భేటీ తర్వాత బీజేపీ ప్రధాన కార్యాలయంలోకి ప్రధాని రావడం ఇదే మొదటిసారి.

మేం మీ వెంటే..!

సామ్రాజ్యవాద శక్తులపై రష్యా పోరాటానికి బేషరతు మద్దతు ఇస్తున్నట్టు కిమ్ ప్రకటన

- ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని పరోక్షంగా సమర్థించిన ఉత్తర కొరియా నియంత
- రష్యాలోని వోస్తోక్నీ అంతరిక్ష ప్రయోగ కేంద్రంలో పుతిన్‌తో కిమ్ భేటీ
- మిలటరీ, అంతరిక్ష రంగాల్లో పరస్పర సాయంపై నాలుగు గంటల పాటు చర్చలు
- సోవియట్ కాలం నుంచీ ఉత్తర కొరియా వద్ద పోగుపడ్డ ఆయుధాలు
- వాటిని రష్యాకు ఇచ్చేందుకు కిమ్ ఓకే
- ప్రతిగా మిలటరీ ఉపగ్రహాల అభివృద్ధికి రష్యా సాయం చేయాలని కొర్రీ

సియోల్: ఉక్రెయిన్‌పై యుద్ధానికి సంబంధించి రష్యాకు ఉత్తర కొరియా పూర్తి మద్దతు ప్రకటించింది. తమ జాతీయ భద్రత కోసం రష్యా చేస్తున్న పోరాటంలో ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు బేషరతుగా పూర్తిస్థాయి మద్దతు ఇస్తున్నట్టు ఉత్తర కొరియా నియంతృత్వ పాలకుడు కిమ్ జోంగ్ ఉన్ వెల్లడించారు. అంతేకాదు ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని 'పవిత్ర పోరాటం'గా అభివర్ణించారు. సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులను ఎదుర్కొనేందుకు తమ దేశం ఎల్లప్పుడూ రష్యాకు మద్దతుగా నిలబడుతుందని తెలిపారు. ఉక్రెయిన్‌పై దాదాపు ఏడాదిన్నర కింద రష్యా యుద్ధం ప్రారంభించిన విషయం తెలిసిందే. యూరప్ దేశాలు, అమెరికా ఆయుధాలు సాయం చేయడంతో ఈ యుద్ధంలో ఉక్రెయిన్ సమర్థవంతంగా రష్యాకు ఎదురొడ్డి నిలిచింది. ఇన్నాళ్లుగా నిరంతర దాడులతో రష్యాకు ఆయుధాల కొరత తలెత్తింది. ఈ క్రమంలో ఉత్తర కొరియా నియంత కిమ్‌తో పుతిన్ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. రష్యా తూర్పు కొసన సైబీరియా ప్రాంతంలో ఉన్న వోస్తోక్నీ అంతరిక్ష ప్రయోగ కేంద్రంలో బుధవారం పుతిన్‌తో కిమ్ భేటీ అయ్యారు.

ఆయుధాలు, ఆర్థిక అంశాలపై..

రష్యా, ఉత్తరకొరియా మీడియా సంస్థల కథనాల ప్రకారం.. సోవియట్ కాలం నుంచీ ఉత్తరకొరియాకు అండగా ఉన్న విషయాన్ని పుతిన్ తమ భేటీలో గుర్తుచేశారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక సహకారాన్ని, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ అంశాన్ని కిమ్ పరోక్షంగా ప్రస్తావిస్తూ.. రష్యాకు తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ''సామ్రాజ్యవాద శక్తుల నుంచి తన సార్వభౌమ హక్కులను, భద్రతను పరిరక్షించుకునేందుకు రష్యా 'పవిత్ర పోరాటం' చేస్తోంది. రష్యా ప్రభుత్వానికి డెమొక్రటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా (ఉత్తర కొరియా) ఎల్లప్పుడూ బేషరతుగా పూర్తి మద్దతు ఇస్తోంది. ఈ విషయాన్ని మరోసారి స్పష్టం చేసేందుకు వచ్చిన ఈ అవకాశాన్ని వినియోగించుకుంటాం..'' అని కిమ్ ప్రకటించారు.



బుధవారం రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ కరచాలనం

ఆ ఆయుధాలు ఇవ్వండి

సోవియట్ యూనియన్ కాలం నుంచి ఉత్తర కొరియా, రష్యా మధ్య స్నేహ సంబంధాలు ఉన్నాయి. 1950–53 మధ్య జరిగిన కొరియన్ యుద్ధంలో సోవియట్ యూనియన్ ఉత్తర కొరియాకు అండగా నిలిచింది. పెద్ద ఎత్తున ఆయుధాలను అందించడం ద్వారా దక్షిణ కొరియాపై ఉత్తర కొరియా ఆక్రమణకు సహకరించింది. ఆ సమయంలో దక్షిణ కొరియాకు అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాలు అండగా నిలవడంతో.. చాలా కాలం యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయి. ఉత్తర కొరియాకు సోవియట్ యూనియన్ ఆయుధాల సరఫరా, సహకారం కొనసాగింది. ఈ క్రమంలో నాటి ట్యాంక్ షెల్స్, లాంఛర్లు, మినీ రాకెట్లు లక్షల సంఖ్యలో ఉత్తర కొరియా వద్ద పోగుపడ్డాయి. సోవియట్ డిజైన్ ఆయుధాలే కాబట్టి రష్యా వాటిని నేరుగా వినియోగించుకోగలదు. ఇప్పుడు ఉక్రెయిన్‌పై యుద్ధంలో వాడేందుకు ఆ ఆయుధాలు ఇవ్వాలని ఉత్తర కొరియాను పుతిన్ కోరారు.

శాటిలైట్ల కోసమేగా వచ్చింది! పుతిన్

రష్యా స్వయం సమృద్ధ దేశమని, అయితే కొన్ని అంశాలపై దృష్టి పెట్టాల్సి ఉందని.. వాటిపై కిమ్‌తో చర్చించానని పుతిన్ వెల్లడించారు. కిమ్‌తో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉత్తర కొరియా ఉపగ్రహాలు అభివృద్ధి చేసేందుకు రష్యా సహకరిస్తుందా? అని మీడియా ప్రశ్నించగా.. ''అందుకేగా మేం ఇక్కడికి (భేటీ కోసం) వచ్చింది. రాకెట్ టెక్నాలజీపై ఉత్తర కొరియా నేత చాలా ఆసక్తి కనబరుస్తున్నారు. ఉత్తర కొరియా నుంచి ఆయుధాల కొనుగోలు, మిలటరీ సాయం, ఆంక్షల విషయంలో మాట్లాడేందుకు ఇంకా చాలా సమయం ఉంది..'' అని పేర్కొన్నారు. రష్యా, ఉత్తరకొరియా మధ్య రవాణా, వ్యవసాయం వంటి పరస్పర ప్రయోజనాలున్న ప్రాజెక్టులు ఎన్నో ఉన్నాయని చెప్పారు. పొరుగు దేశమైన ఉత్తర కొరియాకు మానవతా సాయం అందిస్తున్నామన్నారు. రష్యాలోని మరో రెండు నగరాల్లో కిమ్ పర్యటిస్తారని, యుద్ధ విమానాల ప్లాంట్‌ను, రష్యా పసిఫిక్ నౌకాదళ కేంద్రాన్ని సందర్శిస్తారని వెల్లడించారు.

ఆంక్షలతో కలిసిన ఇద్దరు

ఉక్రెయిన్‌పై యుద్ధం నేపథ్యంలో అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు రష్యాపై ఆంక్షలు విధించాయి. చమురు కొనుగోళ్లు, ఇతర లావాదేవీల విషయంలో సమస్యలతో రష్యా ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంది. మరోవైపు అణ్వస్త్ర క్షిపణుల అభివృద్ధి, ఇటీవల వరుసగా ప్రయోగాలు జరపడం నేపథ్యంలో ఉత్తర కొరియాపై భారీగా ఆంక్షలు అమల్లో ఉన్నాయి. ఇలా పాశ్చాత్య ప్రపంచం దూరం పెట్టిన ఇరుదేశాల నేతలు పరస్పర సహకారం కోసం కలవడం గమనార్హం. అయితే ఉత్తర కొరియా నుంచి ఆయుధాలు కొనడంగానీ, ఆ దేశానికి రాకెట్, శాటిలైట్ టెక్నాలజీని ఇవ్వడంగానీ దారుణమైన పరిస్థితులకు దారితీస్తాయన్న హెచ్చరికలు వినిపిస్తున్నాయి.

మాకు గూఢచర్య ఉపగ్రహ టెక్నాలజీ — కిమ్ షరతు

రష్యా, చైనా తదితర దేశాల సాయంతో ఉత్తర కొరియా క్షిపణులు, అణ్వస్త్ర సాంకేతికతల విషయంలో ఓ మోస్తరుగా అభివృద్ధి సాధించినా.. ఉపగ్రహాల టెక్నాలజీలో చాలా వెనుకబడి ఉంది. అణు సామర్థ్యమున్న క్షిపణుల ప్రయోగం, ఇతర సైనిక అవసరాల కోసం మిలటరీ/గూఢచర్య ఉపగ్రహాలు తప్పనిసరి. ఈ దిశగా ఉత్తర కొరియా పలుమార్లు ప్రయోగాలు జరిపినా విఫలమైంది. తాజాగా రష్యా ఆయుధాలు అడుగుతున్న నేపథ్యంలో.. మిలటరీ గూఢచర్య ఉపగ్రహాల అభివృద్ధి, సాంకేతికత విషయంలో సాయం చేయాలని కిమ్ షరతు పెట్టినట్టు సమాచారం.

ప్రత్యేక రైల్లో.. లిమోజిన్‌తో సహా..



ఉత్తర కొరియా నుంచి కిమ్ ఏకంగా ఓ ప్రత్యేక రైలులో రష్యాకు వెళ్లారు. క్షిపణి దాడులు జరిగినా కూడా తట్టుకునేలా ప్రత్యేకంగా రూపొందించిన బోగీలు, వెంటనే ఎదురుదాడి చేయడానికి వీలుగా భారీ స్థాయిలో సిద్ధంగా అమర్చి పెట్టిన ఆయుధాలు ఈ రైలు సొంతం. దీనితోపాటు ఎలాంటి దాడులనైనా ఎదుర్కొనే ప్రత్యేకమైన వాహనాన్ని (లిమోజిన్) కూడా వెంట తీసుకెళ్లారు. వోస్తోక్నీ అంతరిక్ష కేంద్రం సమీపంలోకి రైలు చేరుకున్నాక.. కిమ్ తన లిమోజిన్‌లో భేటీ అయ్యే స్థలానికి చేరుకోవడం గమనార్హం. కిమ్‌కు పుతిన్ ఎదురెళ్లి స్వాగతం పలికారని, ఇద్దరూ సుదీర్ఘంగా నాలుగు గంటల పాటు చర్చించుకున్నారని.. భేటీ అనంతరం కిమ్‌కు పుతిన్ ప్రత్యేక విందు ఇచ్చారని రష్యా మీడియా వెల్లడించింది. ఈ పర్యటన సందర్భంగా రష్యా అంతరిక్ష కేంద్రంలో కిమ్ కలియదిరిగారని, అక్కడి ప్రత్యేకతలను తెలుసుకున్నారని వివరించింది.

కశ్మీర్‌లో ఉగ్రఘాతుకం

- ఆర్మీ గాలింపు వేళ ఉగ్రవాదుల ఎదురుకాల్పులు
- కల్నల్, మేజర్, డిప్యూటీ ఎస్పీ వీరమరణం



కల్నల్ మన్‌ప్రీత్ సింగ్



డిప్యూటీ ఎస్పీ భట్

రాజౌరీ/జమ్మూ: ఉగ్రవాదులు దాక్కున్నారనే సమాచారంతో ఆ ప్రాంతంలో గాలింపు చేపట్టిన సైన్యంపై ఉగ్రవాదులు మాటువేసి మెరుపుదాడి చేశారు. ఈ దుర్ఘటనలో ఆర్మీ కల్నల్, మేజర్, డిప్యూటీ ఎస్పీలు వీరమరణం పొందారు. ఈ ఘటన జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలోని గరోల్ దగ్గర్లోని కొకొరెనాగ్ కొండ ప్రాంతంలో జరిగింది. రాజౌరీలో ఉగ్రకాల్పుల్లో జవానును కాపాడబోయి సైనిక జాగిలం కెంట్ ప్రాణాలు కోల్పోయిన మరుసటి రోజే ఈ కాల్పుల ఘటన జరగడం విషాదకరం. బుధవారం ఉదయం సైనిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం కొకొరెనాగ్ ప్రాంతంలో ఉగ్రవాదులు దాక్కున్నారనే సమాచారంతో మంగళవారం రాత్రి సైన్యం, కశ్మీర్ పోలీసులు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టారు. బలగాల రాకను పసిగట్టిన ఉగ్రవాదులు వెంటనే తూటాల వర్షం కురిపించారు. దీంతో 19వ రాష్ట్రీయ రైఫిల్స్ కమాండింగ్ అధికారి అయిన కల్నల్ మన్‌ప్రీత్ సింగ్, మేజర్ ఆశిశ్ ధోనక్, డిప్యూటీ ఎస్పీ హుమయూన్ భట్ నేలకొరిగారు. జమ్మూకశ్మీర్ మాజీ ఐజీ గులామ్ హసన్ భట్ కుమారుడే ఈ హుమయూన్. కాల్పుల ఘటనకు నిషేధిత రెసిస్టెంట్ ఫ్రంట్ సంస్థ బాధ్యత ప్రకటించుకుంది. పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రసంస్థ లష్కరే తోయిబానే ఈ రెసిస్టెంట్ ఫ్రంట్ సంస్థను వెనక ఉండి నడిపిస్తోంది. ఆగస్టు నాలుగో తేదీన కుల్గామ్ జిల్లాలోని హలన్ అటవీప్రాంతంలో ముగ్గురు జవాన్ల మరణానికి కారకులైన వారే బుధవారం దాడి చేశారని సైనిక నిఘా వర్గాలు వెల్లడించాయి.

భోపాల్‌లో 'ఇండియా' మొట్టమొదటి ర్యాలీ

- అక్టోబర్ మొదట్లో జరపాలని కూటమి సమన్వయ కమిటీ నిర్ణయం
- భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల పంపిణీపై త్వరలోనే చర్చలు

న్యూఢిల్లీ: ప్రతిపక్ష పార్టీల ఇండియా కూటమి తమ మొట్టమొదటి బహిరంగసభను వచ్చే నెలలో భోపాల్‌లో నిర్వహించనుంది. అదేవిధంగా, భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల పంపిణీకి సంబంధించిన చర్చలను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించనుంది. ఇండియా కూటమి సమన్వయ కమిటీ మొదటి సమావేశం బుధవారం ఢిల్లీలో జరిగింది. ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ నివాసంలో జరిగిన ఈ భేటీకి కమిటీలోని 14 మంది సభ్యులకు గాను 12 మంది హాజరయ్యారు. సనాతనధర్మంపై డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యల దుమారం నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. కమిటీ సభ్యుడు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అనంతరం మాట్లాడుతూ, విచారణకు రావాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సమన్లు జారీ చేయడంతో టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ భేటీకి రాలేదని చెప్పారు. హాజరైన వారిలో..ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్, కాంగ్రెస్ నుంచి కేసీ వేణుగోపాల్, జార్ఖండ్ సీఎం, జేఎంఎం నేత హేమంత్ సోరెన్, సీపీఐ నేత డి.రాజా, ఎస్పీ నుంచి జావెద్ అలీ ఖాన్, డీఎంకే నుంచి టీఆర్ బాలు, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా, జేడీయూకు చెందిన సంజయ్ ఝా, ఎన్సీ నేత ఒమర్ అబ్దుల్లా, పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ, శివసేన(యూబీటీ)కి చెందిన సంజయ్ రౌత్ ఉన్నారు. 'సీట్ల పంపకాల ప్రక్రియను ప్రారంభించాలని సమన్వయ కమిటీ నిర్ణయించింది. భాగస్వామ్య పక్షాలు చర్చలు జరిపి సాధ్యమైనంత త్వరగా సీట్ల పంపణీని ఖరారు చేయాలి.. కూటమి ఉమ్మడి సమావేశాలను దేశవ్యాప్తంగా చేపట్టాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా మొట్టమొదటి సభను అక్టోబర్ మొదటి వారంలో భోపాల్‌లో చేపట్టాలని అంగీకారానికి వచ్చారు. బీజేపీ పాలనలో పెరిగిన అవినీతి, నిత్యావసరాల ధరలు, నిరుద్యోగం ప్రధాన ఎజెండాగా ఈ సభలు జరుగుతాయి'అని కమిటీ ఉమ్మడి ప్రకటనను వేణుగోపాల్ చదివి వినిపించారు. మహారాష్ట్ర, తమిళనాడు, బిహార్‌ల్లో సీట్ల పంపకం సులువుగా కనిపిస్తుండగా, పంజాబ్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్‌ల్లో మాత్రం భాగస్వామ్య పక్షాల మధ్య ఏకాభిప్రాయం సాధ్యమయ్యే సూచనలు కనిపించడం లేదు.

నిఫా కట్టడికి కేరళ సమాయత్తం

- వైరస్ ప్రభావిత ప్రాంతాల్లో ఆంక్షలు
- వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం రాష్ట్రానికి పలు బృందాల రాక
- ఇది బంగ్లాదేశ్ వేరియంట్: కేరళ మంత్రి

కోజికోడ్: అత్యంత ప్రమాదకర నిఫా వైరస్ మరోసారి కేరళ రాష్ట్రంలో అప్రమత్త పరిస్థితులను సృష్టించింది. ఇప్పటికే సోకిన నలుగురిలో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో వైరస్ వ్యాప్తి కట్టడికి రాష్ట్ర ప్రభుత్వ రంగంలోకి దిగింది. ఏడు జిల్లా పంచాయతీలను కంటైన్మెంట్ జోన్లుగా ప్రకటించి ఆంక్షల చట్రాన్ని బిగించింది. తదుపరి నోటీసు వచ్చేదాకా ఆ ప్రాంతాలకు ప్రయాణాలు నిషేధమని కోజికోడ్ కలెక్టర్ గీత చెప్పారు. బ్యాంకులు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, అంగన్‌వాడీలను మూసేయించారు. జనం భయపడొద్దని రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ విజ్ఞప్తిచేశారు. వైరస్ బారినపడిన వారిలో తొమ్మిదేళ్ల బాలుడు ఉన్నాడని కేరళ వైద్య శాఖ మహిళా మంత్రి వీణా జార్జ్ చెప్పారు. సేకరించిన ఐదు శాంపిళ్లలో మూడు పాజిటివ్‌గా వచ్చాయి. నిఫా సోకడంతో ఆగస్టు 30న ఒక వ్యక్తి మరణించాడు. మొదట అతను కాలేయ క్యాన్సర్‌తో మరణించాడని భావించారు. తర్వాత నిఫా నిర్ధారణ పరీక్షలు చేయడంతో ఈసారి ఈ వైరస్‌తో ప్రాణాలు కోల్పోయిన తొలి వ్యక్తి ఇతనేనని నిర్ధారించుకున్నారు. ఇతని కుమారుడు, బంధువుకూ నిఫా సోకింది. కుమారుడికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు.

కేరళకు పుణే వైరాలజీ బృందం

నిఫా వ్యాధి నిర్ధారణపరీక్షలతోపాటు గబ్బిలాలపై సర్వే చేసేందుకు పుణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ నిపుణుల బృందం కేరళకు పయనమైంది. కోజికోడ్ జిల్లాలో నలుగురికి వైరస్ సోకడంతో అప్రమత్తమై పలు బృందాలు రాష్ట్రానికి వస్తున్నాయని బుధవారం శాసనసభలో ఆరోగ్య మంత్రి వీణ వెల్లడించారు. 'ఇది బంగ్లాదేశ్ వేరియంట్ వైరస్. మనుషుల నుంచి మనుషులకు నెమ్మదిగా వ్యాప్తి చెందుతుంది. ఇన్ఫెక్షన్ శాతం తక్కువ ఉన్నా మరణాల రేటు అధికంగా ఉండటం ఆందోళన కల్గిస్తోంది' అని ఆమె చెప్పారు. చెన్నై నుంచి మరో బృందం రాబోతోంది. నిఫా రోగుల చికిత్సలో వాడే మోనోక్లోనల్ యాంటీబాడీలను సరఫరా చేసేందుకు భారతీయ వైద్య పరిశోధనా మండలి(ఐసీఎంఆర్) అంగీకారం తెలిపింది.

ప్రత్యేక సెషన్ ఎజెండా ఇదే..

న్యూఢిల్లీ: ఈ నెల 18 నుంచి మొదలయ్యే అయిదు రోజుల ప్రత్యేక సెషన్‌లో మొదటి రోజున భారత పార్లమెంట్ 75 ఏళ్ల ప్రస్థానంపై ప్రత్యేక చర్చ ఉంటుందని ప్రభుత్వం బుధవారం వెల్లడించింది. 1946లో ఏర్పాటైన భారత రాజ్యాంగ సభ(కాన్‌స్టిట్యూయెంట్ అసెంబ్లీ ఆఫ్ ఇండియా) మొదలుకొని పార్లమెంట్ 75 ఏళ్ల ప్రస్థానం, విజయాలు, అనుభవం, జ్ఞాపకాలు, పాఠాలు' అంశంపై చర్చ ఉంటుంది. మిగతా ఇతర కార్యకలాపాలు కూడా ఉంటాయని తెలిపింది. ఈ సమావేశాల్లో ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకాలను నియంత్రించే బిల్లును ప్రవేశపెడతామని తెలిపింది. ఈ బిల్లును వర్షాకాల సమావేశాల్లో రాజ్యసభ ఆమోదించింది. నియామక ప్యానెల్‌లో ప్రధాని, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ప్రధాని నామినేట్ చేసిన కేంద్ర మంత్రి ఒకరు ఉంటారు. ఇందులో నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)ని తొలగిస్తామని చెప్పడం వివాదాస్పదమైన విషయం తెలిసిందే. వర్షాకాల సమావేశాల్లో రాజ్యసభలో ప్రవేశపెట్టిన ది అడ్వొకేట్స్(సవరణ)బిల్లు–2023, ది ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ పీరియాడికల్స్ బిల్లు–2023, ది పోస్టాఫీస్–2023 బిల్లులను కూడా ఈ సెషన్‌లో భాగంగా లోక్‌సభలో ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది.

17న అఖిలపక్ష సమావేశం

పార్లమెంటు ప్రత్యేక సెషన్ నేపథ్యంలో ఈ నెల 17న అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. ఈ విషయాన్ని ఆయన బుధవారం 'ఎక్స్'లో వెల్లడించారు. 'ఈ నెల 18 నుంచి పార్లమెంటు సమావేశాల సందర్భంగా ముందు రోజు సాయంత్రం 4.30 గంటలకు అఖిలపక్ష ఫ్లోర్ లీడర్ల సమావేశం ఏర్పాటు చేస్తున్నాం. ఈ మేరకు అందరికీ ఈ–మెయిల్ ద్వారా ఆహ్వానాలు పంపించాం''అని జోషి అందులో పేర్కొన్నారు.

మరో 75 లక్షల 'ఉజ్వల'కనెక్షన్లు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో బుధవారం జరిగిన కేంద్ర మంత్రిమండలి సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధానమంత్రి ఉజ్వల యోజన(పీఎంయూవై)కింద అదనంగా 75 లక్షల ఎల్పీజీ కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకోసం రూ.1,650 కోట్లు కేటాయించింది. దీంతోపాటు, ఈ కోర్ట్స్' ప్రాజెక్టు మూడో దశకు అనుమతి మంజూరుచేసింది. ఇందుకు గాను రూ.7,210 కోట్లు వెచ్చించాలని తీర్మానించింది. ఇటీవల ముగిసిన జీ20ని విజయవంతం చేసి, భారత్ ప్రతిష్టను ఇనుమడింప జేసిన ప్రధాని మోదీని ఈ సమావేశం అభినందించింది. ఈ వివరాలను భేటీ అనంతరం కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ మీడియాకు వెల్లడించారు. కొత్తగా జారీ అయ్యే 75 లక్షల ఉజ్వల ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లను 2023–24 నుంచి 2025–26 ఆర్థిక సంవత్సరం వరకు అందజేస్తామని తెలిపారు. వీటితో కలిపి ఉజ్వల లబ్ధిదారుల సంఖ్య 10.35 కోట్లకు చేరుకుంటుందన్నారు. దిగువ కోర్టుల్లో రికార్డుల డిజిటైజేషన్, క్లౌడ్ స్టోరేజీ, వర్చువల్ కోర్టుల ఏర్పాటు తదితరాల కోసం నాలుగేళ్లపాటు అమలయ్యే ఈకోర్ట్స్ ప్రాజెక్టు ఫేజ్–3కి రూ.7,210 కోట్లు కేటాయించేందుకు కూడా కేబినెట్ అంగీకరించిందని ఠాకూర్ చెప్పారు. ఇందులో భాగంగా 3,108 కోట్ల డాక్యుమెంట్లు డిజిటల్ రూపంలోకి మారుతాయని అంచనా.

వియత్నాంలో ఘోర అగ్ని ప్రమాదం

హనోయి: వియత్నాం రాజధాని నగరం హనోయి ఘోర అగ్నిప్రమాదానికి నిలయంగా మారింది. హనోయిలో మంగళవారం రాత్రి తొమ్మిది అంతస్తుల భవంతి పార్కింగ్ ప్రాంతంలో మొదలైన అగ్నికీలలు వెనువెంటనే భవనం మొత్తాన్నీ చుట్టేశాయి. అత్యవసరంగా బయటపడే మార్గం ఈ భవనానికి లేదు. దీంతో తప్పించుకునే మార్గం కానరాక ఏకంగా 56 మంది అగ్నికి ఆహుతయ్యారు. వీరిలో నలుగురు చిన్నారులు ఉన్నారు. 37 మంది గాయపడ్డారు. 150 కుటుంబాలు నివసిస్తున్న ఈ భవనం ఇరుకైన దారిలో నిర్మించారు. దీంతో మంటలు ఆర్పే అగ్నిమాపక సిబ్బంది భవనం దాకా చేరుకోలేకపోయారు. ఇరుకైన మార్గం కావడంతో సహాయక చర్యలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. మంటలు అంటుకుంటాయనే భయంతో కొందరు భవనం మీద నుంచి కిందకు దూకారు. ఇలా గాయపడిన వారిని హుటాహుటిన దగ్గర్లోని ఆస్పత్రుల్లో చికిత్సనందిస్తున్నారు. పొగపీల్చడంతో ఇబ్బందులు పడుతున్న వారికీ చికిత్సచేస్తున్నారు.

లిబియాలో ఊహకందని మహా విషాదం

5,100 దాటిన వరద మృతుల సంఖ్య

- ఇంకా వేలాది మంది జాడ గల్లంతు !
- నగరంలో ఎటుచూసినా శవాలే
- రహదారులు దెబ్బతినడంతో సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం

డెర్నా: అస్థిర ప్రభుత్వాలు, సంక్షోభం, ఎవరికీ పట్టని ప్రజా సంక్షేమంతో సమస్యల వలయంలో చిక్కిన లిబియాపై ప్రకృతి కత్తి గట్టింది. ఊహించని వరదలు, వరద నీటి ధాటికి పేకమేడల్లా కుప్పకూలిన రెండు డ్యామ్‌లు.. వరద విలయాన్ని మరింత పెంచాయి. డ్యామ్‌ల నుంచి దూసుకొచ్చిన నీటిలో కొట్టుకుపోయి జలసమాధి అయిన వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. బుధవారం నాటి గణాంకాల ప్రకారం డెర్నా సిటీలో వరద మృతుల సంఖ్య ఏకంగా 5,100 దాటింది. ఇంకా వేలాది మంది జాడ గల్లంతయిందన్న కథనాలు చూస్తుంటే అక్కడి పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వరద ఉధృతికి ఇళ్లుసహా సర్వం కోల్పోయి నిరాశ్రయులైన వారు వేలాదిగా ఉన్నారు. డెర్నా సిటీ తీరప్రాంతంలోని పర్వతాలు, లోయలతో నిండిన నగరం. వరదల కారణంగా చాలా రోడ్లు దెబ్బతిని సహాయక బృందాలు వరద ముంపు ప్రాంతాలకు చేరుకోలేని పరిస్థితి. దీంతో చాలా చోట్ల సహాయక చర్యలు మొదలేకాలేదు. అతికష్టం మీద కొన్ని బృందాలు చేరుకుని జలమయమైన ఇళ్లలో బాధితుల కోసం అన్వేషణ మొదలుపెట్టాయి. నేలమట్టమైన భవనాలు, శిథిలాల కింద వెతికే కొద్దీ మృతదేహాలు బయటపడుతున్నాయి.

30 వేలు దాటిన వలసలు

వరద ధాటికి సర్వం కోల్పోవడంతో దాదాపు 30 వేల మంది స్థానికులు పొట్టచేత పట్టుకుని వేరే ప్రాంతాలకు వలసవెళ్లారని ఐక్యరాజ్యసమితికి చెందిన మైగ్రేషన్ ఏజెన్సీ తెలిపింది. అయితే ఈ సంఖ్య 40,000కుపైనే ఉంటుందని ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్‌క్రాస్ సొసైటీ లిబియా ప్రతినిధి తమెర్ రమదాన్ అంచనావేశారు.

రెండు ప్రభుత్వాల మధ్య నలిగి..

తూర్పు ప్రాంతంలో ఒక ప్రభుత్వం, మరో దిశలో ఇంకో ప్రభుత్వాల నిర్లక్ష్య ఏలుబడిలో ఉన్న లిబియాలో మౌలిక వసతుల కల్పన అరణ్యరోదనే అయ్యింది. 'నగరంలో ఉన్న ఏకైక శ్మశానానికి తరలించేందుకు మృతదేహాలను ఒక దగ్గరకు చేరుస్తాం. ఈ జల విలయంలో 11 మంది కుటుంబసభ్యులను కోల్పోయి గుండెలవిసేలా రోదిస్తున్న ఒకాయనను ఓదార్చడం ఎవరి తరం కావట్లేదు' అని సహాయక బృంద సభ్యుడొకరు చెప్పారు. ' నా కుటుంబం మొత్తాన్నీ కోల్పోయా. వరదల్లో మా వాళ్ల మృతదేహాలు సముద్రం ఒడ్డుకు కొట్టుకొచ్చాయి' అని అబ్దుల్లా అనే వ్యక్తి వాపోయారు. రోడ్లలో పేరుకుపోయిన బురదను తొలగించేందుకు బుల్డోజర్లతో రెండు రోజులుగా నిరంతరంగా పనిచేయిస్తున్నారు. అప్పుడుగానీ అత్యవసర సరుకుల్ని తరలించలేని దుస్థితి.

వేరే పట్టణాలకు మృతదేహాల తరలింపు

సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు జరిపించే పరిస్థితులు డెర్నీ సిటీలో కరువవడంతో వందలాది మృతదేహాలను సమీపంలోని పట్టణాలకు తరలిస్తున్నారు. మరణించిన వారిలో 84 మంది ఈజిప్టువాసులూ ఉన్నారు. దక్షిణాన ఉన్న బెనీ సుయెఫ్ రాష్ట్రంలో ఎల్–షరీఫ్ గ్రామంలో డజన్లకొద్దీ ఈజిప్షియన్లు జలసమాధి అయ్యారు.

డెర్నాలో భీతావహ దృశ్యం

నగరంలో చాలా చోట్ల మృతదేహాలు కనపడుతు న్నాయి. బురదనీటిలో కూరుకుపోయి, వీధుల్లోకి కొట్టుకొచ్చి, సముద్ర తీరం వెంట.. ఇలా చాలా ప్రాంతాల్లో స్థానికులు విగతజీవులై కనిపించారు. ఒక్కసారిగా నీరు రావడంతో ఎటూ తప్పించుకోలేని నిస్సహాయక స్థితి. 'నగరంలో ఏ ప్రాంతంలో సహాయం చేసేందుకు వెళ్లినా అక్కడ మాకు చిన్నారులు, మహిళల మృతదేహాలే కనిపిస్తున్నాయి' అని బెంఘాజీకి చెందిన ఒక సహాయకుడు ఫోన్‌లో మీడియా సంస్థకు చెప్పారు. 'సిటీ శివార్లలోని డ్యామ్ బద్దలైన శబ్దాలు మాకు వినిపించాయి. నగరం గుండా ప్రవహించే వాదీ డెర్నీ నదిలో ప్రవాహ ఉధృతి అమాంతం ఊహించనంతగా ఎగసి జనావాసాలను ముంచేసింది. ' డ్యామ్ బద్దలవడంతో ఏకంగా ఏడు మీటర్ల ఎత్తులో దూసుకొచ్చిన ప్రవాహం తన మార్గంలో అడ్డొచ్చిన అన్నింటినీ కూల్చేసింది' అని లిబియాలో రెడ్ క్రాస్ కమిటీ ప్రతినిధి బృంద సారథి యాన్ ఫ్రైడెజ్ చెప్పారు. మధ్యధరా ప్రాంతంలో సన్నని తీరప్రాంతంలో పర్వత పాదాల చెంత ఈ నగరం ఉంది. పర్వతాల నుంచి వచ్చిన వరద నీరు నగరాన్ని ముంచేస్తూ తీరం వైపు కిందకు ఉరకలెత్తడంతో వరద తీవ్రత భయంకరంగా ఉంది. వరద ధాటికి దక్షిణం వైపు కేవలం రెండు రోడ్లు మాత్రమే మిగిలిపోయాయి. కూలిన వంతెనలు నగరం మధ్య భాగాన్ని రెండుగా చీల్చాయి. దీంతో సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గాయపడిన ఏడు వేలకుపైగా స్థానికులను మైదానాల్లోని తాత్కాలిక వైద్యశాలల్లో చికిత్సనందిస్తున్నారని తూర్పు లిబియాలోని అంబులెన్స్, అత్యవసర కేంద్రం అధికార ప్రతినిధి ఒసామా అలీ చెప్పారు.





జై మట్టి గణేశా



వినాయక చవితి పర్వదినం వస్తుండడంతో గణపతి విగ్రహాల విక్రయాలు ఊపందుకున్నాయి. బెంగళూరు ఆర్‌ఆర్ నగరలో మట్టి గణేశుల స్టాల్

న్యూస్‌రీల్

రూ.20 కోట్ల స్థలం స్వాధీనం



ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

మైసూరు: నగర శివార్లలో ఫ్యాంటసి పార్కు వద్ద ఆక్రమణకు గురైన రూ. 20 కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఈ స్థలంలో అక్రమంగా కట్టడాలను నిర్మించి ఎం శాండ్, కంకర, ఇటుకల బట్టీ తదితర కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఫిర్యాదు అందుకున్న కలెక్టర్ కేవీ రాజేంద్ర భూమిని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. జిల్లాధికారి ఆదేశాల మేరకు అధికారులు పోలీసుల భద్రత నడుమ జేసీబీ యంత్రాల సాయంతో కబ్జాలను కూల్చివేసి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు.

మలబార్ నగల ప్రదర్శన



ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

సాక్షి, బెంగళూరు: ప్రఖ్యాత మలబార్ గోల్డ్ – డైమండ్స్ సంస్థ హెరిటేజ్ పోల్కీ జ్యువెలరీ షోను ఉద్యాన నగరి వాసుల కోసం ప్రత్యేకంగా తీసుకొచ్చింది. బంగారం, వజ్రాలు, విలువైన రత్నాల ఆభరణాలతో రూపొందించిన వినూత్నమైన నగలు, వాటి ప్రత్యేక ప్రదర్శన, విక్రయాన్ని బెంగళూరులోని ఎంజీ రోడ్డులోని షోరూంలో ప్రారంభించింది. ప్రముఖ మేకప్ ఆర్టిస్ట్ కుల్సుమ్ పర్వేజ్, వ్యాపారవేత్త షాజియా అహ్మద్, బ్రైడల్ మేకప్ ఆర్టిస్ట్ తానియా ఆజం, ఇతర మేనేజ్‌మెంట్ సభ్యుల సమక్షంలో ఈ జ్యువెలరీ షో ప్రారంభమైంది.

లంచం.. ఇద్దరు రెవెన్యూ అధికారులకు జైలుశిక్ష



తుమకూరు: పొలం వివాదం పరిష్కారం కోసం ఒక వ్యక్తి నుంచి లంచం తీసుకున్న కేసులో ఇద్దరు రెవెన్యూ అధికారులకు నగరంలోని ఏడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు నాలుగేళ్ల జైలు శిక్ష విధించింది. రూ. 20 వేల జరిమానా కూడా విధించింది. 2019లో తుమకూరు ఉపవిభాగాధికారిగా పని చేసిన షబ్బీర్ (32), తబసం జహరా నిందితులు. వీరిద్దరూ రెవెన్యూశాఖలో డిప్యూటీ తహసీల్దార్లుగా పనిచేసేవారు. పొలం వివాదం పరిష్కరించేందుకు ఒక వ్యక్తి నుంచి రూ.20 వేలు లంచం డిమాండ్ చేసి మొదట రూ. 5 వేలు తీసుకున్నారు. తరువాత వారి వాయిస్ రికార్డులు వైరల్‌కావడంతో ఏసీబీ కేసు నమోదైంది. ఆ కేసు విచారణ సాగుతోంది. ప్రస్తుతం వీరిద్దరూ వేర్వేరు చోట్ల పనిచేస్తున్నారు. ఈ కేసులో ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం పై విధంగా తీర్పు వెలువరించింది.

హంపీ ఉత్సవాలపై కరువు నీడ

- ఫిబ్రవరికి వేడుకలు వాయిదా



హొసపేటె: రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితుల దృష్ట్యా ప్రపంచ ప్రసిద్ధ హంపీ ఉత్సవాలను వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరిలో నిర్వహించాలని నిర్ణయించారు. సీఎం సిద్దరామయ్య, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ అధ్యక్షతన బుధవారం విధాన సౌధలో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. మామూలుగా అయితే రాబోయే నవంబర్‌లో ఉత్సవాలు నిర్వహించాలి, కానీ రాష్ట్రంలోని విజయనగర, బళ్లారితో సహా చాలా జిల్లాల్లో పెద్ద సంఖ్యలో తాలూకాల్లో కరువు పరిస్థితి ఉంది. కావున ఇలాంటి పరిస్థితుల్లో సంబరాలు నిర్వహించడం సరికాదు, ఫిబ్రవరి నాటికి పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఉత్సవాలు నిర్వహించడం సముచితమని అభిప్రాయపడ్డారు.

నీళ్లివ్వలేం.. న్యాయ పోరాటమే



సెగలు రేపుతున్న కావేరి జలాలు

- అఖిలపక్ష భేటీలో తీర్మానం!
- ఢిల్లీకి వెళ్లి ఒత్తిడి పెంచాలని సూచనలు

శివాజీనగర: తమిళనాడుకు మరో 15 రోజుల పాటు ప్రతిరోజు 5 వేల క్యూసెక్కుల కావేరి జలాలను విడుదల చేయాలనే కావేరి నీటి నియంత్రణ కమిటీ సిఫార్సులను పాటించడం అసాధ్యమని ప్రాధికార, సుప్రీంకోర్టుకు వివరించి చట్టపరంగా పోరాటం చేయాలని సర్కారు తీర్మానించింది. బుధవారం విధానసౌధలో సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. అన్ని పార్టీల నాయకులు ఇందులో పాల్గొన్నారు. కావేరి నదీ నీటి నియంత్రణ కమిటీ సిఫార్సుల్ని ఆచరించడం కష్టం. అందుచేత న్యాయమైన పోరాటం ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలి. కావేరి నీటి నియంత్రణ ప్రాధికార, సుప్రీంకోర్టులో నీటి విడుదల విషయమై ముందుకు సాగాలని సీఎం సహా ఇతర పార్టీల నేతలు స్పష్టంచేశారు. వర్షాలు లేక జలాశయాలు అడుగంటడంతో ఇకపై నీరు వదలడం సాధ్యం కాదని ప్రకటించాలన్నారు. న్యాయ నిపుణుల సలహా ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నడుచుకోనుంది.

కేంద్రం జోక్యానికి వినతి

తమిళనాడుతో కావేరి నదీ జలాల వివాదంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ఒత్తిడి తీసుకురావటానికి త్వరగా అఖిల పక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని ఈ భేటీలో చర్చించారు. ఈ సమావేశంలో బీజేపీ నుంచి మాజీ మంత్రి ఆర్.అశోక్, ఎంపీ ప్రతాప్ సింహ, మండ్య ఎంపీ సుమలత పాల్గొన్నారు. అలాగే డీసీఎం డీ.కే.శివకుమార్, మంత్రులు పాల్గొన్నారు. ఈ దఫా భేటీకి బీజేపీ సీనియర్లు, మాజీ సీఎంలు యడియూరప్ప, బసవరాజ బొమ్మై, సదానందగౌడ గైర్హాజరయ్యారు.

మళ్లీ నిరసనలు

తమిళనాడుకు నీటి విడుదలను కొనసాగించాలన్న ఆదేశాలతో మండ్య ప్రాంతంలో మళ్లీ ఆందోళనలు మొదలయ్యాయి. రైతు సంఘాల నిరసనలు నిర్వహించాయి. రామనగరలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు.



కావేరి నీటి విడుదలకు వ్యతిరేకంగా రామనగర వద్ద రైతు సంఘాల ధర్నా



అఖిలపక్ష భేటీలో సీఎం సిద్దరామయ్య తదితరులు

క్రిప్టో కరెన్సీ అని రూ.16 లక్షలు మస్కా

- రూ.12 లక్షలు రికవరీ చేసిన పోలీసులు



మైసూరు: క్రిప్టో కరెన్సీ ద్వారా డబ్బులు రెట్టింపు అవుతాయని ఆశ చూపించి రూ. 16 లక్షలను దోచుకున్నారు. అయితే పోలీసులు చురుగ్గా వ్యవహరించి డబ్బులు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు తిరిగి రూ. 12 లక్షలు వచ్చేలా చేయగలిగారు. క్రిప్టో కరెన్సీలో డబ్బులు పెట్టుబడులు పెడితే అది రెట్టింపవుతుందని వచ్చిన మెసేజ్‌ను నమ్మి మైసూరులో ఐటీ కంపెనీ మాజీ ఉద్యోగి ఒకరు మోసగాళ్లు చెప్పిన 15 బ్యాంకు ఖాతాలకు రూ.16 లక్షల వరకూ డబ్బులు పంపాడు. తరువాత వారి నుంచి స్పందన లేకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి బాధితునికి తిరిగి రూ. 12 లక్షలు వచ్చేలా చేయగలిగారు.

బహుమతుల పేరుతో యువతికి టోపీ

విదేశాల నుంచి కానుకలు పంపిస్తామని ఆశలు చూపించి ఒక యువతి నుంచి లక్ష రూపాయలను సైబర్ దొంగలు కాజేశారు. మైసూరు రాజీవ్ నగరకు చెందిన అమీనా అన్సారి (19) వాట్సాప్ నంబర్‌కు జార్జ్ ఎలియస్ అనే వ్యక్తి నుంచి మెసేజ్ వచ్చింది, అలా ఇద్దరూ చాటింగ్ చేసేవారు. తాను లండన్‌లో ఉంటానని, నీ కోసం బహుమతులు పంపిస్తానని నమ్మబలికాడు. తరువాత ఢిల్లీ విమానాశ్రం నుంచి అని యువతికి ఒక కాల్ వచ్చింది. లండన్ నుంచి మీకు పార్సిల్ వచ్చిందని, కస్టమ్స్ క్లియరెన్స్ ఫీజు రూ. లక్ష చెల్లించాలని కాల్‌లోని వ్యక్తి తెలిపాడు. వారి మాటలు నమ్మి రూ. లక్షను అన్సారీ పంపించింది. ఆ తర్వాత స్పందన లేకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కరువు తాలూకాలు 195



కరువు వల్ల రాష్ట్రంలో లక్షలాది రైతులు కష్టాల్లో ఉన్నారు

- సహాయక చర్యలు చేపడతాం
- రెవెన్యూ మంత్రి బైరేగౌడ వెల్లడి

శివాజీనగర: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అత్యధిక జిల్లాల్లో సరైన వర్షాలు కురవక వ్యవసాయం కుంటుపడింది. వానలు లేక వేసిన పంటలు ఎండిపోగా, ప్రజలకు, పశువులకు తాగునీటికి కూడా కటకట ఏర్పడింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో195 తాలూకాలను కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించినట్లు రెవెన్యూ మంత్రి కృష్ణబైరేగౌడ తెలిపారు. బుధవారం జరిగిన మంత్రి మండలి సబ్ కమిటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో తీవ్ర కరువు పీడిస్తున్న నేపథ్యంలో ఉపాధి హామీ పనులను 100 రోజుల నుండి 150 రోజులకు పెంచినట్లు, తాగునీటి కొరత ఉన్నచోట్ల ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, పశువులకు పశుగ్రాసం రవాణాకు చర్యలు చేపట్టామన్నారు. 195 కరువు తాలూకాలలో పరిహార పంపిణీ చేపడతామన్నారు. ఈ జాబితాను సీఎం ఆమోదానికి పంపుతామన్నారు.

త్వరలో రెండో విడత సర్వే

వర్షపాతం, కేంద్ర నియమాల ప్రకారం 62 తాలూకాలు మాత్రమే కరువు పీడిత ప్రాంతాల్లోకి వస్తాయని, 134 తాలూకాల్లో పంటల సమీక్ష తరువాత తాలూకాల సంఖ్యను పెంచినట్లు చెప్పారు. మరో 15 రోజులు నిరీక్షించి రెండో విడత కరువు తాలూకాలను ప్రకటిస్తామన్నారు. మలెనాడు భాగంలో కూడా తీవ్ర నీటి కొరత నెలకొంది, రాష్ట్రంలో మొత్తం 40 శాతం కరువు పరిస్థితి ఉండగా, దక్షిణ ఒళనాడులోనూ అనావృష్టి నెలకొందని ఆశ్చర్యం వ్యక్తంచేశారు. రెండో విడతలో 113 తాలూకాలలో కరువు పరిశీలన జరుగుతుందన్నారు.

హద్దులు లేకుండా నేరాలకు అడ్డుకట్ట

- దక్షిణాది రాష్ట్రాల డీజీపీల భేటీలో సీఎం



ఐపీఎస్ అధికారులతో సీఎం తదితరులు

బనశంకరి: నేరాలను సమర్థంగా అణచివేయడానికి రాష్ట్రాల మధ్య సమాచారం, మానవ వనరులు, సాంకేతికతను పరస్పరం వినిమయం చేసుకోవడం అనివార్యమని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. బుధవారం బెంగళూరులో దక్షిణాది రాష్ట్రాల డీజీపీల సమావేశాన్ని సీఎం సిద్దరామయ్య ప్రారంభించి మాట్లాడారు. నేరాల ప్రపంచానికి హద్దులు లేకుండా పోతోందని, వీటిని నియంత్రించడంలో భద్రతాదళాలు, దర్యాప్తు సంస్థలు మధ్య సరిహద్దు ఉండరాదని ప్రతిపాదించారు. ఈ సమ్మేళనం నేరాల ఆచూకీ, నేరాల నియంత్రణలో దక్షిణ భారత రాష్ట్రాల మధ్య మరింత సహకారం సమన్వయం ఏర్పరచుకోవడానికి సహాయపడుతుందనే నమ్మకం ఉందన్నారు.

దక్షిణ భారతం వైవిధ్యమయం

దక్షిణ భారతదేశంలో సాంస్కృతిక వైవిధ్యం, విభిన్నభాషలు, భౌగోళిక కారణాలతో నేరాల నియంత్రణలో అనేక సవాళ్లు ముందున్నాయని సీఎం తెలిపారు. మాదకద్రవ్యాలు మానవ అక్రమ రవాణా, సంఘటిత నేరాలు, సమాజంలో శాంతి భద్రతలకు కలిగే ముప్పును ప్రస్తావించారు. ఈ నేరాలు రాష్ట్రాల సరిహద్దుల్ని దాటి జరుగుతుండడం వల్ల వీటి నియంత్రణకు అంతర్రాష్ట్ర పోలీస్ బృందాల మధ్య సమన్వయం సహకారం అవసరమన్నారు. ఒక రాష్ట్రంలో నేరాల నియంత్రణకు విజయవంతమైన వ్యూహాలను ఇతర రాష్ట్రాల పోలీసులు తెలుసుకోవడానికి ఇటువంటి కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు. దక్షిణ భారతదేశంలో నేరాలను విజయవంతంగా అరికట్టి ప్రతి పౌరునికి భద్రత కల్పించాలన్నారు. ఈ సమావేశంలో హోం మంత్రి పరమేశ్వర్, డీజీపీ అలోక్‌మోహన్, దక్షిణాది రాష్ట్రాల డీజీపీలు, సీనియర్ ఐపీఎస్‌లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్ పేరుతో రూ.5 కోట్లు స్వాహా?

- సామాజిక కార్యకర్త చైత్రాకుందాపుర సహా ఆరుగురి అరెస్ట్



పోలీస్ వాహనంలో చైత్రాను తరలిస్తున్న దృశ్యం

బనశంకరి:బీజేపీ తరపున ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానని పారిశ్రామిక వేత్తనుంచి కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలపై సామాజిక కార్యకర్త చైత్రా కుందాపురతో సహా ఆరుగురిని బుధవారం సీసీబీ పోలీసులు అరెస్ట్‌చేశారు. అదనపు పోలీస్‌కమిషనర్ సతీశ్‌కుమార్ కేసు వివరాలు వెల్లడించారు.

ఏం జరిగిందంటే..

గత శాసనసభ ఎన్నికల సమయంలో బైందూరు నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున పోటీ చేసేందుకు పారిశ్రామికవేత్త గోవిందబాబుపూజారి ఆసక్తితో ఉన్నాడు. ఆ సమయంలోనే చైత్రా కుందాపురతో పరిచయమైంది. ఆర్‌ఎస్‌ఎస్ నేతలతో, పీఎంఓలో తనకు పరిచయాలు ఉన్నాయని చెప్పింది. చిక్కమగళూరుకు గోవిందబాబు పూజారిని తీసుకెళ్లి ఓ వ్యక్తిని పరిచయం చేసింది. ఈయన పేరు విశ్వనాథ్ అని, ఆర్‌ఎస్‌ఎస్‌లో పలుకుబడి ఉందని, టికెట్ ఇప్పిస్తారని చెప్పింది. అనంతరం మూడు విడతలుగా రూ.5కోట్ల నగదు తీసుకుంది. మార్చి 8న ఓ వ్యక్తి పారిశ్రామికవేత్తకు ఫోన్ చేసి విశ్వనాథ్ మృతిచెందారని తెలిపారు. అనుమానం వచ్చి కశ్మీరులో ఉన్న స్నేహితుడు విశ్రాంత ఆర్మీ అధికారి యోగేశ్‌కు ఫోన్ చేయగా విశ్వనాథ్ ఆర్‌ఎస్‌ఎస్‌లో ఎవరూలేరని తెలిపారు. చైత్రాకుందాపురకు ఫోన్‌చేసి తన డబ్బు వెనక్కి ఇవ్వాలని కోరగా ఆత్మహత్యాయత్నం నాటకం ఆడింది. కొంత సమయం కావాలని అడిగింది. అనుమానం రావడంతో చైత్రాకుందాపుర, గగన్‌కడూరు, అభినవ హాలశ్రీ స్వామీజీ, రమేశ్, ధనరాజ్, నాయక్, శ్రీకాంత్, ప్రసాద్‌బైందూరుపై బండెపాళ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీబీ పోలీసులు తీవ్రంగా గాలించి చైత్రా కుందాపుర, గగన్ కడూరు, శ్రీకాంత్‌నాయక్, ప్రసాద్, మరో ఇద్దరిని అరెస్ట్‌చేసి ఉడుపి నుంచి బెంగళూరు నగరానికి తరలించారు. బెంగళూరు నగర ఒకటో ఏసీఎంఎం కోర్టులో హాజరు పరిచి మరింత విచారణ కోసం ఈనెల 23 తేదీ వరకు కస్టడీలోకి తీసుకున్నారు.

అజ్ఞాతంలోకి స్వామీజీ?

మూడో నిందితుడిగా తనపై కేసు నమోదైనట్లు తెలియడంతో విజయనగర జిల్లా హూవినహడగలి తాలూకా హిరేహడగలి హాలుమత అభినవ హాలశ్రీ స్వామీజీ అజ్ఞాతంలోకి వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది.



బుధవారం సాయంత్రం బెంగళూరులో కొన్నిచోట్ల ఒక మోస్తరు వర్షం కురిసింది. కార్పు రోడ్డులో బసవ ధర్మ కూడలిలో వర్షం దృశ్యం

ఆర్‌టీఓ ఆఫీసుల్లో లోకాయుక్త తనిఖీలు

బనశంకరి: బెంగళూరులోని ప్రాంతీయ రవాణా అధికారి (ఆర్‌టీఓ)ల కార్యాలయాలపై బుధవారం లోకాయుక్త పోలీసులు దాడులు నిర్వహించారు. లోకాయుక్త జస్టిస్ బీఎస్. పాటిల్ జయనగర, రాజాజీనగర ఆర్‌టీఓ ఆఫీసుల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. యలహంక , యశవంతపుర ఆర్‌టీఓ కార్యాలయాలను ఉప లోకాయుక్త న్యాయమూర్తి కేఎన్.ఫణీంద్ర సందర్శించారు. ఆ కార్యాలయాల్లో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని ప్రజలు ఫిర్యాదులు చేయడంతో లోకాయుక్త సుమోటోగా కేసులు నమోదు చేసి విచారణ కోసం దాడులు నిర్వహించారు.

చవితికి ఏపీఎస్ ఆర్టీసీ స్పెషల్ బస్సులు

బనశంకరి: వినాయక చవితి పండుగకు సొంతూళ్లకు వెళ్లే ఏపీ ప్రయాణికుల కోసం ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపనున్నట్లు బెంగళూరు ట్రాఫిక్ మేనేజరు రవీంద్రారెడ్డి తెలిపారు. విజయవాడ, నెల్లూరు, కర్నూలు, కడప, ప్రొద్దుటూరు, అనంతపురం, చిత్తూరు, తిరుపతి నగరాలకు ఆర్టీసీ సాధారణ చార్జీలతో ప్రత్యేక బస్ సర్వీసులు నడుస్తాయని చెప్పారు. 15వ తేదీన బెంగళూరు నుంచి బయల్దేరతాయని, అడ్వాన్స్ బుకింగ్ సౌకర్యం ఉందని చెప్పారు. అలాగే బెంగళూరులో ఉండే వారికి కార్గో పార్శిల్ బుకింగ్ సౌకర్యం ఉందని, మరింత సమాచారం కోసం డీఎంఈ-9731216688 నంబరులో సంప్రదించాలని కోరారు.

పొత్తుపై మోదీ నిర్ణయం: యడ్డి


శివాజీనగర: బీజేపీ ఎన్నికల కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు మాజీ సీఎం బీ.ఎస్.యడియూరప్ప బుధవారం ఢిల్లీకి వెళ్లారు. అంతకు ముందుగా డాలర్స్ కాలనీ నివాసంలో మాట్లాడుతూ గురువారం తిరిగి వస్తానని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల గురించి చర్చలు జరగవచ్చు. జేడీఎస్‌తో పొత్తు గురించి ప్రధాని మోదీ, అమిత్ షా నిర్ణయం తీసుకుంటారు. అందుకు తాము కట్టుబడి ఉంటామన్నారు. అనివార్య కారణాల వల్ల కావేరి అఖిల పక్ష సమావేశంలో పాల్గొనలేదన్నారు. మరోవైపు బీజేపీ నేత ఈశ్వరప్ప బెంగళూరులో జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామిని నివాసంలో కలిసి ఆరోగ్యం గురించి పరామర్శించారు.

చలాకీగా సాధన



మైసూరు దసరా ఏనుగులు బుధవారం నుంచి జంబూ సవారీ సాధనను ప్రారంభించిన దృశ్యం. ప్యాలెస్ నుంచి బన్నిమంటప వరకూ వెళ్లి తిరిగి వచ్చాయి

నిఫా అలర్ట్



- కేరళలో వైరస్ కేసులు
- రాష్ట్ర సరిహద్దుల్లో కలవరం

యశవంతపుర: కర్ణాటక– కేరళ సరిహద్దుల్లో నిఫా వైరస్ కారణంగా ఇద్దరు మృతి చెందారు. దీంతో కేరళను ఆనుకుని ఉండే దక్షిణ కన్నడ జిల్లా సుళ్య తాలూకాలో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. కేరళ కల్లికోట ప్రాంతంలో నిఫా వల్ల మరణాలు సంభవించడంతో అక్కడ కంటైన్‌మెంట్ చేపట్టారు. ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలపై నియంత్రణ ఉంది. అక్కడి మలప్పురం, కణ్ణూరు, వయనాడు, కాసరగోడు జిల్లాల పరిధిలో నివారణ చర్యలు చేపట్టారు. కాసరగోడు జిల్లాకు– దక్షిణ కన్నడ మధ్య నిత్యం ప్రజలు వస్తూ పోతూ ఉంటారు. అలాగే కేరళ నుంచి మడికెరి, మైసూరు, మంగళూరుకు పనుల మీద వస్తుంటారు. దీంతో నిఫా వైరస్ వ్యాప్తిపై ఆందోళన నెలకొంది. గబ్బిలం కరిచిన పండ్లను తినరాదని అధికారులు ప్రకటించారు. సుళ్య తాలూకాలో ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేట్ ఆస్పత్రులకు జ్వరంతో వస్తున్న వ్యక్తులకు చికిత్సలు చేసి వివరాలను సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు నిఫా కేసులు దక్షిణ కన్నడ జిల్లాలో నమోదు కాలేదు.

లక్షణాలు ఇవే

నిఫా వైరస్ కలిగిన గబ్బిలాలు కొరికిన పండ్లు, ఆహారాన్ని తిన్నవారికి ఆ వైరస్ సోకే అవకాశముంది. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది, ఒంటి నొప్పులు, వాంతులు దీని లక్షణాలు. బాధితులు వెంటనే వైద్యులను కలిసి చికిత్స తీసుకోవాలి. ఈ గబ్బిలాలు కొరకడం వల్ల పండుల్లోనూ నిఫా వైరస్ కనిపించింది. ఈ రెండు జంతువులకు దూరంగా ఉండడం ఉత్తమం. బాధితుల దగ్గు, తుమ్ము, లాలాజలం నుంచి ఇతరులకు సులభంగా వ్యాప్తి చెందుతుంది.

వానలు రాలే .. వలసలు తప్పలే

- కల్యాణ కర్ణాటకలో అన్నదాతల వెతలు
- కరువు దెబ్బకు చితికిన కూలీల బతుకులు
- ఉపాధి కోసం వలసబాట పట్టిన వైనం

రాయచూరు రూరల్: నైరుతి రుతు పవనాలు ముఖం చాటేశాయి. ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటున్నా వర్షాలు కురవడం లేదు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు. కళ్యాణ కర్ణాటక ప్రాంతంలోని రాయచూరు, యాదగిరి, కొప్పళ, బీదర్, కలబుర్గి జిల్లాలు కరువు ప్రాంతాలుగా మారాయి. రాయచూరు, కొప్పళ జిల్లాల్లో నదిలో నీరు అంతంతగా మాత్రంగానే ఉంది.

బతుకుదెరువు కోసం వలసలు :

రాయచూరు, యాదగిరి, కలబుర్గి జిల్లాలో వ్యవసాయ పనులు లేక రైతు కూలీలు బతుకు దెరువు కోసం బెంగళూరు, ముంబై, షోలాపూర్, గోవా, మహారాష్ట్ర, చెన్నై, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. ఇక బోర్లలో కూడా భూగర్భ జలం అడుగంటింది. మరోవైపు విద్యుత్ కోతలు అధికమయ్యాయి. వానలు కురవకపోవడంతో జీవనోపాధి కోసం రైతు కూలీలు మూట ముల్లె సర్దుకుని వలసబాట పడుతున్నారు. రాయచూరు, యాదగిరి, కలబుర్గి జిల్లాల నుంచి ప్రతి రోజు వందలాది మంది రైళ్లలో బెంగళూరుకు వలసపోతున్నారు. ఇళ్లల్లో పిల్లలు, పెద్దలను విడిచి పెట్టి కట్టుబట్టలతో వలసపోతున్నారు. ఉపాధి కోసం వలస పోతుండటంతో కుటుంబాలు కన్నీరు మున్నీరవుతున్నాయి. ప్రజాప్రతినిధులకు మాత్రం వీరి గోడు పట్టనట్లుగా ఉంది.


రాయచూరులో మూటాముల్లెతో రైలు ఎక్కుతున్న కూలీలు

నదులున్నా భూములు బీళ్లే :

రాయచూరు జిల్లాలో తుంగా, కృష్ణా నదులున్నా భూములు బీళ్లుగా మారుతున్నాయి. జిల్లాలో లక్షా 70 వేల ఎకరాల్లో పత్తి, లక్షా 50 వేల ఎకరాల్లో వరి, 86 వేల ఎకరాల్లో కందులు వేశారు. కాలువకు నీరందక, వానలు కురవక భూములు బీళ్లుగా మారుతున్నాయి. తుంగభద్ర ఎడమ కాలువ ఆయకట్టు చివరి భూములకు నీరందక రైతులు ఆందోళన చేపట్టినా గేజ్ నిర్వహణలో అధికారులు విఫలమయ్యారు.


నీటి ప్రవాహం లేని ఎడమ కాలువ


తాగునీటి కోసం ప్రజల ఆరాటం

క్లుప్తంగా

ఇంటింటికీ ఆయుష్మాన్‌భవ కార్డులు


కార్యక్రమం ప్రారంభిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: పేదలకు ఆరోగ్య భద్రత కల్పించే ఆయుష్మాన్‌భవ కార్డులను జిల్లాలో ఇంటింటికీ సక్రమంగా అందించాలని అదనపు జిల్లాధికారి దురుగేష్ సూచించారు. బుధవారం జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన ఆయుష్మాన్‌భవ అభియాన్‌ను ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో జీపీ స్థాయిలో కార్డులను పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య అధికారి సురేంద్ర బాబు, గణేష్, ఇతర శాఖల అధికారులున్నారు.

స్వచ్ఛతే ఆరోగ్యానికి సోపానం


శ్రమదానం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

రాయచూరు రూరల్: స్వచ్ఛతకు ప్రతిఒక్కరూ చేతులు కలపాలని కిల్లే బృహన్మఠాధిపతి శాంతమల్ల శివాచార్యులు అభిప్రాయ పడ్డారు. బుధవారం నగరంలోని వాల్కట్ మైదానంలో ఎన్.ఎస్.బోసురాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛత అభియాన్‌కు శ్రీకారం చుట్టి మాట్లాడారు. నగరంలో ఐదు రోజుల పాటు బోసురాజు ఫౌండేషన్ చేపట్టే శ్రమదానానికి చేతులు జోడించి ఎక్కడపడితే అక్కడ పేరుకున్న చెత్తా చెదారం తొలగింపునకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సంచాలకుడు రవి, దరూరు బసవరాజు, శివమూర్తి, బసవరాజరెడ్డి, ప్రవీణ్, శాలం, జయన్న, శాంతప్ప, దేవన్న నాయక్, రమేష్, నగరసభ కమిషనర్ గురుసిద్దయ్యలున్నారు.

ఖరీఫ్ పంటల సమీక్షకు శ్రీకారం

కంప్లి: ఈ ఏడాది నా పంట– నా హక్కు కింద ఖరీఫ్ పంటల సమీక్ష ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో రైతులు స్వయంగా పాల్గొని తమ పొలాల్లో తాము పండించిన పంటల వివరాలు నమోదు చేస్తున్నారు. తొలకరి రైతుల పంట సమీక్ష–2023 యాప్ ద్వారా తాలూకాలోని రైతులు తాము పండించిన పంటల వివరాలను యాప్‌లో నమోదు చేయవచ్చని సహాయక వ్యవసాయ శాఖ డైరెక్టర్ దయానంద్ తెలిపారు.

పరమహంసాచారిని బంధించాలని ధర్నా


ధర్నా చేస్తున్న ప్రగతిశీల సంఘాల కార్యకర్తలు

రాయచూరు రూరల్: సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ తల నరికి తెచ్చిన వారికి రూ.10 కోట్ల నజరానా ఇస్తానని ప్రకటించిన సనాతన సంస్థ అర్చకుడు పరమహంసాచారిని బంధించాలని ప్రగతిశీల సంఘాలు డిమాండ్ చేశాయి. బుధవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన సంస్థ అధ్యక్షుడు మారెప్ప మాట్లాడారు. పరమహంసాచారిని రక్షించడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నడాన్ని ఖండించారు. కవిగోష్ఠిలో మంత్రి స్టాలిన్ సనాతన ధర్మం డెంగీ, మలేరియా వంటివన్నారు. వాటిని నిర్మూలించడం మనందరి బాధ్యత అని పేర్కొన్న విషయాలపై స్వామీజీలు ఆరోపణలు చేయడం సరికాదని, సనాతన సంస్థ అర్చకుడు పరమహంసాచారిని బంధించాలని కోరుతూ స్థానికాధికారికి వినతి పత్రం సమర్పించారు.

రూ. 35.86 లక్షల సొత్తు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న ఎస్పీ ఎన్.యతీశ్

మండ్య: చోరీలకు పాల్పడుతున్న నలుగురు సభ్యులున్న అంతర్ జిల్లా ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులనుంచి కారు, బైక్, గూడ్స్ టెంపో, ల్యాప్‌ట్యాప్ తదితర రూ. 35.86 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ ఎన్.యతీశ్ మీడియాకు వివరాలు వెల్లడించారు. యతీశ్ మాట్లాడుతూ నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు ఈ నలుగురు ప్రమేయం ఉన్న మొత్తం 11 కేసులను ఛేదించినట్లు తెలిపారు.

మూడు రోజుల్లో నివేదిక అందాలి

బనశంకరి: బెంగళూరు నగరంలో రాజకాలువ, చెరువు ఆక్రమణ తొలగింపుపై ఈనెల 16 లోగా నివేదిక అందించాలని ఇంజినీర్లకు గడువు విధించినట్లు బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ తెలిపారు. బుధవారం ఆయన బీబీఎంపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... రాజకాలువ, చెరువులు ఆక్రమణకు సంబంధించి ఇప్పటికే బీబీఎంపీ అఫిడవిట్ దాఖలు చేసిందన్నారు. చెరువులు, రాజకాలువలు ఆక్రమణకు గురైన విషయంపై ప్రభుత్వం రెండు నోటిఫికేషన్లు విడుదల చేసిందన్నారు. రాజకాలువకు చుట్టుపక్కల కిలో మీటరు వరకు ఆక్రమణల ఆచూకీ కనిపెట్టాలని సూచించిందన్నారు. పారదర్శకంగా నివేదిక అందించాలని ఆదేశించామన్నారు. ఇంజినీర్లు పూర్తి స్థాయిలో నివేదిక అందించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


మాట్లాడుతున్న బీబీఎంపీ కమిషనర్ తుషార్‌గిరినాథ్

సీఎంగా దళితులకు చాన్స్

- మంత్రి సతీష్ జారకిహొళి వ్యాఖ్య

హుబ్లీ: హోంమంత్రి జీ.పరమేశ్వర్ ముఖ్యమంత్రి, సతీష్ జారకిహొళి ఉపముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ సీనియర్ నేత బీకే.హరీ ప్రసాద్ సందర్భోచితంగా చెప్పి ఉండవచ్చు. అయితే రాబోయే రోజుల్లో దళితులకు అవకాశం దొరకడం తథ్యమని, కాని దాని కోసం వేచి ఉండాలని రాష్ట్ర మంత్రి సతీష్ జారకిహొళి అన్నారు. బుధవారం హుబ్లీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఒకరు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన ఉత్తమ రీతిలో విధులు నిర్వర్తిస్తున్నారు. అందువల్ల ఈ విషయంలో చర్చ అనవసరం. ఎవరు ముఖ్యమంత్రిగా ఉన్నా ఇలాంటి వ్యాఖ్యలు వినిపిస్తూనే ఉంటాయన్నారు. మంత్రి డీ.సుధాకర్‌పై దాఖలైన ఎఫ్ఐఆర్ గురించి మాట్లాడిన ఆయన అందరికీ ఒకటే చట్టం ఉంది అని, దాని ప్రకారమే చర్యలు తీసుకుంటారని అన్నారు.


మాట్లాడుతున్న సతీష్ జారకిహొళి

బాలుడిని రక్షించిన ఆటో డ్రైవర్

మైసూరు: ఇంటి నుంచి ట్యూషన్‌కు వచ్చి దారి తెలియక ఇబ్బంది పడుతున్న బాలుడిని ఆటో డ్రైవర్ రక్షించారు. ఈ ఘటన మైసూరు బస్టాండ్ వద్ద జరిగింది. బెళగావి జిల్లా హుక్కేరి తాలూకా చెందిన శివరాజ్ మహాలింగ మేలమట్టి (14) రెండు రోజుల క్రితం ట్యూషన్ కోసం ఇంటి నుంచి వచ్చి బెళగావి బస్టాండ్‌లో గందరగోళానికి గురయ్యాడు. అక్కడి నంచి రైలులో మైసురుకు వచ్చే రైలు ఎక్కాడు. మైసూరు వచ్చిన తర్వాత దారి తెలియక నగర బస్టాండ్ వద్ద ఏడుస్తూ కూర్చున్నాడు. ఆటో డ్రైవర్ హరీష్ గమనించి వివరాలు అడిగి తెలుసుకున్నాడు. బాలుడికి గుర్తు ఉన్న ఫోన్ నంబర్‌కు కాల్ చేసి అనంతరం దేవరాజ పోలీసు స్టేషన్‌లో అప్పగించాడు. అనంతరం బెళగావి హుక్కేరి తాలూకా యమకన మరడి పోలీసులకు సమాచారం అందించారు. తమ కుమారుడు తప్పిపోయాడని కన్నీటిలో ఉన్న తల్లిదండ్రులకు పోలీసులు బాలుడి క్షేమ సమాచారాలు తెలిపారు.


బాలుడితో పోలీసులు, ఆటో డ్రైవర్ హరీష్

యువకుడి దారుణ హత్య

మండ్య: పాత కక్షల నేపథ్యంలో యువకుడిపై ఐదు మంది దాడి చేసి చంపేశారు. ఈఘటన గాంధీనగర నాలుగో క్రాస్‌లో జరిగింది. గాంధీ నగర లేఔట్ నివాసి అక్షయ్ అలియాస్ గంట్లు (22) మంగళవారం రాత్రి సుమారు ఏడు గంటలకు గాంధీనగర నాలుగో క్రాస్ వద్ద ఉన్న టీ దుకాణంలో టీ తాగుతుండగా దుండగులు దాడి చేశారు. అక్షయ్ తప్పించుకుని పారిపోయేందుకు పరుగులు తీస్తూ ప్రదీప్ అనే వ్యక్తి ఇంటి కాంపౌండ్ లోపలకి దూకాడు. అయితే దుండగులు అతన్ని వెంటాడి మారణాయుధాలతో దాడి చేసి హత్య చేశారు. డీవైఎస్పీ శివమూర్తి వచ్చి పరిశీలించారు. అనంతరం పోలీసులు అక్షయ్ మృతదేహాన్ని మిమ్స్‌కు తరలించారు. ఆ వీధిలోముందుస్తు జాగ్రత్తగా గట్టి పోలీసు బందోబస్తు చేపట్టారు.పశ్చిమ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

మూడునెలల్లో బెలికెరి రాడార్ కేంద్రం ప్రారంభం

బనశంకరి: బెలికెరి రాడార్ కేంద్రాన్ని మూడునెలల్లో ప్రారంభిస్తామని పశ్చిమ వలయ కోస్ట్‌గార్డ్స్ కమాండర్ మనోజ్‌బాడకర్ తెలిపారు. కోస్ట్‌గార్డ్స్ సమరనౌక సామ్రాట్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 7500 కిలోమీటర్ల పొడవున సముద్రతీరాన్ని కోస్ట్‌గార్డ్ పర్యవేక్షిస్తుందన్నారు. తమ సముద్రతీరంలో ఇప్పటికే అత్యాధునిక రాడార్ కేంద్రం కలిగి ఉందని, ఇంకా 8 రాడార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బెలికేరి రాడార్ కేంద్రం ద్వారా 30 నాటికల్‌మైళ్ల వరకు సముద్రతీరంలో నిఘా పెడతామన్నారు. ముంబై, మంగళూరు, ఢిల్లీనుంచే ఈ రాడార్ ద్వారా సముద్రంలోని కార్యకలాపాలను పర్యవేక్షిస్తామన్నారు.

రెండేళ్లలో కేపీఎస్ తరహా స్కూళ్లు


ఉపాధ్యాయులతో మంత్రి మధు బంగారప్ప

శివమొగ్గ: రాష్ట్రంలో రానున్న రెండేళ్లలో సుమారు 500–600 కర్ణాటక పబ్లిక్ స్కూల్ తరహా పాఠశాలలను ప్రారంభించే ఆలోచన చేస్తున్నట్లు విద్యా శాఖ మంత్రి మధు ఎస్.బంగారప్ప తెలిపారు. జిల్లా పాలన యంత్రాంగంగం అధికారులతో డాక్టర్ రాజ్ సభాంగణంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల దినోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీకి ఒక మోడల్ స్కూల్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. కన్నడతో పాటు ఆంగ్ల మాధ్యమంలో విద్యాను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

జేడీఎస్.. బీజేపీకి బీటీం

చిక్కబళ్లాపురం: జేడీఎస్ బీజేపీకి బీ టీం అనే విషయాన్ని తాము ఎన్నికలకు ముందే చెప్పామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎమ్మెల్యే తన్వీర్ సేట్ అన్నారు. ఆయన బుధవారం నగరంలో మహిళా కళాశాల అభివృద్ధి పనులపై సమీక్ష చేపట్టారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, జేడీఎస్ మైత్రిపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా సమాధానం ఇచ్చారు. కావేరి వివాదాన్ని ప్రస్తావిస్తూ వందేళ్లుగా ఈ వివాదం ఉందన్నారు.

అత్యుత్తమ వైద్య సేవలే లక్ష్యం

- ఎమ్మెల్యే గవియప్ప

హొసపేటి: జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న జిల్లా ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయడంతో పాటు ఈ ప్రాంత ప్రజలకు కూడా ఉపయోగపడేలా గుండె శస్త్రచికిత్సలకు ప్రణాళిక రూపొందిస్తామని ఎమ్మెల్యే హెచ్ఆర్ గవియప్ప తెలిపారు. నగరంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కార్యాలయ సభాభవనంలో బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఆయుష్మాన్‌భవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జీవన విధానంతో పాటు చికిత్స విధానం కూడా క్రమంగా మారుతోందన్నారు. ఈ ప్రాంతంలో కూడా ప్రజలకు అత్యుత్తమ వైద్య సదుపాయాలు అందించాలనే సదుద్దేశంతో ఆరోగ్య శాఖను సంస్కరిస్తున్నామన్నారు. ప్రజలకు అన్ని సౌకర్యాలు అందించే లక్ష్యంతో ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్.శంకర్ నాయక్ ప్రసంగిస్తూ ఈనెల 17 నుంచి జిల్లాలో ఆయుష్మాన్‌భవ కార్యక్రమాన్ని మూడు దశల్లో నిర్వహిస్తామన్నారు. మొదటి దశలో ప్రతి ఇంటికి వెళ్లి అభా కార్డు నమోదు చేయడంతో పాటు కార్డు ద్వారా అందుతున్న సౌకర్యాల గురించి సమాచారం ఇస్తారన్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ మహమ్మద్ అలీ అక్రమ్, వైద్యులు జంబయ్య నాయక్, షణ్ముఖ నాయక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గవియప్ప

మండ్యలో ధర్నాల హోరు


ఆందోళన చేస్తున్న రైతులు, మహిళలు


రోడ్డుపై బైఠాయించిన రైతులు

మండ్య: తమిళనాడుకు మళ్లీ కావేరి నీటిని విడుదల చేయాలని ఆదేశించిన కావేరి నది నీటి ప్రాధికారకు వ్యతిరేకంగా మండ్య జిల్లా రైతు సంరక్షణ సమితి ఆందోళన ప్రారంభించింది. నగరంలోని సర్ ఎంవీ విగ్రహం ఎదుట రైతులు, కన్నడపర పోరాట సమితి కార్యకర్తలు ధర్నా చేశారు. ప్రస్తుత సంక్లిష్ట స్థితిలో కేంద్రం జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఎంపీలు ప్రధానిపై ఒత్తిడి చేసి నీరు వదలకుండా అడ్డుకోవాలని కోరారు.

రైతుల రాస్తారోకో

కావేరి నీరు మరో విడత విడుదలపై రైతులు, సంఘాలు భగ్గుమన్నాయి. మండ్య నగరంలోని చామరాజేంద్ర ఒడెయార్ సర్కిల్‌లో రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సమయంలో వాహనాల రాకపోకలను అడ్డగించారు. తమిళనాడుకు నీటిని విడుదల చేయవద్దంటూ నినాదాలు చేశారు.

పొర్లుదండాలు పెడుతూ నిరసన

దొడ్డబళ్లాపురం: తమిళనాడుకు కావేరి జలాలు విడుదల చేయడాన్ని నిరసిస్తూ రామనగర సమీపంలోని బెంగళూరు–మైసూరు ఎక్స్‌ప్రెస్‌వేపై కణమిణికి టోల్‌గేట్ వద్ద కన్నడ భాషా సంఘాల కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. పొర్లుదండాలు పెట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమిళనాడుకు నీటి విడుదల ఆపివేయాలని డిమాండ్ చేశారు. ఎంతసేపటికీ ఆందోళన విరమించకపోవడంతో పోలీసులు పలువురిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అంతకుముందు ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో వాహనాలను దారి మళ్లించారు.


పొర్లు దండాలతో రాస్తారోకో చేస్తున్న కన్నడ భాషా సంఘాల కార్యకర్తలు

కోలారు వార్తలు...

విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలి

కోలారు: విద్యా రంగంలోని సమస్యల పరిష్కారానికి ప్రామాణిక ప్రయత్నం చేయాలని సాహితీవేత్త బరగూరు రామచంద్రప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని చెన్నయ్య రంగమందిరంలో నిర్వహించిన కన్నడ ఉపాధ్యాయులకు ఒకరోజు సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రమబద్ధంగా ప్రణాళికను రూపొందించుకుని రాబోయే రోజుల్లో విద్యా రంగం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలు దశల వారీగా పరిష్కరించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 52 వేల పైచిలుకు పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. విద్యాశాఖలో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రామాణిక ప్రయత్నం చేయాలన్నారు. జెడ్పీ ఉప కార్యదర్శి శివకుమార్, డీఈఓ కృష్ణమూర్తి, కసాప జిల్లా గౌరవ కార్యదర్శి ఆర్.శంకరప్ప, పాత్రికేయుడు కెఎస్ గణేష్ పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న దృశ్యం

వార్డు సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

- స్థానికులకు తప్పని తిప్పలు

కోలారు: నగరంలోని 19వ వార్డులో పలు సమస్యలు తిష్టవేసి సమస్యలను పరిష్కరించడంలో నగరసభ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. వార్డులో ఎక్కడ చూసినా దర్శనం ఇస్తున్న చెత్తను తీయడంలో నగరసభ సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెత్త పేరుకోవడం వల్ల దోమలు పెరిగి స్థానికులు అనారోగ్యాల పాలవుతున్నారని వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీల్లో మురికి నీరు నిండిపోయి రోడ్డు పైకి ప్రవహిస్తున్నా నగరసభ అధికారులు మాత్రం కళ్లున్నా చూడలేని స్థితిలో ఉన్నారన్నారు. స్థానిక సమస్యల గురించి నగరసభ దృష్టికి పలుమార్లు తెచ్చినా ప్రయోజనం లేదన్నారు. స్థానికంగా ఉన్న అంజుమన్ విద్యా సంస్థ ఎదురుగా ఉన్న పైవంతెన కింద చెత్త పేరుకుపోయిందని కనీసం నెలరోజులకోమారు అయినా చెత్తను తొలగించరని వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరిచి వార్డులో సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.


పైవంతెన కింద పేరుకు పోయిన చెత్త చెదారం

యాదవులు సంఘటితం కావాలి

కోలారు: యాదవ సముదాయం సంఘటితంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు నారాయణస్వామి తెలిపారు. బుధవారం నిర్వహించిన శ్రీకృష్ణ జయంతి పల్లకీల ఊరేగింపును ప్రారంభించి మాట్లాడారు. యాదవ యువత ముందుకు వచ్చి సముదాయానికి జరుగుతున్న అన్యాయాలపై గళమెత్తాలన్నారు. సముదాయ ప్రజలందరూ ఐకమత్యంగా ఉంటేనే సంఘం బలపడుతుందన్నారు. ఒకే సముదాయానికి చెందిన గోవులను సాకుతున్న యాదవులు, గొర్రెలు మేపుతున్న కురుబలు అందరూ కలిసిమెలిసి ఉండాలన్నారు. దాదాపుగా పాడి పరిశ్రమపైనే ఆధారపడి యాదవ సముదాయం గోవులను గోమాతగా భావించి పూజిస్తోందన్నారు. శ్రీకృష్ణ జయంతి సందర్భంగా జిల్లాలో మంచి వానలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. సీఎంఆర్ శ్రీనాథ్, బణకనహళ్లి నటరాజ్‌తో పాటు సముదాయ ప్రముఖులు పాల్గొన్నారు.


పల్లకీ ఊరేగింపు దృశ్యం

పండుగల్లో శాంతిని కాపాడాలి


మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్ గోఖలె

కంప్లి: ఎలాంటి కుల, మత, ధర్మ బేధాలు లేకుండా పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని తోరణగల్లు డీఎస్పీ ప్రసాద్ గోఖలె సలహా ఇచ్చారు. గణేష్ చతుర్థి, ఈద్ మిలాద్ పండుగల సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన శాంతి సమావేశంలో ఆయన మాట్లాడారు. గణపతి ప్రతిష్ఠాపన నిమజ్జనాల సందర్భంగా ప్రజలకు ఇబ్బంది కల్గించే కార్యక్రమాలు జరపరాదన్నారు. గణపతి ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

వేతన బకాయిల కోసం ధర్నా


ఆందోళన చేస్తున్న కార్మికులు

రాయచూరు రూరల్: నగరసభలో కాంట్రాక్ట్ పౌరకార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని జిల్లా పౌర కార్మికుల విభాగం డిమాండ్ చేసింది. బుధవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి అధ్యక్షుడు మారెప్ప మాట్లాడారు. నగరంలో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా అధికారులు నేటికీ ఇవ్వడం లేదన్నారు. కార్మికులకు వారం రోజుల్లో కనీస వేతనాలు అందజేసి వారిని పర్మినెంట్ చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం అందించారు.

కేబుల్ వైర్ దొంగల హల్‌చల్

- పట్టించుకోని పోలీసులు

తుమకూరు: కొరటగెరె తాలూకా కోళాల పోలీసు స్టేషన్ పరిధిలోని వ్యవసాయ తోటల్లో చోరీలు విపరీతంగా జరుగుతున్నాయి. బోరు బావుల కేబుల్ వైర్లను దుండగులు తస్కరిస్తున్నారు. ఫిర్యాదు చేస్తే పోలీసులు స్పందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాలూకాలోని కోళాల పోలీసుస్టేషన్ పరిధిలోని నీలగొండనహళ్లి, ఎలెరాంపుర, వజ్జనకురికె, కోళాల గ్రామం పంచాయతీ పరిధిలో 25 మందికి పైగా రైతులకు చెందిన కేబుల్ తీగలు చోరీకి గురయ్యాయి. సుమారు రూ. 10 లక్షల విలువ చేస వైర్లు దొంగతనానికి గురైతే పోలీసులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకట్రెండు మాత్రమే కేసులను నమోదు చేశారని, మిగిలిని ఫిర్యాదులపై గ్రామ పంచాయతీ సభ్యులతో మాట్లాడి కేసులు పెట్టనీయకుండా పోలీసులు ఒత్తిడి చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇప్పటివరకు దొంగలను పట్టుకోకపోగా, కేసులు కూడా నమోదు చేయలేదని విమర్శిస్తున్నారు.

ప్రథమ చికిత్సతో ప్రాణరక్షణ సాధ్యం


పాఠశాలకు ప్రథమ చికిత్స కిట్లను అందిస్తున్న దృశ్యం

కోలారు: అత్యవసర వైద్య పరిస్థితుల్లో ప్రథమ చికిత్సతో వ్యక్తి ప్రాణాలను కాపాడవచ్చని భారతీయ రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా సభాపతి డాక్టర్ ఎన్.గోపాలకృష్ణ తెలిపారు. బుధవారం తాలూకాలోని అరాభికొత్తనూరు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన విశ్వప్రథమ చికిత్సా దినోత్సవాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. వైద్య అత్యవసర పరిస్థితులపై ప్రతి ఒక్కరూ తగిన అవగాహన కలిగి ఉండాలన్నారు. సంస్థ జిల్లా ఉపసభాపతి ఆర్ శ్రీనివాసన్ మాట్లాడుతూ ఆస్పత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య అత్యవసర పరిస్థితులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. హెచ్ఎం సిద్దేశ్వరి, రెడ్‌క్రాస్ కార్యవర్గ సభ్యుడు శీనప్ప, సీఎల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

న్యాయసేవలు వినియోగించుకోండి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: ప్రజలు న్యాయ సేవా ప్రాధికార అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సెషన్స్ జడ్జి సునీల్ ఎస్.హొసమని తెలిపారు. మంగళవారం పాత్రికేయుల భవనంలో నిర్వహించిన న్యాయ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు ఆలస్యం అయితే ప్రాధికారకు, పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులపై త్వరగా స్పందించకపోయినా ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో లోకాయుక్త డీఎస్పీ బీకే ఉమేష్, క్యాన్ అధ్యక్షురాలు మల్లమ్మ, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.మునేగౌడ, కార్యదర్శి ఎస్.భైరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రమణీయం బాబాబుడాన్‌గిరి కొండలు

బనశంకరి: మనసును పరవశింపజేసే పర్వతాలు, జలపాతాలు, కురుంజి పుష్పాల పరిమళాలు, ఆధ్యాత్మికతను పంచే యాత్రాస్థలాలు కొలువైన చిక్కమగళూరు జిల్లాకు ఉత్తరదిక్కున పశ్చిమకనుమల్లో 40 కిలోమీటర్ల దూరంలో బాబాబుడాన్‌గిరి కొండలు పర్యాటకులను విశేషంగా ఆలరిస్తున్నాయి. ఈ పర్వతశ్రేణిని హజ్రత్‌దాదా హయాత్‌ఖలందర్(బాబాబుడాన్ అని పిలుస్తారు) ఇది హిందూ, ముస్లింలకు పవిత్ర యాత్రా స్థలం. ఈ పర్వతశ్రేణిని దత్తగిరి కొండశ్రేణి అని కూడా పిలుస్తారు. హిమాలయాలు, నీలగిరి పర్వతాల మధ్య ఉన్న ఎత్తైన పర్వత శిఖరాల్లో ఇది ఒకటి. ముళ్లయ్యనగిరి పర్వత శ్రేణి నుంచి బాబాబుడాన్‌గిరి కొండల మధ్య ట్రెక్కింగ్ గొప్ప అనుభూతిని ఇస్తుంది. వీటి మధ్య కాలి బాటను సర్పదారి అంటారు. పాము ఆకారంలో ఈ మార్గం ఉంటుంది. దాదాపు 9 కిలోమీటర్ల మేర ట్రెక్కింగ్ చేయాల్సి ఉంటుంది. ఇందుకు ఐదు గంటల సమయం తీసుకుంటుంది. బాబాబుడాన్‌గిరి కొండలు 1895 మీటర్లు, ముళ్లయ్యనగిరి కొండలు 1930 మీటర్ల ఎత్తులో ఉన్నాయి. చంద్రుడు ఆకారంతో సహజంగా ఏర్పడటంతో ఈ పర్వత శ్రేణిని చంద్రదోణ పర్వతాలుగా పిలుస్తారు. కురింజి అనేది ఈ కొండల్లో ప్రతి 12 ఏళ్లకు ఒకసారి వికసించే ఒక ప్రత్యేకమైన పుష్పం. వీటిని వీక్షించడానికి ప్రపంచ నలుమూలల నుంచి వేల సంఖ్యలో పర్యాటకులు విచ్చేస్తుంటారు. ఇక్కడ దేవీరమ్మకొండ పురాతన పుణ్యక్షేత్రాన్ని చూడటానికి అడవి గుండా షికారు చేయవచ్చు.

గుహలు

బాబాబుడాన్‌గిరి సమీపంలో మూడు సిద్ధులచే పవిత్రం చేయబడిన మూడు పెద్ద గుహలు వాటిచి హ్నాలు గద్దిగెలు (సమాధులు) కలిగి ఉంటాయి. వాటి గౌరవార్థం ఇక్కడ వార్షికజాతర జరుగుతుంది.


బాబాబుడాన్‌గిరి పర్వతంపై ట్రెక్కింగ్ చేస్తున్న సాహసప్రియులు


12 ఏళ్లకు ఒకసారి వికసించే నీలకురింజీ పుష్పాలు


బాబాబుడాన్‌గిరి పర్వతం

జలపాతాలు

ఇక్కడికి కొద్ది దూరంలో గదా తీర్థం, నలికై తీర్థం, కామన తీర్థం అనే జలపాతాలున్నాయి. ఇవి అత్తిగుండి సమీపంలో ఉన్నాయి. అజ్ఞాత వాసంలో ఉన్నప్పుడు తన తల్లి దాహం తీర్చడానికి భీముడు తన గదను ఉపయోగించి గదా తీర్థంను సృష్టించినట్లు పురాణాల్లో ఉంది. బాబాబుడాన్‌గిరి కొండలపై మాణిక్యధార జలపాతం పర్యాటకులను కనువిందు చేస్తుంది.


మాణిక్యధార జలపాతం

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

- ప్రియుడు మృతి

దొడ్డబళ్లాపురం: ప్రేమ విఫలం కావడంతో ప్రేమికులు విషం తాగి ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన కనకపుర తాలూకాలో చోటుచేసుకుంది. కనకపుర తాలూకా చాముండిపుర గ్రామానికి చెందిన ప్రేమికులు తమిళనాడు సమీపంలోని కావేరి నది ప్రవాహంలో హొగేనకల్ జలపాతం వద్ద విషం తాగి ఆత్మహత్యాయత్నం చేయగా యువకుడు ఉమేశ్ (24) మృతిచెందగా, ప్రియురాలు (17)ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతోంది. ఉమేశ్, పీయూసీ ఫస్టియర్ చదువుతున్న గిరిజన మైనర్ బాలిక ప్రేమించుకున్నారు. విషయం తెలిసి పెద్దలు వ్యతిరేకించడంతో ఆగస్టు 9వ తేదీన ఇద్దరూ కనబడకుండా పోయారు. దీంతో వారు కోడిహళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హొగేనకల్ ఫాల్స్ వద్ద ప్రేమికులు విషంతాగి ఆత్మహత్యాయత్నం చేశారని తెలిసి పోలీసులు అక్కడికి వెళ్లారు. అప్పటికే ఉమేశ్ చనిపోయి ఉన్నాడు. అస్వస్థతకు గురైన బాలికకు ధర్మపురి ఆస్పత్రిలో చికిత్స అందించిన తరువాత బెంగళూరు కెంపేగౌడ ఆస్పత్రికి తరలించారు.


సంఘటనాస్థలంలో వివరాలు సేకరిస్తున్న కర్ణాటక పోలీసులు

మధ్యాహ్నమైతే ఆకలి కేకలే

- విద్యాశాఖ మంత్రి సొంతూరులోని పాఠశాలలో దుస్థితి
- అమలు కాని మధ్యాహ్న భోజన పథకం

శివమొగ్గ: స్వక్షాత్తు విద్యా శాఖ మంత్రి సొంతూరులోని ప్రభుత్వ పాఠశాల మధ్యాహ్న భోజనానికి నోచుకోలేదు. విద్యార్థులు ఇంటినుంచే క్యారియర్ తెచ్చుకోవాల్సి వస్తోంది. క్యారియర్ తెచ్చుకోలేని విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారు. శివమొగ్గ మహానగరలోని ఒకటో వార్డు సోమనకొప్పలోని మౌలానా ఆజాద్ మోడల్ ఇంగ్లిష్ మీడియం ప్రభుత్వ పాఠశాల మైనారీ సంక్షేమ శాఖ పర్యవేక్షణలో ఉంది. సుమారు రూ.2 కోట్ల ఖర్చుతో అత్యాధునిక భవంతిని కూడా నిర్మించారు. ఆరు నుంచి పదో తరగతి వరకు వంద మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. శివమొగ్గ నుంచి మాత్రమే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. ఇక్కడ చదివే విద్యార్థుల్లో చాలా మంది పేద, మధ్య తరగతి, కూలీ కార్మికుల పిల్లలే. కొత్త పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటుకు గది కూడా నిర్మించారు. అక్షర దాసోహ అధికారులు పాఠశాలకు వచ్చి పరిశీలించి వెళ్లారు. ఇప్పటివరకు మధ్యాహ్న భోజన పథకం మాత్రం అమలు కాలేదు. దీంతో పేద, మధ్య తరగతి పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


రూ.2 కోట్లతో నిర్మించిన మోడల్ స్కూల్

కుమారుడికి ప్రాణభిక్ష పెట్టండి

- చెట్టుపై నుంచి పడి స్పర్శ కోల్పోయిన డిగ్రీ విద్యార్థి
- చికిత్సకు డబ్బు లేక తల్లడిల్లుతున్న తల్లి
- దాతలు ఆదుకోవాలని వినతి

మండ్య: శరీర స్పర్శ కోల్పోయిన తమ కుమారుడి చికిత్సకు అయ్యే ఖర్చును దాతలు అందించాలని శ్రీరంగపట్టణ తాలూకా అరకెరె హోబళి మాద్రహళ్లి గ్రామానికి చెందిన సౌభాగ్య అనే మహిళ విజ్ఞప్తి చేసింది. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తన కుమారుడు రవికుమార్ శ్రీరంగపట్టణలోని ప్రభుత్వ కాలేజీలో బీఎస్సీ రెండో ఏడాది చదువుతున్నాడని, కొబ్బరి బొండం కోసం చెట్టు ఎక్కి కిందపడ్డాడన్నారు. నడుము కింద నుంచి స్పర్శ కోల్పోవడంతో నాలుగైదు నెలలుగా జిల్లాస్పత్రిలో చికిత్స చేయించామన్నారు. అయితే బెంగళూరు నిమ్హాన్స్ ఆస్పత్రికి వెళ్లాలని వైద్యులు సూచించినట్లు తెలిపారు. నాలుగైదు రోజుల చికిత్స తర్వాత నిమ్హాన్స్ వైద్యులు ఫిజియోథెరపీ చేయించుకోవాలన్నారు. కడు పేదరికంలో, సొంత ఇల్లు కూడా లేని, భర్త చనిపోయిన తాను రవి కుమార్‌ను ఎలా కాపాడుకోవాలో తెలియడం లేదన్నారు. కూలీ చేసుకుంటూనే తన కుమార్తెకు పెళ్లి చేసినట్లు తెలిపింది. తన కుమారుడు చికిత్స కోసం ఆర్థిక సాయం అందించాలని వేడుకుంది.


ఆదుకోవాలని కోరుతున్న సౌభాగ్య, చిత్రంలో కుమారుడు రవికుమార్

విశ్రాంత ఏఎస్‌ఐను బెదిరించి టోపీ

- నిందితుడి అరెస్ట్

మైసూరు: విశ్రాంత ఏఎస్సైని బ్లాక్‌మెయిల్ చేసి డబ్బు దండుకున్నాడో దుండగుడు. చివరికి ఆ నిందితుడిని కువెంపునగర పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు..విశ్రాంత ఏఎస్సై దేవయ్య ఈనెల 2న కువెంపునగర కాంప్లెక్స్ వద్ద కారులో వెళుతుండగా హఠాత్తుగా బైక్ అడ్డుగా వచ్చింది. దీంతో దేవయ్య కారు ఆపాడు. 'నా స్నేహితుడిని ఢీ కొట్టి వచ్చావు.. అతనికి కాలికి గాయమైంది. చికిత్స చేయించాలి. అందుకు డబ్బులు ఇవ్వాలి' అని ఆ బైకిస్టు బ్లాక్‌మెయిల్ చేశాడు. నీ స్నేహితుడి వద్దకే వెళ్దాం పదా అని చెప్పినా వినలేదు. చివరికి దేవయ్య వద్ద నుంచి రూ. 40 వేలు వసూలు చేశాడు. ఆ తర్వాత దేవయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కువెంపునగర పోలీసులు సంఘటన స్థలంలోని సీసీటీవీ కెమెరా ఫుటేజీలను పరిశీలించి నిందితుడిని మైసూరు రాజేంద్ర నగర నివాసి జమీల్ ఖాన్‌గా గుర్తించి అరెస్టు చేశారు. నిందితుడు గతంలో కూడా పలువురి నుంచి డబ్బు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు.

మంత్రి సుధాకర్‌కు వ్యతిరేకంగా జేడీఎస్ ధర్నా

బనశంకరి: దళితులకు చెందిన భూమిని కబ్జా చేయడం, వారిపై దాడికి పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రి డీ.సుధాకర్‌కు వ్యతిరేకంగా బెంగళూరు జేడీఎస్ మహానగర జనతాదళ్ సభ్యులు బుధవారం ఫ్రీడంపార్కులో ధర్నాకు దిగారు. మంత్రిని తక్షణం అరెస్ట్‌చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రిపై కులనిందన కేసు నమోదు కావడంతో అతను తక్షణం మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈకేసులో హోంమంత్రి పరమేశ్వర్ జోక్యం చేసుకున్నారని, దర్యాప్తు పారదర్శకంగా జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. జేడీఎస్ బెంగళూరు మహానగర అధ్యక్షుడు హెచ్.ఎం.రమేశ్‌గౌడ, పార్టీ సీనియర్ నేతలు, మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య


నవీన్‌కుమార్ మృతదేహం

చింతామణి: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని కోనపల్లి గ్రామం వద్ద జరిగింది. పోలీసులు వెళ్లి పరిశీలించారు. మృతుడిని కోనపల్లి గ్రామానికి చెందిన నవీన్‌కుమార్(25)గా గుర్తించారు. చిక్కబళ్లాపుర నుంచి కోలారుకు వెళుతున్న రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించారు. నవీన్‌కుమార్‌కు రెండు నెలల క్రితం జరిగిన బైక్ ప్రమాదంలో తలకు గాయాలయ్యాయని, అప్పటినుంచి మతి స్థిమితం సరిగా లేదని తండ్రి మునిరాజ్ తెలిపినట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి

బనశంకరి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు బెంగళూరు దక్షిణ ఎమ్మెల్యే ఎం.కృష్ణప్ప తెలిపారు. అరెహళ్లి ఏజీఎస్. లేఔట్‌లోని ఉన్నత పాఠశాలలో బుధవారం ఐదు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 1500 మందికి శ్రీకృష్ణ విద్యాసంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఎం.రుక్మాంగదనాయుడుతో కలిసి బ్యాగులు, పుస్తకాలు అందజేశారు.

అనంతరం ఎం.రుక్మాంగదనాయుడు మాట్లాడుతూ అరెహళ్లి, కత్రిగుప్పె, కదిరేనహళ్లి, చెన్నసంద్ర, బంగారప్పనగరలోని ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

ప్రాథమిక విద్యాశాఖ డైరెక్టర్ ప్రసన్నకుమార్, శ్రీకృష్ణ విద్యాసంస్థ డైరెక్టర్ ఎస్‌పీ.మనోహర్, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉషాకుమారి, ప్రొఫెసర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాలు, బ్యాగులు అందుకున్న విద్యార్థులతో రుక్మాంగదనాయుడు, ఎమ్మెల్యే ఎం.కృష్ణప్ప

రెండు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

క్రిష్ణగిరి: క్రిష్ణగిరి, హోసూరు ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. వివరాల మేరకు కావేరిపట్టణం ప్రాంతానికి చెందిన మురుగన్ భార్య గీత (35). ఆమె బస్సులో ప్రయాణిస్తుండగా స్పీడ్ బ్రేకర్ వద్ద బస్సు వేగంగా వెళ్లడంతో సీటు తగిలి గాయపడింది. తీవ్ర గాయాలేర్పడిన ఆమెను చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చనిపోయింది. క్రిష్ణగిరి తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు.

కడలూరు జిల్లా నైవేలి ప్రాంతానికి చెందిన ప్రకాష్ (38) హోసూరు పారిశ్రామిక ప్రాంతంలో నివాసముంటూ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ వచ్చాడు. గత రెండు రోజుల క్రితం ద్విచక్రవాహనంలో వెళుతుండగా బైక్ ఢీకొట్టింది. తీవ్ర గాయాలేర్పడిన ప్రకాష్‌ను స్థానికులు ఆస్పత్రికి తీసుకెళ్లగా ఫలితం లేక మృతి చెందాడు. ఉద్దనపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

కారుతో ఢీకొట్టి అవ్వను చంపేశాడు

- మనవడి ఘాతుకం
- మలుపు తిరిగిన రోడ్డు ప్రమాదం కేసు

యశవంతపుర: బైకును కారు ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన మలుపు తిరిగింది. మనవడే ఆమెను కారుతో ఢీకొట్టి హత్యచేసినట్లు పోలీసులు తేల్చారు. బాగలకోటె చిక్కూరు క్రాస్ వద్ద గత నెల 20న రాత్రి 8 మంటల సమయంలో బైకును కారు ఢీకొంది. బాగలకోటె తాలూకా ఖజ్జిడోణి గ్రామానికి చెందిన తాయవ్వ అరకేరి(68)కి, మనవడు గుండప్పకు మధ్య భూ వివాదం ఉంది. ఇటీవల తాయవ్వకు అనుకూలంగా కోర్టు తీర్పు వచ్చింది. అయితే మనవడు ఆమెకు భూమి అప్పగించలేదు. దీంతో ఆమె గుండప్పపై ముధోళ లోకాపుర పోలీసుస్టేషన్‌లో గతనెల 20న ఫిర్యాదు చేశారు. తాయవ్వ తన కొడుకుతో కలిసి బైక్‌పై వెళ్తుండగా చిక్కూరు క్రాస్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. గాయపడిన తాయవ్వను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ 28న మృతిచెందింది. అయితే ప్రమాదం జరిగిన తర్వాత మనవడు గుండప్ప అరకేరి(25) ఇంటికి వెళ్లలేదు. అనుమానం వచ్చి బంధువు మంజునాథ ఉదగట్టి పోలీసులకు ఫిర్యాదు చేయగా కారుతో ఢీకొట్టి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో బయట పడింది. దీంతో పోలీసులు గుండప్పను అరెస్ట్ చేశారు.


హతురాలు తాయవ్వ (ఫైల్)

క్లుప్తంగా

మంత్రి సుధాకర్ రాజీనామా చేయాలి


ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

శివమొగ్గ: మంత్రి డి.సుధాకర్‌కు వ్యతిరేకంగా పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైనందున ఆయన వెంటనే రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఈమేరకు నాయకులు బుధవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడిన మంత్రి ఆ పదవిలో ఉండేందుకు అర్హులు కాదని ఆరోపించింది. ఆందోళనలో బీజేపీ జిల్లాధ్యక్షుడు టీడీ మేఘరాజ్ పాల్గొన్నారు.

చెల్లెలిపై అన్నదాడి


చెల్లిపై దాడిచేస్తున్న అన్న రాజన్న

దొడ్డబళ్లాపురం: భూవివాదం నేపథ్యంలో స్వంత చెల్లెలిపై అన్న నడి వీధిలో దాడిచేసి చితకబాదాడు. ఈ దృశ్యాలు మొబైల్‌లో చిత్రీకరించిన స్థానికులు సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్‌గా మారాయి. కురిదొడ్డి గ్రామానికి చెందిన రాజన్నకు, చెల్లెలు జయమ్మకు మధ్య కొంత కాలంగా భూవివాదం ఉంది. ఈక్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. ఓ దశలో రాజన్న జయమ్మను నడివీధిలోకి తీసుకొచ్చి దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదుతో ఎంకే దొడ్డి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కళోత్సవంలో ప్రతిభ


గురువు దివ్యా శివనారాయణ్‌తో సృజన

గౌరిబిదనూరు: జిల్లా స్థాయి సంప్రదాయిక కళల ప్రదర్శనలో పట్టణంలోని సుమంగళి కాలనీకి చెందిన చిదానంద, దాక్షాయిణి దంపతుల రెండో కుమార్తె సృజన ప్రతిభ చాటింది. స్థానిక బీజీఎస్ కళాశాలలో పీయూసీ పూర్తీ చేసింది. అనేక జాతీయస్థాయి, రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటింది. ప్రస్తుతం చిక్కబళ్లాపురంలో జరిగిన కళోత్సవంలో నగదు పారితోషికంతో పాటు ప్రశస్తి పత్రాన్ని పొందింది. బాలికను గురువైన దివ్యా శివనారాయణ్ అభినందించారు.

కారు చక్రాల దొంగల అరెస్టు


స్వాధీనం చేసుకున్న కారు చక్రాలు

మైసూరు: మైసూరు నగరంలో ఇళ్ల ముందు నిలిపి ఉన్న కార్లనుంచి చక్రాలను దొంగతనం చేస్తున్న నిందితులు పట్టుబడ్డారు. సిద్ధిక్ (24), షారుఖ్ ఖాన్ (25), సక్లైన్ ముస్తాక్ (24) అనే నిందితులను కువెంపునగర పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులనుంచి రూ. 2.56 లక్షల విలువ చేసే 12 కార్ల టైర్లు, 3 బైక్‌లు, ఒక మారుతీ వ్యాన్ స్వాధీనం చేసుకున్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి

గౌరిబిదనూరు: విద్యార్థులు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని టౌన్ ఎస్ఐ గోపాల్ సూచించారు. పట్టణంలోని 4వ వార్డులో ఉన్న ఐటీఐలో మంగళవారం ఆయన విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎక్కడ పడితే అక్కడ తిరగడం, గుంపులుగా చేరి అసభ్య పదజాలంతో మాట్లాడడం, చెడుగా ప్రవర్తించడం వంటివి చేయరాదన్నారు. క్రమశిక్షణతో మెలగాలన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే భవిష్యత్‌లో ఉద్యోగ అన్వేషణ సమయంలో సమస్యగా పరిణమిస్తుందన్నారు.

మద్యం సేవించి ర్యాష్ డ్రైవింగ్

మండ్య: మద్యం మత్తులో కారును నడపడంతో పలు వాహనాలు ఢీ కొట్టుకున్నాయి. ప్రమాదంలో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన పేటె వీధిలో జరిగింది. మహమ్మద్ అనే వ్యక్తి మత్తులో కారును హొళలు సర్కిల్ నుంచి అతివేగంగా నడుపుతూ జైన్‌వీధిలో రైల్వే లెవెల్ క్రాసింగ్ పనులు నిర్వహిస్తున్న స్థలానికి వచ్చాడు. ముందున్న బ్యారికేడ్, పట్టాలను చూసి వెనక్కి రివర్స్ చేశాడు. దీంతో వెనుక ఉన్న వాహనాలను ఢీ కొట్టాడు. అక్కడే టీ విక్రయించే వ్యక్తిని కూడా ఢీకొన్నాడు. స్థానికులు పట్టుకుందామని చూసినా ఆపకుండా కారును వేగంగా నడుపుకుంటూ వెళ్లాడు. ఈ సమయంలో పలు వాహనాలను ఢీ కొట్టాడు. ఈ క్రమంలో స్థానికులు అతన్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

తల్లిని కడతేర్చిన తనయుడు

యశవంతపుర: మద్యానికి డబ్బు ఇవ్వలేదని తనయుడు తల్లిని కొడవలితో నరికి చంపేశాడు. ఈ ఘటన బీదర్ పట్టణంలో మంగళవారం జరిగింది. నగరంలోని చెట్టివీధిలో శకుంతలా రాజకుమార్ శింధె అనే మహిళ తన కుమారుడు దీపక్‌తో కలిసి నివాసం ఉంటోంది. దీపక్ మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రోజు దీపక్ మత్తులో ఇంటికి వచ్చి డబ్బు కోసం తల్లితో గొడవ పెట్టుకున్నాడు. ఓ దశలో కొడవలితో ఆమెను తలపై నరికాడు. గాయపడిన ఆమెను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి


నుజ్జునుజ్జయిన బైకు

యశవంతపుర: కారు, టిప్పర్, బైకులు వరుసగా ఢీకొని దంపతులు మృతి చెందిన ఘటన చిక్కమగళూరు తాలూకా హిరేగౌజ సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. శివమొగ్గకు చెందిన సయ్యద్ ఆసీఫ్(38), మాజీనా(33)లు మృతి చెందగా, 14 నెలల చిన్నారి తీవ్రమైన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దంపతులు చిక్కమగళూరు నుంచి శివమొగ్గకు బైక్‌పై వెళ్తుండగా వరుస ప్రమాదాలు జరిగాయి. సఖరాయపట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన వాహనం

- మహిళకు తీవ్ర గాయాలు

తుమకూరు: టాటా ఏస్ వాహనం ఓ దుకాణంలోకి దూసుకెళ్లగా మహిళకు తీవ్రంగా గాయాలయ్యాయి. ఈ ఘటన కుణిగల్ తాలూకా హుళియారు దుర్గ వద్ద జరిగింది. శృంగసాగర రోడ్డు వద్ద మంజుల అనే మహిళ దుకాణం ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తోంది. బుధవారం అతివేగంగా వచ్చిన టాటా ఏస్ వాహనం దుకాణంలోకి దూసుకొచ్చింది. మంజులకు కాలు విరిగిపోగా మండ్య ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ వాహనాన్ని వదిలేసి ఉడాయించాడు. హుళియారు దుర్గ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

హోసూరు వార్తలు..

కావేరి జలాలపై నిరసన

- సరిహద్దుల్లో ఉద్రిక్తత

హోసూరు: కర్ణాటకలో కావేరి నది నుంచి తమిళనాడుకు నీటి విడుదల చేయడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం కన్నడ సంఘాలు తమిళనాడు – కర్ణాటక సరిహద్దు అత్తిపల్లి సరిహద్దుల వద్ద ఆందోళన చేశారు. కన్నడ చళువళి వాటాల్ సంఘం అధ్యక్షుడు వాటల్ నాగరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ ఆందోళనలో కావేరి నదిలో తమకు తాగడానికే నీరు లేదని, తమిళనాడుకు సాగు నీరు ఎలా వదలాలని అన్నారు. వర్షాలు కురిసే వరకు కావేరి నది నుంచి చుక్క నీరుకూడా వదలమని తలపై ఖాళీ బిందెను పట్టుకొని నినాదాలు చేశారు. మహిళలు సీఎం స్టాలిన్ చిత్రాలను చించి నిరసన తెలిపారు. ఇరురాష్ట్రాల పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. కర్ణాటక పోలీసులు నిరసనకారులను అరెస్టు చేసి తరలించారు. ధర్నాతో హోసూరు– బెంగళూరు జాతీయ రహదారిపై కొద్దిసేపు ఉద్రిక్తత ఏర్పడింది.


సీఎం స్టాలిన్ చిత్రాలను చించేస్తున్న మహిళలు

కేంద్రానికి వ్యతిరేకంగా ధర్నా

హోసూరు: దేశంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అండగా ఉంటూ సాధారణ ప్రజలపై ఎనలేని భారం మోపుతోందని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం నేర్పాలని డిమాండ్ చేస్తూ బుధవారం హోసూరులోని ప్రధాన తపాలా కార్యాలయం ముందు సీపీఐ పార్టీ ఆందోళన చేపట్టింది. క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి, తళి ఎమ్మెల్యే టి. రామచంద్రన్ ధర్నాలో మాట్లాడుతూ 2014 నుంచి దేశంలో నిత్యావసర ధరలతో పాటు పెట్రోల్, డీసెల్, వంటగ్యాస్ ధరలను పెంచి ప్రజల ఆర్థిక వ్యవస్థను కూల్చివేశారని ఆరోపించారు. మోదీకి వ్యతిరేకంగా ఢిల్లీలో రైతులు ఆందోళన చేసి 600 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని అన్నారు. ధర్నాలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆందోళన నిర్వహిస్తున్న సీపీఐ కార్యకర్తలు

ఉద్యోగుల సమ్మె


బోసిపోయిన కెలమంగలం సమితి కార్యాలయం

కెలమంగలం: డిమాండ్లను నెరవేర్చాలని బుధవారం బీడీవో కార్యాలయ ఉద్యోగులు విధులు బహిష్కరించారు. తమిళనాడు గ్రామీణాభివృద్ధి శాఖలో ఖాళీలను భర్తీ చేయాలని, స్థానికులకే ఉద్యోగాలు కేటాయించాలని, వేతనాలు పెంచాలని, గ్రామపంచాయతీలు, యూనియన్‌లను విభజించాలని తదితర 16 డిమాండ్లను ప్రస్తావించారు. కాగా, కెలమంగలం, తళి కార్యాలయాల్లో పనుల మీద వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

బైకిస్టు మృతి

దొడ్డబళ్లాపురం: దొడ్డ గ్రామీణ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మారసంద్రకు చెందిన కిశోర్‌కుమార్(35) అనే యువకుడు మృతి చెందాడు. బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం రాత్రి బెంగళూరు నుంచి రైలులో వచ్చి బైక్‌పై వెళ్తూ ఇంటికి వెళ్తూ నవోదయ పాఠశాల వద్ద రోడ్డుపక్కన నిలిపి ఉన్న సిమెంట్ బంకర్‌ను ఢీకొన్నాడు.ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదైంది.

కార్పొరేటర్ రూ.20 లక్షల సాయం

హోసూరు: హోసూరు పారిశ్రామికవాడ జూజువాడి ప్రాంతంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం మనకు మనమే పథకం ద్వారా ఆ ప్రాంత కార్పొరేటర్, విద్యా కమిటీ అధ్యక్షులు శ్రీధర్ తన సొంత నిధిగా రూ. 20 లక్షల ఆర్థిక సాయాన్ని కార్పొరేషన్ యంత్రాంగానికి అందజేశారు. హోసూరు కార్పొరేషన్ పరిధిలోని 2వ వార్డు మారుతి నగర్, బిటిఆర్ నగర్ ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. దీంతో మురికి నీటి సమస్య పరిష్కరించేందుకు స్థానిక ప్రజల భాగస్వామ్య నిధిగా రూ. 2లక్షలను బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ ఎస్.ఏ.సత్యకు అందజేశారు.

ఆర్చ్‌ల నిర్మాణం ప్రారంభం

హోసూరు: హోసూరు తేరుపేటలో ప్రసిద్ది పొందిన శ్రీ చంద్రచూడేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో రెండు చోట్ల ఆర్చ్‌ల నిర్మాణాలకు బుధవారం భూమిపూజ చేశారు. పట్టణంలోని చంద్రచూడేశ్వర స్వామి ఆలయానికెళ్లే మార్గంలో ఆర్.వి.ప్రభుత్వ బాలుర పాఠశాల వద్ద, విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద రెండు చోట్ల ముఖ ద్వారాలు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వచ్చారు. ఈ విషయంపై స్పందించిన అధికార్లు సామాజిక సంక్షేమ శాఖ ద్వారా రూ. 50 లక్షల నిధులను మంజూరు చేశారు. ఈ నిధులతో బుధవారం బీజేపీ క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా అధ్యక్షతన ఎం.నాగరాజ్ అధ్యక్షతన భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు.



'స్కిల్' కుంభకోణం కుట్రదారు చంద్రబాబే

- సీమెన్స్ కంపెనీకి తెలియకుండానే ఆ కంపెనీ పేరుతో బురిడీ • ఆ విషయాన్ని స్పష్టం చేసిన సీమెన్స్ కంపెనీ • సీఐడీ అదనపు డీజీ సంజయ్ వెల్లడి

సాక్షి, అమరావతి: 'టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణం ప్రధాన కుట్రదారుడు చంద్రబాబు నాయుడే. సీమెన్స్ కంపెనీకి తెలియకుండానే ఆ కంపెనీ పేరుతో ఒప్పందం కుదుర్చుకున్నట్టుగా మోసపూరితంగా వ్యవహరించారు. కేబినెట్ ఆమోదం లేకుండా ఏపీఎస్ఎస్‌డీసీ ఏర్పాటు నుంచి నిబంధనలకు విరుద్ధంగా నిధుల విడుదల వరకు ఆయనే సర్వం తానై వ్యవహరించారు. ప్రజాధనాన్ని కొల్లగొట్టేందుకు ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఫైళ్లలో ఏ–1 చంద్రబాబు 13 చోట్ల సంతకాలు చేశారు. ఏ–2 అప్పటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంతకాలు అయిదు చోట్ల ఉన్నాయి' అని సీఐడీ అదనపు డీజీ సంజయ్ వెల్లడించారు. వెలగపూడిలోని సచివాలయంలో సీఐడీ ఎస్పీ ఫక్కీరప్పతో కలసి బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్ట్ గురించిగానీ ఒప్పందం గురించిగానీ తమకు తెలియదని సీమెన్స్ కంపెనీయే ఈ మెయిల్ ద్వారా న్యాయస్థానంలో 164 సీఆర్‌పీసీ వాంగ్మూలం ద్వారా స్పష్టం చేసిందని తెలిపారు. ఈ కుంభకోణం ద్వారా అక్రమంగా మళ్లించిన రూ.371 కోట్లలో షెల్ కంపెనీల ద్వారా రూ.241 కోట్లు చంద్రబాబుకే చేరాయన్నారు. సీఐడీతోపాటు సమాంతరంగా దర్యాప్తు జరిపిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా ఈ ప్రాజెక్ట్ పేరిట షెల్ కంపెనీల ద్వారా నిధులు కొల్లగొట్టారని నిర్ధారించిందని చెప్పారు. విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం ఈ కేసును పది గంటలపాటు సుదీర్ఘంగా విచారించి.. చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారని పూర్తి ఆధారాలు ఉన్నాయని సంతృప్తి చెందాకే ఆయనకు రిమాండ్ విధించిందన్నారు. సీఐడీ అదనపు డీజీ సంజయ్ ఇంకా ఏం చెప్పారంటే..

కుంభకోణం సూత్రధారి చంద్రబాబే

- కేబినెట్ ఆమోదం లేకుండానే రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ)ను చంద్రబాబు ఏర్పాటు చేశారు. ఆ కార్పొరేషన్ పేరిట ప్రజాధనం కేటాయింపు అంతా గంటా సుబ్బారావు అనే ప్రైవేటు వ్యక్తి చేతిలో పెట్టారు. అందుకోసం ఆయనకు ఏకంగా నాలుగు పోస్టులు కట్టబెట్టారు. ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ–ఈసీవోగా మొదట నియమించి, అనంతరం ఉన్నత విద్యా శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి, స్కిల్ డెవలప్‌మెంట్–ఇన్నోవేషన్ శాఖ కార్యదర్శి పోస్టుతోపాటు ఏకంగా సీఎం ఎక్స్ అఫీషియో కార్యదర్శిగా కూడా నియమించారు.



- డిప్యూటీ సీఈవోగా అపర్ణను నియమించారు. ఆమె భర్త సీమెన్స్ కంపెనీలో డైరెక్టర్‌గా ఉన్నారు. ఇది పరస్పర ప్రయోజనాల కిందకు వస్తుంది. ఇక టీడీపీకే చెందిన జె.వెంకటేశ్వర్లు అనే చార్టెడ్ అకౌంటెంట్‌కు ఏపీఎస్ఎస్‌డీసీలో పోస్టు కట్టబెట్టారు. ఉన్నత విద్యా శాఖను బైపాస్ చేశారు. ఎలాంటి ప్రాతిపదిక లేకుండా బడ్జెట్‌ను ఆమోదించారు. పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాలన్న ప్రతిపాదనను బేఖాతరు చేస్తూ ఏకపక్షంగా ఆరు చోట్ల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు ఏర్పాటు చేస్తామన్నారు.

సీమెన్స్ కంపెనీ పేరుతో మోసం

- టీడీపీ ప్రభుత్వంలో ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్ట్, అందుకోసం ఒప్పందం గురించి సీమెన్స్ కంపెనీకి తెలియనే తెలీదు. చంద్రబాబు కేవలం నిధులు కొల్లగొట్టడానికే ఆ కంపెనీ పేరును వాడుకుని మోసానికి పాల్పడ్డారు. జర్మనీలోని సీమెన్స్ ప్రధాన కార్యాలయాన్ని సంప్రదించగా అసలు ఆ జీవో గురించి, ఆ ఒప్పందం గురించి తమకు ఏమాత్రం తెలియదని వెల్లడించింది.
- ఏపీఎస్ఎస్‌డీసీ చెబుతున్న రూ.3,300 కోట్ల ప్రాజెక్ట్‌తో తమకు సంబంధం లేదని, ఆ ఒప్పందం గురించి తమకు ఏమాత్రం తెలియదని స్పష్టం చేసింది. తాము 90 శాతం నిధులను గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా ఇస్తామని ఎవరికీ చెప్పలేదని.. అసలు ఆ వ్యవహారంతో సీమెన్స్ కంపెనీకి సంబంధం లేదని తేల్చిచెప్పింది. ఈ మేరకు సీమెన్స్ కంపెనీ ఈ మెయిల్ ద్వారా వివరించడంతోపాటు న్యాయస్థానంలో 164 సీఆర్‌పీసీ కింద వాంగ్మూలం కూడా ఇచ్చింది.
- సీమెన్స్ కంపెనీ అంతర్గతంగా కూడా దర్యాప్తు నిర్వహించి వాస్తవాలను ఏపీఎస్ఎస్‌డీసీ, సీఐడీలకు అందించింది. భారత్‌లో సీమెన్స్ కంపెనీ ప్రతినిధిగా ఉన్న సుమన్ బోస్ మరికొందరు నిందితులతో కలసి జర్మనీలోని ప్రధాన కార్యాలయానికి తెలియకుండా ఈ కుట్రలో భాగస్వాములయ్యారని నిర్ధారించింది. ఈ మేరకు సుమన్‌బోస్, ఇతరులు డిలీట్ చేసిన ఈ మెయిల్స్, వాట్సాప్ మెసేజ్‌లు, మెసేజ్‌లు, ఇతర డాటాను రిట్రీవ్ చేసి సీఐడీకి అందించింది.
- డిజైన్ టెక్ కోరితే తాము రూ.58.80 కోట్ల విలువైన సాఫ్ట్‌వేర్‌ను మాత్రమే ఆ కంపెనీకి విక్రయించామని తెలిపింది. ఎవరైనా తమ వద్ద నుంచి సాఫ్ట్‌వేర్ కొనుగోలు చేసుకోవచ్చని, అంత మాత్రాన తాము ఆ ఒప్పందంలో భాగస్వాములమైనట్టు కాదని వెల్లడించింది.

రూ.3,300 కోట్లు ప్రాజెక్ట్‌గా నకిలీ ఒప్పందం

- సీమెన్స్ కంపెనీ ప్రధాన కార్యాలయం ఇచ్చిన వాంగ్మూలంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. కేవలం రూ.58 కోట్ల ప్రాజెక్ట్‌ను రూ.3,300 కోట్ల ప్రాజెక్ట్‌గా చూపిస్తూ చంద్రబాబు భారీగా ప్రజాధనాన్ని కొల్లగొట్టేందుకు పన్నాగం పన్నారు. అందుకోసమే జీవోకు విరుద్ధంగా నకిలీ ఒప్పందాన్ని తీసుకువచ్చారు. డిజైన్ టెక్ అనే కంపెనీని భాగస్వామిని చేశారు.
- సీమెన్స్ కంపెనీ నుంచి 90 శాతం నిధులు రావని తెలుసు. ఎందుకంటే వారికి అసలు ఒప్పందం గురించే తెలియదు. అందుకే ప్రభుత్వ వాటా 10 శాతం నిధులను నిబంధనలకు విరుద్ధంగా డిజైన్‌టెక్ కంపెనీకి చెల్లించి.. పీవీఎస్‌పీ అనే షెల్ కంపెనీకి మళ్లించి.. అక్కడి నుంచి వివిధ షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబు రూ.241 కోట్లు దక్కించుకున్నారు.

చంద్రబాబు ముఠా ద్వారా అక్రమ నిధుల తరలింపు

- షెల్ కంపెనీల ద్వారా దారి మళ్లించిన నిధులు చంద్రబాబు తన ముఠా మనుషుల ద్వారా పొందారు. చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, షాపూర్జీ–పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ పార్థసాని, షెల్ కంపెనీల సృష్టికర్త యోగేశ్ గుప్తా ఇందులో కీలక పాత్ర పోషించారు.
- డిజైన్‌టెక్‌కు చెల్లించిన రూ.371 కోట్లలో రూ.241 కోట్లు వివిధ షెల్ కంపెనీల ద్వారా యోగేశ్ గుప్తాకు చేరాయి. ఆయన ఆ రూ.241 కోట్లు డ్రా చేసి నగదును మనోజ్ పార్థసానికి ముంబయిలో అందించారు. మనోజ్ పార్థసాని ఆ రూ.241 కోట్ల నగదును హైదరాబాద్ తీసుకువచ్చి చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు అందించారు. ఆయన ఆ నగదును చంద్రబాబు బంగ్లాకు చేర్చారు.
- నిధుల తరలింపులో పాత్రధారులుగా వ్యవహరించిన పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ పార్థసాని, యోగేశ్ గుప్తాలే చంద్రబాబు ఇతర కుంభకోణాల్లోనూ నిధుల తరలింపులో కీలకంగా వ్యవహరించారు. అమరావతిలో తాత్కాలిక రాజధాని భవనాల నిర్మాణం, రాష్ట్రంలో టిడ్కో ఇళ్ల కాంట్రాక్టులు కట్టబెట్టిన కుంభకోణంలో నిధులను షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబుకు చేర్చారు.
- ఆ విషయం ఆదాయ పన్ను శాఖ దర్యాప్తులో వెల్లడైంది. దాంతో ఆదాయ పన్ను శాఖ మనోజ్ పార్థసాని, యోగేశ్ గుప్తా, పెండ్యాల శ్రీనివాస్‌లకు నోటీసులు జారీ చేసి వారి వాంగ్మూలాలను నమోదు చేసింది. తాము అక్రమ నిధులను చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కే అందించామని మనోజ్ పార్థసాని, యోగేశ్ గుప్తా వాంగ్మూలంలో స్పష్టం చేశారు. షెల్ కంపెనీల ద్వారా మళ్లించిన నిధులను వారిద్దరి నుంచి చంద్రబాబు తరపున తాను స్వీకరించానని పెండ్యాల శ్రీనివాస్ కూడా అంగీకరిస్తూ వాంగ్మూలం ఇవ్వడం గమనార్హం.

చంద్రబాబు ఒత్తిడితోనే రూ.371 కోట్లు విడుదల

- జీవోలో పేర్కొన్నట్టు రూ.3,300 కోట్ల ప్రాజెక్ట్‌లో గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా 90 శాతం వాటాలో ఒక్క రూపాయి కూడా రాలేదు. కానీ ప్రభుత్వ వాటా 10 శాతం జీఎస్టీతో కలిపి రూ.371 కోట్లను డిజైన్ టెక్ కంపెనీకి ఏకపక్షంగా విడుదల చేశారు. దీనిపై అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ విషయాన్ని నోట్ ఫైళ్లలో స్పష్టంగా పేర్కొన్నారు.
- కానీ నిబంధనలకు విరుద్ధంగా రూ.371 కోట్లు విడుదల చేయాలని అప్పటి సీఎం హోదాలో చంద్రబాబు ఆదేశించారు. అదే విషయాన్ని అధికారులు నోట్ ఫైళ్లలో స్పష్టంగా పేర్కొంటూ.. సీఎం చంద్రబాబు ఆదేశాలతోనే నిధులు విడుదల చేస్తున్నట్టు స్పష్టం చేశారు. అనంతరమే నిధులు విడుదల చేశారు.

షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబుకు రూ.241 కోట్లు

- డిజైన్ టెక్ కంపెనీకి విడుదల చేసిన రూ.371 కోట్లలో ఆ కంపెనీ సీమెన్స్ కంపెనీ నుంచి రూ.58.80 కోట్ల సాఫ్ట్‌వేర్‌ను కొనుగోలు చేసి అందించింది. మిగిలిన రూ.311 కోట్లను డిజైన్ టెక్ కంపెనీ వివిధ షెల్ కంపెనీలకు మళ్లించింది.
- వాటిలో షెల్ కంపెనీలకు కమీషన్లు పోగా, మిగిలిన రూ.241 కోట్లు చంద్రబాబుకు చేర్చారు. అంటే ఈ కుంభకోణం ద్వారా చంద్రబాబు రూ.241 కోట్లు అక్రమంగా కొల్లగొట్టారన్నది ఆధారాలతోసహా నిర్ధారణ అయ్యింది.

గుజరాత్ మోడల్ కాదు..

- యువతకు నైపుణ్యాభివృద్ధి కోసం గుజరాత్‌లో అమలు చేస్తున్న ప్రాజెక్ట్‌నే ఏపీలో అమలు చేశామని టీడీపీ చెబుతుండటం సరికాదు. అధికారుల బృందం గుజరాత్‌లో పర్యటించి అక్కడి ప్రాజెక్ట్‌ను పరిశీలించింది. కానీ అందుకు విరుద్ధంగా ఏపీలో ప్రాజెక్ట్‌ను రూపొందించింది.
- 90 శాతం గ్రాంట్ ఇన్ ఎయిడ్ అన్నది జీవోలో చూపించారు గానీ ఒప్పందంలో లేదు. ఇక పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేసి ఫలితాలను చూసి నిర్ణయం తీసుకుందామన్న అధికారుల ప్రతిపాదనను పట్టించుకోలేదు. కేవలం రూ.371 కోట్లు కొల్లగొట్టడానికే ఈ ప్రాజెక్ట్‌ను తెరపైకి తెచ్చారు.

నోట్ ఫైళ్లు మాయం

- ఈ కుంభకోణం బయట పడకూడదనే ఉద్దేశంతో ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన నోట్ ఫైళ్లను ఉద్దేశ పూర్వకంగా గల్లంతు చేశారు. ఏపీఎస్ఎస్‌డీసీ ఏర్పాటు జీవోకు సంబంధించిన నోట్ ఫైళ్లు, నిధుల విడుదలకు సంబంధించిన ఆదేశాల నోట్ ఫైళ్లను మాయం చేశారు. కానీ సీఐడీ వాటిని రిట్రీవ్ చేసింది.
- ఏపీఎస్ఎస్‌డీసీ ఏర్పాటు గురించి జీవో 4, సీమెన్స్‌తో ఒప్పందం గురించి జీవో 5 జారీ చేశారు. కానీ ఆ రెండు జీవోలకు సంబంధించిన నోట్ ఫైళ్లను మాయం చేశారు. కానీ జీవో 8 ద్వారా అంతకు ముందు ఇచ్చిన జీవోలు 4, 5 లోని అంశాలను సీఐడీ గుర్తించి వెలికి తీయడంతో ఈ కుంభకోణం వెనుక ఉన్న కుట్ర బయటపడింది.

ఈడీ దర్యాప్తులోనూ 'స్కిల్' కుంభకోణం బట్టబయలు

- ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్ట్ పేరిట షెల్ కంపెనీల ద్వారా నిధులు అక్రమంగా తరలించిన అంశంపై కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కూడా దర్యాప్తు చేపట్టింది. ఈ ప్రాజెక్ట్‌లో భారీగా అవినీతి జరిగిందని నిర్ధారించి ఇప్పటి వరకు డిజైన్‌టెక్ కంపెనీ ఎండీ వికాస్ వినాయక్ ఖన్వేల్కర్, సీమెన్స్ కంపెనీ భారత ప్రతినిధిగా గతంలో వ్యవహరించిన సుమన్‌బోస్‌లతోపాటు నలుగురిని అరెస్ట్ చేసింది.
- డిజైన్ టెక్ కంపెనీకి చెందిన రూ.31.32 కోట్ల బ్యాంకు ఖాతాలను జప్తు చేసింది. ఈ మేరకు ఈడీ పత్రికా ప్రకటన జారీ చేయడంతోపాటు ట్వీట్ కూడా చేసింది. డిజైన్ టెక్ కంపెనీ ఎండీ వికాస్ వినాయక్ ఖన్వేల్కర్‌ను ఈడీ ఈ ఏడాది మార్చి 10న అరెస్ట్ చేస్తే, మే 12 వరకు జైలులో ఉండి బెయిల్‌పై విడుదలయ్యారు.
- ఈ కుంభకోణంలో చంద్రబాబు భాగస్వామి అయిన ఆయన ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌లో అసలు అక్రమాలే జరగలేదని వీడియోలు విడుదల చేయడం విడ్డూరం. అక్రమాలు చేయకపోతే ఈడీ ఆయనపై కేసు పెట్టి ఎందుకు అరెస్ట్ చేసి జైలుకు పంపిందో సమాధానం చెప్పాలి. సీఐడీ కూడా చంద్రబాబుతోపాటు ఇప్పటికే వికాస్ వినాయక్ ఖన్వేల్కర్‌తోపాటు మొత్తం 9 మందిని అరెస్ట్ చేసింది.
- సీఐడీ నమోదు చేసిన కేసుపై విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం పది గంటలపాటు సుదీర్ఘంగా విచారించింది. ఇరుపక్షాల వాదనలను పూర్తిగా ఆలకించింది. అనంతరం ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్టులో చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారనడానికి పూర్తి ఆధారాలు ఉన్నాయని సంతృప్తి చెందడంతోనే ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది.

క్లుప్తంగా...

చంద్రబాబుది ముగిసిన అధ్యాయం

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం అర్బన్: చంద్రబాబుది ముగిసిన అధ్యాయమని, రాష్ట్ర చరిత్రలో అవినీతి కేసుల్లో అరెస్టు అయిన తొలి మాజీ ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించాడని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఎద్దేవా చేశారు. తాడేపల్లిగూడెంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అవినీతి కేసుల్లో నిండా మునిగిన చంద్రబాబుకు, తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇస్తున్న పవన్‌కళ్యాణ్ మెడకు రాయి కట్టుకొని గోదావరిలోకి దూకినట్లేనని ధ్వజమెత్తారు. చంద్రబాబును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినా ప్రజల్లో స్పందన లేకపోవడంతో తెదేపా శ్రేణులు అయోమయంలో ఉన్నాయన్నారు.

చంద్రబాబు ఒక గజదొంగ


- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



కార్వేటినగరం (చిత్తూరు జిల్లా): చంద్రబాబు అవినీతి, అక్రమాలకు పాల్పడి స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో రూ.371 కోట్లు కొల్లగొట్టిన ఒక గజదొంగ అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. బుధవారం చిత్తూరు జిల్లా కత్తెరపల్లి గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కనీసం కేబినెట్ ఆమోదం లేకుండా డొల్ల కంపెనీల ద్వారా చంద్రబాబు అవినీతికి పాల్పడి జైలు ఊచలు లెక్కిస్తున్నాడని విమర్శించారు. చంద్రబాబుకు ఒళ్లంతా అక్రమాల మచ్చలేనన్నారు. తప్పుచేయని వాడైతే ఖరీదైన లాయర్లను ఎందుకు రప్పించాడని ప్రశ్నించారు. మార్గదర్శి కుంభకోణంలో నిందితుడు రామోజీరావుకు కూడా జైలు కూడు తప్పదన్నారు. ఎన్ని కేసులు ఉంటే అంత పెద్ద నామినేటెడ్ పదవులు ఇస్తామని ప్రజలను రెచ్చగొడుతున్న లోకేశ్ కూడా జైలుకు పోవడానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. స్కిల్ స్కామే కాదు, పుంగనూరు సహా మరెన్నో కేసుల్లో చంద్రబాబుకు జీవితాంతం ఖైదు తప్పదని హెచ్చరించారు. చంద్రబాబును వెనకేసుకొస్తున్న పచ్చ మీడియాకు కూడా శిక్షలు తప్పవన్నారు.

అవినీతిపరులకు పురందేశ్వరి మద్దతు


- వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడుగా సోము వీర్రాజు కొనసాగితే పురందేశ్వరిలా అవినీతి పరులకు మద్దతు పలికే వారు కాదని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత, వైఎస్సార్ సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వి.విజయసాయిరెడ్డి అన్నారు. తాడేపల్లిలో బుధవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ.. అవినీతిపరులకు పురందేశ్వరి మద్దతు పలుకుతోందన్నారు. టీడీపీ బలహీనతను వీర్రాజు తన పార్టీకి అనుకూలంగా మార్చుకునే వారని అభిప్రాయపడ్డారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కర్ణాటక డిప్యూటి సీఎం డీకే శివకుమార్ ద్వారా 'ఇండియా' కూటమికి దగ్గరవుతున్న విషయం బీజేపీ అధిష్టానానికి తెలుసని ఆయన చెప్పారు. స్కిల్ స్కాంలో చంద్రబాబు లూటీని ఆధారాలతో సీఐడీ నిగ్గు తేల్చిందని అన్నారు. ఆయన జీవితం అంతా నేర, కుట్రపూరిత రాజకీయమేనని మండిపడ్డారు. బాబుపై ఉన్న కేసులన్నిటిలో శిక్షపడితే జీవితాంతం జైల్లోనే గడపాలన్నారు. కాగా, కేరళలో నిఫా వైరస్ కారణంగా ఇద్దరు మృతి చెందడంపై విజయసాయిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం అప్రమత్తం చేయాలని సూచించారు.

చట్టపరంగానే బాబు అరెస్ట్

- వైవీ సుబ్బారెడ్డి వ్యాఖ్య





గోపాలపట్నం: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం కేసులో చట్టపరంగానే టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్ట్ జరిగిందని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. విశాఖ విమానాశ్రయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2014 నుంచి 2019 వరకు వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా రాష్ట్రాన్ని దోచేసిన చంద్రబాబు, ఆయన అనుచరులకు చట్టపరంగానే అరదండాలు పడ్డాయన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ నిధులు ఏవిధంగా దోచుకున్నారన్నది సాక్ష్యాల ద్వారా కోర్టు నమ్మింది కనుకే ఆయనను జైలుకు పంపిందని పేర్కొన్నారు. ఇంతటితో అయిపోలేదని, అమరావతి స్కాం, ఫైబర్‌నెట్ స్కాం ఇలా అన్నీ బయటకు వస్తాయని వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ఈ విషయంలో చట్టం తన పని తాను చేస్తుందని, పథకాల పేరిట ఏవిధమైన అక్రమాలు జరిగాయో సిట్ ద్వారా బయటకు వస్తాయన్నారు.

బాబు షాక్ ఖరీదు రూ.94 వేల కోట్లు!

- ముందుచూపు లేకుండా విద్యుత్తు సంస్థలతో 'పీపీఏ'లు
- పాతికేళ్లలో 464 మెగావాట్లకే రూ.10,978 కోట్లు వ్యయం
- ఇప్పుడు 5,134 మెగావాట్లకు చెల్లించేది రూ.16,425 కోట్లే
- గత సర్కారుతో పోలిస్తే సగం కంటే తక్కువ ధరకే కొనుగోలు

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి





చంద్రబాబు హయాంలో ఎస్పీడీసీఎల్ ప్రైవేటు కంపెనీలతో చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు

విద్యుత్తు రంగంలో గత సర్కారు అడ్డగోలు ఒప్పందాలు, తప్పిదాలు రాష్ట్రానికి శాపంగా మారాయి. దీర్ఘకాలిక ప్రణాళిక లేకుండా ప్రైవేట్ విద్యుత్ సంస్థలతో ఇష్టారాజ్యంగా చేసుకున్న ఒప్పందాలు (పీపీఏ) గుదిబండలా పరిణమించాయి. సరిగ్గా చెప్పాలంటే అదే రేటుతో ఇప్పుడు ఒప్పందం చేసుకుంటే వినియోగదారులపై దాదాపు రూ.లక్ష కోట్ల భారం పడేది! సాధారణంగా సౌర, పవన విద్యుదుత్పత్తి వ్యయం తొలి పదేళ్లు స్థిరంగా కొనసాగి తరువాత నుంచి క్రమంగా తగ్గుతుంది. టీడీపీ సర్కారు మాత్రం వినియోగదారుల నడ్డి విరిచేలా పాతికేళ్ల పాటు అధిక ధరకు కొనుగోలు ఒప్పందాలు చేసుకోవడం దారుణమని విద్యుత్తు రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

ఇదీ జరిగింది...

టీడీపీ హయాంలో 2014–2019 మధ్య ఎస్పీడీసీఎల్ పరిధిలో 464 మెగావాట్ల సౌర విద్యుత్ కొనుగోలుకు 15 కంపెనీలతో ఒప్పందాలు జరిగాయి. దాని ప్రకారం మొదటి ఏడాది యూనిట్‌కు రూ.5.98 చొప్పున చెల్లించాలి. రెండో ఏడాది నుంచి ఏటా మూడు శాతం చొప్పున పదో సంవత్సరం దాకా కొనుగోలు వ్యయం పెరుగుతుంది. పదో ఏడాది నాటికి ఒక్కో యూనిట్ కొనుగోలుకు రూ.7.8025 చొప్పున చెల్లించాలి. పదో ఏడాది చెల్లిస్తున్న ధరనే ఒప్పంద కాలం ముగిసే వరకు అంటే 25వ సంవత్సరం దాకా చెల్లించేలా గత సర్కారు ఒప్పందం చేసుకుంది. దీని ప్రకారం తొలి ఏడాది యూనిట్ రూ.5.98 చొప్పున 464 మెగావాట్లకుగాను రూ.365.89 కోట్లు చెల్లించాలి. ఏటా 3 శాతం చొప్పున పెంచడం వల్ల పదో ఏడాది రూ.477.41 కోట్లు చెల్లించాలి. వెరసి 25 ఏళ్లకు గాను కేవలం 464 మెగావాట్లకు చెల్లించాల్సిన మొత్తం రూ.10,978 కోట్లు అవుతుంది.

ఇప్పుడు ఇలా ఆదా..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో పునరుత్పాదక ఇంధన రంగంలో మూడు కీలక ప్రాజెక్టుల ఏర్పాటుకు గత నెలలో ఏపీ జెన్‌కో, ఎన్‌హెచ్‌పీసీ మధ్య కీలక ఒప్పందాలు జరిగాయి. మొత్తం రూ.25,850 కోట్ల పెట్టుబడుల ద్వారా 5,314 మెగావాట్ల సౌర, పవన విద్యుత్ అందుబాటులోకి రానుంది. అంతేకాకుండా 5,300 మందికి ఉపాధి లభిస్తుంది. ఈ ఒప్పందం ప్రకారం ఒక్కో యూనిట్‌కు రూ.2.49 చొప్పున 25 ఏళ్ల పాటు చెల్లిస్తారు. 5,134 మెగావాట్లకు గాను పాతికేళ్లకు ప్రభుత్వం చెల్లించే మొత్తం కేవలం రూ.16,425 కోట్లు మాత్రమే. అంటే ఒక్కో యూనిట్ గత సర్కారు హయాంతో పోలిస్తే సగం కంటే తక్కువ ధరకే లభించడంతోపాటు రూ.వేల కోట్లు ఆదా అయ్యాయి. టీడీపీ పాలనలో కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం చెల్లిస్తే విద్యుత్తు వినియోగదారులపై అక్షరాలా రూ.94 వేల కోట్ల మేర అదనపు భారం పడేది. పాలకులు ముందుచూపుతో వ్యవహరిస్తే ప్రజలకు ఎంత మేలు చేయవచ్చో విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలే రుజువు చేస్తున్నాయి!

ఊరూ.. పేరూ ఒకటే!

464 మెగావాట్ల సౌర విద్యుత్ సరఫరా నిమిత్తం ఎస్పీడీసీఎల్ 15 సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోగా ఇందులో విచిత్రం ఏమిటంటే తొమ్మిది కంపెనీల రిజిస్టర్డ్ ఆఫీసు, కార్పొరేట్ ఆఫీసుల చిరునామా ఒకటే కావడం గమనార్హం. అంతేకాదు.. ఐదు కంపెనీలలో ముగ్గురు కామన్ డైరెక్టర్లుగా ఉండటం మరో విచిత్రం. ఒప్పందాలు కుదుర్చుకున్న కంపెనీలు, కొందరు డైరెక్టర్లు కనీసం ఐటీ రిటర్నులు కూడా దాఖలు చేయకపోయినా రూ.కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు చూపడం మరో విశేషం. టీడీపీ నుంచి బీజేపీలోకి వెళ్లిన రాజ్యసభ సభ్యుడికి చెందిన కంపెనీలు కూడా వీటిలో ఉండటం పరిశీలనాంశం. ఎల్లో మీడియా ఇవన్నీ దాచిపెడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై బురద చల్లే యత్నం చేయటాన్ని పరిశీలకులు తప్పుబడుతున్నారు.

అవినీతి బాబును జనం తరిమి కొడతారు

- 1,081వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు


తాడికొండ: బాబు అండ్‌కో అవినీతి పరులను అందలమెక్కించేందుకు ఎన్నిపార్టీలు ఆయనకు వత్తాసు పలికినా జనం ఓట్లేయరని, వారిని తరిమి కొడతారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,081వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలలో బుధవారం పలువురు మాట్లాడారు. 29 గ్రామాల పరిసరాల పరిధిలో ఇన్నర్ రింగ్ రోడ్డు పేరుతో చంద్రబాబు, మంత్రి నారాయణ, లోకేశ్‌తో పాటు పావలా కళ్యాణ్‌కు కూడా రెండున్నర ఎకరాలు ఇచ్చి... పేదలకు అన్యాయం చేశారని మండిపడ్డారు. తండ్రి చనిపోతే కూడా పవన్ ఏడ్చి ఉంటాడో లేదో తెలియదు కానీ చంద్రబాబును అరెస్టు చేస్తే మాత్రం పవన్ రోడ్డుపై పడి దొర్లడం వెనుక అమరావతిలో వాటాలే కారణమన్నారు. అసైన్డ్ రైతులను మోసం చేసిన కుంభకోణంలో మంత్రి నారాయణ కేసును కూడా సీబీఐ విచారణకు అప్పగించాలని డిమాండ్ చేశారు. బహుజనుల ఉసురు తగిలే చంద్రబాబు జైలు కెళ్లాడన్నారు. బహుజనుల సొంతింటి కల నెరవేరకుండా తప్పుడు కేసులు వేసిన బాబుకు భవిష్యత్తులో రాజకీయ సన్యాసం తప్పదని చెప్పారు. నాయకులు కారుమూరి పుష్పరాజు, పులి దాసు, మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

'స్కిల్' కాదు డొల్లే

- విహార యాత్రంటూ బీసీ వెల్ఫేర్ స్కూళ్ల విద్యార్థుల తరలింపు
- 1.21 లక్షల మంది 'స్కిల్' నిపుణుల్లో 70,000 మంది స్కూల్ పిల్లలే
- వారికి శిక్షణ ఇచ్చినట్లు రికార్డులు తయారు చేసి నిధులు స్వాహా
- ఆ విద్యార్థులకు అధిక జీతాలతో ఉద్యోగాలు ఇచ్చిన కంపెనీలు ఎక్కడ?
- ఆరు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సగానికిపైగా ల్యాబ్‌లే ఏర్పాటు కాలేదు
- నాడు లక్షలాది మందికి ఉపాధి కల్పించారంటూ ఎల్లో మీడియా బాకా



2018లో శిక్షణ తీసుకున్న విద్యార్థులకు స్టయిఫండ్‌గా రూ.44.52 లక్షలు విడుదలకు సంబంధించిన జీవో కాపీ


for 9 th class, now the same is offered for 10 th class students

మూడో దశ కింద 2018లో బీసీ వెల్ఫేర్ పాఠశాలకు చెందిన 17,000 మందికి శిక్షణ ఇస్తున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ మినిట్స్

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ముసుగులో మాజీ సీఎం చంద్రబాబు చేసిన మోసాలు ఒకొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. 2.50 లక్షల మందికి నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వడం ద్వారా లక్షలాది మందికి ఉపాధి కల్పించినట్లు ఎల్లో మీడియా చేస్తున్న ప్రచారంలో డొల్లతనం బయటపడింది. ఎనిమిదో తరగతి చదివే పిల్లలకు సైతం నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చినట్లు కాగితాలపై చూపారు. పాఠశాల విద్యార్థులను విజ్ఞాన యాత్రల పేరిట సీమెన్స్‌కు తెలియకుండా ఆ కంపెనీ పేరిట ఏర్పాటు చేసిన సెంటర్లకు తరలించారు. బీసీ వెల్ఫేర్ పాఠశాలలకు చెందిన తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు కంప్యూటర్–ఐటీ ఫండమెంటల్స్, ఎలక్ట్రానిక్స్ ఆఫీస్, ఎలక్ట్రికల్ హోమ్ లాంటి కోర్సుల్లో వొకేషనల్ ట్రైనింగ్ ఇచ్చినట్లు రికార్డుల్లో చూపించారు. చంద్రబాబు ప్రభుత్వం వైదొలగేలోపు మొత్తం 1,21,654 మంది నైపుణ్య శిక్షణ తీసుకున్నట్లు పేర్కొన్నారు. వీరిలో 70,000 మంది బీసీ వెల్ఫేర్ పాఠశాలలకు చెందిన విద్యార్థులే కావడం గమనార్హం. విహారయాత్రకు వచ్చిన ఒక్కో విద్యార్థికి రూ.200 ఇచ్చినట్లు సంతకాలు పెట్టించారు. వాటిని చూపిస్తూ వారందరికి అత్యున్నత నైపుణ్య శిక్షణ ఇచ్చినట్లు రికార్డులు తయారు చేశారు. ఇలా శిక్షణ పొందిన విద్యార్థులకు అధిక జీతాలు చెల్లించి తీసుకున్న కంపెనీలు ఏమిటో చంద్రబాబుకు బాకా ఊదుతున్న ఎల్లో మీడియానే చెప్పాలి!!

ల్యాబ్‌లూ లేవు..

సీమెన్స్ పేరును తెరపైకి తీసుకొచ్చి రూ.3,300 కోట్లతో ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు ఘనంగా చెప్పుకున్నా వాస్తవంగా రూ.70 కోట్లు కూడా ఖర్చు చేయలేదన్న విషయం ఫోరెన్సిక్ ఆడిట్‌లో బహిర్గతమయ్యింది. ఆరు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు, వాటికి అనుబంధంగా 34 టీఎస్‌డీఐలు (టెక్నికల్ స్కిల్స్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్స్) ఏర్పాటు చేసినట్లు చంద్రబాబు కాగితాల్లో చూపించారు. పాఠశాల విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు చూపించే ఫోటోలన్నీ ఉత్తిత్తి ల్యాబుల్లో తీసినవే. సీఎన్‌సీ మెకానిక్, టూ వీలర్, ఫోర్ వీలర్ ఆటోమొబైల్, ఎలక్ట్రికల్, మెకానికల్ సర్వీస్ సెక్టార్, క్యాడ్ రామ్, ఐసీటీ, అగ్రి ఫార్మ్ మెకనైజేషన్ లాంటి కోర్సుల గురించి విద్యార్థులకు కంప్యూటర్ స్క్రీన్‌పై చూపించి శిక్షణ ముగించారు. ఒక్కో సీవోఈలో 15 ల్యాబ్‌లు, టీఎస్‌డీఐలో 10 ల్యాబ్‌లు ఏర్పాటు చేసినట్లు రికార్డుల్లో చూపించారు. రాష్ట్రం వాటాగా తరలించిన రూ.371 కోట్లను కాజేసిన కేటుగాళ్లు ఒప్పందం ప్రకారం ల్యాబ్‌లను ఏర్పాటు చేయలేదు. ఈ కుంభకోణంపై రాష్ట్ర ప్రభుత్వం 2021లో ఫోరెన్సిక్ ఆడిటింగ్‌కు ఆదేశించిన వెంటనే ఆగమేఘాలపై కొన్ని ల్యాబ్‌లను ఏర్పాటు చేయడం గమనార్హం.

హైకోర్టు హితవు

అమ్మ చేతి బువ్వ పిల్లల హక్కు

'స్విగ్గీ, జొమాటోల ఫుడ్డు తెప్పించి చేతులు దులుపుకోవద్దు. పిల్లల్ని అమ్మ చేతి రుచికరమైన వంట తిననివ్వండి' అని కేరళ హైకోర్టు హితవు పలికింది. ఒక మొబైల్ ఫోన్ కేసులో బుధవారం తీర్పు వెలువరిస్తూ 'సాయంత్రం ఆడుకుని వచ్చిన పిల్లలు ఇంట్లో వంట ఘుమఘుమలకు ఉత్సాహపడాలి. అన్నం అడగాలి. అలాంటి స్థితి నేడు ఉన్నదా?' అని ప్రశ్నించింది. పిల్లల పెంపకంలో ఎన్నెన్నో మార్పులు వచ్చాయి.కాని, పిల్లల ఆటలు, ఆహారం విషయంలో కేరళ హైకోర్టు హెచ్చరికలు చాలా ముఖ్యమైనవి.



'మైనర్ పిల్లల చేతికి తల్లిదండ్రులు సెల్‌ఫోన్లు ఇచ్చి వారిని సంతోషపెట్టవద్దు. పిల్లల చేతికి ఫోన్లు ఇచ్చి వారు ఏం చూస్తున్నారో పట్టించుకోకుండా తల్లిదండ్రులు ఇంటి పనులో సొంత పనులో చేసుకోవద్దు. పిల్లలు సెల్‌ఫోన్లలో చూడకూడనివి చూస్తే వాటి దుష్ఫలితాలు సుదీర్ఘకాలం ఉంటాయి' అని కేరళ హైకోర్టు బుధవారం తల్లిదండ్రులకు హితవు చెప్పింది.

కేరళలోని అలవు ప్రాంతంలో ఒక వ్యక్తి బహిరంగ ప్రదేశంలో ఫోన్‌లో పోర్న్ వీడియోలు చూస్తున్నాడని పోలీసులు పెట్టిన కేసును కొట్టి వేస్తూ (ఐపిసి సెక్షన్ 292 చెల్లదని) జస్టిస్ కున్హి కృష్ణన్ తల్లిదండ్రులకు సెల్‌ఫోన్ల గురించి హెచ్చరించారు. 'పిల్లలు సెల్‌ఫోన్లలో విజ్ఞాన, వినోదానికి సంబంధించి వీడియోలు చూడాలి... అదీ తల్లిదండ్రుల సమక్షంలో. తల్లిదండ్రుల అజమాయిషీ లేకుండా వారు మొబైల్ చూడకూడదు. పిల్లలు ఆడుకునే సమయాల్లో ఆడుకోవాలి. వారిని ఫుట్‌బాల్, క్రికెట్లో ఆడేలా చేయండి. శారీరకంగా దృఢంగా ఎదిగేలా చేసి దేశ భవిష్యత్తు కోసం ఆశ పెట్టుకునేలా తీర్చిదిద్దండి' అని కున్హి కృష్ణన్ అన్నారు.

తల్లి చేసేదే రుచికరం

అదే సమయంలో పిల్లల ఆహారం గురించి ఇటీవల వచ్చిన మార్పును కూడా జస్టిస్ వ్యాఖ్యానించారు. 'పిల్లలకు స్విగ్గీ, జొమాటోల నుంచి ఆహారం తెప్పించి ఇస్తున్నారు. కాని పిల్లలు తల్లి చేసిన రుచికరమైన తిండినే తినాలి. పిల్లలు సాయంత్రం ఆడుకోవడానికి వెళ్లి ఇంట్లో వంట ఘుమఘుమలు మొదలయ్యే సమయానికి చేరుకుని అన్నం కోసం ఎదురు చూడాలి. అలా జరిగితే ఎంత బాగుంటుంది? మేం చెప్పాల్సింది చెప్పాం. ఇక తల్లిదండ్రుల విచక్షణ' అని కున్హి కృష్ణన్ అన్నారు.

మేధో ఆరోగ్యం, శారీరక ఆరోగ్యం

కేరళ హైకోర్టు చేసిన వ్యాఖ్యలు స్థూలంగా నేటి పిల్లల పెంపకాన్ని వ్యాఖ్యానిస్తున్నాయి. పరిశీలించి చూస్తే అవి పిల్లల మేధో, భౌతిక ఆరోగ్యం గురించి హెచ్చరిక చేస్తున్నాయి. ఇవాళ రేపు స్కూళ్లు, తల్లిదండ్రులు పిల్లల శారీరక వ్యాయామానికి వీలు ఇవ్వడం లేదు. ఆటలాడమని ప్రోత్సహించడం లేదు. ఆడుకునే వీలు కూడా కల్పించడం లేదు. దాంతో పిల్లలు కదలికలు మందగించి బద్ధకం, స్థూలకాయం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. మరోవైపు ఆ సమయాన్ని సెల్‌ఫోన్లలో అనవసరమైన విషయాలు చూస్తూ బుర్ర పాడుచేసుకుంటున్నారు. ఫిల్టర్లు పెడితే తప్ప సెల్‌ఫోన్లలో పోర్నోగ్రఫీ, వయొలెంట్ వీడియోలు మీట దూరంలో ఉంటాయి. తెలిసీ తెలియని వయసులో వాటిని గంటల కొద్ది చూస్తే తీవ్ర మానసిక ప్రభావాలకు లోనవుతారు. జరగవలసిన నష్టం జరిగే వరకు తల్లిదండ్రులకు విషయం తెలియడం లేదు. ఇంకోవైపు వంటకు సమయం లేకనో లేదా పిల్లలు అడుగుతున్నారనో చీటికి మాటికి స్విగ్గీలో టిఫిన్లు, భోజనాలు తెప్పించే తల్లిదండ్రులు పెరిగారు. హోటల్ తిండి పిల్లలకు ఏ మాత్రం మంచిది కాదు. ఒకప్పుడు ఎప్పుడో తప్ప బయటి తిండి తిననివారు ఇవాళ ప్రతి రెండో రోజు ఏదో ఒకటి తెప్పిస్తున్నారు. తల్లి చేసే ఒకటి రెండు కూరలైనా ఎంతో శుచిగా, రుచిగా ఉంటాయి. వంట పని భారం కాకుండా భర్త, పిల్లలు సాయం చేస్తే శుభ్రమైన ఇంటి భోజనం చేయవచ్చు. కలిసి కూచుని భోంచేయడం ద్వారా కుటుంబ సభ్యుల మధ్య అనుబంధం పెరుగుతుంది కూడా.

కాబట్టి అప్రమత్తంగా ఉండాలి. పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

కొత్త దారి

రైతుబిడ్డ

● ఎవర్ గ్రీన్ ఎనర్జీ





మహిళా రైతులతో షర్మిల జైన్

'ఇక వ్యవసాయం చేయవద్దు అనుకుంటాను. కాని చేయక తప్పేది కాదు. దీని వల్ల తలపై అప్పులు తప్ప నాకు జరిగిన మేలు లేదు. అయినా సరే భూమి నాకు అమ్మతో సమానం' అన్నాడు మహారాష్ట్రలోని ఒక రైతు.

'లాభనష్టాల సంగతి పక్కన పెడితే, ఒక్క రోజు పొలం వైపు వెళ్లక పోయినా నాకు ఏదో కోల్పోయినట్లుగా ఉంటుంది' అంటాడు రాజస్థాన్‌లోని ఒక రైతు. మన దేశంలో రైతుకు, భూమికి మధ్య ఆత్మీయ బంధం ఉంది. ఆ బంధాన్ని బలోపేతం చేయడానికి కెనడా నుంచి వచ్చిన షర్మిల జైన్ తన లక్ష్యసాధనలో విజయం సాధించింది...

రైతుల ఆత్మహత్యలతో వ్యవసాయరంగం కల్లోలంగా ఉన్న కాలం అది. ఆ సమయంలో షర్మిలజైన్ కెనడాలో నివాసం ఉంది. స్వదేశంలో రైతుల ఆత్మహత్యల గురించి చదివిన తరువాత ఆమె మనసు మనసులో లేదు. ఎన్నో ఆలోచనలు తనను చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చేశాయి.

'ఈ సమస్యకు పరిష్కారం లేదా?' అని ఆమె ఆలోచించింది.

ఆ సమయానికి కదిలిపోయి మరోరోజుకు మామూలై పోయే వ్యక్తి కాదు షర్మిల. కనిపించే సమస్య వెనకాల కనిపించని సమస్యలను అధ్యయనం చేయడానికి రంగంలోకి దిగింది. అంతే కాదు, రైతుల కోసం కెనడాను వదిలి స్వదేశానికి తిరిగి రావాలని నిర్ణయించుకుంది. 'నువ్వు ఎలాంటి నిర్ణయం తీసుకున్నావో తెలుసా? భావోద్వేగాలపై తీసుకునే నిర్ణయాలు బెడిసికొడతాయి. తీరిగ్గా ఆలోచించు. వెళ్లడం సులభమేకాని ఇక్కడికి మళ్లీ రావడం అంత సులభమేమీ కాదు' అన్నారు సన్నిహితులు.

బాగా ఆలోచించే నిర్ణయం తీసుకున్నానని చెప్పింది షర్మిల.

మహారాష్ట్రలోని గ్రామీణ ప్రాంతంలో పుట్టి పెరిగిన షర్మిలకు రైతుజీవితం కొత్తేమీ కాదు. వారికి సంబంధించి తాను చిన్నప్పుడు విన్న సమస్యలే ఇప్పుడు కూడా వినాల్సి వస్తుంది.

మరాఠీ మీడియం స్కూల్లో చదువుకున్న షర్మిల స్నేహితులలో చాలామంది రైతు బిడ్డలే. ఆ కుటుంబాల ఆర్థిక కష్టాలతోపాటు గృహహింసకు సంబంధించిన విషయాలను తరచుగా వినేది. ఆ సమయంలోనే లాయర్ కావాలని అనుకుంది.

కెనడా నుంచి భారత్‌కు తిరిగి వచ్చిన షర్మిల క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను అర్థం చేసుకోవడానికి మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్‌లలోని ఎన్నో పల్లెలు తిరిగింది. ఇంటింటికి వెళ్లి రైతులతో మాట్లాడింది. వారితోపాటు పొలానికి వెళ్లింది.

'ఇలా ఎవరో ఒకరు వచ్చి ఏదో ఒకటి రాసుకోవడం, తరువాత కనిపించకపోవడం మామూలే. అయితే షర్మిలజీ కళ్లలో నిజాయితీ కనిపించింది. ఆమె మా కోసం ఏదో చేయగలదు అనే ఆశ కలిగింది' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంటాడు చౌహాన్ అనే రైతు.



> ఎన్నో సంవత్సరాలుగా అయిదు రాష్ట్రాలలో వేలాదిమంది రైతులకు వాటర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్స్, కెపాసిటీ–బిల్డింగ్ ప్రోగామ్స్ ద్వారా సహాయపడుతున్నాం. చిరుధాన్యాలు, కూరగాయలు పండించడంపై అవగాహన కలిగిస్తున్నాం. చిరుధాన్యాలు అనే పేరు పెద్దగా వినిపించని కాలంలోనే వాటి ప్రాముఖ్యత గురించి ప్రచారం చేశాం.
> – షర్మిల జైన్

వ్యవసాయ సంబంధిత అంశాలను మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి... ఇంగ్లాండ్‌లో ఎన్విరాన్‌మెంటల్ లా, అగ్రికల్చరల్ లా లో మాస్టర్స్ చేసింది షర్మిల. రెండు సంవత్సరాల కాలంలో ఎంతోమంది రైతులతో, వ్యవసాయరంగ నిపుణులతో మాట్లాడిన తరువాత 'గ్రీన్ ఎనర్జీ ఫౌండేషన్' పేరుతో ఒక స్వచ్ఛంద సంస్థను ప్రారంభించింది. చెరువులను పునరుద్ధరించడం, నవీన వ్యవసాయ పద్ధతులను రైతులకు పరిచయం చేయడం, చిరుధాన్యాలు పండించడంపై అవగాహన కలిగించడం... మొదలైనవి ఈ ఫౌండేషన్ లక్ష్యాలు.

తొలిసారిగా మహారాష్ట్రలోని బుచ్‌కెవాడి గ్రామంలో నాబార్డ్ గ్రాంట్‌తో వాటర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం చేపట్టారు. నిరంతరం నీటిఎద్దడితో సతమతం అవుతున్న ఆ గ్రామం వాటర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా బాగు పడింది. వేసవి సమయంలోనూ నీటి కష్టాలు రాని పరిస్థితి వచ్చింది.

రాజస్థాన్‌లోని దుంగర్‌పూర్ గ్రామంలోని రైతులకు నీటి అవసరం ఎక్కువగా లేని పంటల గురించి అవగాహన కలిగించారు.

'గ్రీన్ ఎనర్జీ మా ఊరిలో అడుగు పెట్టకపోతే వ్యవసాయానికి శాశ్వతంగా దూరం అయ్యేవాళ్లం. గ్రీన్‌ఎనర్జీ కార్యక్రమాల ద్వారా అనేక రకాలుగా లబ్ధి పొందాం. ఇప్పుడు కూరగాయలు కూడా పండిస్తున్నాం. గతంలో పంటలు పండనప్పుడు నా భర్త కూలిపనుల కోసం పట్నం వెళ్లేవాడు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు' అంటుంది దీప్తి అనే మహిళా రైతు.

షర్మిల తన తండ్రి నుంచి రెండు విలువైన మాటలు విన్నది. ఒకటి... చిరుధాన్యాల ప్రాముఖ్యత. రెండు... కార్పొరేట్ కంపెనీల సామాజిక బాధ్యత. ఇప్పుడు బాగా వినిపిస్తున్న సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ఆరోజుల్లోనే విన్నది షర్మిల.

ఆరోగ్యకరమైన ఆహార అలవాట్ల కోసం, చిరుధాన్యాలను పండించే రైతులకు సహాయపడడానికి 'గుడ్ మామ్' అనే స్టార్టప్‌కు శ్రీకారం చుట్టింది షర్మిల జైన్. 'గుడ్ మామ్' ద్వారా మిల్లెట్ నూడుల్స్ నుంచి హెర్బ్ స్టిక్స్ వరకు ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారు. చిరుధాన్యాలపై ఆసక్తి వేలం వెర్రిగా మారకుండా, దాన్ని ఇతరులు సొమ్ము చేసుకోకుండా ఉండడానికి 'గుడ్ మామ్' ద్వారా 'ఏది అబద్ధం?' 'ఏది నిజం' అంటూ అవగాహన కలిగిస్తున్నారు.

బ్యూటిప్

కాంతిమంతమైన ముఖం కోసం....



టమాటాను గుండ్రంగా కట్ చేసి ఒక ముక్కను తీసుకుని దానికి పంచదార అద్దాలి. తరువాత ఈ ముక్కను ముఖంపై సున్నితంగా రుద్దాలి. పది నిమిషాల తరువాత సాధారణ నీళ్లతో కడుక్కోవాలి. తరువాత స్పూను శనగ పిండి, అర స్పూను అలోవెర జెల్, రెండు స్పూన్ల టమాటా రసం, అర స్పూను తేనె వేసి పేస్టులా కలుపుకోవాలి. ఈ పేస్టుని ముఖానికి ఫేస్‌ప్యాక్‌లా వేసుకోవాలి. ఇలా చేస్తే ముఖంపై ఉన్న మృత కణాలు, ట్యాన్ పోయి ముఖం కాంతిమంతమవుతుంది.



బీరు వ్యర్థాలతో... ఆహార పదార్థాలు

కొంతమంది ఆకలితో అలమటిస్తుంటే, మరోపక్క టన్నులకొద్దీ ఆహారం వివిధ రకాలుగా వ్యర్థాల రూపంలో మట్టిపాలవుతోంది. ఈ మధ్య కాస్త అవగాహన రావడంతో ఫంక్షన్లలో మిగిలిన ఆహారాన్ని ఆశ్రమాలకు దానంగా ఇస్తున్నారు. అయితే వండిన ఆహారమే కాకుండా, కొన్నిరకాల పదార్థాలు, పానీయాలు తయారయ్యాక ఎన్నో పోషకాలున్న పదార్థాలు చెత్తలోకి వెళ్లి పోతున్నాయి. వీటిని మనం చక్కగా వినియోగించుకుంటే...

బిస్కెట్లు, బ్రెడ్, రోటీలు చేసుకోవచ్చని చెబుతోంది ఎలిజబెత్ యార్క్. బీర్ తయారవగా మిగిలి పోయిన వ్యర్థాలతో చిక్కి, లడ్డు, నూడుల్స్ తయారు చేసి మరీ రుచి చూపెడుతోంది ఎలిజబెత్.



బెంగళూరుకు చెందిన ఎలిజబెత్ యార్క్ ఒక చెఫ్. మణిపాల్‌లో డిగ్రీ చేసిన ఎలిజబెత్ తరువాత మైసూర్‌లోని సెంట్రల్‌ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో రీసెర్చ్ చేసింది. అందులో భాగంగా దేశంలో ఎన్నో రకాలుగా భారీ ఎత్తున ఆహార వృథా జరుగుతోందని గ్రహించింది. ఆహారం వ్యర్థం కాకుండా ఎలా ఆపాలా... అని ఆలోచించింది. ఈ క్రమంలోనే 2016లో కాలిఫోర్నియాలోని బ్రెడ్ స్పెషలిస్ట్, ఫుడ్ హిస్టోరియన్ విలియం రెబెల్ దగ్గర ఇంటర్న్‌గా చేరింది. రుబెల్ ద్వారా... ''వందల ఏళ్ల నాడే పానీయాల తయారీదారు, (బ్రీవర్స్), రొట్టె, బ్రెడ్స్ తయారీదార్లు (బేకర్స్) కలిసి పనిచేసే వారని తెలిసింది. కొన్నిసార్లు ఆర్థికంగా ప్రతికూల పరిస్థితులు ఏర్పడినప్పుడు మిగిలిపోయిన బ్రెడ్‌ను బ్రీవర్స్, గింజలు, ఈస్ట్‌ను బ్రీవర్స్ బేకర్స్ ఇచ్చి పుచ్చుకునేవాళ్లు. అలా వాళ్ల పదార్థాలు వృథా కాకుండా, తక్కువ ఖర్చులో ఆహారాన్ని తయారు చేసేవారు'' అని ఎలిజబెత్ తెలుసుకుంది. భారత్‌లో కూడా ఇలా చేసి ఫుడ్ వేస్ట్ కాకుండా చూడవచ్చు అనుకుంది.

సేవింగ్ గ్రెయిన్స్

లాక్‌డౌన్ సమయంలో కాస్త ఎక్కువ సమయం దొరకడంతో ఎలిజబెత్ వ్యర్థాల నుంచి ఫుడ్ తయారు చేయాలని నిర్ణయించుకుంది. బీర్ తయారైన తరువాత పడేసే వ్యర్థాలను రుచికరమైన ఆహారంగా మార్చాలనుకుని 2021లో 'సేవింగ్ గ్రెయిన్స్' ప్రారంభించింది. బీర్ తయారవగా మిగిలిన పిప్పిని పిండిగా మార్చి, తరువాత ఆ పిండితో బ్రెడ్, రోటీలు, గ్రనోలా, కుకీస్, టీ బిస్కెట్స్, లడ్డులు, చిక్కీలు తయారు చేసి విక్రయిస్తోంది. పిప్పినుంచి తయారు చేసినవే అయినా ఇవి ఎంతో రుచిగా ఉండడం విశేషం. సేవింగ్ గ్రెయిన్స్ ఉత్పత్తులు ఆఫ్‌లైన్‌లోనేగాక, ఆన్‌లైన్‌లో కూడా లభ్యమవుతున్నాయి. స్థానిక బేకరీ భాగస్వామ్యంతో సేవింగ్ గ్రెయిన్స్‌ను విస్తరిస్తోంది ఎలిజబెత్.



రోజుకి పన్నెండు వేల కేజీలు..

''రకరకాలుగా ఫుడ్ వేస్ట్ అవడం చాలా బాధగా అనిపించేది. రుబెల్‌ను కలిసాక ఈ సమస్యకు చక్కటి పరిష్కారం దొరికింది. దాంతోనే 'సేవింగ్ గ్రెయిన్స్'ను ప్రారంభించాను. బీర్, ఆల్కహాల్‌ను తయారు చేసేందుకు గోధుమలు, ఓట్స్, బార్లీలను నానబెట్టి మొలకలు వచ్చిన తరువాత, చక్కెరతో ఉడికిస్తారు. తరువాత మెత్తగా రుబ్బి రసాన్ని వేరు చేసి బీర్, ఆల్కహాల్స్‌ను తయారు చేస్తారు. పానీయం వేరు చెయ్యగా మిగిలిన పిప్పిని పశువులకు దాణాగా వేస్తుంటారు. పశువులు తిన్నప్పటికీ, ఎక్కువ మొత్తంలో వ్యర్థంగా పోతుంది. ఒక్క బెంగళూరులోనే రోజుకి పన్నెండు వేలకేజీల ధాన్యాలను పానీయాల తయారీలో వాడుతున్నారు. రోజుకి ఇంత అంటే ఇక ఏడాదికి చాలా ఎక్కువ అవుతుంది. దేశవ్యాప్తంగా ఉన్న బ్రీవరీలు లక్షల కేజీల ధాన్యాలను ఉపయోగిస్తున్నాయి. ఇలా ఉత్పన్నమయ్యే పిప్పిని ఫుడ్‌గా మార్చడం వల్ల ధాన్యాలు వ్యర్థంగా పోవు. సేవింగ్ గ్రెయిన్స్ ద్వారా ఎంతోమంది ఆకలి కూడా తీర్చవచ్చు'' అని ఎలిజబెత్ చెబుతోంది.



సైబర్ టాక్

ఇన్‌ఫ్లుయెన్సర్లూ జాగ్రత్త!!

సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లు వ్యూవర్స్‌ని యాడ్స్ ద్వారా ప్రభావితం చేస్తుంటారు. వీరితో పాటు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ ద్వారా వెలుగులోకి వస్తున్నవారు కూడా ఇ-కామర్స్ సంస్థల బ్రాండ్స్‌ను ఎలా ప్రచారం చేయాలో తెలుసుకోవాలి.

ప్రకటనదారులు ఇన్‌ఫ్లుయెన్సర్లకు కానుకల ఆశ చూపి, తమ ఉత్పత్తులకు ప్రచారకర్తలుగా మార్చుకుంటారు. ఇవి తెలియని ఇన్‌ఫ్లుయెన్సర్లు ఉత్పత్తులకు, సేవలకు ప్రచారకర్తలుగా మారిపోతారు. వీరు చెప్పే బ్రాండ్స్‌ను గుడ్డిగా నమ్మి వ్యూవర్స్ వాటిని కొనుగోలు చేసి, మోస పోవచ్చు.

అందుకే, భారత ప్రభుత్వం వినియోగదారుల రక్షణ చట్టం -2019 అమలులోకి తీసుకు వచ్చింది. ఉత్పత్తులు, సేవల గురించి తప్పుడు ప్రచారాలు చేసి, ప్రజలను మోసం చేస్తే వారు శిక్షార్హులు అవుతారని చెబుతోంది.

వ్యూవర్లను, సబ్‌స్క్రైబర్లను పొందాలంటే..

సాధారణంగా ఇన్‌ఫ్లుయెన్సర్లు సోషల్‌మీడియా ఛానెల్స్‌లో పోస్ట్ చేసిన వాటి విషయంలో ఈ పరిస్థితి తలెత్తదు. వాటిలో స్వీయప్రచారం లేదా సబ్‌స్క్రైబర్స్‌కి ఏదైనా సూచన ఇవ్వడం కనిపిస్తుంది. లాంగ్‌టైమ్ ఇన్‌ఫ్లుయెన్సర్‌లలో ఒకరిగా సక్సెస్ కావాలంటే ఉపయోగకరమైన సమాచారాన్ని తెలియజేసే వ్యక్తిగానే ఉండాలి.

- అర్థవంతమైన కంటెంట్, సంభాషణను ప్రదర్శించాలి.
- సబ్‌స్క్రైబర్లు, ఫాలోవర్లను కట్టిపడేలా మీ కంటెంట్ సమయాన్ని పెంచుకోవచ్చు. వ్యూవర్స్ అన్ని కామెంట్స్‌కు ప్రత్యుత్తరం ఇవ్వడం మర్చిపోవద్దు.
- సబ్‌స్క్రైబర్ల దృష్టి కోణం నుండి మీ పోస్ట్ ఉండేలా చూసుకోండి. కృత్రిమమైన డ్రామాను ప్లే చేయకూడదు.

కథనాలకు లింక్ ఇన్..
ఇలా దేనికది ఎంచుకోవాలి.

- మీ ప్రతిస్పందనలోనూ నిజాయితీగా ఉండండి. సోషల్‌మీడియా ఉనికికి సంబంధించిన ఆరోగ్యకరమైన సంబంధాలను ఏర్పరుచుకోవడానికి ఇది మీకు సహాయం చేస్తుంది.
- హాష్‌ట్యాగ్‌ల విషయాలపై సరైన పరిశోధన చేయండి. లేకుంటే, హ్యాష్‌ట్యాగ్‌లు మీ ప్రతిష్ఠను దెబ్బతీసే అవకాశం ఉంది.

ప్రకటనలు ఎలా చేయాలి?

- ప్రకటనలు స్పష్టంగా, ప్రముఖంగా, మిస్ చేయడం చాలా కష్టంగా ఉండే విధంగా ఎండార్స్‌మెంట్ సందేశంలో ఉంచాలి. హ్యాష్‌ట్యాగ్‌లు లేదా లింక్‌ల సమూహంతో యాడ్స్‌ను బహిర్గతం చేయకూడదు.
- వ్యూవర్స్ గమనించే విధంగా ప్రకటనల ఎండార్స్‌మెంట్ ఇమేజ్‌పై ఉంచాలి.
- ప్రకటనలు ఆడియో, వీడియో ఫార్మాట్‌లో చేయాలి.



- మీ ఛానెల్‌ను ఫాలో అవమని వ్యక్తులను అడగడంలో మీరు ఎంత పెద్దవారైనప్పటికీ సిగ్గుపడకూడదు. సబ్‌స్క్రైబర్లను కొనుగోలు చేయడం కంటే సోషల్‌మీడియా ఛానెల్‌లో ప్రమోషన్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది.
- మీ పోటీదారులు ఎవరు, వారు సోషల్ మీడియాలో ఏమేం చేస్తున్నారు, ఎంత బాగా చేస్తున్నారో చూడండి. వారిని ఫాలో అవడం ద్వారా మీ లోపాలను సులభంగా గుర్తించి, సరి చేసుకోవచ్చు. అంతేకాదు, సబ్‌స్క్రయిబర్లను పెంచుకునే వ్యూహాన్ని రూపొందించుకోవచ్చు.
- ప్రతిరోజూ ఉండాలి కదా అని ఏదో ఒకటి పోస్ట్ చేయకండి. అది మీ వ్యూవర్స్‌ని పెంచదు. ప్రతి పోస్ట్ మీ లక్ష్యానికి చేరువ చేస్తుందా అని నిర్ధారించుకోండి. క్వాలిటీ కంటెంట్‌పైనే దృష్టి పెట్టండి.
- సాధారణంగా కొందరు రెచ్చగొట్టే చర్చలను, వివాదాలను సృష్టించడానికి ట్రోల్ చేస్తారు. దీని వల్ల సబ్‌స్క్రైబర్లు, ఫాలోవర్లను సంతోషపెట్టలేరు. అలాగని, మీపై ట్రోల్ చేయడంలో వారి పూర్తి పాయింట్ అదే కాబట్టి ట్రోల్‌లను విస్మరించకూడదు.
- అన్ని సామాజిక ఛానెల్స్ కంటెంట్‌ను మానిటైజ్ చేస్తున్నందున జాగ్రత్తపడాలి. వార్తలు, వినోదం కోసం ఫేస్‌బుక్, బ్లాగ్ పోస్ట్‌లకు ట్విటర్, ఫోటోలు, వీడియోలకు ఇన్‌స్టాగ్రామ్, ఇండస్ట్రీలకు సంబంధించిన
- ప్రకటనలు మొత్తం లైవ్‌స్ట్రీమ్‌లో ప్రదర్శించాలి.
- సింపుల్ అండ్ క్లియర్ లాంగ్వేజ్ ఉండాలి.

తగిన శ్రద్ధ ..

- సెలబ్రిటీలు/ఇన్‌ఫ్లుయెన్సర్లు ప్రకటనలో చూపిన విధంగా ఆ ఉత్పత్తులను తాము వాడి, ప్రయోజనం పొందేలా కూడా ఉండాలి. ఉత్పత్తి, సేవ తప్పనిసరిగా ఎండార్సర్ ద్వారా ఉపయోగించబడి ఉండాలని కూడా సిఫార్సు చేయబడింది.
- ఒక ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్‌లను సంప్రదించి వారి ఉత్పత్తులను ప్రమోట్ చేయడానికి తమ బ్రాండ్ దుస్తులను ధరించమని, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల కోసం కంటెంట్‌ను రూపొందించమని కోరాలి.
- సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్‌లు ఆన్‌లైన్‌లో కంటెంట్‌ను పోస్ట్ చేస్తే ఆ బ్రాండ్స్‌ను ఎలాంటి పక్షపాతం లేకుండా ప్రమోట్ చేస్తున్నట్లు కనిపించాలి.
- సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లు తమ మెటీరియల్ కనెక్షన్‌ను బహిర్గతం చేయనట్లయితే, వారి అభిప్రాయం పక్షపాతంగా లేదా తప్పుదారి పట్టించేదిగా ఉందనుకోవాలి.
- ఏదైనా మెటీరియల్ కనెక్షన్‌ను బహిర్గతం చేయడంలో ఇన్‌ఫ్లుయెన్సర్లు ఫెయిల్ అయితే వినియోగదారుల రక్షణ చట్టం – 2019 కింద చట్టం ప్రకారం కఠిన చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. అందుకే, తగిన జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.

ఉచిత ఉత్పత్తుల వల..

వ్యూవర్స్ నిర్ణయాలు లేదా అభిప్రాయాలను ప్రభావితం చేసే శక్తి ఉన్న ప్రముఖ వ్యక్తులు కొన్ని రంగాలకు మాత్రమే పరిమితం కాదు. వ్యూవర్స్ అభిప్రాయాలపై బలమైన ప్రభావంతో ఉత్పత్తుల, సేవలను ప్రకటించే సృష్టికర్తలు మాత్రమే. ప్రకటనల కంపెనీలు వారికి ప్రోత్సాహకాలు ప్రకటిస్తుంటాయి. ట్రిప్స్ లేదా హోటల్ వసతి, ఉచిత ఉత్పత్తులు, అవార్డులు.. మొదలైనవి జత చేస్తారు. ఇక, వర్చువల్ ఇన్‌ఫ్లుయెన్సర్లు కంప్యూటర్ సృష్టించిన వ్యక్తులు. వీటి ద్వారా కూడా యాడ్ కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రచారం చేస్తుంటాయి.



ఇన్‌పుట్స్: అనీల్ రాచమల్ల, డిజిటల్ వెల్‌బియింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్



భారత్ నుంచి ఒక్కరే...

వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడల్లో హాకీ ఈవెంట్‌లో విధులు నిర్వహించే అంపైర్ల వివరాలను అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రకటించింది. పురుషుల, మహిళల మ్యాచ్‌లకు కలిపి మొత్తం 28 మంది అంపైర్లను ఎంపిక చేశారు. భారత్ నుంచి రఘు ప్రసాద్ ఒక్కడే అంపైరింగ్ బాధ్యతలు నిర్వహించేందుకు ఎంపికయ్యాడు. 2003 నుంచి అంపైర్‌గా వ్యవహరిస్తున్న రఘు 186 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో అంపైర్‌గా పని చేశాడు. 2012 లండన్, 2021 టోక్యో ఒలింపిక్స్‌లోనూ రఘు ప్రసాద్ అంపైరింగ్ బాధ్యతలు నిర్వహించాడు.

నీరజ్ ఒక్కడే బరిలోకి...

ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ మీట్ ఫైనల్స్‌లో భారత్ నుంచి జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా మాత్రమే పోటీపడుతున్నాడు. అవినాశ్ సాబ్లే (3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్), మురళీ శ్రీశంకర్ (లాంగ్‌జంప్) కూడా అర్హత సాధించినా ఆసియా క్రీడల నేపథ్యంలో ఈ ఇద్దరు దూరంగా ఉన్నారు. ఈనెల 16, 17వ తేదీల్లో అమెరికాలోని యుజీన్‌లో ఈ ఫైనల్స్ జరుగుతాయి. గత ఏడాది జ్యూరిక్‌లో జరిగిన డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో నీరజ్ జావెలిన్ త్రో ఈవెంట్ స్వర్ణ పతకం సాధించాడు.



రిటైర్మెంట్ ఆలోచన లేదు: సైనా నెహ్వాల్

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించే అవకాశాలు తక్కువగానే ఉన్నప్పటికీ... ఇప్పట్లో ఆటకు వీడ్కోలు పలికే ఆలోచన లేదని భారత బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ స్పష్టం చేసింది. మోకాలి గాయంతో బాధపడుతున్న 33 ఏళ్ల సైనా గత జూన్ నుంచి అంతర్జాతీయ టోర్నీలకు దూరంగా ఉంది. ఫలితంగా ఒకప్పుడు ప్రపంచ నంబర్‌వన్‌గా ఉన్న ఆమె ప్రస్తుతం 55వ ర్యాంక్‌కు పడిపోయింది. 'ప్రపంచ చాంపియన్ ఆన్ సె యంగ్, తై జు యింగ్, అకానె యామగుచిలాంటి స్టార్స్‌తో తలపడాలంటే కేవలం ఒక గంట శిక్షణ సరిపోదు. పూర్తి స్థాయి ఫిట్‌నెస్ సాధించాకే మళ్లీ బరిలోకి దిగుతాను. ప్రతి ప్లేయర్ రిటైర్ అవుతాడు. నా విషయంలో మాత్రం వీడ్కోలు పలికేందుకు తుది గడువు పెట్టుకోలేదు' అని 2019లో చివరిసారి అంతర్జాతీయ టోర్నీ టైటిల్ గెలిచిన సైనా వ్యాఖ్యానించింది.



గెలిచే జట్టు ఫైనల్‌కు...





- ఆసియా కప్‌లో నేడు శ్రీలంకతో పాకిస్తాన్ పోరు
- మ్యాచ్ రద్దయితే ఫైనల్‌కు లంక
- మధ్యాహ్నం గం.3:00 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

కొలంబో: ఆసియా కప్‌లో 'సెమీఫైనల్'లాంటి మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. సూపర్-4 దశలో భాగంగా నేడు జరిగే పోరులో శ్రీలంకతో పాకిస్తాన్ తలపడుతుంది. రెండు వరుస విజయాలతో భారత జట్టు ఇప్పటికే ఫైనల్‌కు అర్హత సాధించగా... భారత్‌తో తుది పోరులో తలపడే ప్రత్యర్థిని ఈ మ్యాచ్ నిర్ణయించనుంది. నాలుగో జట్టయిన బంగ్లాదేశ్ ఇప్పటికే రెండు మ్యాచ్‌లలో ఓడి ఫైనల్ రేసు నుంచి తప్పుకుంది. ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా నేటి మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్లోకి అడుగు పెడుతుంది. భారత్ చేతిలో చిత్తుగా ఓడి ఆత్మవిశ్వాసం దెబ్బతినడంతో పాటు రన్‌రేట్‌లో పాక్ భారీగా వెనుకబడగా... టీమిండియా చేతిలో ఓడినా చివరి వరకు పోరాడిన లంక మెరుగైన స్థితిలో ఉంది. వర్షం కారణంగా నేటి మ్యాచ్ రద్దయితే లంక లాభపడుతుంది. మెరుగైన రన్‌రేట్‌తో ఆ జట్టు ఫైనల్‌కు చేరుతుంది.

బలాబలాల దృష్ట్యా చూస్తే పాకిస్తాన్, శ్రీలంక సమఉజ్జీలుగానే కనిపిస్తున్నాయి. అయితే సొంతగడ్డపై లంకకు అదనపు ప్రయోజనం ఉంది. భారత్‌తో పోరులో పాక్ పేలవ బ్యాటింగ్ బయటపడింది. ఓపెనర్లు ఫఖర్ జమాన్, ఇమామ్ ఉల్ హఖ్ అంతంత మాత్రమే ఆడుతుండగా, వరల్డ్ నంబర్‌వన్ బ్యాటర్‌గా బరిలోకి దిగిన బాబర్ ఆజమ్ దానికి తగినట్లుగా కనీస ప్రదర్శన ఇవ్వలేకపోయాడు. మిడిలార్డర్‌లో రిజ్వాన్, ఆగా సల్మాన్, ఇఫ్తికార్ కూడా జట్టు ఆశించిన రీతిలో స్కోర్లు చేయలేకపోతున్నారు. అయితే అన్నింటికంటే మించి ప్రధాన బౌలర్లు హారిస్ రవూఫ్, నసీమ్ షా ఈ మ్యాచ్‌కు దూరం కావడం పాక్‌కు పెద్ద దెబ్బ. నసీమ్ అధికారికంగా తప్పుకోగా అతని స్థానంలో జమాన్‌ను ఎంపిక చేశారు. రవూఫ్ కూడా ఆడే తక్కువగా ఉండటంతో దహాని బరిలోకి దిగవచ్చు. పాక్ స్పిన్ కూడా బలహీనంగా ఉంది. మరోవైపు లంక స్పిన్ బలమేంటో గత మ్యాచ్‌లో కనిపించింది. ఇదే జోరు కొనసాగిస్తే పాక్‌ను ఆ జట్టు సునాయాసంగా అడ్డుకోగలదు. వెలలాగె, అసలంక, తీక్షణలను పాక్ ఎలా ఆడుతున్నది చూడాలి. ప్రధానంగా కుశాల్ మెండిస్, నిసాంక, సమరవిక్రమ, ధనంజయలపై ఆ జట్టు బ్యాటింగ్ ఆధారపడి ఉంది. ఆల్‌రౌండర్‌గా కెప్టెన్ షనక కీలక ప్రదర్శన చేయాల్సి ఉంది.

155 ఇప్పటి వరకు శ్రీలంక, పాకిస్తాన్ జట్లు 155 వన్డే మ్యాచ్‌ల్లో తలపడ్డాయి. 92 మ్యాచ్‌ల్లో పాకిస్తాన్, 58 మ్యాచ్‌ల్లో శ్రీలంక గెలిచాయి. ఒక మ్యాచ్ 'టై' అయింది. నాలుగు మ్యాచ్‌లు రద్దయ్యాయి.

కెరీర్ బెస్ట్ రెండో ర్యాంక్‌లో గిల్

టాప్-10లో ముగ్గురు భారత బ్యాటర్లు



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో నాలుగేళ్ల తర్వాత టాప్-10లో ముగ్గురు భారత బ్యాటర్లకు చోటు దక్కింది. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో శుబ్‌మన్ గిల్ 759 రేటింగ్ పాయింట్లతో కెరీర్ బెస్ట్ రెండో ర్యాంక్‌కు చేరుకున్నాడు. భారత స్టార్స్ విరాట్ కోహ్లి 715 పాయింట్లతో ఎనిమిదో ర్యాంక్‌లో, కెప్టెన్ రోహిత్ శర్మ 707 పాయింట్లతో తొమ్మిదో ర్యాంక్‌లో ఉన్నారు. 2019లో రోహిత్, కోహ్లి, శిఖర్ ధావన్ టాప్-10 ర్యాంకింగ్స్‌లో నిలిచారు. పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ ఆజమ్ 863 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. పాక్ నుంచి కూడా ముగ్గురు టాప్-10లో ఉండటం విశేషం. ఇమామ్ ఉల్ హఖ్ 735 పాయింట్లతో ఐదో ర్యాంక్‌లో, ఫఖర్ జమాన్ 705 పాయింట్లతో పదో ర్యాంక్‌లో ఉన్నారు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో కుల్దీప్ యాదవ్ ఏడో ర్యాంక్‌లో, మొహమ్మద్ సిరాజ్ తొమ్మిదో ర్యాంక్‌లో నిలిచారు. ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో హార్దిక్ పాండ్యా ఒక స్థానం మెరుగుపర్చుకొని ఆరో ర్యాంక్‌లో ఉన్నాడు.

ద్వితీయ శ్రేణి ఆటగాళ్లతో...

ఆసియా క్రీడలకు భారత ఫుట్‌బాల్ జట్టు ప్రకటన


సునీల్ ఛెత్రి

న్యూఢిల్లీ: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) క్లబ్ జట్లు తమ పంతం నెగ్గించుకున్నాయి. ఆసియా క్రీడల్లో పాల్గొనేందుకు అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) ఎంపిక చేసిన పలువురు అగ్రశ్రేణి సీనియర్, జూనియర్ ఆటగాళ్లను ఐఎస్ఎల్ క్లబ్‌లు విడుదల చేయలేదు. 17 మంది సభ్యులతో కూడిన భారత జట్టులో కెప్టెన్ సునీల్ ఛెత్రి మినహా మిగతా వారంతా అనుభవంలేని ఆటగాళ్లే ఉన్నారు. సునీల్ ఛెత్రితోపాటు సీనియర్ గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్, సందేశ్ జింగాన్‌లను ఏఐఎఫ్ఎఫ్ ఎంపిక చేసింది. ఆసియా క్రీడల కోసం గుర్‌ప్రీత్‌ను బెంగళూరు ఎఫ్‌సీ, సందేశ్‌ను గోవా ఎఫ్‌సీ విడుదల చేసేందుకు ఆసక్తి చూపలేదు. భారత జట్టు వెంట రెగ్యులర్ కోచ్ ఇగోర్ స్టిమాక్ వెళ్తారా లేదా అనేది ఇంకా స్పష్టం కాలేదు. ఆసియా క్రీడల ఫుట్‌బాల్ మ్యాచ్‌లు ఈనెల 19న మొదలు కానుండగా... ఐఎస్ఎల్ పదో సీజన్‌కు ఈనెల 21న తెరలేస్తుంది.

భారత ఫుట్‌బాల్ జట్టు: ధీరజ్ సింగ్, గుర్మీత్ సింగ్ సుమిత్ రాఠి, నరేందర్ గెహ్లోట్, అమర్జీత్ సింగ్, శామ్యూల్ జేమ్స్, కేపీ రాహుల్, అబ్దుల్ రబీ, ఆయుశ్ దేవ్, బ్రైస్ మిరిండా, అజ్ఫర్ నూరాని, రహీమ్ అలీ, విన్సీ బరెటో, సునీల్ ఛెత్రి, రోహిత్ దాను, గుర్‌కీరత్ సింగ్, అనికేత్ జాదవ్.

స్టోక్స్ 182



లండన్: న్యూజిలాండ్‌తో మూడో వన్డేలో ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ (124 బంతుల్లో 182; 15 ఫోర్లు, 9 సిక్స్‌లు) విధ్వంసం సృష్టించాడు. నాలుగో సెంచరీ చేసిన క్రమంలో స్టోక్స్ వన్డేల్లో ఇంగ్లండ్ తరఫున అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పాడు. జేసన్ రాయ్ (180; 2018లో ఆస్ట్రేలియాపై) పేరిట ఉన్న ఈ రికార్డును స్టోక్స్ బద్దలు కొట్టాడు. 13 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన దశలో క్రీజులోకి వచ్చిన స్టోక్స్ ఓపెనర్ డేవిడ్ మలాన్ (96; 12 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి మూడో వికెట్‌కు 199 పరుగులు జోడించాడు. డబుల్ సెంచరీ దిశగా సాగుతున్న దశలో స్టోక్స్ 45వ ఓవర్‌లో ఆరో వికెట్‌గా వెనుదిరిగాడు. స్టోక్స్ అవుటయ్యాక ఇంగ్లండ్ 48.1 ఓవర్లలో 368 పరుగుల వద్ద ఆలౌటైంది. గత ఏడాది జూలైలో వన్డేలకు వీడ్కోలు పలికిన స్టోక్స్ ప్రపంచకప్ కోసం తన రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకున్నాడు.

ప్రిక్వార్టర్ ఫైనల్లో అశ్విని-తనీషా జోడీ

కౌలూన్: హాంకాంగ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో బుధవారం అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జోడీ మినహా మిగతా భారతీయ క్రీడాకారులకు నిరాశాజనక ఫలితాలు ఎదురయ్యాయి. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో అశ్విని-తనీషా ద్వయం 21-19, 21-19తో లి చియా సిన్-టింగ్ చున్ సున్ (చైనీస్ తైపీ) జోడీపై విజయం సాధించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో అశ్విని పొన్నప్ప-సుమీత్ రెడ్డి (భారత్) జోడీ 16-21, 21-16, 18-21తో చెన్ టాంగ్ జీ-తో ఈ వె (మలేసియా) జంట చేతిలో... సిక్కి రెడ్డి-రోహన్ కపూర్ (భారత్) ద్వయం 19-21, 10-21తో హీ యోంగ్ కాయ్ టెర్రీ-టాన్ వె హాన్ జెస్సికా (సింగపూర్) జోడీ చేతిలో ఓడిపోయాయి. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో లక్ష్య సేన్ బరిలోకి దిగకుండా తన ప్రత్యర్థికి 'వాకోవర్' ఇవ్వగా... ప్రియాన్షు రజావత్ 13-21, 14-21తో కాంటా సునెయామ (జపాన్) చేతిలో ఓటమి పాలయ్యాడు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ఆకర్షి 18-21, 10-21తో వైయోన్ లీ (జర్మనీ) చేతిలో, మాళవిక 14-21, 12-21తో జాంగ్ యి మాన్ (చైనా) చేతిలో పరాజయం చవిచూశారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో విష్ణువర్ధన్ గౌడ్-కృష్ణ ప్రసాద్ (భారత్) ద్వయం 14-21, 19-21తో సుంగ్ హున్ కో-బేక్ చోల్ షిన్ (కొరియా) జోడీ చేతిలో ఓడింది.


అశ్విని

సినిమా


● ప్రభాస్

సలార్ వాయిదా

ప్రభాస్ హీరోగా నటించిన చిత్రం 'సలార్'. ఈ మూవీలోని తొలి భాగం 'సలార్:సీజ్‌ఫైర్'ని ఈ నెల 28న విడుదల చేయాలనుకున్నారు. కానీ వాయిదా వేస్తున్నట్లుగా చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ''అనుకోని కారణాల వల్ల 'సలార్: సీజ్‌ఫైర్' సినిమాను సెప్టెంబరు 28న విడుదల చేయలేకపోతున్నాం. త్వరలో కొత్త విడుదల తేదీని ప్రకటిస్తాం'' అంటూ సోషల్ మీడియా వేదికగా ఓ నోట్‌ను విడుదల చేశారు మేకర్స్. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ సినిమాలో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించారు.

యుద్ధానికి సిద్ధం

వెండితెరపై కథానాయకుడు కత్తి దూస్తే.. గుర్రపు స్వారీ చేస్తూ యుద్ధం చేస్తే... విల్లు ఎక్కుపెడితే చూసే ప్రేక్షకులకు ఓ థ్రిల్. రెగ్యులర్‌గా వచ్చే ఫైట్స్‌కి భిన్నంగా సిల్వర్ స్క్రీన్‌పై 'వార్' కనిపిస్తే 'వావ్' అనకుండా ఉండలేరు. కొందరు హీరోలు వెండితెరపై యుద్ధం చేయడానికి రెడీ అయ్యారు. ఆ వారియర్స్ గురించి ఓ లుక్ వేయండి.

దిక్కులెల్ల గెలిచినోడు..
'కొండల కోనల్లో కోటి పులులు పట్టినోడు, ముక్కోటి చుక్కలెక్కి దిక్కులెల్ల గెలిచినోడు.. ఒక్కడే ఒక్క వీరుడురా.. వాడే కంగ'.. కంగువా' సినిమాలో హీరోగా సూర్య పాత్రను చిత్రబృందం వివరించిన తీరు ఇది. దీన్నిబట్టి ఈ సినిమాలో సూర్య పాత్రను ఈ చిత్రదర్శకుడు శివ చాలా పవర్‌ఫుల్‌గా తీర్చిదిద్ది ఉంటారని ఊహించవచ్చు. ఈ పీరియాడికల్ ఫిల్మ్‌లో కొన్ని సన్నివేశాల్లో కంగ అనే యోధుడి పాత్రలో కనిపిస్తారు సూర్య. ఇప్పటికే ఈ సన్నివేశాలను చిత్రీకరించారు. అంతేకాదు..'కంగువా' సినిమాలో ఈ సీన్స్ హైలైట్‌గా ఉంటాయని కోలీవుడ్ సమాచారం. 17వ శతాబ్దానికి చెందిన ఓ వీరుడు సమకాలీన పరిస్థితులకు కనెక్ట్ అయ్యే ఓ పాయింట్‌తో 'కంగువా' చిత్రాన్ని దర్శకుడు శివ తెరకెక్కించినట్లుగా తెలుస్తోంది. ఈ చిత్రంలో దిశా పటానీ హీరోయిన్‌గా నటించారు. 'కంగువా' తొలి భాగం ఏప్రిల్‌లో విడుదల కానుంది.


● మోహన్‌లాల్


● సూర్య


● నిఖిల్

ది వారియర్
విభిన్న సినిమాలు, వైవిధ్యభరితమైన పాత్రల్లో నటిస్తూ ఎప్పుడూ బిజీగా ఉంటారు హీరో మోహన్‌లాల్. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'వృషభ'. 'ది వారియర్ అరైజ్' అనేది ఉపశీర్షిక. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. తొలి షెడ్యూల్ పూర్తయింది. కాగా ఈ చిత్రం నుంచి విడుదలైన ఓ లుక్ కొన్ని సీన్స్‌లో మోహన్‌లాల్ వారియర్‌గా కనిపిస్తారన్నట్లుగా స్పష్టం చేస్తోంది. దీనికి తోడు క్యాప్షన్‌లో 'వారియర్' ప్రస్తావన ఉండటంతో మోహన్‌లాల్ వారియర్‌గా కనిపించే నిడివి కూడా ఎక్కువే అని ఊహిస్తున్నారు ఆయన అభిమానులు. తెలుగు, మలయాళం భాషల్లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో రోషన్ ఓ హీరోగా నటిస్తున్నాడు. జహ్రా ఖాన్, శనయ కపూర్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. నందకిశోర్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది. అలాగే మోహన్‌లాల్ నటించి, తొలిసారి దర్శకత్వం వహించిన పీరియాడికల్ సోషియో ఫ్యాంటసీ ఫిల్మ్ 'బరోజ్'. ఈ చిత్రంలో ఓ నిధిని కాపాడే యోధుడిగా కనిపిస్తారాయన.

స్వయంభూ
వియత్నాంలో మార్షల్ ఆర్ట్స్, గుర్రపు స్వారీ, కత్తి యుద్ధం.. వంటి యుద్ధ విద్యల్లో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు హీరో నిఖిల్. ఎందుకంటే 'స్వయంభూ' సినిమా కోసం. ఈ పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్‌లో నిఖిల్ యుద్ధ వీరుడిగా కనిపిస్తారు. నిఖిల్ శిక్షణ పూర్తయిన తర్వాత ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ పూర్తి స్థాయిలో ప్రారంభం కానుంది. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

ఇలా 'వార్' బ్యాక్‌డ్రాప్‌లో దక్షిణాదిన మరికొన్ని చిత్రాలు రూపొందుతున్నాయి.



వాళ్లంతా గొప్పవాళ్లు.. నేను కాను - ఛోటా కె.నాయుడు

''పెదకాపు 1' సినిమాలోని కొన్ని సన్నివేశాలను డైరెక్టర్ వీవీ వినాయక్ చూశారు. విజువల్స్ ఆయనకు బాగా నచ్చడంతో పీసీ శ్రీరామ్‌గారితో నన్ను పోల్చారు. అయితే పీసీ శ్రీరామ్‌గారితో పోల్చుకునేటంత గొప్ప వ్యక్తిని కాదు నేను. పీసీ శ్రీరామ్, వీఎస్ఆర్ స్వామి, విన్సెంట్ (ఛాయాగ్రాహకులు).. వాళ్లంతా గొప్పవాళ్లు'' అని కెమెరామేన్ ఛోటా కె. నాయుడు అన్నారు. విరాట్ కర్ణ, ప్రగతి శ్రీవాస్తవ జంటగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పెదకాపు 1'. మిర్యాల సత్యనారాయణ రెడ్డి సమర్పణలో మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 29న రిలీజ్ కానుంది. ఈ చిత్రానికి ఛాయాగ్రాహకుడిగా చేసిన ఛోటా కె.నాయుడు విలేకరులతో పంచుకున్న విశేషాలు...

- 'కొత్త బంగారు లోకం' చిత్రంతో శ్రీకాంత్ అడ్డాల, నా ప్రయాణం మొదలైంది. అప్పటి నుంచి ఇప్పటివరకూ తన ప్రతి సినిమా కథ నాకు చెప్తాడు. ఇద్దరం కలసి చేద్దామనుకుంటాం కానీ 'పెదకాపు 1'కి కుదిరింది. తన సినిమాల్లాగానే శ్రీకాంత్ చాలా కూల్‌గా ఉంటాడు. తనని చూస్తే నాకు కె.విశ్వనాథ్‌గారిలా అనిపిస్తారు. కూల్‌గా ఉండే తను 'పెదకాపు 1' లాంటి చిత్రం చేసి, ఇంత మంచి ఔట్‌పుట్ ఇవ్వడం నాకు షాక్ అనిపించింది. శ్రీకాంత్ అడ్డాలకి నటుడిగా ఇది తొలి చిత్రమైనా సింగిల్ టేక్‌లో చేసేసేవాడు.. తను నటించిన ప్రతి సీన్‌ని మా నిర్మాత రవీందర్ రెడ్డిగారు డైరెక్ట్ చేశారు.
- 'పెదకాపు 1' కథ 1983 నేపథ్యంలో జరుగుతుంది. ఈ కథ కొత్త ప్యాట్రన్, కొత్త కలర్స్, మేకింగ్‌ని డిమాండ్ చేసింది.. దాన్ని తీసుకురావడం నాకు సవాల్‌గా అనిపించింది. ఈ విషయంలో క్రెడిట్ దర్శకుడిదే.
- నేనెప్పుడూ హీరో స్థానానికి గౌరవం ఇస్తాను. స్టార్ హీరోనా, పెద్ద హీరోనా, చిన్న హీరోనా అని చూడను. విరాట్‌కి ఇది తొలి సినిమా అయినా అనుభవం ఉన్న నటుడిలా చేశాడు. హీరోయిన్ ప్రగతికి కూడా మొదటి సినిమా అయినా చాలా బాగా చేసింది. నటి అనసూయ కూడా తన పాత్రని మేము అనుకున్నదానికంటే బాగా చేసింది.. మిక్కీ జె.మేయర్ ఇలాంటి చక్కని నేపథ్య సంగీతం ఇవ్వడం నన్ను సర్‌ప్రైజ్ చేసింది.
- 'పెదకాపు 1'ని రవీందర్ రెడ్డిగారు కాకుండా మరో నిర్మాత అయితే ఐదారు కోట్లలో సినిమా తీయమని చెప్పేవారు. కానీ, ఈ కథ ముప్పై నలభై కోట్లు డిమాండ్ చేస్తుంది. ఆయన కాబట్టి ఇంత భారీ బడ్జెట్‌తో తీశారు. పైగా తన బావమరిదిని హీరోగా లాంచ్ చేస్తున్నారు. 'పెదకాపు 2' చిత్రం కూడా ఉంటుంది.
- 'పెదకాపు 1' కోసం 1983 నాటి వాతావరణం సృష్టించడానికి చాలా కష్టపడ్డాం. ఈ మూవీలో హీరో, అతని స్నేహితులు జెండా కర్ర పాతే సన్నివేశం చిత్రీకరించడం నా కెరీర్‌లో అద్భుతం. నేను చాలా గర్వంగా చెప్పుకునే ఎపిసోడ్ ఇది. నెక్స్ట్ చిరంజీవిగారి 157వ సినిమా చేస్తున్నాను.. నవంబర్‌లో షూటింగ్ ప్రారంభమవుతుంది.


● విక్రాంత్, రుక్సార్ ఢిల్లార్

ఏమా అందం

విక్రాంత్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'స్పార్క్.. ఎల్.ఐ.ఎఫ్.ఈ'. మెహరీన్ ఫిర్జాదా, రుక్సార్ ధిల్లాన్ హీరోయిన్లు. డెఫ్ ఫ్రాగ్ ప్రొడక్షన్స్‌పై రూపొందిన ఈ చిత్రం నవంబరు 17న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలోని 'ఏమా అందం.. ఏమా అందం.. భామా నీకు భువితో ఏమి సంబంధం' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను చిత్ర యూనిట్ విడుదల చేసింది. విక్రాంత్, రుక్సార్ కాంబినేషన్‌లో ఈ పాట చిత్రీకరించారు. సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరచిన ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, సిద్ శ్రీరామ్ పాడారు.


● భరత్ నరేన్, బాబీ కొల్లి, రాజా విక్రమ్

వారి కళ్లల్లో ఆ నమ్మకం కనిపిస్తోంది - డైరెక్టర్ బాబీ కొల్లి

''దిల్ సే' సినిమా ట్రైలర్ చాలా బాగుంది.. ఒక పాజిటివ్ వైబ్ కనిపిస్తోంది. ఈ చిత్రంతో విజయం అందుకుంటామనే నమ్మకం యూనిట్ కళ్లల్లో కనిపిస్తోంది. అందుకు తగ్గట్టే 'దిల్ సే' పెద్ద విజయం సాధించాలి'' అని డైరెక్టర్ బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) '' అన్నారు. రాజా విక్రమ్ హీరోగా భరత్ నరేన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దిల్ సే'. శ్రీ అక్కియన్ ఆర్ట్స్ బ్యానర్‌పై శ్రీధర్ మరిసా నిర్మించిన ఈ సినిమా ఈ నెల 16 నుంచి ఓ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని బాబీ కొల్లి విడుదల చేశారు. భరత్ నరేన్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో మాస్క్ వేసుకున్న అమ్మాయి (హీరోయిన్) ఎవరు? అనేది ప్రేక్షకుల్లో ఆసక్తిని కలిగించడానికే చెప్పడం లేదు'' అన్నారు. ''దిల్ సే' నా మొదటి చిత్రం '' అన్నారు రాజా విక్రమ్.

అష్టదిగ్బంధనం.. ఓ పజిల్


● విషిక, సూర్య

''అష్టదిగ్బంధనం' పవర్‌ఫుల్ టైటిల్. ట్రైలర్‌లో మంచి సస్పెన్స్ కనిపడుతోంది. అలాగే ప్రేక్షకులను అష్టదిగ్బంధనం చేసే అంశాలు ఈ చిత్రంలో చాలానే ఉన్నాయి'' అని 'బేబీ' మూవీ డైరెక్టర్ సాయి రాజేష్ అన్నారు. సూర్య, విషిక జంటగా బాబా పీఆర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అష్టదిగ్బంధనం'. ఎంకేఏకేఏ ఫిలిం ప్రొడక్షన్స్ సమర్పణలో మనోజ్ కుమార్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని సాయి రాజేష్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా బాబా పీఆర్ మాట్లాడుతూ– ''నా మొదటి సినిమా 'సైదులు'.. రెండో చిత్రం 'అష్టదిగ్బంధనం'. క్రైమ్, యాక్షన్, థ్రిల్, పజిల్ లాంటి సినిమా ఇది'' అన్నారు. ''కథను నమ్మి ఈ సినిమా నిర్మించాను'' అన్నారు మనోజ్ కుమార్ అగర్వాల్. ''సినిమా పక్కా హిట్ అని నమ్ముతున్నాం'' అన్నారు సూర్య.



నా కల నెరవేరుతోంది - గోల్డీ నిస్సీ

''ఛాంగురే బంగారురాజా' కుటుంబంతో కలిసి హాయిగా చూడదగ్గ సినిమా. ఇందులో మంగరత్నం అనే పోలీస్ కానిస్టేబుల్ పాత్ర చేశాను. మెకానిక్ బంగార్రాజుగా కార్తీక్ నటించారు. మా ఇద్దరి మధ్య ప్రేమ ప్రయాణం చాలా సరదాగా ఉంటుంది. రవితేజగారి నిర్మాణంలో నా మొదటి సినిమా చేయడం చాలా అదృష్టంగా భావిస్తున్నాను'' అని హీరోయిన్ గోల్డీ నిస్సీ అన్నారు. కార్తీక్ రత్నం హీరోగా సతీష్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'ఛాంగురే బంగారురాజా'. రవితేజ నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా గోల్డీ నిస్సీ మాట్లాడుతూ–''నేను తెలుగమ్మాయిని. కొన్ని షార్ట్ ఫిలిమ్స్ చేశాను. హీరోయిన్‌గా నా తొలి సినిమా 'ఛాంగురే బంగారురాజా'. రవితేజగారిని కలిసినప్పుడు 'సినిమా చూశాను. నీకు ఇది తొలి సినిమా అయినా భయం లేకుండా నటించావ్' అని మెచ్చుకోవడం హ్యాపీ. నన్ను నేను పెద్ద తెరపై చూసుకోవాలనే కల నెరవేరుతుండటం చాలా ఎగ్జయిటింగ్‌గా ఉంది'' అన్నారు.

సాక్షి బిజినెస్
గురువారం
14-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	246	67,467
నిఫ్టీ ▲	77	20,070

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30కి ముగింపు)

సూచీ			
నాస్‌డాక్	13,861	▲	88
డోజోన్స్	34,679	▲	33
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,526	▽	2
డాక్స్	15,654	▽	62
షాంఘై	3,123	▽	14
నికాయ్	32,706	▽	70

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	58,200
బంగారం (22 క్యారట్)	55,430
వెండి (కేజీ)	77,000

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎపతం	82.18	83.85
£	బ్రిటన్ పౌండ్	ఎపతం	102.97	105.34
€	యూరో	ఎపతం	87.68	90.79
¥	జపాన్ ఎన్ (100)	ఎపతం	55.49	57.21
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎపతం	52.10	54.43
S$	సింగపూర్ డాలర్	ఎపతం	60.00	61.94
SAR	సౌదీ రియాల్	ఫారెక్స్	21.17	22.80
UAE D	యూఏఈ దిర్హామ్	ఫారెక్స్	21.70	23.49
¥	చైనా యువాన్	ఫారెక్స్	10.28	12.35

భారత్ నుంచి టెస్లా 1.9 బి. డాలర్ల కొనుగోళ్లు

కేంద్ర మంత్రి గోయల్ వెల్లడి



న్యూఢిల్లీ: అమెరికన్ ఎలక్ట్రిక్ వాహనాల దిగ్గజం టెస్లా ఈ ఏడాది భారత్ నుంచి 1.9 బిలియన్ డాలర్ల విలువ చేసే పరికరాలను కొనుగోలు చేసే యోచనలో ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. గతేడాది 1 బిలియన్ డాలర్ల మేర కొనుగోళ్లు చేసిందని ఆటోమొబైల్ పరికరాల తయారీ సంస్థల సమాఖ్య ఏసీఎంఏ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా తెలిపారు. భారత్ మార్కెట్లో తమ కార్లను విక్రయించుకోవడానికి కొన్ని ప్రత్యేక మినహాయింపులు కావాలని టెస్లా చీఫ్ ఎలాన్ మస్క్ కేంద్రాన్ని కోరుతున్న నేపథ్యంలో గోయల్ వెల్లడించిన వివరాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు, దేశీ ఎలక్ట్రిక్ వాహనాల రంగంలోకి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు కేంద్రం అన్ని చర్యలూ తీసుకుంటోందని మంత్రి చెప్పారు. విద్యుత్ వాహనాల పరిశ్రమ ప్రపంచవ్యాప్తంగా వృద్ధి చెందుతున్న తరహాలోనే భారత్‌లోనూ ఎదగగలదని ఆయన తెలిపారు. ఎలక్ట్రిక్, ఇతర వాహనాల డిమాండ్ మధ్య వ్యత్యాసం గణనీయంగా తగ్గిందని.. రాబోయే రోజుల్లో మరింత తగ్గగలదని గోయల్ చెప్పారు.

సాయి సిల్క్స్ ఐపీవో 20న

కళామందిర్, కేఎల్ఎం బ్రాండ్ స్టోర్ల సంస్థ

న్యూఢిల్లీ: సంప్రదాయ దుస్తుల రిటైలర్ సాయి సిల్క్స్ (కళా మందిర్) పబ్లిక్ ఇష్యూ ఈ నెల 20న ప్రారంభంకానుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 18న షేర్లను విక్రయించనుంది. 22న ముగియనున్న ఇష్యూలో భాగంగా కంపెనీ రూ. 600 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి అదనంగా 2.7 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 280 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు కేటాయించనుంది. కళామందిర్, వరమహాలక్ష్మి సిల్క్స్, మందిర్, కేఎల్ఎం ఫ్యాషన్ మాల్ బ్రాండ్లతో స్టోర్లను నిర్వహిస్తున్న హైదరాబాద్ కంపెనీ 2023 మార్చికల్లా రూ. 1,351 కోట్ల టర్నోవర్ సాధించింది. రూ. 98 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2023 జులైకల్లా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులలో 54 స్టోర్లు నిర్వహిస్తోంది.

ఈ-టూవీలర్ కంపెనీలకు చెక్!

- ప్రోత్సాహకాలు తిరిగివ్వకుంటే.. చట్టపరమైన చర్యలు
- కేంద్ర ప్రభుత్వం కఠిన వైఖరి
- లిస్టులో హీరో ఎలక్ట్రిక్, ఒకినావా తదితర సంస్థలు
- ఫేమ్–2 నిబంధనలను ఉల్లంఘించినందుకే



న్యూఢిల్లీ: దేశీయంగా ఎలక్ట్రిక్ వాహనాల తయారీని, వాడకాన్ని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఫేమ్–2 స్కీమ్ నిబంధనలను ఉల్లంఘించిన కంపెనీలపై చట్టపరమైన చర్యలకు కూడా కేంద్రం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా, పథకం కింద పొందిన రూ. 469 కోట్ల పైచిలుకు సబ్సిడీ ప్రోత్సాహకాలను తిరిగి చెల్లించాలంటూ ఏడు ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థలకు నోటీసులు ఇచ్చింది. హీరో ఎలక్ట్రిక్, ఒకినావా ఆటోటెక్, యాంపియర్ ఈవీ, రివోల్ట్ మోటార్స్, బెన్‌లింగ్ ఇండియా, ఎమో మొబిలిటీ, లోహియా ఆటో ఈ జాబితాలో ఉన్నట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. వీటిలో రివోల్ట్ మోటార్స్ మాత్రమే ప్రోత్సాహకాలను తిరిగి చెల్లించేందుకు ముందుకు వచ్చినట్లు వివరించారు. మిగతా సంస్థలు ఇంకా స్పందించలేదని పేర్కొన్నారు. రీఫండ్‌కు డెడ్‌లైన్ దాదాపు ముగిసిపోతోందని చెప్పారు. 'వచ్చే వారం కేంద్రం కొన్ని నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. చట్టపరమైన చర్యలకు గల అవకాశాలను పరిశీలిస్తున్నాం' అని అధికారి వివరించారు.

ఉల్లంఘనలు ఇలా..

ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనాల వినియోగాన్ని వేగవంతం చేసేలా రూ. 10,000 కోట్ల ప్రోత్సాహకాలతో కేంద్రం 2019లో ఫేమ్–2 పథకాన్ని ఆవిష్కరించింది. ఇది 2015లో రూ. 895 కోట్లతో ప్రకటించిన తొలి ఫేమ్ వెర్షన్‌కు కొనసాగింపు. ఫేమ్–2 పథకం నిబంధనల ప్రకారం .. దేశీయంగా తయారైన పరికరాలతో ఎలక్ట్రిక్ వాహనాలను ఉత్పత్తి చేసిన కంపెనీలకు ప్రోత్సాహకాలు లభిస్తాయి. అయితే, పలు కంపెనీలు వీటిని ఉల్లంఘిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో ఈ స్కీముతో ప్రయోజనం పొందిన కంపెనీలపై భారీ పరిశ్రమల శాఖ విచారణ జరిపింది. వీటిలో ఏడు సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా దిగుమతి చేసుకున్న పరికరాలను ఉపయోగించినట్లుగా వెల్లడైంది. దీంతో గత ఆర్థిక సంవత్సరం సబ్సిడీలను విడుదల చేయడంలో కేంద్రం ఆలస్యం చేసింది. ఫలితంగా అటు సబ్సిడీ బకాయిలు చిక్కుబడిపోయి, ఇటు మార్కెట్ వాటా కోల్పోయి ఎలక్ట్రిక్ వాహన సంస్థలు దాదాపు రూ. 9,000 కోట్లు నష్టపోయినట్లు విద్యుత్ వాహనాల తయారీ సంస్థల సమాఖ్య ఎస్ఎంఈవీ అంచనా వేసింది. కొనుగోళ్లపై పొందిన రిబేట్లను తిరిగి చెల్లించేలా కస్టమర్లకు సూచించే అవకాశాలను పరిశీలించాలంటూ సబ్సిడీలపరమైన మద్దతు కోల్పోయిన ఏడు ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల కంపెనీలు కేంద్రాన్ని కోరాయి.

ఇస్రోతో అమెజాన్ వెబ్ సర్వీసెస్ జట్టు

న్యూఢిల్లీ: క్లౌడ్ కంప్యూటింగ్ ద్వారా స్పేస్–టెక్ సంబంధ నవకల్పనలకు ఊతమిచ్చేలా ఇస్రో, ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ (ఇన్–స్పేస్)తో అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. అంతరిక్ష పరిశోధనలకు సంబంధించి కొత్త ఆవిష్కరణలు చేసే దిశగా స్పేస్ స్టార్టప్‌లు, పరిశోధన సంస్థలు, విద్యార్థులకు క్లౌడ్ టెక్నాలజీలను అందుబాటులో ఉంచడానికి ఈ ఒప్పందం ఉపయోగపడగలదని ఏడబ్ల్యూఎస్ ఇండియా, సౌత్ ఏషియా డైరెక్టర్ శాలిని కపూర్ తెలిపారు. అంతరిక్ష రంగం మరింత మెరుగైన నిర్ణయాలను, వేగవంతంగా తీసుకునేందుకు క్లౌడ్ కంప్యూటింగ్ ఆధారిత ఆవిష్కరణలు సహాయపడగలవని ఆమె వివరించారు.

డాక్యుమెంట్లు తిరిగి ఇవ్వకపోతే రోజుకు రూ. 5 వేల పరిహారం

- రుణ పూర్తి చెల్లింపులపై బ్యాంకింగ్‌కు ఆర్‌బీఐ ఆదేశాలు
- 30 రోజుల్లో పత్రాలన్నింటినీ తిరిగి ఇవ్వాలని నిర్దేశం



న్యూఢిల్లీ: రుణం పూర్తి చెల్లింపుల తర్వాత రుణానికి సంబంధించి తనఖాగా ఉంచిన ఒరిజినల్ స్థిర లేదా చర ఆస్తి పత్రాలు అన్నింటినీ రుణగ్రహీతకు 30 రోజుల లోపు తిరిగి ఇవ్వాలని రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) బ్యాంకులకు, ఫైనాన్స్ సంస్థలకు స్పష్టం చేసింది. ఏదైనా ఆలస్యం జరిగితే రోజుకు రూ. 5 వేలు పరిహారంగా చెల్లించాలని స్పష్టం చేసింది. అదేవిధంగా ఏదైనా రిజిస్ట్రీలో నమోదైన చార్జీలను అన్నింటినీ నిర్దేశిత 30 రోజుల్లో తీసివేయాలని కూడా ఒక నోటిఫికేషన్‌లో ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఈ తరహా పలు ఫిర్యాదుల నమోదు నేపథ్యంలో బ్యాంకింగ్ రెగ్యులేటర్ తాజా ఆదేశాలు ఇచ్చింది. డాక్యుమెంట్లు తిరిగి ఇవ్వడంలో నెల రోజులు దాటితే ఈ జాప్యానికి స్పష్టమైన కారణాలను రుణగ్రహీతకు తెలియజేయాల్సి ఉంటుందని ఆర్‌బీఐ బ్యాంకులను ఆదేశించింది. డాక్యుమెంట్లను తిరిగి ఇవ్వడానికి సంబంధించిన విధివిధానాల వివరాలను బ్యాంకింగ్ లేదా ఆర్థిక సంస్థలు తమ వెబ్‌సైట్‌లో ఉంచాలని సూచించింది.

నష్టం జరిగితే.. మరో 30 రోజులు

ఒరిజినల్ చర లేదా స్థిర ఆస్తి పత్రాలు కనబడకుండా పోవడం లేదా ఏదైనా నష్టం జరిగితే అటువంటి పత్రాల డూప్లికేట్ లేదా సర్టిఫైడ్ కాపీలను పొందడంలో రుణగ్రహీతకు బ్యాంకులు, ఆర్థిక సంస్థలు పూర్తిగా సహాయపడాలని కూడా ఆర్‌బీఐ నిర్దేశించింది. ఇందుకు మరో 30 రోజుల సమయాన్ని తీసుకోవచ్చని పేర్కొంది. ఆ తర్వాతే (60 రోజుల తర్వాత) జాప్యానికి రోజుకు రూ.5 వేల పరిహారం నిబంధన వర్తిస్తుందని పేర్కొంది. కాగా, ఈ పరిహారం... ఇతర ఏదైనా (వర్తించే) చట్టం ప్రకారం ఏదైనా ఇతర పరిహారం పొందేందుకు రుణగ్రహీతకు ఉండే హక్కులకు ఎటువంటి భంగం కలిగించబోదని ఆర్‌బీఐ స్పష్టం చేయడం గమనార్హం. 2023 డిసెంబరు 1 తర్వాత ఒరిజినల్ చర లేదా స్థిరాస్తి పత్రాలను విడుదల చేసే అన్ని కేసులకు ఈ తాజా ఆదేశాలు వర్తిస్తాయని ఆర్‌బీఐ తెలిపింది.

సువెన్ ఫార్మాలో రూ. 9,589 కోట్ల ఎఫ్‌డీఐ

'అడ్వెంట్' పెట్టుబడులకు కేంద్రం ఓకే..

న్యూఢిల్లీ: ఔషధ రంగ సంస్థ సువెన్ ఫార్మాలో ప్రైవేట్ ఈక్విటీ ఫండ్ అడ్వెంట్ ఇంటర్నేషనల్ వాటాల కొనుగోలుకు ఆమోదముద్ర పడింది. ఇందుకు సంబంధించి అడ్వెంట్‌కు చెందిన సైప్రస్ సంస్థ బెర్హ్యాండా రూ. 9,589 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ) ప్రతిపాదనను కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదించింది. సువెన్ ఉత్పత్తి సామర్థ్యాలను విస్తరించుకోవడానికి, కొత్తగా మరిన్ని ఉద్యోగాలు కల్పించడానికి ఇది తోడ్పడనుంది.



హైదరాబాద్‌కు చెందిన సువెన్ ఫార్మాలో 50.1 శాతం వాటాలు కొనుగోలు చేసేందుకు అడ్వెంట్ ఇంటర్నేషనల్ గతేడాది డిసెంబర్‌లో ఒప్పందం కుదుర్చుకుంది. దీనితో పాటు ఓపెన్ ఆఫర్ కింద మరో 26 శాతం వాటాలు కూడా కొనుగోలు చేయాల్సి ఉండటంతో డీల్ మొత్తం విలువ రూ. 9,589 కోట్లయ్యింది.

బుధవారం బీఎస్‌ఈలో సువెన్ షేర్లు 0.75% లాభపడి రూ. 517.40 వద్ద ముగిశాయి.

20,000 పైన నిఫ్టీ ముగింపు

- తొమ్మిదో రోజూ సెన్సెక్స్ ర్యాలీ
- బ్యాంకులు, ఇంధన షేర్లకు డిమాండ్



ముంబై: దేశీయంగా ఆగస్టు రిటైల్ ద్రవ్యోల్బణం, జూలై పారిశ్రామికోత్పత్తి గణాంకాలు మెప్పించడంతో సెన్సెక్స్ ర్యాలీ తొమ్మిదో రోజూ కొనసాగింది. ఇంట్రాడేలో 344 పాయింట్లు బలపడి ఈ సూచీ చివరికి 246 పాయింట్ల లాభంతో 67,467 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 77 పాయింట్లు బలపడి తొలిసారి 20 వేల స్థాయిపై జీవిత కాల గరిష్టం 20,070 వద్ద ముగిసింది. రోజంతా 19,944 – 20,097 శ్రేణిలో కదలాడింది. ఆటో, ఐటీ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ముఖ్యంగా బ్యాంకింగ్, ఇంధన, టెలికం షేర్లకు డిమాండ్ లభించింది. క్రితం ట్రేడింగ్‌లో ఈ ఏడాదిలోనే అతిపెద్ద పతనాన్ని చవిచూసిన చిన్న, మధ్య తరహా షేర్లలో రికవరీ కన్పించింది. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు దాదాపు ఒక శాతం ర్యాలీ చేశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,632 కోట్ల షేర్లను అమ్మేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.850 కోట్ల షేర్లను కొన్నారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు...

- కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ షేరు 20% పెరిగి రూ.51 వద్ద అప్పర్ సర్క్యూట్‌ని తాకింది. ఇండస్‌ఇండ్ బ్యాంక్‌తో ఓ ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా ఎన్‌సీఎల్‌టీ దివాలా పరిష్కార ప్రక్రియ గండం నుంచి గట్టెక్కగలిగింది. బీఎస్‌ఈలో 24.01 లక్షల ఈక్విటీలు చేతులు మారాయి.
- పర్యావరణ అనుకూల రవాణా అనుసంధాన ప్రాజెక్టుల్లో రూ.24,750 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమవడంతో కోల్ ఇండియా కంపెనీ షేరు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్‌ఈలో 3% పెరిగి రూ.280 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ సూచీలో అత్యధికంగా లాభపడిన షేరు ఇదే.
- ప్రభుత్వరంగ బ్యాంకుల షేర్లకు భారీ డిమాండ్‌తో బీఎస్‌ఈ పీఎస్‌బీ సూచీ 4% ఎగసింది. పీఎన్‌బీ 8.50%, బ్యాంక్ ఆఫ్ బరోడా 8%, సెంట్రల్ బ్యాంక్ 7%, పీఎస్‌బీ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యుకో బ్యాంక్ షేర్లు 6% ర్యాలీ చేశాయి. మహారాష్ట్ర బ్యాంక్, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా 5% పెరిగాయి. యూనియన్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, ఎస్‌బీఐ షేర్లు 3–1% లాభపడ్డాయి.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: జనరల్ స్టడీస్ కోసం | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

సెంట్రల్ రైల్వే-ఆర్ఆర్‌సీలో 2409 యాక్ట్ అప్రెంటిస్‌లు

ముంబైలోని సెంట్రల్ రైల్వే–రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ).. సెంట్రల్ రైల్వే పరిధిలోని వర్క్‌షాప్‌లు, డివిజన్‌లలో యాక్ట్ అప్రెంటిస్ శిక్షణ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 2409
» అర్హత: పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» ట్రేడులు: ఫిట్టర్, వెల్డర్, కార్పెంటర్, పెయింటర్, టైలర్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, పీఏఎస్‌ఏఏ, మెకానిక్ డీజిల్, సీవోపీఏ, షీట్ మెటల్ వర్కర్, మెకానిక్ మెషిన్ టూల్స్ మెయింటెనెన్స్, ఐటీ అండ్ ఈఎస్ఎం.
» వయసు: 29.08.2023 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 28.09.2023
» వెబ్‌సైట్: https://www.rrccr.com

ఏపీ సార్వత్రిక విద్యలో ఇంటర్‌లో ప్రవేశాలు

అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» గ్రూప్‌లు: ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ, ఎంఈసీ, హెచ్‌ఈసీ, సీఈసీ.
» అర్హత: పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఇంటర్ మధ్యలోనే మానేసిన అభ్యర్థులు అర్హులే.
» వయసు:అభ్యర్థికి 31.08.2023 నాటికి 15 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి లేదు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 25.09.2023
» వెబ్‌సైట్: apopenschool.ap.gov.in


ఏపీ సార్వత్రిక విద్యలో పదో తరగతిలో ప్రవేశాలు

అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» వయసు: 31.08.2023 నాటికి అభ్యర్థికి 14 ఏళ్లు నిండా ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధన లేదు. ఇందుకు జనన ధ్రువీకరణ పత్రం లేదా టీసీని సమర్పించాల్సి ఉంటుంది.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 25.09.2023
» వెబ్‌సైట్: apopenschool.ap.gov.in

ఇస్రో.. కెరీర్ లాంచింగ్

» డిప్లొమా నుంచి డాక్టరేట్ వరకు పలు అవకాశాలు
» సైన్స్, మ్యాథమెటిక్స్, ఇంజనీరింగ్‌తో కొలువులు
» ఇస్రో ఆధ్వర్యంలో సెంట్రలైజ్డ్ రిక్రూట్‌మెంట్ బోర్డ్
» అంతరిక్ష పరిశోధన అభ్యర్థులకు అద్భుత వేదిక



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ.. ఇస్రోగా సుపరిచితం! తాజాగా చంద్రయాన్-3, ఆదిత్య ఎల్-1 విజయంతో ఇస్రో పేరు మారుమోగుతోంది. ఈ ప్రయోగాల్లో పాల్పంచుకున్న శాస్త్రవేత్తలకు, సిబ్బందికి యావత్ దేశం జేజేలు పలుకుతోంది. ఈ నేపథ్యంలో ఇస్రో విజయాల్లో యువత భాగస్వాములవ్వాలంటే ఏం చేయాలి? ఈ అంతరిక్ష పరిశోధన సంస్థలో కెరీర్‌కు మార్గాలు ఏమిటి; ఎలాంటి అర్హతలుంటే.. ఇస్రో కొలువు సొంతమవుతుంది.. నియామక విధానాల గురించి తెలుసుకుందాం..

ఇస్రో.. సైన్స్, మ్యాథమెటిక్స్, ఇంజనీరింగ్, టెక్నాలజీ విభాగాల్లో డిప్లొమా నుంచి పీహెచ్‌డీ వరకూ.. ఆయా అర్హతలకు అనుగుణంగా నియామకాలు చేపడుతోంది. ముఖ్యంగా బీటెక్‌లో ఏరోస్పేస్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఆస్ట్రానమీ, ఆస్ట్రో ఫిజిక్స్; అలాగే మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌తోనూ ఉద్యోగావకాశాలు లభిస్తాయి. వీటికి సంబంధించి ఈ అంతరిక్ష సంస్థ నిత్యం నోటిఫికేషన్లు విడుదల చేస్తుంది. ఇందుకోసం ఇస్రో సెంట్రలైజ్డ్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ వెబ్‌సైట్‌ను క్రమం తప్పకుండా పరిశీలిస్తే.. అవకాశాలు చేజారకుండా దరఖాస్తు చేసుకునే వీలుంటుంది.

కోర్సులు.. ఇన్‌స్టిట్యూట్‌లు

ఇస్రో కెరీర్‌కు దోహదం చేసే ఆస్ట్రానమీ, ఏవియానిక్స్, ఆస్ట్రో ఫిజిక్స్ వంటి స్పెషలైజ్డ్ కోర్సులను ప్రస్తుతం పలు ఇన్‌స్టిట్యూట్‌లు అందుబాటులోకి తెచ్చాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(బెంగళూరు), యూనివర్సిటీ ఆఫ్ పుణెలతోపాటు పలు సెంట్రల్ యూనివర్సిటీలు బీటెక్, ఎంటెక్ స్థాయిలో వీటిని అందిస్తున్నాయి. గ్రాడ్యుయేషన్ స్థాయి కోర్సుల్లో జేఈఈ–మెయిన్, జేఈఈ–అడ్వాన్స్‌డ్, సీయూఈటీ -యూజీలో ర్యాంకు; పీజీ కోర్సుల్లో గేట్ స్కోర్, సీయూఈటీ-పీజీ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

ఐఐఎస్‌టీ

ఇస్రో ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐఐఎస్‌టీ)ని నెలకొల్పారు. డీమ్డ్ యూనివర్సిటీ హోదా కలిగిన ఈ ఇన్‌స్టిట్యూట్‌లో.. బీటెక్ ఈసీఈ(ఏవియానిక్స్), బీటెక్(ఏరోస్పేస్ ఇంజనీరింగ్); ఎంటెక్‌లో ఏరో డైనమిక్స్ అండ్ ఫ్లైట్ మెకానిక్స్, స్ట్రక్చర్స్ అండ్ డిజైన్, క్వాంటమ్ టెక్నాలజీ, డిజిటల్ సిగ్నల్ ప్రాసెసింగ్, థర్మల్ అండ్ ప్రొపల్షన్; ఎమ్మెస్సీ(ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్) తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. బీటెక్‌లోకి జేఈఈ -అడ్వాన్స్‌డ్ ర్యాంకు ఆధారంగా ప్రవేశాలు నిర్వహిస్తారు. గేట్ స్కోర్ ఆధారంగా ఎంటెక్; సీఎస్ఐఆర్ -యూజీసీ నెట్, జెస్ట్ స్కోర్‌తో పీహెచ్‌డీలో అడ్మిషన్ లభిస్తుంది. ఐఐఎస్‌టీలో కోర్సులు పూర్తి చేసుకున్న వారికి.. ఇస్రోతోపాటు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని రీసెర్చ్ కేంద్రాలు, ఎర్త్ సైన్స్ సెంటర్ వంటి రీసెర్చ్ కేంద్రాల్లో కొలువులు లభిస్తున్నాయి.

ఎంట్రీ లెవల్‌లో సైంటిస్ట్-ఎస్‌సీ

ఇస్రోలో ప్రధానంగా ఎనిమిది సైంటిస్ట్ హోదాలు ఉన్నాయి. అవి.. సైంటిస్ట్–ఎస్‌సీ, ఎస్‌డీ, ఎస్‌ఈ, ఎస్ఎఫ్, ఎస్‌జీ, సైంటిస్ట్–జీ, ఔట్ స్టాండింగ్ సైంటిస్ట్, డీఎస్ (డిస్టింగ్విష్డ్ సైంటిస్ట్).

ఎంట్రీ లెవల్‌లో.. సైంటిస్ట్/ఇంజనీర్–ఎస్‌సీ హోదాతో కొలువు సొంతం చేసుకోవచ్చు. నిర్దేశిత బ్రాంచ్‌లు, స్పెషలైజేషన్లలో బీటెక్, ఎంటెక్‌లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణతను వీటికి అర్హతగా పేర్కొంటారు. ఇదే రీతిలో సైంటిస్ట్–ఎస్ఎఫ్ హోదా వరకు రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా నియామకాలు చేపడతారు. సైంటిస్ట్ ఎస్‌జీ నుంచి సైంటిస్ట్–జీ హోదాలకు రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు.

డీఎస్ స్థాయికి చేరుకునే అవకాశం

బీటెక్‌తో సైంటిస్ట్/ఇంజనీర్–ఎస్‌సీగా కొలువు దీరిన వారు భవిష్యత్తులో విశిష్ట శాస్త్రవేత్త(డిస్టింగ్విష్డ్ సైంటిస్ట్) హోదాకు పదోన్నతి పొందే అవకాశముంది. సర్వీస్‌లో చేరిన నాలుగేళ్లకు సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌డీగా.. ఆ తర్వాత నాలుగేళ్లకు సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌ఈగా.. అనంతరం మరో నాలుగేళ్లకు సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్ఎఫ్‌గా పదోన్నతులు లభిస్తాయి. మరో అయిదేళ్లకు సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌జీ, అనంతరం అయిదేళ్లకు.. సైంటిస్ట్ జీ హోదా లభిస్తుంది. సైంటిస్ట్ జీ హోదాలో ఆరేళ్లు పూర్తి చేసుకుంటే.. ఔట్ స్టాండింగ్ సైంటిస్ట్‌గా, ఈ హోదాలో రెండేళ్లు పూర్తి చేసుకుంటే.. డిస్టింగ్విష్డ్ సైంటిస్ట్‌గా పదోన్నతి లభిస్తుంది.

విధులు ఇవే

ఇస్రోలో ఎంట్రీ లెవల్‌లో సైంటిస్ట్–ఎస్‌సీ హోదాలో నియామకం ఖరారు చేసుకున్న వారు ఇస్రో, అంతరిక్ష శాఖకు చెందిన విభాగాలు, కేంద్రాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. సీనియర్ సైంటిస్ట్‌లకు సహకరించడం, సంబంధిత విభాగాల్లో అప్లికేషన్స్ రూపొందించడం వంటివి చేయాల్సి ఉంటుంది. అదే విధంగా పదోన్నతులు పొందే కొద్దీ విధులు, బాధ్యతలు పెరుగుతాయి. ఆయా ప్రాజెక్ట్‌లను స్వయంగా పర్యవేక్షిస్తూ.. సిబ్బందికి తగిన సూచనలు ఇవ్వాల్సి ఉంటుంది.

ఇస్రోలో కెరీర్స్.. ముఖ్యాంశాలు

- సైంటిస్ట్–ఎస్‌సీ హోదాలో బీటెక్, ఎంటెక్ ఉత్తీర్ణులకు ఎంట్రీ లెవల్ ఉద్యోగాలు.
- ఐఐఎస్‌టీ ఆధ్వర్యంలో ఏవియానిక్స్, ఎలక్ట్రానిక్స్‌లో బీటెక్, ఎంటెక్ ప్రోగ్రామ్‌లు.
- పలు ఇన్‌స్టిట్యూట్స్‌లో ఆస్ట్రానమీ, ఆస్ట్రో ఫిజిక్స్, ఏవియానిక్స్ తదితర అంతరిక్ష శాస్త్ర అనుబంధ కోర్సులు. ▪ ఇస్రో ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సెంట్రలైజ్డ్ రిక్రూట్‌మెంట్ బోర్డ్.
- ఆయా హోదాలను బట్టి పే లెవల్–7 నుంచి పే లెవల్ –14 వరకు వేతన శ్రేణి.
- ఇస్రో కెరీర్స్, నియామక నిబంధనలకు వెబ్‌సైట్: https://www.isro.gov.in/CareerOpportunities.html

బీఎస్సీతో సైంటిఫిక్/టెక్నికల్ అసిస్టెంట్

బీఎస్సీ అర్హతతో ఇస్రోలో సైంటిఫిక్/టెక్నికల్ అసిస్టెంట్ నియామకాలు చేపడతారు. ఇందుకోసం రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ హోదాలో కెరీర్ ప్రారంభించిన వారు సీనియర్ సైంటిఫిక్/టెక్నికల్ అసిస్టెంట్-ఎ, సైంటిఫిక్/టెక్నికల్ ఆఫీసర్ -సి, డి, ఈ, ఎఫ్, ఎస్‌జీ హోదాలకు పదోన్నతులు పొందే అవకాశం ఉంటుంది.

డిప్లొమాతో టెక్నీషియన్

ఇస్రోలో డిప్లొమా అర్హతతోనూ ఉద్యోగం పొందే అవకాశం ఉంది. ముఖ్యంగా డిప్లొమా ఇన్ ల్యాబ్ టెక్నీషియన్ ఉత్తీర్ణతతో ల్యాబ్ టెక్నీషియన్–ఎ హోదాలో అడుగు పెట్టొచ్చు. ఇందుకోసం రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ హోదాలో కెరీర్ ప్రారంభించిన వారు భవిష్యత్తులో ల్యాబ్ టెక్నీషియన్–బి, సి, ఎ, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్–బి హోదాలకు చేరుకోవచ్చు. అదే విధంగా డిప్లొమా ఇన్ రేడియోగ్రఫీలో ప్రథమ శ్రేణి ఉత్తీర్ణతతో రేడియోగ్రాఫర్–ఎగా కెరీర్ సొంతం చేసుకోవచ్చు. ఆ తర్వాత రేడియో గ్రాఫర్–బి, సి; సీనియర్ రేడియోగ్రాఫర్–ఎ, సీనియర్ రేడియోగ్రాఫర్–బి వరకు పదోన్నతులు పొందొచ్చు.

ఐటీఐతోనూ

ఇస్రోలో ఐటీఐతో టెక్నీషియన్/డ్రాఫ్ట్స్‌మెన్ పోస్టులకు నియామకాలు చేపడతారు. ప్రారంభంలో టెక్నీషియన్–ఎ హోదా కల్పిస్తారు. ఆ తర్వాత టెక్నీషియన్–బి /డ్రాఫ్ట్‌మెన్–బి, టెక్నీషియన్–డి/డ్రాఫ్ట్స్‌మెన్–సి 2, టెక్నీషియన్–ఎఫ్/ డ్రాఫ్ట్స్‌మెన్–డి, జి, ఈ హోదాలకు; ఆ తర్వాత సీనియర్ టెక్నీషియన్, సీనియర్ డ్రాఫ్ట్స్‌మెన్ ఎ, బి కేటగిరీలకు చేరుకోవచ్చు. ఆ తర్వాత జూనియర్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్ స్థాయికి చేరుకునే అవకాశముంది. వీటికి కూడా రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూలలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ప్రత్యేక నియామక విభాగం

భారత అంతరిక్ష శాఖ పరిధిలోని ఇస్రోతోపాటు, అంతరిక్ష శాఖకు చెందిన విభాగాలు, కేంద్రాల్లో సైంటిస్ట్, ఇంజనీర్ ఉద్యోగాల భర్తీ కోసం ఇస్రో సెంట్రలైజ్డ్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ పేరిట ప్రత్యేక నియామక విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఈ విభాగం నిర్వహించే ఎంపిక ప్రక్రియలో విజేతలనే సైంటిస్ట్, ఇంజనీర్స్‌గా ఖరారు చేస్తారు. గత ఏడాది వరకు ఈ పోస్ట్‌లకు గేట్ స్కోర్ ఆధారంగానే నియామక ప్రక్రియ ఉండేది. ఈ ఏడాది తొలిసారి సెంట్రలైజ్డ్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో ఇస్రో సొంత నియామక ప్రక్రియ చేపడుతోంది.

రాత పరీక్షల్లో.. సబ్జెక్ట్ నాలెడ్జ్

ఇస్రో సైంటిస్ట్–ఎస్‌సీ పోస్టులకు నిర్వహించే రాతపరీక్ష 100 మార్కులకు ఉంటుంది. ఇందులో 80 మార్కులకు సబ్జెక్ట్ నాలెడ్జ్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. మరో 20 మార్కులకు న్యూమరికల్ రీజనింగ్, లాజికల్ రీజనింగ్, డయాగ్రమెటిక్ రీజనింగ్, అబ్‌స్ట్రాక్ట్ రీజనింగ్, డిడక్టివ్ రీజనింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.

వెయిటేజీ విధానం

రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా విజేతలను ఖరారు చేసే క్రమంలో.. వెయిటేజీ విధానాన్ని అనుసరిస్తున్నారు. రాత పరీక్షలో ప్రతిభకు 50 శాతం; ఇంటర్వ్యూ మార్కులకు 50 శాతం వెయిటేజీని గణించి.. దాని ఆధారంగా తుది విజేతలను ఖరారు చేస్తారు.

వేతనాలు ఆకర్షణీయంగానే

ఏడో వేతన సంఘ సిఫార్సుల ప్రకారం–సైంటిస్ట్స్ కేటగిరీలో వేతనాలు ఆకర్షణీయంగానే ఉన్నాయని చెప్పొచ్చు.సైంటిస్ట్/ఇంజనీర్–ఎస్‌సీలకు పే లెవల్–10లో రూ.56,100–రూ.1,77,500 వేతన శ్రేణి ఉంటుంది. సైంటిస్ట్–ఎస్‌డీ హోదాలో పే లెవల్–11లో రూ. 67,700 – రూ.2,08,700; సైంటిస్ట్–ఎస్‌ఈ హోదాలో పే లెవల్ 12తో రూ.78,800 –రూ.2,09,200;సైంటిస్ట్–ఎస్ఎఫ్ హోదా లో పే లెవల్13తో రూ.1,23,100–రూ.2,15,900; సైంటిస్ట్ -ఎస్‌జీ హోదాలో పే లెవల్ 13తో రూ. 1,31,100–రూ.2,16,600, సైంటిస్ట్–జీ హోదాలో పే లెవల్ 14తో రూ. 1,44,200–రూ.2,18,200 వేతన శ్రేణి ఉంటుంది. ఇక.. ఔట్ స్టాండింగ్ సైంటిస్ట్‌లకు రూ.1,82,200– రూ.2,24,100. రూ. 2,05,400 – రూ. 2,24,400 వేతన శ్రేణిలో వేతనాలు లభిస్తాయి.

క్లుప్తంగా...

శ్రీశైలానికి 11 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి బుధవారం సాయంత్రానికి 11,104 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. జూరాల ప్రాజెక్ట్‌లో విద్యుత్ ఉత్పాదనతో ఈ ప్రవాహం శ్రీశైలానికి వస్తోంది. జలాశయం నుంచి మంగళవారం నుంచి బుధవారం వరకు 6,697 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు. ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో 0.740 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి నాగార్జున సాగర్‌కు 1,361 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యాక్ వాటర్ నుంచి కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1,600 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,460 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 2 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 92.9240 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యామ్ నీటిమట్టం 855.40 అడుగులకు చేరుకుంది.

కొత్త రిజిస్ట్రేషన్ విధానం పూర్తి వివరాలు ఇవ్వండి

ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానాన్ని (కార్డ్ ప్రైమ్ 2.0) సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై హైకోర్టు స్పందించింది. పూర్తి వివరాలను తమ ముందుంచాలని రిజిస్ట్రేషన్ శాఖను ఆదేశించింది. రిజిస్ట్రేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి, ఆ శాఖ ఐజీలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను అక్టోబర్ 4కి వాయిదా వేసింది. కొత్త రిజిస్ట్రేషన్ విధానం చట్ట నిబంధనలకు విరుద్ధంగా ఉందని, ఈ విధానం అమలు కోసం స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని కోరుతూ కృష్ణాజిల్లా, కంకిపాడుకు చెందిన కొత్తపల్లి సీతారామప్రసాద్, టీడీపీ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వేర్వేరుగా హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై బుధవారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది.

కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చండి

పలు కులాల చేర్పులకు ఎంపీల ప్రతిపాదన

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ఓబీసీ జాబితాలో ఏపీలోని తూర్పు కాపులు, కళింగ వైశ్యులు, శిష్టకరణాలు, సొండి, అర్వాల కులాల చేర్పుపై జాతీయ బీసీ కమిషన్ సమావేశం నిర్వహించింది. బీసీ కమిషన్ అధ్యక్షుడు హన్స్‌రాజ్ ఆహిర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ఈ సమావేశంలో ఎంపీలు బెల్లాన చంద్రశేఖర్, జీవీఎల్ నరసింహారావు,రామ్మోహన్‌నాయుడు, కె.లక్ష్మణ్, శిష్టకరణం, తూర్పు కాపులు, కళింగ కోమట్లు, సొండి కార్పొరేషన్ చైర్మన్లు మహంతి అనూష పట్నాయక్, మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, రాజారావు పాల్గొన్నారు.

జనసేన జెడ్పీటీసీ అరెస్ట్

గత అసెంబ్లీ ఎన్నికల్లో డబ్బు తరలిస్తుండగా పట్టివేత



పాలకోడేరు: కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం జెడ్పీటీసీ సభ్యుడు, జనసేన పార్టీకి చెందిన గుండా జయప్రకాష్‌నాయుడును బుధవారం పాలకోడేరు పోలీసులు హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. ఏలూరు జిల్లా కోర్టులో హాజరుపరచగా అతడికి రిమాండ్ విధించినట్లు పాలకోడేరు ఎస్‌ఐ నాళం శ్రీనివాసరావు తెలిపారు. 2019లో జరి గిన అసెంబ్లీ ఎన్నికల్లో గుండా జయప్రకాష్‌నాయుడు, సుల్తాన్ జనోద్దీన్ కలిసి కారులో రూ.70,500 తరలిస్తుండగా పాలకోడేరు మండలంలోని శృంగవృక్షం గ్రామంలో అప్పటి ఎస్‌ఐ వెంకటేశ్వరరావు పట్టుకున్నారు. వారిద్దరిపై కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరిచారు. బెయిల్ మీద ఉన్న జయప్రకాష్‌నాయుడు అప్పటి నుంచి వాయిదాలకు హాజరుకావడంలేదు. హైదరాబాద్‌లో ఉంటూ కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతుండటంతో కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీచేసింది. దీంతో పాలకోడేరు ఎస్‌ఐ నాళం శ్రీనివాసరావు హైదరాబాద్ వెళ్లి అతడిని అరెస్ట్ చేసి తీసుకొచ్చారు. నిందితుడిని బుధవారం ఏలూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి 14 రోజుల రిమాండ్ విధించారు.

పులివెందుల వెళ్లేందుకు ఉదయ్‌కుమార్‌కు అనుమతి

సాక్షి, హైదరాబాద్: వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో నిందితుడు (ఏ–6) గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డి పులివెందుల వెళ్లేందుకు సీబీఐ ప్రత్యేకన్యాయస్థానం అనుమతి ఇచ్చింది. చంచల్‌గూడ జైలులో ఉన్న అతడిని గురువారం (నేడు) ఉదయం 8 గంటలకు ఎస్కార్ట్ (ముగ్గురు కానిస్టేబుళ్లు, ఒక ఎస్‌ఐ) పోలీసులకు అప్పగించాలని అధికారులను ఆదేశించింది. తిరిగి 16న ఉదయం 11 గంటలకల్లా ఉదయ్‌కుమార్‌రెడ్డిని జైలు అధికారులకు అప్పగించాలని పోలీసులకు స్పష్టం చేసింది. తన భార్య బిడ్డకు జన్మనిచ్చిందని, వెళ్లి చూసేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఉదయ్‌కుమార్‌రెడ్డి సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై బుధవారం విచారించిన న్యాయాధికారి ఈ మేరకు ఆదేశించారు. ఎస్కార్ట్‌కు, వాహనానికి అయ్యే ఖర్చును భరించాలని పిటిషనర్‌కు సూచించారు.

స్మార్ట్ మీటర్లతో రైతు సాధికారత

కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకే వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు

- అనుబంధ పరికరాల వల్ల అదనపు భద్రత
- స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఖర్చంతా పూర్తిగా ప్రభుత్వానిదే
- రైతులు, డిస్కంలు పైసా పెట్టాల్సిన అవసరం లేదు
- మీటర్లకు కేంద్రం అంచనా ధర కేవలం మీటర్లకే
- అదనపు పరికరాల వ్యయం అందులో లేదు
- రైతులకు హక్కుగా ఉచిత విద్యుత్.. డిస్కంలకు జవాబుదారీతనం
- గృహ విద్యుత్ వినియోగదారులకూ స్మార్ట్ మీటర్లు



'సాక్షి'తో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్

సాక్షి, అమరావతి: ఉచిత విద్యుత్ వాడుకునే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్ల వల్ల రైతులకు అన్ని విధాలుగా మేలు జరుగుతుందని, వారి సాధికారతకు దోహద పడుతుందని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. రాష్ట్రంలోని వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వ ఉత్తర్వుల (జీవో ఎంఎస్ నంబర్ 22, తేదీ: 01 – 09 – 2020) ప్రకారం నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయడంతోపాటు విద్యుత్ పంపిణీ నష్టాల తగ్గింపు, పారదర్శకత కోసమే స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. స్మార్ట్ మీటర్లపై 'సాక్షి' ప్రతినిధికి విజయానంద్ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి..

- ప్రస్తుతం రాష్ట్రంలో సరఫరా అయ్యే మొత్తం విద్యుత్‌లో 18 నుంచి 20 శాతం వ్యవసాయ రంగం వినియోగించుకుంటోంది. ఈ విద్యుత్‌ను లెక్కించడం కష్టమవుతోంది. విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)ల పనితీరు మెరుగుదలకు, ఉచిత విద్యుత్ పథకం ద్వారా ఎంత వినియోగం జరుగుతోందో తెలుసుకోవడానికి, నగదు బదిలీ కింద ప్రతి నెలా సబ్సిడీ రూపంలో ఎంత చెల్లించాలనే లెక్కకు వ్యవసాయ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు బిగించాలి.
- స్మార్ట్ మీటర్లు బిగించడానికయ్యే ఖర్చు మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. విద్యుత్ సంస్థలపైగానీ, రైతులపైగానీ ఒక్క రూపాయి భారం పడదు. ప్రతి నెలా వ్యవసాయ విద్యుత్ వినియోగదారుడు కూడా అందరిలాగే విద్యుత్ బిల్లు చెల్లించే వెసులుబాటు ఉండడంతో రైతుకు నాణ్యమైన, నమ్మకమైన అంతరాయాలు లేని విద్యుత్‌ను డిమాండ్ చేసే హక్కు లభిస్తుంది. డిస్కంలకు జవాబుదారీతనం పెరుగుతుంది. ఇది రైతు సాధికారతకు దోహద పడుతుంది.
- కేంద్ర ప్రభుత్వ అధీనంలోని విద్యుత్ మంత్రిత్వ శాఖ కఠిన నిబంధనలను అనుసరించి స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నాం. స్మార్ట్ మీటర్ ధరను కేంద్రం ప్రాథమికంగా రూ.6 వేలుగా అంచనా వేసింది. అనుబంధ పరికరాలను అందులో కలపలేదు. స్మార్ట్ మీటరు సక్రమంగా పనిచేయడానికి సాంకేతికంగా అనుబంధ పరికరాలు అవసరం.
- స్మార్ట్ మీటర్లతో పాటు అనుబంధ పరికరాలైన పీవీసీ వైరు, ఎంసీబీ, కెపాసిటర్, ఎర్త్ వైరు, ఎర్త్ పైపు, మీటరు బాక్సులను ఏర్పాటు చేస్తారు. మోటార్లను బాగా నడపడంలో, వోల్టేజి సమస్య రాకుండా చూడటంలో కెపాసిటర్లది కీలక పాత్ర. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు సరైన ఎర్తింగ్ ఉండాలి. ఎంసీబీ ద్వారా ఓవర్ లోడ్ ప్రొటెక్షన్ జరుగుతుంది. తద్వారా ట్రాన్స్‌ఫార్మర్ వైఫల్యాలను తగ్గించడంతోపాటు విద్యుత్ ప్రమాదాలను నివారించవచ్చు.
- స్మార్ట్ మీటర్ల ధర, అనుబంధ పరికరాల ధర వేర్వేరు. ఒక్కో వ్యవసాయ విద్యుత్ సర్వీసుకు అనుబంధ పరికరాలకు రూ.12128.71, పన్నులతో కలిపి రూ.14,455ల ఖర్చవుతుంది. దీనిలో దాదాపు 60 శాతం కేంద్రం నుంచి గ్రాంటుగా పొందడానికి ప్రయత్నిస్తున్నాం.
- స్మార్ట్ మీటర్లు అమర్చడం వల్ల డిస్కంలకు ప్రయోజనం ఏమీ లేదని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లేఖ రాశారని జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదు. ఈ ప్రాజెక్టును మరింత పకడ్బందీగా, పారదర్శకంగా అమలు చేయడం కోసం సూచనలు చేశాం.
- మన రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల అంశాన్ని ఇతర రాష్ట్రాలతో పోల్చడం సరికాదు. అనుబంధ పరికరాలు లేకుండా ఉత్తరప్రదేశ్ మినహా ఇతర ఏ రాష్ట్రాల్లోనూ వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడంలేదు.
- ఆర్డీఎస్ఎస్ పథకంలో ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో గృహ విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. అదే తరహాలో ఏపీలోనూ గృహాలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు టెండర్లు పిలిచాం.

బాలయ్య.. బాంబు!

చంద్రబాబు సీట్లో కూర్చుని నేతలతో మంతనాలు

- నేను వస్తున్నానంటూ టీడీపీ క్యాడర్‌కు సందేశం
- కొత్త రాజకీయంతో ఉలిక్కిపడ్డ లోకేశ్
- హడావుడిగా తల్లితో కలిసి కార్యకర్తల సమావేశం
- పార్టీ నారా కుటుంబం చేతుల్లోనే ఉందని చినబాబు సంకేతాలు
- తాజా పరిణామాలతో అయోమయంలో శ్రేణులు



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో మాజీ సీఎం చంద్రబాబు అరెస్టైన తరుణంలో టీడీపీలో ఆసక్తికరమైన పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. చంద్రబాబు జైల్లో ఉన్న వేళ ''నేను వస్తున్నా..'' అంటూ బాలయ్య చేసిన వ్యాఖ్యలు ఆయన అల్లుడు లోకేశ్ శిబిరాన్ని ఉలికిపాటుకు గురి చేశాయి. దీంతో చినబాబు వెంటనే తన తల్లి, భార్యతో కలిసి పార్టీ నేతల సమావేశాన్ని ఏర్పాటు చేసి టీడీపీ తమ చేతుల్లోనే ఉందనే సంకేతాలు ఇచ్చుకున్నారు. తాజా పరిణామాలతో టీడీపీ క్యాడర్‌లో అయోమయం నెలకొంది. పార్టీలో ఏం జరుగుతుందోననే ఆందోళన వారిని వేధిస్తోంది.

బాబు సీట్లో బాలయ్య..

చంద్రబాబు అరెస్టు అయిన తర్వాత బాలకృష్ణ తొలిసారి సోమవారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయానికి వచ్చారు. అక్కడ అందుబాటులో ఉన్న నాయకులతో సమీక్ష నిర్వహించేటప్పుడు ఆయన చంద్రబాబు సీట్లో కూర్చోవడం చర్చనీయాంశమైంది. అది చంద్రబాబు కూర్చునే సీటు అని, పక్కనే కూర్చోవాలని ఇతర నేతలు వారించినా బాలకృష్ణ కన్నెర్ర చేసి అందులోనే కూర్చుని సమావేశం నిర్వహించారు. రెండో రోజు మంగళవారం మళ్లీ పార్టీ కార్యాలయానికి వచ్చి నేతలతో సమావేశమయ్యారు. ఈసారి మీడియా సమావేశం నిర్వహించి గతంలో ఎన్నడూ లేని విధంగా 'నేనున్నా.. నేను వస్తున్నా..!' అంటూ కొత్త తరహా వ్యాఖ్యలు చేశారు. అసలు తెలుగుదేశం పార్టీ తనదే అనేలా ఆయన చేసిన వ్యాఖ్యలు ఉన్నాయని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఇకపై పార్టీని తానే నడిపిస్తాననేలా ఆయన చేసిన ప్రసంగంతో పార్టీ శ్రేణులంతా ఆలోచనలో పడ్డాయి. అంతటితోపాటు ఆగకుండా ఎప్పుడూ లేని విధంగా బాలకృష్ణ వరుసగా పార్టీ నేతల సమావేశాల్లో పాల్గొనడం ఆసక్తికరంగా మారింది. పోరంకిలో జరిగిన కృష్ణా జిల్లా పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఆయన వ్యాఖ్యలు, వ్యవహార శైలి పార్టీపై పట్టు సాధించేలా ఉండడంతో బాలయ్య కొత్త రాజకీయానికి తెర తీశారనే అభిప్రాయాలు టీడీపీలో వ్యక్తమవుతున్నాయి. తన తండ్రి స్థాపించిన పార్టీని చంద్రబాబు స్వాధీనం చేసుకుని ఇంతకాలం చక్రం తిప్పినా బాలకృష్ణ అందుకు సహకరించారు. ఇప్పుడు బావ జైలుకు వెళ్లిన తరుణంలో బాలకృష్ణ తాను రేసులో ఉన్నానంటూ ముందుకు రావడం చర్చనీయాంశమైంది.

అప్రమత్తమైన లోకేశ్..

బాలయ్య వైఖరితో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ లోకేశ్ అప్రమత్తమయ్యారు. రాజమహేంద్రవరంలో తన తల్లి భువనేశ్వరి, భార్య బ్రాహ్మణితో కలిసి పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. తాజా పరిణామాలు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఇందులో చర్చించారు. చంద్రబాబుకు మద్దతుగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఈ సందర్భంగా భువనేశ్వరితో మాట్లాడించారు. తల్లి, భార్యతో కలిసి నేతలు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించడం ద్వారా పార్టీ తమ కుటుంబం చేతుల్లోనే ఉందని చినబాబు శ్రేణులకు సంకేతాలు పంపారు. అంతేకాకుండా వివిధ జిల్లాల నుంచి నాయకులను తన వద్దకు రప్పించుకుని మాట్లాడుతున్నారు. జిల్లాల వారీగా పార్టీ నేతలు రాజమహేంద్రవరం వెళ్లి లోకేశ్‌తో మాట్లాడుతున్నారు. చంద్రబాబు అరెస్టు పరిణామాల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీలో నాయకత్వం కోసం లోకేశ్, బాలకృష్ణ మధ్య పోటీ నెలకొన్నట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీపై పట్టు సాధించేందుకు బాలకృష్ణ, తమ పట్టు నిలుపుకునేందుకు ఆయన అల్లుడు లోకేశ్ ప్రయత్నిస్తున్నట్లు స్పష్టమవుతోంది. దీంతో ఏం జరుగుతుందో అంతుబట్టక నేతలు, కార్యకర్తలు అయోమయానికి లోనవుతున్నారు. చంద్రబాబు అరెస్టు అయినా ప్రజల్లో స్పందన లేకపోవడం, మామ – అల్లుడి మధ్య పోటీ నెలకొనడంతో వారికి ఏమీ పాలుపోని పరిస్థితి నెలకొంది.

పోయింది ఓ మామూలు వ్యక్తేలే..!

- అమెరికాలో తెలుగు యువతి మృతిపై చులకనగా మాట్లాడిన పోలీస్
- నవ్వుతూ, జోకులు వేస్తున్న వీడియో వెలుగులోకి..
- అతడిపై విచారణకు ఆదేశించిన ఉన్నతాధికారులు

సియాటెల్: అమెరికాలో రోడ్డు ప్రమాదంలో తెలుగు యువతి మృతి చెందడంపై అక్కడి పోలీసు అధికారి చులకనగా మాట్లాడిన అంశం కలకలం రేపుతోంది. సదరు పోలీసు అధికారి నవ్వుతూ, జోకులు వేస్తున్న వీడియో బయటికి రావడంతో.. అక్కడి ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు.

అసలేం జరిగింది?

అమెరికాలో సియాటెల్‌లోని నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీలో చదువుతున్న కర్నూలు జిల్లా ఆదోని యువతి జాహ్నవి (23) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అదీ పోలీసు పెట్రోలింగ్ వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించారు. ఆ ఘటన విషయం తెలిసి దర్యాప్తు చేయడానికి వచ్చిన పోలీసు అధికారి డానియెల్ అడరర్.. పైఅధికారికి వివరాలు చెప్తూ జాహ్నవి పట్ల చులకనగా మాట్లాడారు. గట్టిగా నవ్వుతూ 'ఆమె చచ్చిపోయింది. ఆ ఓ మామూలు వ్యక్తేలే..' అని వ్యాఖ్యానించారు. పోలీసు వాహనమే ఢీకొట్టిన నేపథ్యంలో.. 'ఏముంది. ఓ పదకొండు వేల డాలర్లకు చెక్కు రాస్తే చాలు.. ఆమెకు 26 ఏళ్లు ఉంటాయేమో.. విలువ తక్కువే..' అని పగలబడి నవ్వుతూ వ్యాఖ్యానించారు. ఇదంతా అతడి బాడీ కెమెరాలో రికార్డైంది. తాజాగా ఈ దృశ్యాలు వెలుగులోకి రావడంతో.. సియాటెల్ కమ్యూనిటీ పోలీస్ కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఇలాంటి వ్యాఖ్యలు దారుణమని పేర్కొంది. డానియెల్ అడరర్‌పై విచారణకు ఆదేశించింది.

తప్పుడు వివరాలతోనూ..

జాహ్నవిని ఢీకొని ఆమె మరణానికి కారణమైన తోటి పోలీసు అధికారి కెవిన్‌ను కాపాడేందుకు డానియెల్ ప్రయత్నించిన విషయం కూడా వెలుగులోకి వచ్చింది. ప్రమాద సమయంలో కెవిన్ కారును గంటకు 50 మైళ్ల వేగంతోనే నడుపుతున్నాడని, కారు అదుపు తప్పలేదని డానియల్ దర్యాప్తు నివేదికలో పేర్కొన్నాడు. తప్పు జాహ్నవిదే అన్నట్టుగా చూపడానికి ప్రయత్నించాడు. అయితే కెవిన్ కారును పరిమితికి మించి 74 మైళ్ల వేగంతో నడిపాడని, కారు అదుపు తప్పిందని తర్వాత ఫోరెన్సిక్, ఇతర దర్యాప్తు నివేదికల్లో తేలడం గమనార్హం.

విషమంగానే డి.శ్రీనివాస్ ఆరోగ్య పరిస్థితి

తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ ఆరోగ్య పరిస్థితి ఇంకా విషమంగానే ఉంది. ఆయన రక్తపోటును నియంత్రించేందుకు, శ్వాసక్రియను మెరుగుపరిచేందుకు వైద్యులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై సిటీ న్యూరో ఆసుపత్రి తాజాగా హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. శ్వాస కోస వ్యాధులతో తీవ్రంగా బాధపడుతున్న సీనియర్ నేత.. శ్రీనివాస్ సెప్టిక్ షాక్‌లో ఉన్నారని రక్తపోటు నియంత్రణకు చికిత్స అందిస్తున్నామని, నాన్ ఇన్వాసివ్ వెంటిలేషన్, వాసోప్రెసర్ సపోర్ట్‌పై ఇంటెన్సివ్ కేర్ లో నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోందని ఆసుపత్రి వెల్లడించింది.

ముగ్గురు టీటీడీ బోర్డు సభ్యులకు హైకోర్టు నోటీసులు

సాక్షి, అమరావతి : జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, పారిశ్రామికవేత్త పెనకా శరత్‌చంద్రారెడ్డి, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) మాజీ చైర్మన్ కేతన్ దేశాయ్‌లు క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారని, వీరిని టీటీడీ బోర్డు సభ్యులుగా నియమించడం విరుద్ధమంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై హైకోర్టు స్పందించింది. ఈ ముగ్గురు బోర్డు సభ్యులతో పాటు దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, టీటీడీ ఈవో, దేవదాయ శాఖ కమిషనర్‌లకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్ 1కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందర్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

బాబు కోసం పవన్ 'ఆరాటం'

- జైలులో ఉన్న చంద్రబాబుతో నేడు భేటీ
- హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో రాజమండ్రికి!
- వారంలో రెండోసారి రాష్ట్రానికి రావడంపై పార్టీ వర్గాల విస్మయం



చంద్రబాబు అరెస్టుకు నిరసనగా జగ్గయ్యపేట వద్ద జాతీయ రహదారిపై పడుకున్న పవన్ (ఫైల్)

సాక్షి, అమరావతి: స్కిల్ కుంభకోణం కేసులో జైలులో ఉన్న టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబునాయుడి కోసం దత్తపుత్రుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పడుతున్న ఆరాటం చూసి సొంత పార్టీ నేతలే విస్తుపోతున్నారు. ఒక అవినీతి కేసులో జైలుకు వెళ్లిన వ్యక్తి కోసం ఇంత హడావుడిగా హైదరాబాద్ నుంచి రావాలా అని ప్రశ్నిస్తున్నారు. పవన్ వారం రోజుల్లో రెండో సారి రాష్ట్రానికి రావడమే వారి ప్రశ్నకు ఒక కారణం. పవన్ పార్టీ పెట్టినప్పటి నుంచి ఇంత స్వల్ప వ్యవధిలో రాష్ట్రానికి వచ్చిన దాఖలాలు లేవని పార్టీ నేతలే చెబుతున్నారు. ఒకసారి రాష్ట్రంలో పర్యటించి (అదీ.. కొద్ది రోజులే) హైదరాబాద్ వెళ్లాక మళ్లీ నెలకో రెండు నెలలకో.. ఎప్పుడో వీలు కుదిరినప్పుడు వచ్చి పోయే వారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో కాపు ఉద్యమం తీవ్ర స్థాయిలో జరిగినప్పుడు ఇటువైపు కన్నెత్తి చూడలేదు. కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభాన్ని, ఆయన కుటుంబాన్ని, మహిళలను చంద్రబాబు, లోకేశ్ దుర్భాషలాడి, వేధించి, కేసులు పెట్టినా పవన్ ఒక్క మాట మాట్లాడలేదు. కానీ, పవన్ ఇప్పుడు చంద్రబాబు అరెస్టు తర్వాత మాత్రం వారంలో రెండోసారి వస్తున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. చంద్రబాబు అరెస్టయిన రోజున (శనివారం) హడావుడిగా రాష్ట్రానికి వచ్చిన పవన్.. జైలులో ఉన్న చంద్రబాబుతో ములాఖత్ అయ్యేందుకు గురువారం రాజమండ్రి వెళ్లనున్నట్లు ఆయన రాజకీయ కార్యదర్శి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పవన్ హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో రాజమండ్రి వస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. హైదరాబాద్‌లో నివాసం ఉండే పవన్ 2014లో జనసేన పార్టీ ఏర్పాటు చేశారు. గత పదేళ్లలో అప్పుడప్పుడు మాత్రమే ఏపీకి వస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా రాజకీయం చేసే పార్టీకి అధ్యక్షుడు అయి ఉండి కూడా పవన్ ఏపీలో ఎప్పుడూ కొద్దిరోజులు స్థిరంగా లేరు. 2014 తర్వాత మొదటి మూడున్నరేళ్లలో ఏడాదికి రెండుసార్లో మూడుసార్లో వచ్చారని పార్టీ వర్గాలే చెబుతున్నాయి. అప్పట్లో రాజధాని రైతుల నుంచి చంద్రబాబు భూములు బలవంతంగా తీసుకున్న సమయంలో అమరావతి ప్రాంతానికి వచ్చారు. రైతులకు మద్దతు ప్రకటిస్తున్నట్లు ప్రకటించినప్పటికీ, చంద్రబాబుపై పోరాడిందీ లేదు, రైతుల కోసం పోరాటం చేసిందీ లేదు. ఆ తర్వాత కూడా మొక్కుబడిగా రాష్ట్రానికి వచ్చి వెళ్తుండేవారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రంలో కాపు రిజర్వేషన్ల ఉద్యమం తీవ్రస్థాయిలో కొనసాగిన సందర్భంలోనూ రాష్ట్రానికి రాలేదు. ఆ ఉద్యమాన్నీ పట్టించుకోలేదు. 2019 ఎన్నికల అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక రెండు నెలలకు ఒక మారు రాష్ట్రానికి వస్తున్నట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. అయితే, స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబును సీఐడీ పోలీసులు శనివారం అరెస్టు చేసిన వెంటనే పవన్ ప్రత్యేక విమానంలో విజయవాడకు బయల్దేరారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో ఆయన ఆగమేఘాల మీద రోడ్డు మార్గంలో విజయవాడకు బయల్దేరారు. రాష్ట్ర సరిహద్దుల్లో పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపైనే పడుకొని నిరసన తెలిపారు. ఆ తర్వాత తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయారు. నాలుగు రోజులు కూడా గడవక ముందే మళ్లీ రాష్ట్రానికి వస్తుండటంతో జనసేన వర్గాలు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నాయి. జైలులో ఉన్న చంద్రబాబును కలిసేందుకు పవన్‌కు ఇంత తాపత్రయం ఎందుకన్న ప్రశ్న పార్టీలో ఉత్పన్నమవుతోంది. కాపు రిజర్వేషన్ల ఉద్యమం తీవ్రంగా ఉన్నప్పుడే రాష్ట్రానికి రాని పవన్.. చంద్రబాబుకు ఇంత ప్రాధాన్యత ఎందుకిస్తున్నారని పార్టీ నేతలు, అభిమానులు ప్రశ్నిస్తున్నారు.

రీసేల్.. రివర్స్

కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రాని దైన్యం

ఉంచుకోలేక... ప్లాట్లు అమ్ముకోలేక వేతన జీవుల అగచాట్లు

ఏళ్లు గడుస్తున్నా.. ఎలాంటి అభివృద్ధి లేదు



సిటీకి 75 కిలోమీటర్ల దూరంలో ఉన్న సదాశివపేటలో ఓ నిర్మాణ సంస్థ భారీ వెంచర్ చేసింది. ఇది నిమ్జ్‌కు అతి సమీపంలో ఉండడంతో రెట్టింపు ధర పక్కాగా వస్తుందని ఓ ప్రైవేట్ ఉద్యోగి ఆశపడ్డాడు. గజానికి రూ. 8 వేలు చెల్లించి 150 గజాల ప్లాట్ కొన్నాడు. మూడేళ్ల తర్వాత ఇప్పుడు సదరు ఉద్యోగి తన కొడుకు చదువుకని ప్లాట్ అమ్మకానికి పెట్టాడు.. రెట్టింపు ధర సంగతి దేవుడెరుగు.. కనీసం బ్యాంకు వడ్డీ కూడా వచ్చే పరిస్థితి లేదు.

గ్రేటర్ పరిధిలో గత ఆర్థిక సంవత్సరం ఐదు మాసాల్లో సుమారు 3.5 లక్షల దస్తావేజులు నమోదు కాగా, ఈసారి మాత్రం 2.2 లక్షలకు డాక్యుమెంట్లు కూడా దాటలేదు. రియల్ వ్యాపారం పూర్తిగా మందగించడంతో పరిస్థితులు తలకిందులయ్యాయి.

సాక్షి, హైదరాబాద్: ఎవరైనా సరే భూమి ఎందుకు కొంటారు..? పిల్లల చదువుకోసమో.. అమ్మాయి పెళ్లి కోసమో.. ఇతరత్రా భవిష్యత్ అవసరాలకు అక్కరకొస్తుందనే కదా! కానీ, ప్రస్తుతం రీసేల్ ప్లాట్లకు అస్సలు గిరాకీ లేదు. కుప్పలుతెప్పలుగా వెంచర్లు, స్థానిక సంస్థల నుంచి అనుమతులు లేకపోవటం, మౌలిక వసతులు కల్పించకపోవటంతో పాటు ఎన్నికల వాతావరణం కావడంతో రీసేల్ ప్లాట్లకు గిరాకీ లేకుండా పోయింది.

నగరం చుట్టూ ఇదే పరిస్థితి


రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్), యాదాద్రి, నిమ్జ్, ఫార్మా సిటీ, టెక్స్‌టైల్స్ పార్క్, ఇండస్ట్రియల్ పార్క్, ఐటీ హబ్‌లు, మెట్రో రైలు విస్తరణ.. ఇలా అనేక ప్రాజెక్టులు వచ్చేస్తున్నాయంటూ హైదరాబాద్ నుంచి వంద కిలోమీటర్ల వరకూ రియల్ ఎస్టేట్ సంస్థలు భారీ వెంచర్లు చేస్తున్నారు. యాదాద్రి, జనగాం, సదాశివపేట, షాద్‌నగర్, సంగారెడ్డి, చౌటుప్పల్, చేవెళ్ల తదితర ప్రాంతాలలో ఫామ్ ప్లాట్లు, విల్లా ప్లాట్లు, వీకెండ్ హోమ్స్ అని రకరకాల పేర్లతో విక్రయిస్తున్నారు. స్థలం కొనుగోలు చేస్తే అధిక లాభాలు ఉంటాయని అందమైన బ్రోచర్లతో ఊదరగొడుతున్నారు. వీటిని నమ్మి కొన్నవారికి నిరాశే ఎదురవుతోంది. తెల్ల కాగితాల మీద గీతలు గీసేసి, ప్లాట్లు విక్రయించే బిల్డర్లు సైతం ఉన్నారంటే అతిశయోక్తి కాదు.

రెరాలో నమోదు లేకుండానే

నిబంధనల ప్రకారం స్థిరాస్తి సంస్థల ఏజెంట్లు కూడా టీఎస్–రెరాలో నమోదు చేసుకోవాలి. కానీ, నిర్మాణ సంస్థలు ఇవేవీ పట్టించుకోకుండా పెద్ద ఎత్తున మార్కెటింగ్ ప్రతినిధులను నియమించుకుంటున్నాయి. ఏజెంట్లకు ఒక్క ప్లాట్ విక్రయిస్తే రూ.2 లక్షలకు పైగానే కమీషన్ అందిస్తున్నాయి. ఎక్కువ ప్లాట్లు విక్రయిస్తే ఏజెంట్లకు బంగారం, కార్లు గిఫ్టులుగా ఇవ్వడంతో పాటు గోవా, మలేసియా, దుబాయ్, బ్యాంకాక్ హాలీడే ట్రిప్పులకు తీసుకెళుతున్నారు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లతో గొలుసుకట్టు వ్యాపారం చేస్తున్నాయి. ప్రతి ఆదివారం బస్సులు, కార్లలో కొనుగోలుదారులను వెంచర్ల వద్దకు తీసుకెళుతున్నారు.

రెండు మూడేళ్లుగా..

జనరద్దీ లేని చోట... అటవీ ప్రాంతాలకు సమీపంగా కూడా వెంచర్లు వేశారు. కనీసం అక్కడ ఊరు ఆనవాళ్లు కూడా కనిపించవు. ఆయా ప్రాంతాల్లో ప్లాట్లను కొనుగోలు చేసిన వారు అత్యవసరమైతే అమ్ముకోలేక అగచాట్లు పడుతున్నారు. వెంచర్లు చేసిన సంస్థ విక్రయించిన ధరకు ప్లాట్‌ను తీసుకోవడానికి వెనుకంజ వేస్తున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ప్లాట్‌పై పెట్టుబడి పెడితే ఎప్పటికైనా ధర పెరుగుతుందనే ధీమాతో చాలా మంది కొనుగోలు చేశారు. వారంతా రెండుమూడేళ్లుగా విక్రయించడానికి ప్రయత్నించినా కొనుగోలుదారులు ముందుకు రావడం లేదు.



అభివృద్ధి జరిగే ప్రాంతంలోనే కొనాలి

అభివృద్ధికి ఆస్కారం ఉండే ప్రాంతాల్లోనే ప్లాట్లు కొనుగోలు చేయాలి. వెంచర్లలో రోడ్లు, డ్రైనేజీ, వీధి లైట్లు వంటి అన్ని రకాల మౌలిక వసతులు ఉంటేనే భవిష్యత్‌లో విక్రయించినా మంచి ధర వస్తుంది. అనుమతులు ఉన్న వెంచర్లలో కొనడమే ఉత్తమం.
– సీహెచ్ వెంకట సుబ్రహ్మణ్యం, సీఎండీ, భువన్‌తేజ ఇన్‌ఫ్రా

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali,
(Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

ఇంటింటికీ ఆయుష్మాన్ భవ కార్డులు


కార్యక్రమం ప్రారంభిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: పేదలకు ఆరోగ్య భద్రత కల్పించే ఆయుష్మాన్‌భవ కార్డులను జిల్లాలో ఇంటింటికీ సక్రమంగా అందించాలని అదనపు జిల్లాధికారి దురుగేష్ సూచించారు. బుధవారం జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన ఆయుష్మాన్‌భవ అభియాన్‌ను ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో జీపీ స్థాయిలో కార్డులను పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య అధికారి సురేంద్ర బాబు, గణేష్, ఇతర శాఖల అధికారులున్నారు.

స్వచ్ఛతే ఆరోగ్యానికి సోపానం


శ్రమదానం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

రాయచూరు రూరల్: స్వచ్ఛతకు ప్రతిఒక్కరూ చేతులు కలపాలని కిల్లే బృహన్మఠాధిపతి శాంతమల్ల శివాచార్యులు అభిప్రాయ పడ్డారు. బుధవారం నగరంలోని వాల్కట్ మైదానంలో ఎన్.ఎస్.బోసురాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛత అభియాన్‌కు శ్రీకారం చుట్టి మాట్లాడారు. నగరంలో ఐదు రోజుల పాటు బోసురాజు ఫౌండేషన్ చేపట్టే శ్రమదానానికి చేతులు జోడించి ఎక్కడపడితే అక్కడ పేరుకున్న చెత్తా చెదారం తొలగింపునకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సంచాలకుడు రవి, దరూరు బసవరాజు, శివమూర్తి, బసవరాజరెడ్డి, ప్రవీణ్, శాలం, జయన్న, శాంతప్ప, దేవన్న నాయక్, రమేష్, నగరసభ కమిషనర్ గురుసిద్దయ్యలున్నారు.

ఖరీఫ్ పంటల సమీక్షకు శ్రీకారం

కంప్లి: ఈ ఏడాది నా పంట– నా హక్కు కింద ఖరీఫ్ పంటల సమీక్ష ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో రైతులు స్వయంగా పొల్గొని తమ పొలాల్లో తాము పండించిన పంటల వివరాలు నమోదు చేస్తున్నారు. తొలకరి రైతుల పంట సమీక్ష–2023 యాప్ ద్వారా తాలూకాలోని రైతులు తాము పండించిన పంటల వివరాలను యాప్‌లో నమోదు చేయవచ్చని సహాయక వ్యవసాయ శాఖ డైరెక్టర్ దయానంద్ తెలిపారు.

పరమహంసాచారిని బంధించాలని ధర్నా


ధర్నా చేస్తున్న ప్రగతిశీల సంఘాల కార్యకర్తలు

రాయచూరు రూరల్: సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ తల నరికి తెచ్చిన వారికి రూ.10 కోట్ల నజరానా ఇస్తానని ప్రకటించిన సనాతన సంస్థ అర్చకుడు పరమహంసాచారిని బంధించాలని ప్రగతిశీల సంఘాలు డిమాండ్ చేశాయి. బుధవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన సంస్థ అధ్యక్షుడు మారెప్ప మాట్లాడారు. పరమహంసాచారిని రక్షించడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నడాన్ని ఖండించారు. కవిగోష్టిలో మంత్రి స్టాలిన్ సనాతన ధర్మం డెంగీ, మలేరియా వంటివన్నారు. వాటిని నిర్మూలించడం మనందరి బాధ్యత అని పేర్కొన్న విషయాలపై స్వామీజీలు ఆరోపణలు చేయడం సరికాదని, సనాతన సంస్థ అర్చకుడు పరమహంసాచారిని బంధించాలని కోరుతూ స్థానికాధికారికి వినతి పత్రం సమర్పించారు.

త్వరలో పాఠశాల గదుల మరమ్మతు


కార్యక్రమం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లతా మల్లికార్జున తదితరులు

కంప్లి: కళ్యాణ కర్ణాటక అభివృద్ధి మండలి నిధులతో హరపనహళ్లి తాలూకాలో శిథిలమైన పాఠశాల గదుల మరమ్మతులను చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే ఎంపీ లతా మల్లికార్జున తెలిపారు. పట్టణంలోని బాణగేరి ఉర్దూ పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్మానకార్యక్రమాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. తాలూకాలో 198 పాఠశాల గదుల మరమ్మతులను త్వరలో చేపడతామన్నారు. కార్యక్రమంలో అటవీ, విద్యాశాఖ పరిసర, జీవశాస్త్ర శాఖల అధికారులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వానలు రాలే .. వలసలు తప్పలే

- కల్యాణ కర్ణాటకలో అన్నదాతల వెతలు
- కరువు దెబ్బకు చితికిన కూలీల బతుకులు
- ఉపాధి కోసం వలసబాట పట్టిన వైనం


రాయచూరులో మూటాముల్లెతో రైలు ఎక్కుతున్న కూలీలు

రాయచూరు రూరల్: నైరుతి రుతు పవనాలు ముఖం చాటేశాయి. ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటున్నా వర్షాలు కురవడం లేదు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు. కళ్యాణ కర్ణాటక ప్రాంతంలోని రాయచూరు, యాదగిరి, కొప్పళ, బీదర్, కలబుర్గి జిల్లాలు కరువు ప్రాంతాలుగా మారాయి. రాయచూరు, కొప్పళ జిల్లాల్లో నదిలో నీరు అంతంతగా మాత్రంగానే ఉంది.

బతుకుదెరువు కోసం వలసలు :

రాయచూరు, యాదగిరి, కలబుర్గి జిల్లాలో వ్యవసాయ పనులు లేక రైతు కూలీలు బతుకు దెరువు కోసం బెంగళూరు, ముంబై, షోలాపూర్, గోవా, మహారాష్ట్ర, చెన్నై, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. ఇక బోర్లలో కూడా భూగర్భ జలం అడుగంటింది. మరోవైపు విద్యుత్ కోతలు అధికమయ్యాయి. వానలు కురవకపోవడంతో జీవనోపాధి కోసం రైతు కూలీలు మూటా ముల్లె సర్దుకుని వలసబాట పడుతున్నారు. రాయచూరు, యాదగిరి, కలబుర్గి జిల్లాల నుంచి ప్రతి రోజు వందలాది మంది రైళ్లలో బెంగళూరుకు వలసపోతున్నారు. ఇళ్లల్లో పిల్లలు, పెద్దలను విడిచిపెట్టి కట్టుబట్టలతో వలసపోతున్నారు. ఉపాధి కోసం వలస పోతుండటంతో కుటుంబాలు కన్నీరు మున్నీరు వుతున్నాయి. ప్రజాప్రతినిధులకు మాత్రం వీరి గోడు పట్టనట్లుగా ఉంది.

నదులున్నా భూములు బీళ్లే :

రాయచూరు జిల్లాలో తుంగా, కృష్ణా నదులున్నా భూములు బీళ్లుగా మారుతున్నాయి. జిల్లాలో లక్షా 70 వేల ఎకరాల్లో పత్తి, లక్షా 50 వేల ఎకరాల్లో వరి, 86 వేల ఎకరాల్లో కందులు వేశారు. కాలువకు నీరందక, వానలు కురవక భూములు బీళ్లుగా మారుతున్నాయి. తుంగభద్ర ఎడమ కాలువ ఆయకట్టు చివరి భూములకు నీరందక రైతులు ఆందోళన చేపట్టినా గేజ్ నిర్వహణలో అధికారులు విఫలమయ్యారు.


నీటి ప్రవాహం లేని ఎడమ కాలువ


తాగునీటి కోసం ప్రజల ఆరాటం

ఉజ్వల భవిష్యత్తుకు పునాది కారంజి


ప్రతిభా కారంజిలో పాల్గొన్న విద్యార్థులు


సరస్వతి దేవి వేషధారిగా బాలిక


శివపార్వతుల వేషధారణలో చిన్నారులు

రాయచూరు రూరల్: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రతిభా కారంజి పునాది కావాలని సీనియర్ కౌన్సిలర్ జయణ్ణ అన్నారు. బుధవారం నగరంలో ఏర్పాటు చేసిన ప్రతిభా కారంజి దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు పిల్లల్లో ప్రతిభను ప్రోత్సహించి మంచి భవిష్యత్తును రూపొందించాలన్నారు. వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలన్నారు. కాగా దేవసూగూరు, యరమరస్, నగరంలోని మెల్‌రోజ్ పాఠశాలలో ప్రతిభా కారంజీ పోటీలను మాజీ ఎమ్మెల్యే పాపారెడ్డి, నాగిరెడ్డి, గిల్లేసూగూరులోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయిని లక్ష్మీవెంకటేష్ ప్రారంభించారు. విద్యార్థులు వివిధ రకాల వేషధారణలతో చూపరులను ఆకట్టుకున్నారు.

వినాయక విగ్రహాల ప్రతిష్టాపన తథ్యం

- ఎమ్మెల్యే అరవింద బెల్లద


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవింద బెల్లద

హుబ్లీ: ఈద్గా మైదానంలో గత ఏడాది వినాయక ఉత్సవాల వేళ వినాయకుడిని ప్రతిష్టాపన చేశాం. ఈ ఏడాది కూడా వినాయకుడిని ప్రతిష్టాపన చేసి పండుగను జరుపుకోవాలనుకున్నాం. అయితే సిద్దరామయ్య సర్కారు వినాయక విగ్రహాల ప్రతిష్టాపనకు అవకాశం కల్పించడం లేదని ఎమ్మెల్యే అరవింద బెల్లద అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వినాయక ప్రతిష్టాపనల గురించి ప్రభుత్వానికి లేఖ రాశాం. అయినా దానికి ఎటువంటి ప్రత్యుత్తరం రాలేదు. రాణిచెన్నమ్మ పేరున ఉన్న ఈద్గా మైదానం కార్పొరేషన్ స్థలం అయినందున రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నందున అధికారులపై ఒత్తిడి పెంచుతున్నారు. అయితే ఎవరు ప్రతిఘటించినా తూర్పున ఉదయించే సూర్యుడు ఎంత సత్యమో అదే విధంగా గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేయడం అంతే సత్యమన్నారు. కొన్ని సంఘాలు ఈ కార్యక్రమానికి అడ్డుపడుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సంఘాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటే కొమ్ములు వచ్చినట్లుగా భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోయినా ఈద్గా మైదానంలో వినాయక ప్రతిష్టాపన చేసి తీరుతామన్నారు. కార్పొరేషన్ ఆస్తి కావడం వల్ల దానిపై పాలికె సాధారణ సమావేశంలో అనుమతి ఇవ్వాలన్నారు. వీలైనంత త్వరలో దీనికి అవకాశం ఇస్తూ పాలికె నిర్ణయం తీసుకోక పోతే హిందూ సంఘాలు తగిన ఆందోళన చేస్తాయని ఆయన వివరించారు. సమావేశంలో కుందగోళ ఎమ్మెల్యే ఎంఆర్ పాటిల్ తదితరులు ఉన్నారు.

పేదల అభివృద్ధికి ప్రభుత్వం కంకణం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి: తమ ప్రభుత్వం మురికివాడల్లోని పేదల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చినందున నేడు వారికి పట్టాలు పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. బుధవారం పట్టణంలోని 5వ వార్డులో పట్టాలు అందించి ఆయన మాట్లాడారు. మున్ముందు పట్టణంలోని మరిన్ని మురికివాడలను గుర్తించి అక్కడి వాసులకు పట్టాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ముఖ్యాధికారి దురుగణ్ణ, కౌన్సిలర్లు చాంద్‌బాషా, ఎస్.రామాంజనేయులు, సుధాకర్ పాల్గొన్నారు.

దాడిలో గాయపడిన వ్యక్తికి చికిత్స

- కోలుకుంటున్న మునియప్ప

శ్రీనివాసపురం: తాలూకాలోని నంబిహళ్లి గ్రామంలో మంగళవారం జరిగిన భార్య హత్య కేసులో గాయపడిన మామ మునియప్ప కోలారు ఆర్‌ఎల్ జాలప్ప ఆస్పత్రిలో కోలుకుంటున్నాడు. భార్య రాధను హత్య చేయడానికి వచ్చిన సమయంలో మామ మునియప్ప తన కూతురును కాపాడుకోవడానికి అడ్డుపడిన సమయంలో నాగేష్ మామ మునియప్పపై కూడా దాడి చేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం అతను ఆర్‌ఎల్ జాలప్ప ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా పోలీసులు అరెస్టు చేయడానికి వచ్చిన సమయంలో పోలీసులపై కొడవలితో దాడి చేయడానికి ప్రయత్నించి పోలీసులు జరిపిన కాల్పుల్లో గాయపడిన హంతకుడు నాగేష్‌ను పోలీసులు కోలారు ఆర్‌ఎల్ జాలప్ప ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు.

మద్యం అమ్మకాలు అరికట్టండి


అధికారికి వినతిపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

గంగావతి రూరల్: ఎమ్మార్పీ రేట్ల కంటే అధిక ధరలకు మద్యం అమ్మకాలను అరికట్టాలని కర్ణాటక దళిత సంఘర్షణ సమితి పదాధికారులు డిమాండ్ చేశారు. బుధవారం వారు సంబంధిత ఎక్సైజ్ అధికారి పిరగన్నవర్ విఠ్ఠల్‌కు వినతిపత్రాన్ని అందించారు. సమితి కళ్యాణ కర్ణాటక అధ్యక్షుడు హంపేశ్ జి.అరగోలు మాట్లాడుతూ మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లలో మద్యంపై ఎంఆర్‌పీ ధర కంటే వినియోగదారుల నుంచి రూ.20 నుంచి రూ.50 అధిక ధరను వసూలు చేస్తున్నారన్నారు. పైగా గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలు, గుళ్లు, ప్రభుత్వ ఆఫీసుల సమీపంలో కిరాణా దుకాణాలు, హోటళ్లు, పాన్ షాపుల్లో కూడా అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తుండడంతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేకుంటే తమ కార్యాలయం ఎదుట రాత్రింపగలు దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పంపాపతి సిద్దాపుర, హనుమంతప్ప నాయక, బెటప్ప ఆరాళ, నూర్ మహ్మద్, హనుమంతప్ప, అమ్రేశ్ నాయక, శివప్ప తదితరులు పాల్గొన్నారు.

మండ్యలో ధర్నాల హోరు


ఆందోళన చేస్తున్న రైతులు, మహిళలు


రోడ్డుపై బైఠాయించిన రైతులు

మండ్య: తమిళనాడుకు మళ్లీ కావేరి నీటిని విడుదల చేయాలని ఆదేశించిన కావేరి నది నీటి ప్రాధికారకు వ్యతిరేకంగా మండ్య జిల్లా రైతు సంరక్షణ సమితి ఆందోళన ప్రారంభించింది. నగరంలోని సర్ ఎంవీ విగ్రహం ఎదుట రైతులు, కన్నడపర పోరాట సమితి కార్యకర్తలు ధర్నా చేశారు. ప్రస్తుత సంక్లిష్ట స్థితిలో కేంద్రం జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఎంపీలు ప్రధానిపై ఒత్తిడి చేసి నీరు వదలకుండా అడ్డుకోవాలని కోరారు.

రైతుల రాస్తారోకో

కావేరి నీరు మరో విడత విడుదలపై రైతులు, సంఘాలు భగ్గుమన్నాయి. మండ్య నగరంలోని చామరాజేంద్ర ఒడెయార్ సర్కిల్ లో రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సమయంలో వాహనాల రాకపోకలను అడ్డగించారు. తమిళనాడుకు నీటి విడుదల చేయవద్దంటూ నినాదాలు చేశారు.

సీఎంగా దళితులకు చాన్స్

- మంత్రి సతీష్ జారకిహొళి వ్యాఖ్య


మాట్లాడుతున్న సతీష్ జారకిహొళి

హుబ్లీ: హోంమంత్రి జీ.పరమేశ్వర్ ముఖ్యమంత్రి, సతీష్ జారకిహొళి ఉపముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ సీనియర్ నేత బీకే.హరీ ప్రసాద్ సందర్భోచితంగా చెప్పి ఉండవచ్చు. అయితే రాబోయే రోజుల్లో దళితులకు అవకాశం దొరకడం తథ్యమని, కాని దాని కోసం వేచి ఉండాలని రాష్ట్ర మంత్రి సతీష్ జారకిహొళి అన్నారు. బుధవారం హుబ్లీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఒకరు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన ఉత్తమ రీతిలో విధులు నిర్వర్తిస్తున్నారు. అందువల్ల ఈ విషయంలో చర్చ అనవసరం. ఎవరు ముఖ్యమంత్రిగా ఉన్నా ఇలాంటి వ్యాఖ్యలు వినిపిస్తూనే ఉంటాయన్నారు. మంత్రి డీ.సుధాకర్‌పై దాఖలైన ఎఫ్ఐఆర్ గురించి మాట్లాడిన ఆయన అందరికీ ఒకటే చట్టం ఉంది అని, దాని ప్రకారమే చర్యలు తీసుకుంటారని అన్నారు.

అత్యుత్తమ వైద్య సేవలే లక్ష్యం

- ఎమ్మెల్యే గవియప్ప


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గవియప్ప

హొసపేటె: జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న జిల్లా ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయడంతో పాటు ఈ ప్రాంత ప్రజలకు కూడా ఉపయోగపడేలా గుండె శస్త్రచికిత్సలకు ప్రణాళిక రూపొందిస్తామని ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప తెలిపారు. నగరంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కార్యాలయ సభాభవనంలో బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఆయుష్మాన్‌భవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జీవన విధానంతో పాటు చికిత్స విధానం కూడా క్రమంగా మారుతోందన్నారు. ఈ ప్రాంతంలో కూడా ప్రజలకు అత్యుత్తమ వైద్య సదుపాయాలు అందించాలనే సదుద్దేశంతో ఆరోగ్య శాఖను సంస్కరిస్తున్నామన్నారు. ప్రజలకు అన్ని సౌకర్యాలు అందించే లక్ష్యంతో ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్.శంకర్ నాయక్ ప్రసంగిస్తూ ఈనెల 17 నుంచి జిల్లాలో ఆయుష్మాన్‌భవ కార్యక్రమాన్ని మూడు దశల్లో నిర్వహిస్తామన్నారు. మొదటి దశలో ప్రతి ఇంటికి వెళ్లి అభా కార్డు నమోదు చేయడంతో పాటు కార్డు ద్వారా అందుతున్న సౌకర్యాల గురించి సమాచారం ఇస్తారన్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ మహమ్మద్ అలీ అక్రమ్, వైద్యులు జంబయ్య నాయక్, షణ్ముఖ నాయక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పైన పటారం..లోన లొటారం


మార్కెట్‌లో చెత్తకుప్పను తొలగించని దృశ్యం


అపరిశుభ్రంగా ఉన్న మార్కెట్ కాంప్లెక్స్

- నిరుపయోగంగా కాంప్లెక్సులు
- డైలీ మార్కెట్‌లో సౌకర్యాల లేమి


నీడ కోసం ఏర్పాటు చేసుకున్న టార్పాళ్లు

కంప్లి: పట్టణంలోని డైలీ మార్కెట్ పరిస్థితి పైన పటారం లోన లొటారంగా దర్శనమిస్తోంది. ఆరుబయట వ్యాపారాలు చేస్తున్న కూరగాయల వ్యాపారుల కోసం 22 కాంప్లెక్సులు నిర్మించి చుట్టు కాంపౌండ్ గోడ, లోపల మరుగుదొడ్లు నిర్మించారు. ఇంతవరకు బాగానే ఉంది కానీ ఉన్న 22 కాంప్లెక్సుల్లో ప్రస్తుతం 15 మంది వ్యాపారులు మాత్రం వ్యాపారాలు చేస్తున్నారు. నిత్యం వందలాది మంది కూరగాయల కొనుగోలు కోసం రాకపోకలు సాగిస్తుంటారు. ఖరీదు సమయంలో పందులు, పశువులు వారిని పలు ఇబ్బందులు పెడుతుంటాయి. వాటిని తరిమేందుకే రోజు కూలి ఇచ్చి వ్యాపారాలు చేస్తుంటారు. ఎన్నో కాంప్లెక్సులు నిరుపయోగంగా ఉన్నాయి. పట్టణంలో ప్రతి మంగళవారం సంత జరుగుతుండగా ఆరోజు ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసిన వ్యాపారులు ఆరు బయటనే వ్యాపారాలు చేస్తారు తప్ప ఖాళీగా ఉన్న కాంప్లెక్సుల్లోకి మాత్రం వారు వెళ్లరు. ఇక చినుకులు పడితే ఖరీదు చేసేందుకు వచ్చే వారికి నీడలేనందున వ్యాపారులు టార్పాలిన్లు వేసుకుని వ్యాపారాలు చేస్తున్నారు. లోపలి భాగంలో తాగునీటి సౌకర్యం లేదు. చీకటి పడగానే విద్యుత్ దీపాల సౌకర్యం లేనందున మందు బాబులకే పరిమితం అయిపోయింది. ఇక మరుగుదొడ్లు రొచ్చు కంపు కొడుతున్నాయి. ముక్కు మూసుకొనే కాలం వెళ్లదీస్తున్నారు. మున్సిపాల్టీ వారు ఈ ప్రాంతంలో పర్యటించి వ్యాపారులకు కావలసిన సౌకర్యాలు కల్పించి కాంపౌండ్‌కు గేటు అమర్చి భద్రత కల్పించాలని వ్యాపారులు కోరుతున్నారు.

విద్యా రంగ సమస్యలు పరిష్కరించండి

కోలారు: విద్యా రంగంలోని సమస్యల పరిష్కారానికి ప్రామాణిక ప్రయత్నం చేయాలని సాహితీవేత్త బరగూరు రామచంద్రప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని చెన్నయ్య రంగమందిరంలో నిర్వహించిన కన్నడ ఉపాధ్యాయులకు ఒకరోజు సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రమబద్ధంగా ప్రణాళికను రూపొందించుకుని రాబోయే రోజుల్లో విద్యా రంగం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలు దశల వారీగా పరిష్కరించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 52 వేల పైచిలుకు పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. విద్యాశాఖలో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రామాణిక ప్రయత్నం చేయాలన్నారు. జెడ్పీ ఉప కార్యదర్శి శివకుమార్, డీఈఓ కృష్ణమూర్తి, కసాప జిల్లా గౌరవ కార్యదర్శి ఆర్.శంకరప్ప, పాత్రికేయుడు కెఎస్ గణేష్ పాల్గొన్నారు.

యాదవులు సంఘటితం కావాలి


పల్లకీ ఊరేగింపు దృశ్యం

కోలారు: యాదవ సముదాయం సంఘటితంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు నారాయణస్వామి తెలిపారు. బుధవారం నిర్వహించిన శ్రీకృష్ణ జయంతి పల్లకీల ఊరేగింపును ప్రారంభించి మాట్లాడారు. యాదవ యువత ముందుకు వచ్చి సముదాయానికి జరుగుతున్న అన్యాయాలపై గళమెత్తాలన్నారు. సముదాయ ప్రజలందరూ ఐకమత్యంగా ఉంటేనే సంఘం బలపడుతుందన్నారు. ఒకే సముదాయానికి చెందిన గోవులను సాకుతున్న యాదవులు, గొర్రెలు మేపుతున్న కురుబలు అందరూ కలిసిమెలిసి ఉండాలన్నారు. దాదాపుగా పాడి పరిశ్రమపైనే ఆధారపడి యాదవ సముదాయం గోవులను గోమాతగా భావించి పూజిస్తోందన్నారు. శ్రీకృష్ణ జయంతి సందర్భంగా జిల్లాలో మంచి వానలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. సీఎంఆర్ శ్రీనాథ్, బణకనహళ్లి నటరాజ్‌తో పాటు సముదాయ ప్రముఖులు పాల్గొన్నారు.

పండుగల్లో శాంతిని కాపాడాలి


మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్ గోఖలె

కంప్లి: ఎలాంటి కుల, మత, ధర్మ బేధాలు లేకుండా పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని తోరణగల్లు డీఎస్పీ ప్రసాద్ గోఖలె సలహా ఇచ్చారు. గణేష్ చతుర్థి, ఈద్ మిలాద్ పండుగల సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన శాంతి సమావేశంలో ఆయన మాట్లాడారు. గణపతి ప్రతిష్టాపన నిమజ్జనాల సందర్భంగా ప్రజలకు ఇబ్బంది కల్గించే కార్యక్రమాలు జరపరాదన్నారు. గణపతి ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

వేతన బకాయిల కోసం ధర్నా


ఆందోళన చేస్తున్న కార్మికులు

రాయచూరు రూరల్: నగరసభలో కాంట్రాక్ట్ పౌరకార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని జిల్లా పౌర కార్మికుల విభాగం డిమాండ్ చేసింది. బుధవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి అధ్యక్షుడు మారెప్ప మాట్లాడారు. నగరంలో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా అధికారులు నేటికీ ఇవ్వడం లేదన్నారు. కార్మికులకు వారం రోజుల్లో కనీస వేతనాలు అందజేసి వారిని పర్మినెంట్ చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం అందించారు.

మంత్రి బర్తరఫ్‌కు డిమాండ్


మాట్లాడుతున్న విరుపాక్షి

రాయచూరు రూరల్: రాష్ట్ర మంత్రి డి.సుధాకర్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని జేడీఎస్ జిల్లాధ్యక్షుడు విరుపాక్షి డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులకు రక్షణ కల్పిస్తామని చెప్పి అధికారం చేతికి అందగానే వారిపైనే దౌర్జన్యం చేయడం తగదన్నారు. బెంగళూరులోని యలహంక వద్ద 1.30 సెంట్ల భూమిని ఆక్రమించడానికి మంత్రి సహచరులు ఇటీవల దళితులపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. దళిత మంత్రితోనే రాష్ట్రంలో దళితులకు రక్షణ లేదని, అందువల్ల సుధాకర్‌ను వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించాలని ముఖ్యమంత్రిని ఆయన ఒత్తిడి చేశారు.

ప్రథమ చికిత్సతో ప్రాణరక్షణ సాధ్యం


పాఠశాలకు ప్రథమ చికిత్స కిట్లను అందిస్తున్న దృశ్యం

కోలారు: అత్యవసర వైద్య పరిస్థితుల్లో ప్రథమ చికిత్సతో వ్యక్తి ప్రాణాలను కాపాడవచ్చని భారతీయ రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా సభాపతి డాక్టర్ ఎన్.గోపాలకృష్ణ తెలిపారు. బుధవారం తాలూకాలోని అరాభికొత్తనూరు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన విశ్వప్రథమ చికిత్సా దినోత్సవాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. వైద్య అత్యవసర పరిస్థితులపై ప్రతి ఒక్కరూ తగిన అవగాహన కలిగి ఉండాలన్నారు. సంస్థ జిల్లా ఉపసభాపతి ఆర్ శ్రీనివాసన్ మాట్లాడుతూ ఆస్పత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య అత్యవసర పరిస్థితులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. హెచ్ఎం సిద్దేశ్వరి, రెడ్‌క్రాస్ కార్యవర్గ సభ్యుడు శీనప్ప, సీఎల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

న్యాయసేవలు వినియోగించుకోండి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: ప్రజలు న్యాయ సేవా ప్రాధికార అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సెషన్స్ జడ్జి సునీల్ ఎస్.హొసమని తెలిపారు. మంగళవారం పాత్రికేయుల భవనంలో నిర్వహించిన న్యాయ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు ఆలస్యం అయితే ప్రాధికారకు, పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులపై త్వరగా స్పందించకపోయినా ఫిర్యాదు చేయవచ్చన్నారు. లోకాయుక్త డీఎస్పీ బీకే ఉమేష్, క్యాస్ అధ్యక్షురాలు మల్లమ్మ, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.మునేగౌడ, కార్యదర్శి ఎస్.భైరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.